ఈనాడు

విజయవాడ 1-8-2025 శుక్రవారం సిటీ సంపుటి 51 . సంచిక 353
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



నందనవనంలా.. సుందర నగరంలా..

రాజధానిని జీవవైవిధ్య ప్రాంతంగా తీర్చిదిద్దాలి

పార్కులు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండాలి

అధికారులకు సీఎం ఆదేశం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి సుందర నందనవనాలతో.. ఎటు చూసినా అందమైన పుష్పాలతో శోభాయమానంగా కనిపించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వివిధరకాల ఫల, పుష్ప, ఔషధ మొక్కలు నాటడంతోపాటు రాజధాని ప్రాంతమంతా జీవవైవిధ్య ప్రాంతంగా ఉండాలని ఆయన అన్నారు. అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలో సీఎం గురువారం సమీక్ష నిర్వహించారు. 'గ్రీన్‌బెల్ట్, బఫర్ జోన్లలో దేశీయ వృక్ష జాతులు ఉండేలా చూడాలి. రివర్ ఫ్రంట్‌ను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి. ప్రధాన ట్రంక్ రోడ్లు, అనుబంధ రహదారులు, బఫర్ జోన్లు, గ్రీన్‌జోన్లు, ముఖ్యమైన (మిగతా 10లో)

కలిసి మునగనీయండి

రష్యాతో భారత్ ఏం చేసుకున్నా లెక్కచేయం



- ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకోనివ్వండి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు
- పాక్‌తో వాణిజ్య ఒప్పందం
- భవిష్యత్తులో భారత్‌కు పాక్ చమురు అమ్మొచ్చంటూ వ్యాఖ్య
- ఇరాన్ చమురుతో వ్యాపారం చేస్తున్న 6 భారత కంపెనీలపై ఆంక్షలు
- మన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటాం: కేంద్ర ప్రభుత్వం
- ఆర్థిక పరిస్థితిపై ట్రంప్ నిజం చెప్పారు: కాంగ్రెస్ నేత రాహుల్

వాషింగ్టన్, న్యూయార్క్

భారత్, రష్యా బంధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. తనకేం సంబంధం లేదంటూనే శాపనార్థాలు పెట్టారు. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చుకోనీయండని, కలిసి మునగనీయండని వ్యాఖ్యానించారు. బుధవారం భారత్‌పై 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీ విధిస్తూ ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్ ఏం చేస్తుందన్న విషయాన్ని అసలు పట్టించుకోబోమని, వారిద్దరూ మునిగిపోతుంటే మాకెందుకని, మిగిలిన అందరి గురించి పట్టించుకుంటామని స్పష్టం చేశారు. 'మనకు భారత్ స్నేహితురాలే అయినా ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

భారత్ కంపెనీలపై ఆంక్షలు

ఇరాన్ పెట్రో ఉత్పత్తులతో వ్యాపారం చేస్తున్న 6 భారతీయ కంపెనీలతోపాటు మొత్తం 20 సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఆ నిధులతో ఇరాన్ ఉగ్రవాదులకు సహకారం అందిస్తోందని ఆరోపించింది. అమెరికా ఆంక్షలు విధించిన వాటిలో భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, తుర్కియే, ఇండోనేసియా (మిగతా 10లో)

కేంద్రం అమెరికా సుంకాల విషయంలో జాతీయ ప్రయోజనాలను కాపాడతామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించింది. వాటిపై అధ్యయనం జరుగుతోందని అక్టోబరుకల్లా ఒప్పందం కుదిరే అవకాశముందని పేర్కొంది.

కాంగ్రెస్ మృత ఆర్థిక వ్యవస్థ అని ట్రంప్ విమర్శించడాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ఈ విషయం ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

- రాహుల్ వ్యాఖ్యలను భాజపా తిప్పికొట్టింది. ఆయన దేశాన్ని, ప్రజలను అవమానిస్తున్నారని విమర్శించింది.

ఐదేళ్లలో రూ.45వేల కోట్ల పెట్టుబడులు



- సింగపూర్ ప్రభుత్వ సంస్థ జీఐసీ-తమసెక్‌తో ఒప్పందం
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.45వేల కోట్ల పెట్టుబడులకు సింగపూర్ ప్రభుత్వానికి చెందిన జీఐసీ-తమసెక్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సింగపూర్ ప్రభుత్వం సావరిన్ ఫండ్ ద్వారా ఆ పెట్టుబడులు పెడుతుందన్నారు. 'ఇది రాష్ట్ర యువతకు గుడ్ న్యూస్, వైకాపా అధ్యక్షుడు జగన్‌కు బ్యాడ్ న్యూస్' అని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాల్ని పునరుద్ధరించడం, పెట్టుబడుల సాధన, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలో నాలుగు రోజులపాటు సాగిన సింగపూర్ పర్యటన విజయవంతమైందని తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో గురువారం ఆయన విలేకర్లకు సింగపూర్ పర్యటన విశేషాల్ని తెలియజేశారు.

"సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని, సీనియర్ మంత్రి లీసైన్ లూంగ్ తదితరులతోను, పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతోను సమావేశాలు జరిగాయి. ముఖ్యమంత్రి 26 ముఖాముఖి సమావేశాల్లో పాల్గొన్నారు. నేను 19 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యాను. 16 రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సుల్లో పాల్గొన్నాను. ఐటీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్, డ్రోన్‌లు, గ్రీన ఎనర్జీ, డేటా సెంటర్లు, సెమీకండక్టర్ రంగాల కంపెనీలతో రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించాం" అని ఆయన తెలిపారు. చంద్రబాబు సింగపూర్‌లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు విరామం లేకుండా సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడులు ఆకర్షించేందుకు కృషిచేస్తే... అదే సమయంలో జగన్ నేరపూరిత రాజకీయాలు చేస్తూ వాటికి విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నారని లోకేశ్ ధ్వజమెత్తారు.

సింగపూర్ ప్రభుత్వానికి వైకాపా తప్పుడు ఈమెయిల్స్

తాము సింగపూర్ పర్యటనలో ఉన్నప్పుడే.. రాష్ట్రంలో అస్థిర ప్రభుత్వం (మిగతా 10లో)

రేపే 'అన్నదాతా సుఖీభవ'

లోపలి పేజీల్లో

- ప్రకాశం జిల్లా దర్శిలో పథకానికి శ్రీకారం చుట్టనున్న సీఎం చంద్రబాబు
- కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో కలిపి ఒక్కో రైతు ఖాతాకు రూ.7 వేలు జమ
- సందేహాల నివృత్తికి 155251 టోల్ ఫ్రీ నంబర్

మాలేగావ్ పేలుళ్ల కేసులో ఆ ఏడుగురూ నిర్దోషులే

సాధ్వి ప్రజ్ఞాసింగ్ సహా నిందితులందరికీ విముక్తి కల్పించిన ముంబయి కోర్టు

విజయసాయిరెడ్డి కుమార్తె... నేహారెడ్డికి రూ.17.46 కోట్ల జరిమానా

హైకోర్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదించిందన్న జనసేన కార్పొరేటర్

రైల్వే ట్రాకుల నిర్మాణానికి రూ.11వేల కోట్లు

- 6 రాష్ట్రాల పరిధిలో కొత్తగా 574 కి.మీ.మార్గం
- ఆర్థిక వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ ఆమోదం

మద్యం ముడుపుల లెక్కలు జగన్ బాగా చెబుతారు

- ఏ పెట్టెలో ఎంత డబ్బు పడుతుందో ఆయనకు బాగా తెలుసు
- కుంభకోణంలో బయటపడింది తక్కువ.. శోధించాల్సింది ఇంకా ఉంది
- పెద్దిరెడ్డి కంపెనీ ఖాతాకు అదాన్ డిస్టిలరీ నుంచి ముడుపుల సొమ్ము
- మంత్రి నారా లోకేశ్ ధ్వజం

లోపలి పేజీలో

మంత్రుల ఇళ్లపైకి మా వాళ్లను పంపి హత్యలు మొదలెడితే..

ప్రసన్న ఇంటిపైకి మారణాయుధాలతో మనుషులను పంపుతారా?

- ప్రతీకారంతోనే మిథున్‌రెడ్డిని జైల్లో పెట్టారు
- ఏం తప్పు చేశాడని కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు పెట్టారు?
- నెల్లూరు పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి జగన్



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్ చిత్రంలో ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకాణి కుమార్తె పూజిత

ఈనాడు, నెల్లూరు: 'చంద్రబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఆ సమయంలో చంద్రబాబును పెద్దిరెడ్డి కొట్టారు. కాలేజీ అన్నాక గొడవలుంటాయి, కొట్టుకుంటుంటారు. అప్పట్లో వారిరువురిదీ ఉడుకు రక్తం.. అందువల్ల చంద్రబాబును టపా అని నాలుగు పీకి ఉంటాడు.. అందులో తప్పేముంది' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యానించారు. 'రామచంద్రారెడ్డి కొట్టిన విషయాన్ని మనసులో పెట్టుకుని, ఇన్ని సంవత్సరాల తర్వాత ఆయన కొడుకు (మిగతా 10లో)

నెల్లూరులోనూ అదే అరాచకం

- పోలీసులను తోసుకుని రావాలని పిలిచిన జగన్
- పోలీసులను తోసేసి.. జనాన్ని వెంటేసుకుని వెళ్లిన ప్రసన్న
- తోపులాటలో హెడ్‌కానిస్టేబుల్‌కు విరిగిన చెయ్యి
- కాకాణి, ప్రసన్నలకు జగన్ పరామర్శ

లోపలి పేజీలో

పంకజ్ డబ్బులిస్తాడు.. ప్రభుత్వ పెద్దల మనుషులకు అందజేయ్

మద్యం కుంభకోణం నిందితుడు వరుణ్‌కు శ్రీకాంత్ ఆదేశాలు

అదాన్, లీలా డిస్టిలరీస్‌లో ఎకౌంటెంట్‌గా పనిచేసిన శ్రీకాంత్

అతన్ని విచారించిన సిట్ అధికారులు

ఈనాడు, అమరావతి: 'హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వెంగళరావు పార్క్, అయ్యప్ప సొసైటీలోని బెంజ్ షోరూమ్ ప్రాంతాలకు వెళ్లు. పంకజ్ నగదు కవర్ అందజేస్తారు. ఆ డబ్బు తీసుకున్నాక, అదాన్ డిస్టిలరీస్ డైరెక్టర్ కాశీచయనుల శ్రీనివాస్‌కు ఫోన్ కాల్ చెయ్యి. ఆయన చెప్పిన వారికి ఆ సొమ్ము అందజెయ్యి' అంటూ అదాన్ డిస్టిలరీస్, లీలా డిస్టిలరీస్‌లో ఎకౌంటెంట్‌గా పనిచేసిన శ్రీకాంత్.. మద్యం కుంభకోణం నిందితుడు పురుషోత్తం వరుణ్ కుమార్‌కు (ఏ-40) తరచూ ఆదేశాలిచ్చేవారని దర్యాప్తులో సిట్ గుర్తించింది. వరుణ్‌కుమార్ ఒక్కో విడతలో రూ.25 - రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.5 కోట్ల మేర పంకజ్ నుంచి తీసుకుని కాశీచయనుల శ్రీనివాసులు సూచనల మేరకు నాటి ప్రభుత్వ పెద్దల తరపు మనుషులకు అందజేసేవారని తేల్చింది. ఇదంతా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్నందుకు లీలా డిస్టిలరీస్ తరపున చెల్లించిన ముడుపుల సొమ్మేనని సిట్ నిర్ధారణకు వచ్చింది. (మిగతా 10లో)



సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ 3 వారాల్లో లొంగిపోవాలి

సుప్రీంకోర్టు ఆదేశం • అవినీతి కేసులో ఆయనకు హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు

కేసు వినేకొద్దీ అనుమానాలొస్తున్నాయని వ్యాఖ్య

ఈనాడు – దిల్లీ

ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైకాపా హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీల కోసం అవగాహన కార్యక్రమాల నిర్వహణలో ప్రైవేటు సంస్థలతో కలిసి రూ.1.19 కోట్ల అవినీతికి పాల్పడినట్లు నమోదైన కేసులో ఆయనకు చుక్కెదురైంది. ఇందులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఈ ఏడాది జనవరి 30న ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టేసింది. నిందితుడిగా ఉన్న సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల గడువిచ్చింది. తర్వాత బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఆయన్ను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉంటే అందుకోసం దరఖాస్తు చేసుకొనే స్వేచ్ఛను దర్యాప్తు సంస్థకు ఇచ్చింది. ముందస్తు బెయిల్ తీర్పులో న్యాయమూర్తి విస్తృత ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా, అగ్నిమాపక శాఖ డీజీగా పనిచేసిన సంజయ్.. అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, ట్యాబ్‌ల సరఫరా ఒప్పందం పేరుతో సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు, సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ ఒప్పందం పేరుతో క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు కలిపి రూ.1.75 కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టారని ఏసీబీ కేసు నమోదు చేసింది. దీనిలో హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ (మిగతా 10లో)



సంజయ్

ధర్మస్థలలో కంకాళాల కలకలం


- రెండు అస్థిపంజరాలు లభ్యం.. మహిళలవని ప్రాథమిక అంచనా
- మారణహోమంపై బలపడుతున్న అనుమానాలు
- గత పదేళ్లలో 450 మంది అదృశ్యం!
- కొనసాగుతున్న ప్రత్యేక బృందం దర్యాప్తు

లోపలి పేజీల్లో

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై... మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి

- తెలంగాణ శాసన సభాపతికి సుప్రీంకోర్టు ఆదేశం
- ట్రైబ్యునల్‌గా వ్యవహరించేటప్పుడు సభాపతికి రాజ్యాంగ సంరక్షణ ఉండదని స్పష్టీకరణ
- ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు తీరును పరిశీలించాలని పార్లమెంటుకు సూచన

ఇదీ సంగతి!




నో ప్రాబ్లం! మీ జాడ ఎవరూ కనిపెట్టలేరు బిగ్‌బాస్!

మీ ఆర్థికారోగ్యం.. బలం ఎంత?

తినే ఆహారంలో పోషకాలుండాలి..! వేసుకునే దుస్తులు నాణ్యమైనవి అయి ఉండాలి..! ఉండే ఇల్లు సురక్షితంగా, దృఢంగా ఉండాలి..! మరి మన ఆర్థికారోగ్యం?? అది కూడా పక్కా ప్రణాళికలతో.. సమతులంగా ఉండాలంటున్నారు వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాల నిపుణులు, పీఎఫ్‌పి ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు, ఎన్ఎస్ఈ అకాడమీ విజిటింగ్ ఫ్యాకల్టీ పురాతన్ భారతి! వ్యక్తిగత పెట్టుబడులు ఎలా ఉండాలన్న విషయమై 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారాయన.

? ఎవరికి ఎలాంటి ఆర్థిక ప్రణాళికలు నప్పుతాయో ఎలా తెలుసుకోవడం

ప్రతి ఒక్కరికీ తమకంటూ కొన్ని ఇష్టాలుంటాయి. కొందరికి కారం అధికంగా ఉండే పదార్థాలంటేనే ఇష్టం. ఆర్థిక విషయాల్లో ఇలాంటి వారిని ఎక్కువ నష్టభయం భరించగలిగే వారితో పోల్చవచ్చు. మరికొందరు సాత్విక ఆహారమే కావాలంటారు. ఇలాంటి వారిని కాస్త తక్కువ నష్ట భయం లేదా సురక్షిత పెట్టుబడులు పెట్టేవారితో పోల్చవచ్చు. కొన్ని ఆర్థిక లక్ష్యాలు చాలామందికి ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు మరో 30 ఏళ్ల తర్వాత పదవీ విరమణ ప్రణాళిక. ఇది అందరికీ ఒకటే. కేవలం ఎంత (మిగతా 14లో)



ధగధగా వెలుగులు.. కృష్ణమ్మ పరుగులు!

కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. గురువారం విద్యుత్తు దీపాల వెలుగుల్లో బ్యారేజీ కాంతులీనుతోంది. కృష్ణా జలాలు ఉరకలెత్తుతూ సముద్రం వైపు పరుగులు తీస్తున్నాయి. – ఈనాడు, అమరావతి

ఈ రెండు నెలల్లో వర్షాలు ఆశాజనకం: భారత వాతావరణ విభాగం అంచనా

10లో


రేపే 'అన్నదాతా సుఖీభవ'

- ప్రకాశం జిల్లా దర్శిలో పథకానికి శ్రీకారం చుట్టనున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా 'పీఎం కిసాన్- అన్నదాతా సుఖీభవ' పథకాన్ని ఆగస్టు 2న అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు దీని ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.2,342.92 కోట్లు రైతుల ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేయనుంది. దీనికి తోడుగా కేంద్రం 'పీఎం కిసాన్' పథకం కింద మొదటి విడతగా రూ.2 వేల చొప్పున రూ.831.51 కోట్లు రైతులకు సాయం అందించనుంది. అంటే ఆగస్టు 2న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేలు జమ చేస్తాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని కూటమి ఎన్నికల వేళ హామీ ఇచ్చింది. 'పీఎం కిసాన్' పథకంలో ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6 వేల సాయానికి రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాతా సుఖీభవ' కింద మరో రూ.14 వేలు కలిపి అందజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి రెండు విడతల్లో రూ.5 వేల చొప్పున, మూడో విడతలో రూ.4 వేలు ఇవ్వనుంది. 'అన్నదాతా సుఖీభవ'కు సంబంధించి 59,750 వినతులు నమోదు కాగా 58,464 దరఖాస్తులను పరిష్కరించారు. ఈ పథకంపై సందేహాల నివృత్తికి 155251 టోల్ ఫ్రీ నంబరును ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

అర్హులందరికీ పథకం అందాలి: సీఎం

అర్హులైన రైతులందరికీ అన్నదాతా సుఖీభవ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పథకం అమలు సన్నద్ధతపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. 'ఆగస్టు 2న గ్రామ సచివాలయం నుంచి పంచాయతీలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలి. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసంతోపాటు అన్ని వ్యవస్థలనూ ఛిన్నాభిన్నం చేసింది. వాటన్నింటినీ పునర్నిర్మిస్తున్నాం. అన్నదాతా సుఖీభవ అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒకరోజు ముందే 'మనమిత్ర' ద్వారా సందేశాలు వెళ్లాలి. ఖాతాలు యాక్టివేట్ చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలి. ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రం రూపొందించి క్షేత్రస్థాయిలో ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి' అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.



నీటి నిర్వహణపై సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం

భారత్‌పై అమెరికా 25 శాతం సుంకాలు విధించిందని, అందువల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. 'బొప్పాయి ధర తగ్గిందని కథనాలు వస్తున్నందున దీనిపై సమీక్షించి, రైతులకు న్యాయం చేయాలి. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వంద శాతం నీటితో నింపాలి. రిజర్వాయర్లలో ఎంత నీరుందనే సమాచారం ఉండాలి. నీటి నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి' అని ఆదేశించారు.

ఆధార్ సీడింగ్ జరగని రైతులు లక్షల్లో!

ఈనాడు, అమరావతి: "అన్నదాతా సుఖీభవ'' పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా అర్హత సాధించిన రైతుల్లో లక్షల మంది ఆధార్ కార్డులోని వివరాలు వెబ్‌ల్యాండ్‌లోని వివరాలతో సీడింగ్ (అనుసంధానం) జరగలేదు. రైతుల పేర్లు, ఇంటి పేర్లు తప్పుగా నమోదు కావడం, చనిపోయిన వారి స్థానంలో వారసుల పేర్లు నమోదు కాకపోవడం వంటి సమస్యలు భారీ సంఖ్యలో ఉన్నాయి. రైతుల వివరాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దనందున తహసీల్దార్ల లాగిన్‌లలో వివరాలు వేలల్లో పెండింగులో ఉన్నాయి. దీంతో అర్హుల జాబితాలో తమ పేర్లు కనిపించక.. రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఈ సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేసింది. అందుబాటులో ఉన్న రికార్డుల్లోని వివరాల ఆధారంగా అర్హులు నష్టపోకుండా చూడాలని కోరింది. ఆధార్ కార్డుల్లోని వివరాల్లో మార్పులు, చేర్పులపై రైతులతో వీఆర్వోల సాయంతో దరఖాస్తు చేయించాలని సూచించింది.

ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో స్థలాల వేలం

- ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈనాడు, అమరావతి: అసంపూర్తిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ (ఎంఐజీ లేఔట్) ప్రాజెక్టును పూర్తిచేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలుచోట్ల ప్రారంభించిన లేఔట్లలో ఇప్పటివరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై యథావిధిగా లాటరీ తీసి స్థలాలు (ప్లాట్లు) కేటాయించనున్నారు. మిగిలిన స్థలాలు వాణిజ్య విధానంలో వేలం ద్వారా ప్రజలకు విక్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

74 ప్రాజెక్టుల్లో ప్రారంభమైనవి 36

పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో మొత్తం 74 ప్రాజెక్టులు ప్రతిపాదించగా వీటిలో 36 ప్రారంభమయ్యాయి. మిగిలిన 38 ప్రాజెక్టుల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రారంభమైన ప్రాజెక్టుల్లోనూ 29% స్థలాలే లాటరీలో కేటాయించారు. ప్లాట్లు దక్కించుకున్నవారి నుంచి 23% మొత్తమే వసూలైంది. వార్షికాదాయ పరిమితి రూ.18 లక్షలుగా నిర్ణయించడం, లాటరీ విధానంలో స్థలాల కేటాయింపు, ఒక వ్యక్తికి ఒకే స్థలం లాంటి కారణాలు ప్రాజెక్టు అమలుకు ప్రతిబంధకాలుగా మారినట్లు గుర్తించారు. వీటిని అధిగమించేందుకు స్థలాలు వేలం వేసి విక్రయించాలని నిర్ణయించారు. నిబంధనలకు లోబడి వేలం పూర్తిచేయాలని పురపాలక శాఖ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి రూ.2,750 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా కింద ఆగస్టు నెల సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.2,750 కోట్లు విడుదల చేసినట్లు సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా 1.09 లక్షల మంది వితంతువులకు స్పౌజ్ కేటగిరీ కింద పింఛన్లు మంజూరు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛను పంపిణీ చేస్తామని వివరించారు.

నీటి తీరువా బకాయిలపై రూ.85 కోట్ల వడ్డీ మాఫీ

ఈనాడు, అమరావతి: రైతుల నీటి తీరువా బకాయిలపై రూ.85.81 కోట్ల వడ్డీని 'ఏకకాల పరిష్కారం' కింద ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి గురువారం జారీచేశారు.

గ్రహం అనుగ్రహం

1-8-2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
అష్టమి: పూర్తి
స్వాతి: తె. 3-23 తదుపరి విశాఖ
వర్జ్యం: ఉ. 7-02 నుంచి 8-48 వరకు
అమృత ఘడియలు: సా. 5-39 నుంచి 7-25 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-07 వరకు తిరిగి మ. 12-32 నుంచి 1-23 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5.42; సూర్యాస్తమయం: సా.6.31

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	36.5	27.0
నెల్లూరు	36.4	28.4
విశాఖపట్నం	36.4	27.6
గుంటూరు	36.0	28.0
విజయనగరం	36.0	26.0
తిరుపతి	35.6	27.4
ఒంగోలు	35.4	27.6
తాడేపల్లిగూడెం	35.4	27.6
విజయవాడ	35.4	25.7
నరసాపురం	34.2	24.8
కడప	34.0	26.0
అనంతపురం	33.5	25.1
కర్నూలు	33.4	25.2
శ్రీకాకుళం	33.0	28.0

నేహారెడ్డికి రూ.17.46 కోట్ల జరిమానా

హైకోర్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదించిందన్న జనసేన కార్పొరేటర్

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖ జిల్లా భీమిలి తీరంలో తవ్వకాలు జరిపి, ప్రహరీ నిర్మించి.. పర్యావరణానికి నష్టం కలిగించినందుకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి రూ.17.46 కోట్లు జరిమానా చెల్లించాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ... హైకోర్టుకు నివేదించినట్లు విశాఖ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. విశాఖలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. 'భీమిలి తీరంలో అక్రమాలపై హైకోర్టు ఆదేశాలతో ఇటీవల నిపుణుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసింది. జరిమానా చెల్లించడంతోపాటు 3 నెలల్లో నిబంధనల ప్రకారం తీరాన్ని పునరుద్ధరించాలని సిఫారసు చేసింది. తీరంలో ప్రహరీ తొలగింపునకు జీవీఎంసీ అధికారులు రూ.73.60 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. ఆ సొమ్మును నేహారెడ్డి నుంచి వసూలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. నేహారెడ్డి అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీపై భీమిలి కోర్టులో పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసు నమోదైంది' అని మూర్తియాదవ్ వివరించారు.

నమ్మినబంట్లు తోడుగా నకిలీల 'సృష్టి'

- వెలుగులోకి ఫెర్టిలిటీ సెంటర్ దారుణాలు
- డాక్టర్ నమ్రతకు ఐదు రోజుల కస్టడీ

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ దారుణాలు బయటపడుతున్నాయి. సంతాన లేమి సమస్యతో వచ్చే దంపతుల్ని డాక్టర్ నమ్రత విశాఖలోని తమ ఆసుపత్రికి తీసుకెళ్లి నమ్మించడం.. తరువాత సరోగసీ చేయిస్తున్నట్లు నటిస్తూ అండాలు, వీర్యం సేకరించడం చేసేవారు. ఏవో కారణాలు చెప్పి ముందుగా చెప్పిన మొత్తం కంటే ఎక్కువ డబ్బులు డిమాండ్ చేసేవారని తెలుస్తోంది. ఈ మేరకు నమ్రత, ఇతర నిందితుల రిమాండు రిపోర్టులో గోపాలపురం పోలీసులు కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రధాన నిందితురాలు నమ్రతను శుక్రవారం నుంచి ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. ఇతర నిందితులు జయంత్ కృష్ణ, ధనసరి సంతోషిని కస్టడీ కోసంకూడా పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. రిమాండు రిపోర్టులోని వివరాలివీ...

నమ్మించేందుకు విశాఖ తీసుకెళ్లి..

- సికింద్రాబాద్‌లోని కేంద్రానికి వచ్చే దంపతులను డాక్టర్ నమ్రత సరోగసీ ద్వారా పిల్లలు పుట్టడానికి అవకాశం ఉందని, రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని నమ్మించేవారు.
- విశాఖలోని బ్రాంచిలో అత్యున్నత సదుపాయాలున్నాయని, గర్భం దాల్చే మహిళ(జేనర్ సరోగేట్) సిద్ధంగా ఉందని తీసుకెళ్లి చూపించేవారు.
- సికింద్రాబాద్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ గొల్ల మండల చెన్నారావు ద్వారా దంపతుల అండాలు, వీర్యాన్ని సేకరించేవారు.
- గాంధీ ఆసుపత్రి వైద్యుడు నర్గుల సదానందంతో బాధితులకు మత్తుమందు ఇప్పించేవారు.
- తరువాత డోనర్ గర్భం దాల్చిందని, మీ బిడ్డ పెరుగుతోందని, మరింత ఖర్చవుతుందని దంపతుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసేవారు.
- ఈలోపు ఏజెంట్లు సంజయ్, నందిని సాయంతో అస్సాంకు చెందిన మహిళల నుంచి పిల్లలను కొనుగోలు చేసి తీసుకొచ్చి దంపతులకు వారి బిడ్డగా అప్పగించేవారు. వారికి రికార్డులేవీ ఇవ్వకుండా జాగ్రత్తపడేవారు.
- ఇదే విధంగా రాజస్థాన్ దంపతులకు మగబిడ్డను ఇచ్చారు. వారు డీఎన్ఏ పరీక్ష చేయించడంతో బండారం బయటపడింది. ఆ బిడ్డ ప్రస్తుతం శిశువిహార్‌లో ఉన్నాడు.
- సరోగసీ ముసుగులో పిల్లల్ని విక్రయించేందుకు సహకరించిన నిందితురాలు కల్యాణికి వచ్చిన లాభంలో వాటాతోపాటు విశాఖపట్నం మహారాణిపేటలో సముద్రానికి సమీపంలో ఉండే తన ఫ్లాటును వినియోగించుకోవాలని ఇచ్చారు. ప్రస్తుతం కల్యాణి అందులోనే నివాసమున్నారు.

లోక్‌సభ స్పీకర్, కేంద్ర మంత్రులతో బాలకృష్ణ భేటీ



స్పీకర్ ఓంబిర్లాతో బాలకృష్ణ. చిత్రంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లక్ష్మీనారాయణ, పార్థసారథి, అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, కృష్ణప్రసాద్, శ్రీభరత్

ఈనాడు, దిల్లీ: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం దిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కార్మిక, యువజన, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయలతో భేటీ అయ్యారు. తెదేపా ఎంపీలతో కలిసి పార్లమెంటు భవన్‌లో స్పీకర్ ఓంబిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న సేవలను ఆయనకు వివరించారు. తర్వాత హర్‌దీప్‌సింగ్ పురిని కలిసి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆసుపత్రికి నిధులు మంజూరు చేయడానికి సహకరించాలని కోరారు. హిందూపురానికి ఈఎస్ఐ ఆసుపత్రిని కేటాయించాలని మన్‌సుఖ్ మాండవీయను కోరారు. హిందూపురం పట్టణాభివృద్ధికి నిధులివ్వాలంటూ మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తిచేశారు. హిందూపురం చుట్టుపక్కల రింగ్‌రోడ్డు, ఇతర రహదారుల నిర్మాణం చేపట్టాలని నితిన్ గడ్కరీని కోరారు.

వాకాడు తహసీల్దార్‌పై లైంగిక వేధింపుల అభియోగం

నాయుడుపేట, వాకాడు, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా వాకాడు తహసీల్దార్ రామయ్య లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు అభియోగాలు రావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. రామయ్య వారం రోజుల కిందట నాయుడుపేటలో ఉంటున్న ఓ మహిళా వీఆర్వో ఇంటికెళ్లారు. అక్కడ దుస్తుల్లేకుండా కనిపించడం, ఓ మహిళ చీపురుకట్టతో ఆయనకు దేహశుద్ధి చేసే దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ఈ క్రమంలో తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ సదరు మహిళా వీఆర్వో.. కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదం కుట్రే

సీఆర్ఎస్ నివేదిక



అప్పట్లో కవరపేట స్టేషన్‌లో సంభవించిన ప్రమాదం

ఈనాడు, చెన్నై: తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరపేట స్టేషన్ సమీపంలో గతేడాది అక్టోబరు 11 రాత్రి మైసూరు-దర్భాంగ భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. మెయిన్ లైను నుంచి లూప్‌లైనుకు వెళ్లి... అక్కడ ఆగి ఉన్న గూడ్స్‌రైలును ఢీకొట్టింది. 1,800 మంది ప్రయాణికులపై ప్రభావం చూపిన ఈ ఘటనలో 19 మంది గాయపడ్డారు. ప్రమాద దృశ్యాలను చూస్తే ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నా, ప్రాణనష్టం మాత్రం సంభవించలేదు. ప్రమాదానికి కారణాలేమిటి? లోకోపైలట్ వల్ల ప్రాణనష్టం ఎలా తప్పింది? అనే విషయాలను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్ఎస్) సదరన్ సర్కిల్ ఎ.ఎం.చౌదరి తన నివేదికలో రైల్వే బోర్డుకు వివరించారు. 'ప్రమాదం వెనక కుట్ర దాగి ఉంది. రైలు పట్టాల్లోని ఎల్‌హెచ్ స్విచ్ పాయింట్ దగ్గర ఫిట్టింగ్స్‌ను దుండగులెవరో దురుద్దేశంతో తొలగించారు. రైల్వే పరికరాల్లో, ఆటోమేటిక్ సిగ్నలింగ్‌లో తప్పిదాలు లేవు. ప్రమాద సమయంలో భాగమతి ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 13 బోగీలు పట్టాలు తప్పాయి. ఒక బోగీ మంటల్లో చిక్కుకుంది' అని చౌదరి నివేదించారు.



సుబ్రమణి

ఆయన ప్రయత్నాన్ని గుర్తించండి: భాగమతి ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ జి.సుబ్రమణి ప్రమాదాన్ని గుర్తించి సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే ప్రాణనష్టం సంభవించలేదని చౌదరి స్పష్టతనిచ్చారు. గూడ్స్ బండిని ఢీకొట్టక ముందు అత్యవసర బ్రేక్‌లు వేసి రైలు వేగాన్ని ఆయన నియంత్రించగలిగారని, అందుకే ప్రమాద తీవ్రత బాగా తగ్గిందని చౌదరి పేర్కొన్నారు. లోకోపైలట్ ప్రయత్నాన్ని రైల్వే మంత్రిత్వశాఖ గుర్తించాలన్నారు. ఈ విషయమై రైల్వే మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. సుబ్రమణికి 'అతి విశిష్ఠ్ రైల్ సేవా పురస్కార్'ను ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించింది.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై... మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి

- తెలంగాణ శాసన సభాపతికి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ భారాస దాఖలు చేసిన పిటిషన్లపై మూడు నెలల్లోపు విచారణ పూర్తి చేయాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకు గతంలో మణిపుర్ కాంగ్రెస్ నాయకుడు కేశమ్ మేఘచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునే ఉదాహరణగా చూపింది. అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఆయా పిటిషన్లపై విచారణను సాగదీయడానికి చేసే ప్రయత్నాలకు స్పీకర్ అనుమతించరాదని స్పష్టం చేసింది. అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు సంబంధిత ఎమ్మెల్యేలపై స్పీకర్ ప్రతికూల అభిప్రాయానికి రావొచ్చని పేర్కొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు పైవిధంగా ఉత్తర్వులిచ్చింది. వీరి అనర్హత పిటిషన్‌పై విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోపు ఖరారు చేయాలని స్పీకర్‌కు సూచిస్తూ 2024 సెప్టెంబరు 9న హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును పక్కనపెడుతూ.. అదే ఏడాది నవంబరు 22న హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టేస్తున్నట్లు సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రకటించింది. రాజేంద్రసింగ్ రాణా కేసు తరహాలోనే ఈ కోర్టే పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ఇప్పటివరకు వివిధ రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పుల ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే తొలి అధికారం స్పీకర్లకే ఉన్నందున తామూ దాన్నే సమర్థిస్తున్నట్లు పేర్కొంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఫిరాయింపుల నిరోధక చట్టం ఉద్దేశాలు నెరవేరుతున్నాయా... లేదా? అన్న అంశంపై పార్లమెంటు ఒక పరిశీలన చేయడం మంచిదని సూచించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్‌గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది.

స్పీకర్ ఒక ట్రైబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పుడు...

పదో షెడ్యూల్‌లోని పేరాగ్రాఫ్ 6(1)కింద ఉన్న అధికారాలను అనుసరించి స్పీకర్ ఒక ట్రైబ్యునల్ (న్యాయాధికారి)గా వ్యవహరిస్తున్నప్పుడు ఆయన చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 226, 227 ప్రకారం హైకోర్టుల, ఆర్టికల్ 136 ప్రకారం సుప్రీంకోర్టు పరిధిలోకి వస్తాయి. అప్పుడు స్పీకర్ ఆర్టికల్ 122, 212 కింద ఉన్న రాజ్యాంగపరమైన రక్షణ (కాన్‌స్టిట్యూషనల్ ఇమ్యూనిటీ) ఉపయోగించుకోలేరని గుర్తుచేస్తున్నాం" అని సుప్రీంకోర్టు తన తీర్పులో వివరించింది.

ఐఐటీఎంలో 'అప్లైడ్ ఏఐ, డీప్ లెర్నింగ్' కోర్సు

- సెప్టెంబరు 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్‌లోని ప్రవర్తక్ టెక్నాలజీ.. అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ అప్లైడ్ ఏఐ, డీప్ లెర్నింగ్ కోర్సులో మొదటి బ్యాచ్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. 'టైమ్స్ ప్రో' సంస్థతో కలిసి 7 నెలల పాటు ఆన్‌లైన్‌లో ఈ కోర్సును చెప్పనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్టుగా దీన్ని రూపొందించారు. దీని ద్వారా రియల్ టైమ్ మెషిన్ లెర్నింగ్ సొల్యూషన్స్, పైథాన్, పైటోర్చ్, టెన్సార్‌ఫ్లో, ఎంఎల్‌ఓపీ వంటి వాటిల్లో నైపుణ్యాన్ని సాధించొచ్చని ఐఐటీఎం ప్రవర్తక్ సీఈవో డాక్టర్ ఎం.జె.శంకరరామన్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్, మేథమేటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో యూజీ, పీజీ చదివిన వారు, ఏఐ రంగంలోకి మారాలనుకుంటున్న ఉద్యోగులు కోర్సుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఐఐటీఎం ప్రవర్తక్, టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ నుంచి ధ్రువపత్రం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు <https://timespro.com/executive–education/iit–madras–pravartak–advanced–certificate–in–applied–ai–and–deep–learning> అనే లింకు ద్వారా సెప్టెంబరు 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తరగతులు సెప్టెంబరు 13 నుంచి ప్రారంభమవుతాయని, ఫీజు రూ.1.44 లక్షలు (పన్నులు అదనం) ఉంటుందని పేర్కొన్నారు.

షార్ డైరెక్టర్‌గా పద్మకుమార్



శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ డైరెక్టర్‌గా ఈఎస్ పద్మకుమార్‌ను నియమిస్తూ ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆర్ముగం రాజరాజన్‌ను తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ)కు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. పద్మకుమార్ ప్రస్తుతం ఇస్రో ఇనర్షియల్ సిస్టమ్స్ యూనిట్(ఐఐఎస్‌యూ) డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈయన గతంలో పలు డైరెక్టర్ పోస్టులతో పాటు వీఎస్ఎస్‌సీలో కీలక పదవులు నిర్వహించారు.

తిరుమలలో రీల్స్ చేయొద్దు: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట, మాడ వీధుల్లో ఇటీవల కొంత మంది వెకిలి చేష్టలు, నృత్యాలు చేస్తూ ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌గా అప్‌లోడ్ చేస్తున్నట్లు తితిదే దృష్టికి వచ్చింది. ఇలాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తితిదే గురువారం హెచ్చరించింది. 'ఇలాంటి చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల మనోభావాలు గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఇలాంటి వీడియోలు చిత్రీకరించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడతాం' అని తితిదే తెలిపింది.

కొమ్మమూరు కాలువపై 100 సెన్సర్లు

- కృష్ణా పశ్చిమ డెల్టాలో పైలట్ ప్రాజెక్టు


పర్చూరు, చినగంజాం, మార్టూరు, న్యూస్‌టుడే: కృష్ణా పశ్చిమ డెల్టా రైతులకు సకాలంలో సాగు నీరు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం కొమ్మమూరు కాలువపై అధునాతన సెన్సర్లతో నీటిని లెక్కించనుంది. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం దీనిని చేపట్టనుంది. కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు పలుచోట్ల 100కు పైగా సెన్సర్లు, ఎంపిక చేసిన పొలాల్లో తేమ శాతాన్ని తెలుసుకునేలా జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా సమాచారం.. జలవనరులు, భూగర్భ శాఖల అధికారుల ఫోన్లకు వెళుతుంది. దీంతో వారు నీటి ప్రవాహాన్ని లెక్కించటంతో పాటు అవసరాలకు తగ్గట్లు విడుదల చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు 'ఆంధ్రప్రదేశ్ జలవనరుల సమాచార నిర్వహణ వ్యవస్థ' ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సుమారు 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

మేసిందంతా కక్కించాల్సిందే!

అవినీతిపరులకు అధికారం అప్పగించడమంటే దొంగల చేతికి తాళాలివ్వడమే. నిర్లజ్జగా ఆ విషయాన్ని నిరూపించిన వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఠా- చెరుకుతోటలో పడిన ఏనుగుల మంద మాదిరిగా అయిదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ సౌభాగ్యాన్ని పీల్చిపిప్పిచేసింది. ముఖ్యంగా 'జే' గ్యాంగ్ ముందుండి నడిపించిన మద్యం కుంభకోణమైతే- రాష్ట్ర సంపదనే కాదు, ప్రజారోగ్యాన్నీ ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకాన్నీ నమిలి మింగేసింది. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎప్పుడూ ఎక్కడా కనీవినీ ఎరగని స్థాయిలో సాగిన ఆ సొత్తాపహరణపర్వానికి సంబంధించి 'సిట్' దర్యాప్తులో ఎన్నో ఆధారాలు వెలుగుచూస్తున్నాయి. రాజకీయ అవినీతిని వ్యవస్థీకృతం చేసిన వైకాపా పెద్దలు- ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి, అలా దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి ఎన్నెన్ని పన్నాగాలకు పాల్పడ్డారో అవి చాటిచెబుతున్నాయి. పూర్వం బందిపోట్లు తాము కాజేసిన నగానట్రా ఎవరి కంటా పడకుండా కారడవుల్లో కప్పెట్టేవారు. దోపిడీలో వాళ్లను మించిపోయిన జగన్ పార్టీ మద్యం మాఫియా- జనారణ్యంలోనే డెన్‌లు తెరిచి కోట్ల కొద్దీ ముడుపుల సొమ్మును అక్కడ గుట్టుగా దాచింది. అలాంటి డెన్‌లోని ఒకదాని తలుపులను 'సిట్' తెరిపించడంతో రూ.11 కోట్ల నోట్లకట్టలు బయటపడ్డాయి. తమ భోషాణాలను నింపుకోవడానికి ఎందరో ఆడబిడ్డల తాళిబొట్టు తెంపేసిన వైకాపా లిక్కర్ సిండికేటు- జనతంత్ర తులసివనంలో ఓ గంజాయి మొక్క! దానికి పాదులుతీసి, ఆ విషవృక్ష ఫలాలను ఆబగా ఆరగించిన 'అంతిమ లబ్ధిదారు'కూ జేడీలు పడాలని ఏపీ ప్రజానీకం గట్టిగా గళమెత్తుతోందిప్పుడు!

మద్యం విక్రయాలను ప్రభుత్వమే నిర్వహించినప్పుడు ఇక కుంభకోణం ఎలా జరుగుతుందని జగన్ జమానాలో సకల శాఖల మంత్రిగా రాచభోగాలు అనుభవించిన సజ్జల రామకృష్ణారెడ్డి అమాయకత్వం ఒలకబోస్తున్నారు. కానీ, వైకాపా అధికారంలోకి రాగానే మద్యం విధానాన్ని మార్చింది ముడుపుల మేత కోసమన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన వాస్తవం. మద్యం తయారీ మొదలు అమ్మకాల వరకు మొత్తం వ్యవస్థను చెరబట్టిన జగన్ పార్టీ పెత్తందారులు- ఏపీఎస్‌బీసీఎల్ దగ్గర నమోదైన 111 కంపెనీల్లో 40 సంస్థలకే తాంబూలాలు ఆర్డర్లు కట్టబెట్టారు. వాటి నుంచి వేల కోట్ల రూపాయల లంచాలు మేయడంతో పాటు తమ బినామీ సంస్థల పేరిట ఆర్డర్లు తీసుకుని మరింతగా ప్రజాధనాన్ని గుటకాయ స్వాహాచేశారు. తాగినవాళ్ల ప్రాణాలను కబళించే 'జే' బ్రాండ్ మందును జనానికి అంటగట్టి ఎన్నో సంసారాలను సర్వనాశనం చేశారు. కావాల్సిన అధికారులను కీలక పోస్టుల్లోకి తెచ్చిపెట్టుకుని జగన్ అనుచరవర్గం చేసిన ఈ దోపిడీపర్వంలో చివరికి సమిధలైంది సామాన్యులే! కాబట్టి వైకాపా మాఫియా దిగమింగిన ప్రజాధనాన్ని మొత్తం కక్కించి, దాని బాధితుల సంక్షేమానికి వినియోగించడం కూటమి ప్రభుత్వ కర్తవ్యం!

లోతైన కుట్రలతో కూడిన ఆర్థిక నేరాలపట్ల కఠినంగా వ్యవహరించాలని గతంలో జగన్‌మోహన్ రెడ్డి కేసులోనే సుప్రీంకోర్టు నిర్దేశించింది. బెయిళ్లు, ముందస్తు బెయిళ్లు మంజూరు చేసే సమయంలో సాధారణ నిందితులను, సమాంతర వ్యవస్థను నడిపిస్తూ దేశ ప్రగతిని కబళించే ఆర్థిక నేరగాళ్లను ఒకే గాటన కట్టరాదని న్యాయపాలికే పలు సందర్భాల్లో స్పష్టంచేసింది. జగన్ పార్టీ ప్రాయోజిత మద్యం కుంభకోణం- తీవ్రస్థాయి ఆర్థిక నేరమే కాదు, ఎన్నో కుటుంబాలను ఛిద్రంచేసిన మహాపాతకం. దానికి పథక రచన చేసినవారు, అందులో భాగస్వాములైన వాళ్లు ప్రతిఒక్కరూ కఠిన దండనలకు అర్హులు. జనం ఇళ్లూఒళ్లూ గుల్లచేసి పోగేసిన నెత్తుటి పైకంతో భూములు కొని, సినిమాలు తీసి, జల్సాలు చేసి... ఆ అక్రమ సొత్తుతోనే ఓట్లు బేరం చేసి ప్రజాస్వామ్యాన్ని మరోసారి చెరబట్టడానికి తెగబడిన జగన్ పార్టీ ప్రబుద్ధులు- మన రాజకీయాలకు పట్టిన చీడపురుగులు!



ఎవరి గొంతునైనా అణచివేయడం అంత తేలిక కాదు, ఎంతగా అణచివేస్తే అంతగా అది రాజుకుంటుంది. తిరుగుబాటు చేస్తూనే ఉంటుంది.

– అన్నాభావు సాఠే, సంఘసంస్కర్త

వ్రత సంకల్పం

వ్రతం అంటే నియమం, సంకల్ప దీక్ష. భక్తి, శ్రద్ధల సమ్మిళితం. అష్టదిక్కుల నడుమ, తల్లి గర్భంలోని శిశువు శరీరాకృతి సక్రమంగా రూపుదాల్చాలి. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో పుట్టడానికి శక్తి అవసరం. ఆ శక్తికి ప్రతిరూపమే అష్టలక్ష్మీ తత్వం. మానవ జీవితంలో సంపూర్ణత్వానికి అష్టైశ్వర్యాలు ప్రతీక. అష్టకష్టాలను నివారించే వరలక్ష్మీ వ్రతాన్ని జీవన సర్వస్వంగా చెబుతారు.

వరలక్ష్మీ వ్రతాన్ని మొదటగా చారుమతీదేవి తన భర్త క్షేమం కోరి తపస్సుగా ఆచరించిందని స్కాంద పురాణం వివరిస్తోంది. పరమేశ్వరుడి సూచనతో ఆమె ఈ వ్రతాన్ని ఆచరించి, భర్తకు ఆయురారోగ్యాలను, కుటుంబ సౌఖ్యాన్ని పొందిందన్నది పురాణ కథనం. వ్రతంలో భాగంగా చేసే కలశ పూజ పరమార్థం... అష్టలక్ష్ముల సమ్మిళిత శక్తిని ఇంట్లోకి ఆహ్వానించడం. ఆ శక్తి కుటుంబానికి ఆయుష్షునిస్తుందని విశ్వాసం. అది సమష్టితత్వాన్ని ప్రేరేపిస్తుంది. లక్ష్మి అంటే కేవలం ఐశ్వర్యప్రదాయిని కాదు. అనేక రూపాలలో మనిషి జీవన చక్రాన్ని నడిపించే మాతృశక్తి. అన్నిటికీ అదే మూలాధారం ఆ శక్తి లేనిదే మనిషి మనుగడ అసాధ్యం. ఆత్మీయత, సౌభ్రాతృత్వం, అంకిత భావం అన్నీ ఆ శక్తిలోనే ఉన్నాయి.



అంతర్యామి

శ్రద్ధగా తలపెట్టిన వ్రతం మనిషిలోని స్వార్థాన్ని తొలగిస్తుంది. ఇంటి పూజామందిరంలో వెలిగే దీపం కన్నా, హృదయంలో వెలిగే జ్ఞానదీపమే శాశ్వతమైనదిగా నిలుస్తుంది. లక్ష్మీదేవి పాదాలను అలంకరించడమే కాదు, ఆమె సుగుణాలను, సంతుష్టి చెందే తత్వాన్ని నిజజీవితంలో అనుసరించాలన్న తపన కలగాలి. సమృద్ధి అంటే సంపాదించి దాచుకోవడం కాదని, పంచుకోవడంలోనే సంపత్తి తత్వం ఉన్నదని ధాన్యలక్ష్మి తెలియజేస్తుంది. గజలక్ష్మి శక్తి- శాంతి సమన్వయమే కాదు, మన లోపలి అహంకారాన్ని జయించి, స్వీయ నియంత్రణతో జీవించమన్న సందేశం ఇస్తుంది. సంతానలక్ష్మి సంతతి ప్రాప్తికి మాత్రమే కాక ధర్మ పరంపర కొనసాగింపునకు, విలువల వారసత్వానికి ప్రతీక. వీరలక్ష్మి నిర్భీతి, న్యాయంవైపు నిలబడే ధైర్యానికి ప్రేరణ. విద్యాలక్ష్మి జీవన విజ్ఞానాన్ని, సత్యాన్ని తెలుసుకునే సామర్థ్యాన్ని బోధిస్తుంది. అహంకారంపై నియంత్రణ కలిగి ఉండాలని, అంతరంగ విజయమే విజయలక్ష్మి తత్వమని సూచిస్తుంది. ఈ ఎనిమిది తత్వాల సమన్వయమే లక్ష్మిని సంపూర్ణంగా దర్శించే మార్గం. వ్రతం ఒక్కరోజు చేసే ఆచారంగా కాక, ఈ అష్టశక్తులను జీవితంలో ప్రతి దినం ఆచరించే ఆత్మవైభవంగా రూపాంతరం చెందాలి. అప్పుడు లక్ష్మి అనుగ్రహం అందరి హృదయాలనూ ఆనందమయం చేస్తుంది.

శ్రావణమాసం భారతీయ ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతిబింబించే కాలం. ప్రకృతి పునరుజ్జీవం పొందే ఈ రుతువులో, మనుషుల హృదయాలలోనూ భక్తి, శ్రద్ధ, శాంతి చివుర్లు వేస్తాయి. ఈ మాసంలో వచ్చే శుక్లపక్ష పున్నమికి దగ్గరలోని శుక్రవారం నాడు జరుపుకొనే వరలక్ష్మీవ్రతం, త్రికాలబద్ధమైన ధర్మవేదిక. ఇది స్త్రీలు మాత్రమే ఆచరించాల్సిన పూజ కాదు. కుటుంబంతో చుట్టూ ఉన్న సమాజాన్ని సత్సాంగత్యంతో బంధించగలిగే ధార్మిక, తాత్విక ఆత్మ వైభవ సంస్కారమది. మహాలక్ష్మీ అనుగ్రహం అందరికీ ఉండాలని కోరుకుందాం.

– గొర్తి వాణీ శ్రీనివాస్



ప్రగతి వనంలో అంకురాలు

ఆర్థికాభివృద్ధి, స్వయంసమృద్ధిలో స్టార్టప్‌లు కీలకంగా నిలుస్తాయి. ప్రపంచ దేశాలు ఈ విషయాన్ని గుర్తించినందువల్లే స్టార్టప్ వ్యవస్థాపకులను ప్రోత్సహిస్తున్నాయి. సత్వర అనుమతులతో అంకురాల అభివృద్ధికి స్టార్టప్ ఎకోసిస్టంను రూపొందిస్తున్నాయి. స్టార్టప్‌లు సైతం సరికొత్త ఆలోచనలు, నిర్విరామ కృషి, నవీన ఆవిష్కరణలతో ముందుకెళ్తున్నాయి. వ్యాపారాన్ని విస్తరిస్తూ, ఉపాధి కల్పిస్తూ, బహుళజాతి సంస్థలుగా ఎదుగుతున్నాయి. ప్రారంభ దశలోని స్టార్టప్‌లకు ప్రభుత్వాలు మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. సాంకేతిక, న్యాయ సలహాలు, పెట్టుబడుల సమీకరణకు సూచనలు అందిస్తున్నాయి. సవాళ్లను ఎదుర్కొనే శిక్షణను ఇవ్వడంతో పాటు ఇతరత్రా సేవలన్నీ అందించేందుకు స్టార్టప్ ఎకోసిస్టంలో ప్రత్యేక 'ఇంక్యుబేటర్'లను నెలకొల్పుతున్నాయి. విజయవంతంగా ఉత్పత్తిని ప్రారంభించిన స్టార్టప్‌లను వేగంగా విస్తరించడానికి ప్రభుత్వాల పరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్టార్టప్‌ల లక్ష్యాలను, వ్యాపార పరిధిని, సాంకేతికతను అర్థం చేసుకుని పెట్టుబడులకు ఆసక్తి చూపే ఏంజెల్ ఇన్వెస్టర్లను ఎకోసిస్టంలో భాగస్వాముల్ని చేస్తున్నారు. వెంచర్ క్యాపిటల్, ప్రైవేటు ఈక్విటీల ద్వారా పెట్టుబడులను సమకూర్చడమే కాకుండా షేర్‌మార్కెట్ల ద్వారా మూలధనాన్ని సమీకరించుకునే వెసులుబాటును కూడా ఎకోసిస్టం కల్పిస్తోంది. సామాన్యుల నుంచీ పెట్టుబడులు పొందే 'క్రౌడ్ ఫండింగ్' విధానాన్నీ ప్రోత్సహిస్తోంది. సాంకేతిక మెలకువలను మెరుగుపరచడానికి, స్టార్టప్‌ల ఉత్పత్తుల్లో నాణ్యతను పెంచడానికి, వ్యాపార ప్రణాళికల్లో లోపాలను సరిదిద్దేందుకు పలు దేశాల్లో విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలను విజ్ఞాన వనరులుగా ఏర్పాటు చేశారు. చిన్న సంస్థలు మొదలు భారీ కంపెనీల వరకు అన్నింటినీ స్టార్టప్‌లతో అనుసంధానించి పరస్పర సహకారంతో అభివృద్ధి చెందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజాదరణ పొందిన ఉత్పత్తులను సత్వరమే అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేసే లక్ష్యాలతో వివిధ దేశాలు తమ స్టార్టప్ ఎకోసిస్టంలను అభివృద్ధి చేసుకుంటున్నాయి.

ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగిన దేశంగా ఇండియా ఎదిగినట్లు ప్రపంచ ఆర్థిక వేదిక ఇటీవల ప్రకటించింది. 2016లో దేశీయంగా 500 స్టార్టప్‌లుంటే, తొమ్మిదేళ్లలోనే వాటి సంఖ్య దాదాపు 1.60 లక్షలకు చేరింది. భారతీయ స్టార్టప్‌లు పదహారు లక్షల మందికి పైగా వృత్తి నిపుణులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు అవి లక్ష కోట్ల డాలర్ల మేర సమకూరుస్తాయని అంచనా!



ప్రపంచ స్థాయిలో పోటీ

ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగిన అమెరికా- అంకుర సంస్థల ఏర్పాటు, వాటి ద్వారా ఆదాయం ఆర్జించడంలో అగ్రభాగాన నిలుస్తోంది. భారీ పెట్టుబడులు, సంపూర్ణ ప్రభుత్వ మద్దతు, అతి తక్కువ నిర్వహణ వ్యయం, అధునాతన మౌలిక వసతులు, అతిపెద్ద స్వదేశీ మార్కెట్ వంటివి చైనాను రెండో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగిన దేశంగా నిలబెట్టాయి. భారత్ ఆ తరవాతి స్థానంలో నిలుస్తోంది. ఇండియా 120కి పైగా స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా తీర్చిదిద్దింది. ప్రపంచంలో అత్యధిక యూనికార్న్‌లు కలిగిన మూడో దేశంగా గుర్తింపు పొందింది. స్వదేశీ విజ్ఞానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఇండియాలో స్టార్టప్‌ల ఎదుగుదలకు ఎంతగానో అక్కరకొస్తున్నాయి. ముఖ్యంగా, అభివృద్ధి చెందిన దేశాలతో శాస్త్ర, సాంకేతిక పరిశోధన రంగాల్లో వ్యూహాత్మక సంబంధాలు, కీలక రంగాల్లోని విదేశీ పరిశ్రమలతో సాంకేతిక, వ్యాపార భాగస్వామ్యాలు భారతీయ స్టార్టప్‌ల వృద్ధిని వేగవంతం చేస్తున్నాయి. మేటి సాంకేతిక విలువలు, నాణ్యతతో కూడిన భారతీయ ఆవిష్కరణలు ప్రపంచస్థాయిలో పోటీ పడుతున్నాయి.

బెంగళూరుకు చెందిన స్టార్టప్ ఒకటి 25 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఉత్పత్తి చేస్తూ, స్వదేశీ పరిజ్ఞానంతో వాటిని అభివృద్ధి చేయగల అయిదో దేశంగా ఇండియాకి గుర్తింపు తెచ్చింది. డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలు, వ్యోమనౌకల్లో కీలక భాగాలైన ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు, రాడార్, లేజర్ వ్యవస్థల్లో వాడుతున్న ఇమేజింగ్ సెన్సర్లు, చిప్‌సెట్లు వంటి వాటిని భారత స్టార్టప్ 'థర్డ్ ఐ టెక్' అభివృద్ధి చేస్తోంది. ఇస్రోతోపాటు అమెరికా రక్షణ, అంతరిక్ష శాఖలు, ఇతర ప్రసిద్ధ కంపెనీలు ఈ సంస్థకు ప్రధాన వినియోగదారులు కావడం గొప్ప విజయం. దిల్లీకి చెందిన మరో స్టార్టప్ 'భారత్ సెమీ'- అమెరికా రక్షణ శాఖతో కలిసి ఈ ఏడాది సెమీకండక్టర్ల ఉత్పత్తిని ప్రారంభించి ఎగుమతులకు సిద్ధమవుతోంది. బోయింగ్, మిత్సుబిషి లాంటి దిగ్గజ సంస్థల కోసం పౌర, యుద్ధ విమానాల డిజైన్ల రూపకల్పనతో పాటు, కీలక ముఖ్య భాగాలను 'యూనిమెక్ ఏరోస్పేస్' స్టార్టప్ తయారు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఉపగ్రహాల్లో వినియోగించే ప్రొపల్షన్ వ్యవస్థలను పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తున్న 'బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్' సంస్థ సంచలన విజయాలు నమోదు చేస్తోంది.

పరిశోధనలపై పెట్టుబడులు

భారత స్టార్టప్‌లు కంప్యూటింగ్, ఏఐ, అంతరిక్ష, ఆర్థిక, ఈ-కామర్స్ రంగాల్లో సత్తా చాటుతున్నాయి. రక్షణ, విద్య, బయోటెక్నాలజీ, వ్యవసాయ రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తున్నాయి. కానీ, అన్ని విజ్ఞానశాస్త్ర విభాగాల్లో సమర్థ పరిశోధన, అభివృద్ధి వ్యవస్థ లేకపోవడంతో ఆశించిన విజయాలు దక్కడం లేదు. శాస్త్ర సాంకేతిక పరిశోధనలూ అభివృద్ధికి భారీగా ఖర్చుపెడుతున్న అమెరికా, ఐరోపా దేశాలతో పోలిస్తే బడ్జెట్లలో కేటాయింపులు చాలక, ప్రైవేటు రంగం నుంచి తగినంత సహకారం దక్కక దేశీయ పరిశోధన రంగం వెనకబడింది. శాస్త్ర, సాంకేతిక ప్రతిభ సమృద్ధిగా ఉన్న ఇండియాలో ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులను పెంచాలి. దానివల్ల ఆవిష్కరణలు వేగవంతమవుతాయి. త్వరగా పేటెంట్లు దక్కుతాయి. తద్వారా స్టార్టప్‌లు మరిన్ని విజయాలు నమోదు చేస్తాయి. ఇండియా మౌలిక విజ్ఞానశాస్త్రాల్లో పరిశోధన, అధ్యయనానికి పెద్దపీట వేయాలి. అప్పుడే సుదీర్ఘకాలం ఆవిష్కరణల్లో భారత్ అగ్రభాగంలో కొనసాగుతుంది. స్టార్టప్‌ల పరంగా అద్భుత పురోగతి సాధిస్తుంది.



భరత్ వేదాంతం
సాంకేతిక రంగ నిపుణులు

'తుది విజయానికి తొలి అడుగు ఓటమి' అన్నారు సినారె. గెలవాలంటే పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నది చాలామంది అభిప్రాయం. అందుకు భిన్నంగా, గెలుపునకు గత విజయాలూ ప్రేరణనిస్తాయి అంటారో వ్యక్తి. రెండు దశాబ్దాల్లో వేలాదిమందిని విజయపథంలో నడిపించిన అనుభవంతో ఆయన చెప్పే మాటలను కొట్టివేయలేం.

కొన్ని పనులు పదే పదే చేసినా విసుగనిపించవు. పైపెచ్చు ఆనందం కలిగిస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఎందుకలా అంటే- చేసే పని ఇష్టమైంది కాబట్టి. చిన్నతనంలో సైకిల్ తొక్కడం నేర్చుకునేటప్పుడు కిందపడి మోకాలు చిప్పలు డొక్కుపోతాయి. అయినా తొక్కడం మానం. సరిగ్గా తొక్కడం వచ్చేదాకా పంతం వదలం. అక్కడితో ఆగిపోక తోటివారిపై పైచేయి సాధించేదాకా పట్టుదలతో కృషి చేస్తే లోకం శభాష్ అంటుంది. విజేతగా గుర్తిస్తుంది. మరిన్ని విజయావకాశాలను అందిస్తుంది. కాకపోతే



విజయసూత్రం

ప్రతిభ ప్రదర్శించడం ఒక ఎత్తయితే, ఇష్టమైన పనిని ఎంచుకోవడం మరో ఎత్తు. తమ ఇష్టాయిష్టాలేవో తెలీకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్లు పనిచేసుకు పోయేవాడికి విజయం పగటి కలే. విజేతల నేపథ్యాలను తరచి చూస్తే అన్నింటిలో కామన్‌గా కనిపించేది ప్రతిభ. అది ఏ రంగానికి సంబంధించినదైనా కావచ్చు. ఆసక్తి, శ్రద్ధ, పట్టుదల, సామర్థ్యం... ఈ బలాలన్నిటినీ సక్రమంగా వినియోగించే శక్తి సామర్థ్యాలే ప్రతిభ. 'ఎవరికి వారు తమ శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకుని ఆ రంగానికి చెందిన వృత్తిని ఎంచుకుని అందులో ప్రతిభ ప్రదర్శిస్తే విజయం సాధ్యమవుతుంది' అంటారు బెర్నార్డ్ హాల్డేన్. వ్యక్తి ప్రవృత్తిని బట్టి విజయసాధనకు వీలయ్యే ఉపాధి మార్గాలను సూచించే నేటి 'కెరీర్ కన్సల్టెన్సీ' వృత్తికి శ్రీకారం చుట్టింది ఆయనే మరి.

లండన్‌కి చెందిన బెర్నార్డ్ హాల్డేన్‌కి మెడిసిన్ చదవాలని కోరికగా ఉండేది. అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో అమెరికా వెళ్లారు. అప్పుడు అక్కడ ఆర్థికమాంద్యం ఉంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో న్యూయార్క్ జర్నల్ ఆఫ్ కామర్స్‌లో కొన్నాళ్లు పనిచేశారు. తరవాత ఒక ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ సంస్థలో చేరారు. అక్కడ ఆయన బాధ్యత- రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొని తిరిగి వచ్చిన సైనికాధికారులకు మంచి ఉపాధి మార్గాలు సూచించడం. ఆ అనుభవం ఆయనకు తన ప్రతిభకు సానబెట్టుకునే అవకాశాన్నిచ్చింది. 'జీవితాన్ని ఆస్వాదించాలంటే, ప్రేమించే పనిని ఎంచుకోవాలి. చేసే పనిని ప్రేమించాలి. అప్పుడు విజయమూ లభిస్తుంది, జీవితమూ నిశ్చింతగా గడిచిపోతుంది' అనేది ఆయన అనుభవంతో కనిపెట్టిన విజయసూత్రం. దాని ఆధారంగా 'బెర్నార్డ్ హాల్డేన్ అసోసియేట్స్' స్థాపించి అతి తక్కువ కాలంలోనే అనేక నగరాల్లో వేలాదిమందికి తగిన ఉపాధి మార్గాలు సూచించారు. కెరీర్ ప్లానింగ్ మీద ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. ఇవాళ పెద్ద పెద్ద సంస్థలు సైతం తప్పనిసరిగా ఆధారపడుతున్న 'కెరీర్ కౌన్సెలింగ్'ను ఒక వృత్తిలా ప్రపంచానికి పరిచయం చేసిన మొదటి వ్యక్తి బెర్నార్డ్ హాల్డేన్!

– అభయ్

ఎన్ని హత్యలో...



శాంతి భద్రతల నిర్వహణలో ప్రభుత్వాల వైఫల్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా హత్యలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. వాస్తవానికి విశ్వవ్యాప్తంగా ప్రతి లక్ష జనాభాకు హత్యల రేటు 2015లో 5.9 ఉంటే, 2023లో అది 5.2కు దిగివచ్చింది. అయితే, 2030 నాటికి హత్యలను యాభై శాతానికి తగ్గించాలన్న సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు ప్రపంచం చేరుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతంలో హత్యలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. వ్యవస్థీకృత నేరాలు, ముఠాల కొట్లాటల్లో పురుషులు ఎక్కువగా కడతేరిపోతున్నారు. మహిళలు ఎక్కువగా జీవిత భాగస్వాములు లేదా కుటుంబ సభ్యుల చేతిలో హత్యకు గురవుతున్నారు. 2023లో ఆయా ప్రాంతాల్లో హత్యల రేటు...

లాటిన్ అమెరికా, కరేబియన్	19.7
సబ్ సహారన్ ఆఫ్రికా	11.9
ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా	5.0
ఐరోపా, ఉత్తర అమెరికా	3.2
ఓషియానియా	2.9
మధ్య, దక్షిణాసియా	2.9
తూర్పు, ఆగ్నేయ ఆసియా	0.8

(ఆధారం: ది సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ రిపోర్ట్-2025)

హరివిల్లు వర్ణాలు.. చూడలేని పిల్లలు!



రంగుల ప్రపంచాన్ని హాయిగా ఆస్వాదించాల్సిన పిల్లలు అసలు ఆ రంగులేంటో గుర్తించలేకపోతున్నారు. కలర్ల పేరు తెలియకపోవడం దీనికి కారణం కాదు.. వాళ్ల కంటికి అన్ని రంగులూ ఒకేలా కనిపిస్తుండటం వల్లే ఈ సమస్య తలెత్తుతోంది. దానికి కారణమేంటి? నివారించడం ఎలా?

ప్రస్తుతం చాలామంది పిల్లల్లో చిన్న వయసులోనే రెటీనా సమస్యలు తలెత్తుతున్నాయి. రంగులను గుర్తుపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువసేపు టీవీ, ఫోన్లు చూడటమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. గత నాలుగేళ్లలో ఇలాంటి కేసులు దాదాపు అయిదు రెట్లు పెరిగాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలోని మెట్రో నగరాల్లో ప్రతి అయిదుగురు బాలల్లో ఇద్దరు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకరు రంగులను సరిగ్గా గుర్తించలేకపోతున్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు శివరామ్ మాలే 'కలర్ విజన్ డెఫిషియెన్సీ' అంశంపై పరిశోధన చేశారు. రంగులన్నీ ఒకేలా కనిపించడాన్ని ఆరంభంలోనే గుర్తించే ఏర్పాట్లు దేశీయంగా లేవు. దాంతో, అది తీవ్రమైతేగానీ బయటపడటం లేదు. ఆ సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు 'రిషివి కలర్ ఇల్యూజన్ ప్రొటోటైప్' యాప్‌ను శివరామ్ అభివృద్ధి చేశారు.

ఆన్‌లైన్ విద్యతో అరచేతుల్లోకి

లాక్‌డౌన్ సమయంలో ప్రారంభమైన ఆన్‌లైన్ తరగతుల వల్ల నర్సరీ, ఎల్‌కేజీ చదివే పిల్లలు మొదలు డిగ్రీ విద్యార్థుల వరకు అందరి చేతుల్లోకి ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చి చేరాయి. మొదట్లో చదువుకోవడానికి అలవాటైన ఫోన్లు కాలక్రమంలో వ్యసనంగా మారిపోయాయి. తినేటప్పుడు, పడుకునేటప్పుడు ఫోను చేతిలో లేకుంటే గడవని దుస్థితి ఏర్పడింది. ఆ అలవాటు చదువును దెబ్బతీయడంతో పాటు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తోంది. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లల్లో 79శాతం మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్‌కి అలవాటు పడ్డారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల్లో 63.7శాతం మంది ఫోన్ లేనిదే ఉండలేకపోతున్నారు. 2018 కంటే ముందు 29.6 శాతంగా ఉన్న ఫోన్ల వినియోగం ఆ తరవాత 68.6 శాతానికి పెరిగింది. ఆ అలవాటును మాన్పించేందుకు వైద్యులను సంప్రదించాల్సి వస్తోందంటేనే పిల్లలు ఫోన్లకు ఎంతలా బానిసలుగా మారుతున్నారో అర్థమవుతుంది. ఎలెక్ట్రానిక్ పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మయోపియా(దగ్గరి దృష్టి) సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

ఫోన్లు, ట్యాబ్‌ల నుంచి వచ్చే నీలి కాంతి శరీరంలోని మెలటోనిన్ అనే హార్మోన్ మీద ప్రభావం చూపుతుంది. అది క్రమంగా నిద్రలేమికి దారితీస్తుంది. ఫలితంగా ఊబకాయం, వినికిడి సమస్యలు, కంటి వ్యాధులు చుట్టుముడతాయి. అంతేకాక ప్రాణాంతక ట్యూమర్లు సైతం కోరలు చాచే ప్రమాదం పొంచి ఉంది. సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వాడే పిల్లల్లో మానసిక పరిస్థితి సరిగ్గా ఉండటం లేదని వైద్యులు చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికీ పేచీ పెడుతూ ఏం అడిగినా విసుగ్గా సమాధానాలు చెబుతున్నారని, వాళ్లలో ఏకాగ్రత లోపించి చురుకుదనం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలోచనా విధానం సైతం మారిపోతోందని హెచ్చరిస్తున్నారు.


తల్లిదండ్రులతోనే సాధ్యం

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో తల్లిదండ్రులదే కీలక పాత్ర. వీలైనంత వరకు పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఉదయం పూట, సాయంత్రం స్కూల్ నుంచి వచ్చాక ఫోన్లకు బదులు పిల్లలకు క్రికెట్, వాలీబాల్, చెస్ లాంటి ఆటలు అలవాటు చేయాలి. లేదంటే సంగీతం, డ్యాన్స్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలి. ఫోన్లవైపు కాకుండా పుస్తకాలు చదడం, వ్యాయామం మీదకు వారి మనసును మళ్లించాలి. దేశానికి భవిష్యత్తు అయిన పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలూ ప్రత్యేక శ్రద్ధ చూపడం తప్పనిసరి. చైనాలో మైనర్లకు రాత్రి 10 నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఇంటర్నెట్‌లోని చాలా సేవలు అందుబాటులో ఉండవు. 8-15 ఏళ్ల వయసు పిల్లలు గంటకు మించి ఫోన్ వాడకుండా అక్కడి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. చిన్నారులు, యువత ఎక్కువగా ఫోన్లకు అలవాటు పడకుండా సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ చైనా (సీఏసీ) కీలక నిబంధనలు అమలు చేస్తోంది. మన దగ్గరా అలాంటి వాటిని ఆచరణలోకి తెచ్చే అవకాశాలను ప్రభుత్వాలు పరిశీలించాలి. ఎడతెగకుండా ఫోన్లలో మునిగిపోతుండటం వల్ల పిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై తల్లిదండ్రుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. అప్పుడే భావి భారతం దృఢంగా రూపుదిద్దుకుంటుంది.

– సూగూరు రవీందర్ రావు

కోతి వైద్యం!

ఒక అడవిలో ఉండే కపిల అనే కోతికి చక్కగా వైద్యం చేస్తుందనే పేరుంది. అక్కడుండే జంతువులకు ఏ అనారోగ్యం వచ్చినా దాని దగ్గరకే వచ్చేవి. అదే అడవిలో ఒక ఎలుగుబంటి కూడా వైద్యం చేస్తుండేది. కానీ దాని దగ్గరికి పెద్దగా జంతువులేవీ వెళ్లేవి కావు. ఒకరోజు వైద్యం చేయడానికి కావాల్సిన మూలికల కోసం వెతుకుతోంది ఎలుగు. అక్కడే దానికి కోతి కనిపించింది. అప్పుడు.. 'కోతి మామా! నువ్వూ నేనూ ఒకే దగ్గర వైద్యం నేర్చుకున్నాం. ఒకే రకమైన మూలికలు వాడతాం. కానీ నా కంటే నీ దగ్గరికే ఎక్కువమంది వస్తున్నారు ఎందుకు?' అని అడిగింది. 'నువ్వు వైద్యం చేసే విధానం చూస్తేగానీ చెప్పలేను' అంది కోతి. అన్నట్టుగానే కొన్నిరోజులకు ఎలుగు వైద్యాన్ని పరిశీలించడానికి వెళ్లింది కోతి. అప్పుడే



హాయ్! బుజ్జీ!!

అక్కడికి ఒక నక్క వచ్చింది. దాని కాలుకు దెబ్బ తగిలి చాలా రక్తం కారుతోంది. 'అమ్మో! ఎంత రక్తం పోతోంది. నీకు వైద్యం చేయాలంటేనే భయమేస్తోంది' అంటూ కట్టు కట్టింది ఎలుగు. కొన్ని మూలికలు ఇచ్చి.. 'ఇవి తప్పకుండా వేసుకో లేదంటే గాయం తగ్గదు.. కాలు తీసేయాల్సి వస్తుంది' అంటూ భయపెట్టింది. ఆ తరవాత రామచిలుక రెక్కలకు గుచ్చుకున్న ముల్లును తీసి పసరు మందు రాసింది. 'కొన్నిరోజుల వరకు ఏది పడితే అది తినొద్దు. కాస్త జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం' అని చెప్పింది. దాంతో అది చాలా భయపడిపోయింది. అదంతా గమనించిన కోతి.. 'ఎలుగు మామా! నీ మీద నమ్మకంతో వచ్చే జంతువులను భయపెడుతూ వైద్యం చేస్తున్నావు. అది తప్పు.. శరీరానికి వైద్యం ఎంత పని చేస్తుందో, వాళ్ల మనసుకు నువ్వు చెప్పే మాటలు కూడా అంతే ధైర్యాన్ని ఇవ్వాలి. అప్పుడే తొందరగా జబ్బు నయం అవుతుంది' అని చెప్పింది. అప్పుడు ఎలుగుకు తను చేస్తున్న తప్పేంటో తెలిసింది. ఆ రోజు నుంచి కోతి చెప్పిన మాటలు పాటించడం మొదలుపెట్టింది. మెల్లగా ఎలుగు కూడా మంచి పేరు తెచ్చుకుంది.

– వడ్డేపల్లి వెంకటేశ్

గడుల్లో గప్‌చుప్!

ప్రతి చతురస్రంలో ఒక్క అక్షరం తప్ప మిగతావి రెండు సార్లు ఉంటాయి. ఆ ఏకాకి అక్షరాలను ఓ చోట చేరిస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ఓసారి ప్రయత్నించండి.

1	గి	గృ	గే	బో	బై	బ	3
	గై	గి	గా	బు	బో	బొ	
	గే	గృ	గై	బ	బై	బు	
2	జు	జీ	జ	మృ	మై	ము	4
	జృ	జె	జీ	మ్మ	మృ	మే	
	జ	జృ	జె	ము	మే	మై	

జవాబు: (printed upside down)

ఈనాడు అమరావతి ఎన్టీఆర్
శుక్రవారం ఆగస్టు 1, 2025

శాంతించిన కృష్ణమ్మ


దిగువకు తరలిపోతున్న వరదనీరు

సమయం	రాక (క్యూసెక్కుల్లో)	పోక
ఉ.06.00	2,54,034	2,37,125
ఉ.07.00	2,65,909	2,49,000
ఉ.09.00	2,77,784	2,60,875
ఉ.11.00	2,89,659	2,72,750
రా.07.00	2,65,909	2,49,000
రా.08.00	2,54,034	2,37,125

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం గురువారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. సుమారు 2.90 లక్షల క్యూసెక్కుల వరకు వరద తీవ్రత వచ్చింది. తర్వాత కృష్ణమ్మ శాంతించింది. మధ్యాహ్నం 12 గంటలలోపు ఉద్ధృత పరిస్థితులు నెలకొన్నా.. 3 గంటల వరకు నిలకడగా ఉంది. సాయంత్రం 4 గంటల నుంచి తగ్గడం కన్పించింది. పంట కాలువలకు 16,909 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వరద ఉద్ధృతి నేపథ్యంలో కలెక్టర్ జి.లక్ష్మీశ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. జలవనరుల శాఖ అధికారులతో పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

వరద నేపథ్యంలో అప్రమత్తం

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వస్తున్న నేపథ్యంలో పర్యాటక, జలవనరు, రెవెన్యూశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పర్యాటకశాఖ బోట్లను పున్నమిఘాట్ వద్ద ఒడ్డున పెట్టించారు. ఉద్ధృతి పెరిగినా కొట్టుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పున్నమి, భవానీఘాట్‌ల వద్ద నదిలో ఉన్న ఇసుక బోట్లను సైతం జలవనరుల శాఖ అధికారులు ఒడ్డున పెట్టించారు. గతేడాది బ్యారేజీ గేట్ల వద్ద బోటు ఇరుక్కుపోగా తీయడానికి అధికారులు తీవ్రంగా శ్రమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందే అప్రమత్తమయ్యారు. జాలర్లు వేటకు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మెచ్చిన మెనూ.. నచ్చిన ఆహారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే


నందిగామ జడ్పీ పాఠశాలలో..

జిల్లాలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థులు 99 శాతం

కూటమి ప్రభుత్వం సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత మెరుగు పరిచిన నేపథ్యంలో బడుల్లో భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. గతంలో 30 శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తినేవారు. ప్రస్తుతం జిల్లాలో 99 శాతం మంది మధ్యాహ్న భోజనం తీసుకుంటున్నారు. ★ జిల్లాలో 907 ప్రభుత్వ పాఠశాలల్లో పథకం అమలవుతోంది. మొత్తం 81,827 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం పాఠశాలకు 69,156 మంది హాజరుకాగా.. 68,228 మంది మధ్యాహ్న భోజనం తిన్నారు. అంటే 99 శాతం మంది భోజనాన్ని ఇష్టపడి స్వీకరించారు. ★ ప్రభుత్వ బడులు తెరిచే నాటికి కూటమి ప్రభుత్వం పౌర సరఫరా శాఖ ద్వారా సన్న బియ్యం సరఫరా చేయించింది. మెనూలో చిన్నపాటి మార్పులు చేసింది. రాగి జావ, ఉడికించి వేయించిన కోడిగుడ్లు, వెరైటీగా చిక్కీ ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో పరిశీలిస్తే.. ★ నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 864 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 650 మంది బడిలో భోజనం తింటున్నారు. ఆహారం రుచిగా ఉందని ఎనిమిదో తరగతి విద్యార్థి బంకా ప్రమోద్ సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేవారు. ★ ఐతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులు, మాగల్లు పాఠశాలలో 278 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్నారు. హఠాత్తున విద్యార్థులు భోజనాన్ని ఇష్టపడి తింటున్నారు, గతంలో బాక్సులు తెచ్చుకునే వారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెప్పారు. ★ నందిగామ నియోజకవర్గంలోని 198 పాఠశాలల్లో 12,512 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నారు. ఎ.కొండూరు, జి.కొండూరు, గంపలగూడెం, జగ్గయ్యపేట, వత్సవాయి, విస్సన్నపేట మండలాల్లో మాత్రం వంద శాతం మంది పిల్లలు భోజనం తీసుకుంటున్నారు.

రూ.600 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రహదారి

కంకిపాడు నుంచి నాలుగు వరుసలుగా విస్తరణ ★ విజయవాడ నుంచి గుడివాడకు దూసుకుపోవచ్చిక

ఈనాడు, అమరావతి

'కంకిపాడు నుంచి గుడివాడ మధ్యలో 27 కిలోమీటర్ల పొడవున నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు చేపట్టేలక్ష్యంతో ఉన్నాం. ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద రూ.600 కోట్ల నిధులను ఈ రహదారి కోసం మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకారం తెలిపారు. విజయవాడ నుంచి గుడివాడకు చేరుకునేందుకు అత్యంత కీలకమైన ఈ రహదారి ప్రాధాన్యం గురించి బందరు ఎంపీ బాలశౌరి.. ప్రత్యేక నివేదికను రూపొందించి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వివరించారు.

'మచిలీపట్నం పోర్టు నుంచి ఎన్‌హెచ్-65 జాతీయ రహదారి వరకు ప్రతిపాదించిన 18.5 కిలోమీటర్ల ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రూ.350 కోట్లను మంజూరు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి వెంటనే స్పందించి.. సంబంధిత అధికారులను పిలిచి.. ఈ రహదారుల నివేదికలను రాష్ట్రం నుంచి తెప్పించి.. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.'

కృష్ణా జిల్లాలో ప్రస్తుతం అత్యంత ప్రమాదకర రహదారి కంకిపాడు-గుడివాడ మధ్య ఉన్నదే. ఎన్‌హెచ్ 165, 65, 216హెచ్.. ఈ మూడు జాతీయ రహదారులను కలిపే అత్యంత కీలకమైన దారి ఇది. గుడివాడ నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఇదే ఆధారం. ప్రస్తుతం ఇక్కడున్న ఇరుకైన రహదారికి పక్కనే పంట కాలువ ఉండడంతో.. ఎప్పుడూ దెబ్బతింటూనే ఉంటుంది. నిత్యం వేల మంది తల్లడిల్లుతున్నారని కేంద్ర మంత్రికి.. ఎంపీ బాలశౌరి వివరించారు. అందుకే ఇక్కడ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అలైన్‌మెంట్ సర్వే కూడా పూర్తయిందని, వీలైనంత త్వరగా ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు.


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వివరిస్తున్న బందరు ఎంపీ బాలశౌరి

గుడివాడలో రూ.18.50 కోట్లతో..

గుడివాడ పట్టణ పరిధిలో 216హెచ్ జాతీయ రహదారి విస్తరణ పనులకు ఈ వార్షిక ప్రణాళికలో రూ.18.50 కోట్ల అంచనాతో ఇప్పటికే ప్రతిపాదనలు పెట్టామని, వాటిని మంజూరు చేయాలని గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. విస్తరణ జాప్యంతో.. వాహనదారుల నిత్య కష్టాలను వివరించారు. ★ గుడివాడలో ఎన్‌హెచ్ 165, ఎన్‌హెచ్ 216హెచ్ మధ్య అనుసంధానానికి మరో రూ.28.53 కోట్లతో డీపీఆర్‌ను మోర్త్‌కు సమర్పించామని దానిని కూడా మంజూరు చేయాలని కోరారు.

★ మచిలీపట్నం, మంగినపూడి బీచ్ మధ్యలో 11.07 కిలోమీటర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించడంతో పర్యాటకానికి ఊతం ఏర్పడుతుందని ఎంపీ వివరించారు. జిల్లా ప్రగతిలో కీలకమైన.. ఈ ప్రాజెక్టులన్నింటికీ గడ్కరీ సానుకూలంగా స్పందించి, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేసినందుకు ఎంపీ బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.


పోర్టు నుంచి రాకపోకలకు కీలకం..

మచిలీపట్నం పోర్టు పూర్తయితే దానికి అనుసంధానంగా రూ.350 కోట్లతో ప్రతిపాదించిన 18.5 కిలోమీటర్ల ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి చాలా అవసరమని ఎంపీ వివరించారు. ఏడు అండర్‌పాస్‌లు, నాలుగు వైడెనింగ్‌ల నిర్మాణం దీనిలో భాగంగా చేపట్టనున్నారు. వీటిలో ఒక ప్రైవేటు బీచ్ రోడ్డులో నిర్మించనున్నారు. ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారి నుంచి సరకు రవాణా వాహనాలు పోర్టుకు తరలించడానికి, తిరిగి తీసుకెళ్లడానికి ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారే కీలకమని తెలియజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన రేపు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 2న ధర్నాచౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు జిల్లా ఛైర్మన్ ఎ.సుందరయ్య, సెక్రటరీ జనరల్ ఇంటి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా.. విద్యాశాఖ ద్వారా జారీ అవుతున్న అనేక బోధనేతర కార్యక్రమాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అప్‌లోడ్, డౌన్‌లోడ్, బయోమెట్రిక్ అథంటికేషన్, మెగా పీటీఎం వంటివి తగ్గించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్నామని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

మద్యం కుంభకోణం భాగస్వాములకు శిక్ష తప్పదు


మాట్లాడుతున్న దేవినేని ఉమా

గొల్లపూడి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణానికి పాల్పడిన వారికి, అందులో భాగస్వాములైన వారికి శిక్ష తప్పదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..మంత్రి పదవికి ఆశపడి పెద్దిరెడ్డి జగన్ పంచన చేరితే మిధున్‌రెడ్డిని లిక్కర్ స్కాంలో భాగస్వామిని చేశారన్నారు. మహిళలను కించపరిచిన నాయకుడికి మద్దతిస్తూ పరామర్శించడం సిగ్గు చేటన్నారు. గత శాసనసభలో మహిళలను కించపరిచినందుకే ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. జగన్‌ను చూసి ఎవరూ భయపడడం లేదని, శాసనసభను చూసే అతను భయపడుతున్నారన్నారు. మద్యం కుంభకోణంలో పెట్టెలు మాత్రమే దొరికాయని, కంటైనర్లు దొరకాల్సి ఉందన్నారు. రూ.వేలకోట్లను బంగారం రూపంలోకి మార్చారని, ఇతర దేశాలకు తరలించారని విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్‌ల సింగపూర్ పర్యటన విజయవంతం కావడంతో జగన్ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.

దీపం 2.0 పథకం పటిష్ఠ అమలుకు ప్రణాళిక


స్టాల్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 52 గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఎల్.పి.జి. సిలిండర్ల సరఫరా జరుగుతోందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీపం 2.0 పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో గురువారం పౌరసరఫరాల శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేయగా, కలెక్టర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 957 రేషన్ దుకాణాల పరిధిలో 5,90,000 బియ్యం కార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రతి నెలా 8,400 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. బియ్యం, సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యతా పరీక్ష ప్రక్రియ తదితరాలతో కూడిన గోడ, కరపత్రాలను పరిశీలించారు. డీఎస్‌వో ఎ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ నష్ట పరిహారంలో వ్యత్యాసాలు: ఎమ్మెల్యే గద్దె

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని బెంజిసర్కిల్ నుంచి నోవోటెల్ హోటల్ వరకు సర్వీసు రోడ్డు విస్తరణకు భూసేకరణ చేపట్టారు. కానీ నష్ట పరిహారం చెల్లింపులు అసమగ్రంగా ఉన్నాయని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విషయమై నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశను గురువారం కలిసి విన్నవించారు. గద్దె మాట్లాడుతూ.. జాతీయ రహదారుల సంస్థ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా నష్టపరిహారం చెల్లింపులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఒక రకంగా, నగరంలో మరోలా చెల్లింపులు ఉండడంతో భూ యజమానులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశీలించి, న్యాయం చేయాలని ఆయన కోరారు. తగిన అర్హత ఉన్నా.. పలు కుటుంబాలు పీ-4 జాబితాలో నమోదు కాలేదన్నారు. అర్హులతో కూడిన జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. తన విజ్ఞప్తులపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వివరించారు.

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

పటమట, న్యూస్‌టుడే: జిల్లాలో నేటి నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిణి రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రజలకు తల్లి పాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. 'ఇన్వెస్ట్ ఇన్ బ్రెస్ట్ ఫీడింగ్.. ఇన్వెస్ట్ ఇన్ ది ఫ్యూచర్' అనే థీమ్‌తో ఈ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

కృష్ణా వర్సిటీ సమస్యలకు... ఏడాదిలోగా పరిష్కారం

ముఖాముఖిలో ఉపకులపతి రాంజీ వెల్లడి

కృష్ణా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను.. వైకాపా ఐదేళ్ల పాలనలో దిగజార్చింది. వసతులు లేక విద్యార్థులు తల్లడిల్లినా పట్టించుకున్న పాపానపోలేదు. వీసీలు.. రిజిస్ట్రార్లు మారినా.. స్వామి భక్తితో విగ్రహాల ఏర్పాటు.. అంతర్గత రాజకీయాలతో మసకబార్చారు. వర్సిటీలో చేరికకు ఇతర జిల్లాల విద్యార్థులు ఆసక్తి చూపక పలు కోర్సులు ఖాళీగా మిగలగా.. మరికొన్ని ఒకరిద్దరికే పరిమితం అయ్యాయి. క్యాంపస్‌లో 2 వేల మందికిపైగా విద్యార్థులున్నా సరైన వసతిలేక బందరులో ప్రైవేటు హాస్టళ్లు.. ఇరుకు గదుల్లో ఉండి అల్లాడుతున్నారు. 'కూటమి ప్రభుత్వ సహకారంతో సకల వసతులు సమకూర్చి.. ఏడాదిలోగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని' ఉపకులపతి రాంజీ 'ఈనాడు, ఈటీవీ' ముఖాముఖిలో వెల్లడించారు.

– ఈనాడు డిజిటల్, మచిలీపట్నం



వర్సిటీలో అతిపెద్ద సమస్య.. వసతి భవనాలలేమి. గత ప్రభుత్వంలో క్యాంపస్, నూజివీడులో భవనాలకు రూ.55 కోట్లు కేటాయించారు. నూజివీడులో భవనాలు పూర్తవగా.. నిధులు చాలక ఇంజినీరింగ్ కాలేజీ, వసతి భవన నిర్మాణాలు పునాదుల్లోనే ఆగాయి. వీటి పూర్తికి రూ.50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించగా సానుకూల స్పందన వచ్చింది. పునాదుల్లోనే పైరెండు భవనాలకు రూ.9.7 కోట్లకుపైగా బిల్లులు చెల్లించారని ఫిర్యాదులు రాగా విచారణ జరుగుతోంది.

త్వరలో విద్యార్థినుల హాస్టల్ పూర్తి: 300 మంది యువతులకు సరిపడేలా నిర్మిస్తున్న వసతి భవనం ఈ ఏడాది జూన్‌కే పూర్తికావాలి. పలు కారణాలతో ఆలస్యమైంది. దీనికి గుత్తేదారుకు 12-24 శాతం మేర జరిమానా పడనుంది. సెప్టెంబరు నాటికి భవనం పూర్తి చేస్తాం. మరికొన్ని నిర్మాణాలు. . ఇతర పనులకు రూ.20 కోట్లు రూసా నిధులు వచ్చాయి. అత్యవసర పనులు పూర్తి చేస్తున్నాం.

మైదానం మెరకకు చొరవ: 60 ఎకరాల్లో మైదానం లోతట్టుగా ఉండటంతో 3-4 అడుగుల మేర మెరక చేయాలి. ఇందుకు రూ.12 కోట్లు అవసరం. అంచనాలు రూపొందించి బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరికి సమస్యను వివరించగా సీఎస్సార్ నిధులతో కొంతమేర పనులు చేయిస్తామన్నారు.

పీజీ సెంటర్‌తో వెలుగులు: ఎన్టీఆర్ జిల్లాలో పీజీ సెంటర్ ఏర్పాటుకు 10 ఎకరాలు, తక్షణ అవసరాలకు భవనం కావాలని కలెక్టర్‌ను కోరగా త్వరలో సమకూరుస్తామన్నారు. రాజధాని అమరావతి డిమాండ్‌కు తగిన కోర్సులను ఈ ఏడాది నుంచే అక్కడ ప్రవేశపెడతాం. విద్యార్థులు ఒక్కొక్కరు రూ.3-9 లక్షల జీతాలు ఇచ్చే 2, 3 ప్లేస్‌మెంట్లు పొందారు. ఏఐ, క్వాంటమ్‌వ్యాలీ, కళలు.. మార్కెట్ డిమాండ్‌కు తగిన కోర్సులు తెస్తాం.

17 మందే శాశ్వత ప్రొఫెసర్లు: 2008లో కృష్ణా యూనివర్సిటీ స్థాపన వేళ మొత్తం 167 కళాశాలలు ఉండేవి. ప్రస్తుతం 134 ఉన్నాయి. 108 మంది శాశ్వత ప్రొఫెసర్లకు ప్రస్తుతం 17 మందే ఉన్నారు. 55 మంది ఒప్పంద ఉద్యోగులతో పాఠాలు చెప్పిస్తున్నాం. పరిశోధనలు.. తదితరాలకు చాలా కష్టంగా ఉంది. సమష్టి కృషితో 100 శాతం ప్లేస్‌మెంట్లు.. స్నాతకోత్సవం విజయవంతం చేశాం.

నర్సుల కొరత.. రోగుల వ్యథ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

విజయవాడ కొత్త-పాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సుల కొరత వేధిస్తోంది. మరో వంద మంది అవసరం ఉంది. అసలే సంఖ్య తక్కువ ఉండగా.. కొంతమంది వారాంతపు సెలవు, మరికొందరు సెలవులో ఉంటున్నారు. ఫలితంగా విధుల్లో ఉన్న వారిపై భారం పడుతోంది. విధులు కేటాయించే రోస్టర్ విధానం సక్రమంగా అమలు చేయకుండా కొందరు పెత్తనం చేస్తున్నారని నర్సులు ఆరోపిస్తున్నారు.

రోస్టర్ అమలు అస్తవ్యస్తం!

★ రెండు ఆసుపత్రులకు రోగుల తాకిడి ఎక్కువ. నిత్యం ఓపీ 2800 మంది వరకు ఉంటుంది. చికిత్స నిమిత్తం మరో 800 మందికిపైగా రోగులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. రెండు వైద్యశాలలకు కలిపి స్టాఫ్‌నర్సులు 431 మంది, హెడ్‌నర్సులు 32 మంది ఉన్నారు. 431 మంది స్టాఫ్‌నర్సుల్లో 113 మంది పాత ఆసుపత్రిలో, మిగిలిన వారంతా కొత్త ఆసుపత్రిలో ఉంటారు. 32 మంది హెడ్‌నర్సుల్లో 23 మంది కొత్త, 9 మంది పాత ఆసుపత్రిలో పని చేస్తున్నారు. రెండింటికీ సూపరింటెండెంట్ ఒక్కరే ఉండగా.. మరో పోస్టు ఖాళీగా ఉంది. మూడు షిఫ్టులకు సరిపడా నర్సులు లేక ఉన్నవారిపైనే ఒత్తిడి పడుతోంది. రోగులకు కూడా మెరుగైన సేవలు అందడం లేదనే వాదన ఉంది. కొత్త, పాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతిఒక్కరూ నెలకు 15 రోజులు చొప్పున విధులు నిర్వహించాలి. ఆ ప్రక్రియ సక్రమంగా అమలు కావడం లేదని నర్సులు ఆవేదన చెందుతున్నారు. నచ్చిన వారిని ఒకే చోట ఉంచుతూ.. నచ్చని వారిని మార్చుతూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. రోస్టర్ విధానం సక్రమంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

★ వైకాపా సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు ఆరుసార్లు నర్సుల నియామకం కోసం ఆసుపత్రి నుంచి ప్రతిపాదనలు వెళ్లినా... బుట్టదాఖలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రోజురోజుకు రోగుల తాకిడి అధికమవుతోంది. అధికారులు, పాలకులు స్పందించి పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపిస్తా

నర్సుల నియామకంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తా. ఉన్నతాధికారుల ఆదేశాలతో నియామకాలు చేపడతాం. రోస్టర్ విధానం అమలు తీరును పరిశీలిస్తాను.

- ఏవీ రావు, సూపరింటెండెంట్

దుర్గగుడిలో బయట ఆహారం పంపిణీ!

నలుగురు సిబ్బందిని తొలగించిన ఈవో

ఈనాడు, అమరావతి: దుర్గగుడిలోకి బయట నుంచి భారీగా సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలను తీసుకొచ్చి.. భక్తులకు పంపిణీ చేస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. దేవస్థానం అనుమతి లేకుండా.. బయట నుంచి పెద్దఎత్తున ఆహారం తీసుకొచ్చి పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో.. ఆలయ ఈవో శీనానాయక్ గురువారం గుర్తించి పట్టుకున్నారు. వివరాలు ఇవీ...ఇంద్రకీలాద్రి దిగువన కనకదుర్గానగర్ మీదుగా గురువారం ఓ ఆటో నిండా పెద్ద హాట్‌బాక్సుల్లో బయట నుంచి తినుబండారాలు తీసుకొచ్చారు. నేరుగా ఆటోను లిఫ్ట్ ప్రాంతం వరకూ అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది అనుమతించేశారు. హాట్ బాక్సులను ఆటోలో నుంచి దించుతుండగా.. సరిగ్గా అప్పుడే ఈవో శీనానాయక్ పోరంకిలో వేదపాఠశాల పరిశీలనకు వెళ్లి తిరిగి వచ్చారు. ఆటో నుంచి దింపుతున్న తినుబండారాలను గమనించి.. అవేంటని ప్రశ్నించారు. ఎవరో అపరిచిత వ్యక్తి దేవస్థానంలో భక్తులకు పంపిణీ చేసేందుకు ఆహార పదార్థాలను తెచ్చారని.. అక్కడున్న వాళ్లు చెప్పారు. దుర్గగుడి లోపలకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. ఇంత పెద్దఎత్తున ఆహారం ఎందుకు తీసుకొచ్చారంటే సమాధానం చెప్పేవాళ్లు లేరు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి.. దేవస్థానం ప్రతిష్ఠకు భంగం వాటిల్లే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, కాశీరావు అనే ముగ్గురు గార్డులు, కాశయ్య అనే సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగించారు.

సీసీ కెమెరాలతో.. 24 గంటల్లోనే కేసుల ఛేదన

డ్రోన్లు, బైకుల అందజేతలో సీపీ రాజశేఖర్‌బాబు


డ్రోన్లను ఇచ్చిన దాతలను సత్కరిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా


అధునాతన బైక్‌లపై దూసుకెళ్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఈనాడు - అమరావతి: "విజయవాడ కమిషనరేట్ పరిధిలో 'సురక్ష' కార్యక్రమం కింద దాతల సాయంతో ఆరు వేల సీసీ కెమెరాలు, 28 డ్రోన్లను సమకూర్చుకున్నాం. వీటి సాయంతో క్లిష్టమైన కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. 24 గంటల్లోనే ఛేదిస్తున్నాం. సాంకేతికతను గరిష్ఠంగా వాడుతున్నాం. ఇప్పటికే లా అండ్ ఆర్డర్ పోలీసులకు డ్రోన్లు అందజేశాం. అవి సత్ఫలితాలు ఇచ్చాయి. ఇప్పుడు ట్రాఫిక్ విభాగం పోలీసులకు 14 డ్రోన్లు ఇస్తున్నామని" నగర సీపీ రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. నగర కమిషనర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు డ్రోన్లు, ద్విచక్ర వాహనాలను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. అస్త్రం టూల్ ద్వారా ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించామన్నారు. ఇకపై అంతర్గత రోడ్లపైనా శ్రద్ధ వహిస్తామనీ.. టూల్‌ను పూర్తి స్థాయిలో వినియోగించేలా డీజీపీ రూ.కోటి మంజూరు చేశారని వివరించారు. ప్రతి ట్రాఫిక్ వాహనంలో డ్రోన్ ఉంటుందనీ, దీనిపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. వీటి నుంచి వచ్చే దృశ్యాలు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి చేరతాయనీ, వీటి ద్వారా పార్కింగ్ సమస్యలు, వ్యతిరేక దిశలో వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానా విధిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరంలో గత ఏడాదిగా ట్రాఫిక్ నిర్వహణలో తీసుకున్న చర్యలు, వచ్చిన ఫలితాలను సీపీ రాజశేఖర్‌బాబు, ఏడీసీపీ ప్రసన్న కుమార్‌లు ప్రెజెంటేషన్ ఇచ్చారు. దీనిపై డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు సరిత, తిరుమలేశ్వర్ రెడ్డి, మహేశ్వరరాజు, ఉదయరాణి, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోమ్యుటేషన్‌తో అక్రమాలకు చెక్

రిజిస్ట్రేషన్‌తోపాటు పేరు మార్పిడి ★ నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఆటోమ్యుటేషన్ ప్రక్రియ నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా అమల్లోకి రానుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు డిజిటలైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ద్వారా మ్యుటేషన్ (ఆస్తి పన్ను, పేరు మార్పిడి) విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ద్వారా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే ఆటోమేటిక్‌గానే పేరు మార్పిడి జరిగిపోతుంది. దీని కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ఇప్పటి వరకు ఇళ్లు, అపార్టుమెంట్లు, స్థలాలు కొనుగోలు చేసినప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సజావుగా జరిగినా.. తర్వాత ఇబ్బందులు తలెత్తేవి. సంబంధిత ఆస్తి పేరు మారి.. దస్తావేజు వచ్చిన తర్వాత ఇంటి పన్ను పేరు మార్పు కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. టైటిల్ డీడ్‌తో పాటు లింక్ డాక్యుమెంట్లు, పాత పన్ను రసీదు, వాల్యుయేషన్ సర్టిఫికెట్, కొనుగోలుదారులు.. అమ్మకందారుల ఆధార్ కార్డుల నకళ్లు, నోటరీ అఫిడవిట్ తదితర పత్రాలు ఇవ్వాల్సి వచ్చేది. పైగా ఈ పని అవ్వడానికి నెల రోజులు సమయం పట్టేది. ఈ ప్రక్రియ అంతా పూర్తవడానికి, పేరు మార్పిడికి అనధికారికంగా సిబ్బంది అదనంగా రూ.5వేలు నుంచి రూ.10వేలు వరకు చెల్లించాల్సి వచ్చేది. తాజాగా అమల్లోకి రానున్న ఈ నూతన పద్ధతి ద్వారా కార్యాలయాల చుట్టూ తిరగకుండానే ఆటోమ్యుటేషన్ జరుగుతుంది. సమయం కలిసి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేసే సమయానికి పన్ను బకాయిలు ఉంటే మాత్రం మ్యుటేషన్ ఛార్జీతో పాటు చెల్లించాల్సి ఉంటుంది.

★ విజయవాడ నగరంలోని గాంధీనగర్, పటమట, గుణదల, నున్నతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ★ ప్రతి రోజూ అయ్యే రిజిస్ట్రేషన్లు సుమారు 700 నుంచి 1000 వరకు ★ పేరు మార్పిడికి ఒక్కో దరఖాస్తుకు సుమారు రూ.లక్షకు రూ.250 చొప్పున కట్టాలి.

త్యాగధనులకు శుభతరుణం

రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలని యూనియన్ బ్యాంకు ఆదేశాలు

ఈనాడు – అమరావతి: రాజధాని నిర్మాణం కోసం తమ భూములు త్యాగం చేసిన అమరావతి రైతులకు ఊరట లభించింది. సీఆర్డీఏ ఆమోదిత, రిజిస్టర్ అయిన ప్లాట్లపై రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంకు అయిన యూబీఐ గుంటూరు రీజియన్‌లోని అన్ని బ్రాంచి హెడ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అమరావతి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరేళ్లుగా రిటర్నబుల్ ప్లాట్లు తాకట్టు పెట్టుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తెదేపా హయాంలో బ్యాంకర్లు రుణాలిచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల వైఖరి కారణంగా లోన్లు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీనిపై జగన్ ప్రభుత్వం కూడా చొరవ చూపలేదు. ఒకవైపు వ్యవసాయం లేక, మరోవైపు కుటుంబ అవసరాలకు డబ్బులేక రైతులు చాలా అవస్థలు పడుతున్నారు. భూములు ఇచ్చిన వారిలో ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. ఎకరాలోపు 20,490 మంది భూములు ఇచ్చారు. ఒకటి నుంచి రెండు ఎకరాల్లోపు ఇచ్చిన వారు 5 వేల మంది పైగా ఉన్నారు. వీరంతా బ్యాంకుల చుట్టూ రుణాల కోసం తిరుగుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న జరిగిన ఎస్ఎల్‌బీసీలో రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. ఈ సమావేశం మినిట్స్ కాపీని అమరావతి రీజియన్‌లోని అన్ని బ్యాంకులకు పంపించినా ఎటువంటి స్పందన లేదు. తదనంతరం జులై, 25న సబ్‌కమిటీ సమావేశంలోనూ ప్లాట్లపై లోన్లు ఇవ్వాలని తీర్మానించారు. దీనిపై తాజాగా యూబీఐ ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలపై త్వరలోనే బ్యాంకర్లు కార్యాచరణ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


చేపను పట్టుకుని వెళ్తూ..


పెనుగులాడుతూ..


దొరకబుచ్చుకుని ఎగిరిపోతూ..

ఆకలి పోరాటం.. ఆఖరికి నాదే విజయం

సృష్టిలో ఏ జీవి పోరాటమైనా ఆకలిని జయించడానికే! ఒక్కోసారి అది ఎంతో కష్టంగా ఉంటుందో! తన తోటి జీవుల నుంచి తప్పించుకుని ఆకలి తీర్చుకోవాలి. ఈ చిత్రాలు చూడండి.. ఒక నీటి కాకి తనకు దొరికిన చేపను దక్కించుకోవడానికి తోటి నీటి కాకుల నుంచి చేసిన పోరాటమిది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధిక మొత్తంలో వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో గేట్ల పక్కన గట్టుపై పదుల సంఖ్యల ఆహారం వేట కోసం కాచుకుని కూర్చున్నాయి. వరదలో వచ్చే చేపలను పట్టుకుని ఆకలి తీర్చుకుంటున్నాయి. ఓ నీటికాకి అడుగున ఉన్న చేపను బయటకు తెచ్చి దాన్ని తినేలోపే మిగతావి మూకుమ్మడిగా దాని మీద పడ్డాయి. ఈ క్రమంలో అక్కడ చిన్నపాటి యుద్ధమే జరిగింది. అయితే అది ఎట్టకేలకు తన ఆహారాన్ని వదలకుండా, మిగిలిన వాటికి చిక్కకుండా తప్పించుకుని తన ఆకలి తీర్చుకుంది. - ఈనాడు, అమరావతి

ట్రాఫిక్ నియంత్రణకు వినూత్న ప్రయోగాలు

డీజీపీ ప్రశంసలు పొందిన యంత్రాంగం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

బెజవాడలో ఎప్పుడు ఎక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుందో చెప్పటం కష్టం. నగర ప్రజలు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంటోంది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పర్యవేక్షణలో దీనిపై కసరత్తు చేశారు. వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. ఏడీసీపీగా ఎ.వి.ఎల్.ప్రసన్నకుమార్ బాధ్యతలు చేపట్టక ముందే నగరంలో 'అస్త్రం' యాప్ ఉంది. అయితే దీనిపై అంతగా ప్రచారం లేదు. ఆయన పర్యవేక్షణలో దీనిపై విస్తృత ప్రచారం చేశారు. ట్రాఫిక్ అంబాసిడర్లను నియమించి వారి చరవాణుల్లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఎక్కడ ట్రాఫిక్ నిలిచిపోయినా.. తక్షణం ఫిర్యాదు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నగరంలో విస్తృతంగా ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి.


'అస్త్రం' యాప్‌పై 'ఈనాడు' కథనం గురించి వివరిస్తున్న ఏడీసీపీ ప్రసన్నకుమార్

డ్రోన్ల ద్వారా నిఘా

తాజాగా డ్రోన్ ద్వారా ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు శ్రీకారం చుట్టారు. సీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏడీసీపీ దీనిపై కసరత్తు చేశారు. డ్రోన్లను ఏ విధంగా వినియోగించాలి? తదితర అంశాలపై సాధన చేశారు. వినూత్న కార్యక్రమాలతో నగరంలో వచ్చిన మార్పులను ఏడీసీపీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గురువారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలపై డీజీపీ ప్రశంసల వర్షం కురిపించారు. సీపీ రాజశేఖరబాబు, ఏడీసీపీ ప్రసన్నకుమార్ ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది కృషిని ఆయన కొనియాడారు.

రిటైరైనా సేవల వినియోగానికి సమ్మతి

ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ ఆగస్టు నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. అయినప్పటికీ ఆయన సేవలను వినియోగించుకునేందుకు డీజీపీ సుముఖత వ్యక్తం చేశారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ఆయన చేస్తున్న వినూత్న ప్రయోగాలకు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేసి.. డీజీపీ ఈ మేరకు ఏడీసీపీ సేవలను మరికొంత కాలం ఎన్టీఆర్ కమిషనరేట్‌లో వినియోగించుకుంటామని తెలిపారు.

'ఆర్టీసీ స్థలాన్ని కట్టబెట్టే హక్కు ప్రభుత్వానికి లేదు'


మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు. వేదికపై ఆంజనేయులు, శంకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే అడ్డుకుని.. నగరాన్ని పరిరక్షించుకుంటామని విజయవాడ పౌర వేదిక హెచ్చరించింది. విజయవాడ పాత బస్‌స్టేషన్‌కు చెందిన 4.17 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని లులు గ్రూప్‌నకు అప్పగిస్తూ సర్కారు జీవో జారీచేసింది. దీన్ని నిరసిస్తూ ఆయా సంఘాలతో కూడిన విజయవాడ పౌరవేదిక గురువారం బాలోత్సవ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. హెరిటేజ్ షేర్లు విక్రయించినట్లుగా ఆర్టీసీ ప్రభుత్వ స్థలాలను అమ్మే హక్కు సీఎం చంద్రబాబుకు లేదన్నారు. ఆయన గతంలో పీడబ్ల్యూడీ మైదానం, విద్యుత్ సౌధ, మున్సిపల్ కార్యాలయం, కృష్ణానది తీరాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నించగా.. ప్రజలు తిప్పికొట్టినట్లు చెప్పారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ.. పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల నగరాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ స్థలాన్ని లులు గ్రూప్‌కి కేటాయించడం వల్ల ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు, ప్రజా ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. బడా కంపెనీలకు, వ్యక్తులకు భూములను పందేరం చేస్తోందన్నారు. ఇది న్యాయ సూత్రాలకు విరుద్ధమని, న్యాయ పోరాటంతో పాటు ప్రజా పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకుడు బాబూరావు మాట్లాడుతూ.. నగరంలో పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి కరవైందన్నారు. భూముల కేటాయింపుపై ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శిస్తోందన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్ కన్వీనర్‌గా పౌర వేదిక ఆధ్వర్యంలో ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ ఏర్పడింది. ప్రభుత్వ స్థలాలను లులు ఇంటర్నేషనల్ సంస్థకు లీజుకు ఇస్తూ ప్రభుత్వం విడుదల చేసిన 137 జీవోను రద్దు చేయాలని, ఆయా ఆదేశాలను ఉపసంహరించుకోవాలని సమావేశంలో తీర్మానించి ఆమోదించారు. రైతు సంఘం నాయకులు అక్కినేని భవానీ ప్రసాద్, వై.కేశవరావు, ఎం.వి.ఆంజనేయులు, పలిశెట్టి దామోదర్, వి.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు నెలల కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు, నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి, ఆపైన చదివిన అభ్యర్థులు శిక్షణకు అర్హులని, ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ నెల 14వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రం అందజేస్తామని చెప్పారు. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, ఫోన్ నెంబరుతో ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 81424 26211, 93477 79032 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వయం ఉపాధి అంశాలపై..

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతి యువకులకు స్వయం ఉపాధి కోసం ఈ నెలలో ఉచితంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ ఛైర్‌పర్సన్ విద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమ తెలిపారు. శుక్రవారం నుంచి కటింగ్, టైలరింగ్ (3 నెలలు), డ్రెస్ మేకింగ్ (3 నెలలు), ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (15 రోజులు), 4వ తేదీ నుంచి అసిస్టెంట్ జ్యూట్ క్రాఫ్ట్ ప్రోడక్ట్ మేకర్ (3 నెలలు), బ్యూటీకేర్ అసిస్టెంట్ (3 నెలలు), 5 నుంచి మెషిన్ ఎంబ్రాయిడరీ (2 నెలలు), 7 నుంచి ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (2 నెలలు), ఏసీ రిఫ్రిజరేషన్ (2 నెలలు), 9 నుంచి హోమ్‌క్రాఫ్ట్ (10 రోజులు), స్క్రీన్ ప్రింటింగ్ (నెల), 11 నుంచి బాతిక్ ప్రింటింగ్ (2 నెలలు), అసిస్టెంట్ ఫ్రూట్, వెజిటబుల్ ప్రాసెసింగ్, ప్రిజర్వేషన్ (75 రోజులు), జామ్, జ్యూస్ తయారీ (పది రోజులు), 16 నుంచి అసిస్టెంట్ డ్రెస్ మేకర్ (3 నెలలు), అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ (3 నెలలు), 18 నుంచి ఫ్యాషన్ నగలు (3 నెలలు) మిర్రర్ వర్క్ (వారం)లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని కార్యాలయంలో కానీ, 0866-2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

బాలకృష్ణ, ఎంపీ శివనాథ్ భేటీ



పటమట, న్యూస్‌టుడే: బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, సీఈవో కృష్ణయ్య గురువారం పార్లమెంట్‌లోని తెదేపా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి రాబట్టాల్సిన నిధులపై బాలకృష్ణ, శివనాథ్ చర్చించుకున్నారు.

ఆందోళన వద్దు.. జాగ్రత్తలు పాటించండి


పునరావాస కేంద్రం ఏర్పాటుకు ట్రక్కు టెర్మినల్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు లక్ష్మీశ అధికారులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎగువన కురిసిన వర్షాల నేపథ్యంలో పులిచింతల నుంచి వస్తున్న వరద క్రమంగా పెరుగుతుండడంతో నదీ తీరగ్రామాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. వరద పరిస్థితిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అయితే జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలన్నారు. అధికారులతో కలిసి గురువారం ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని చిన్నలంక, పెద్దలంకలతోపాటు నదీ తీర గ్రామాల్లో వరద ఉద్ధృతిని ఆయన పర్యవేక్షించారు. అవసరమైతే వరద బాధితుల పునరావాసం కోసం ఇబ్రహీంపట్నం ట్రక్కు టెర్మినల్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన, దిగువన నదీ తీర ప్రాంత వాసులను అప్రమత్తం చేశామన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు, పంచాయతీరాజ్, పురపాలికశాఖ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చామన్నారు. తీర ప్రాంతవాసులు వాగులు, వంకలు, కాలువలు దాటే ప్రయత్నాలు చేయవద్దని, చేపల వేటకు వెళ్లడం, పశువులు, జీవాలు వంటివాటిని వదలడం చేయొద్దని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట విజయవాడ ఆర్డీవో చైతన్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, పురపాలిక కమిషనర్ రమ్యకీర్తన తదితరులున్నారు.

'సీనియారిటీ ప్రాతిపదికనే నియామకాలు చేపట్టాలి'

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో 98 శాతం జిల్లా, మండల పరిషత్తు, మున్సిపల్ పాఠశాలలు ఉన్నాయి. నేరుగా ప్రభుత్వ యాజమాన్యం కింద కేవలం 2 శాతం పాఠశాలలున్నాయి. తక్కువ శాతం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకే మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)-1 బాధ్యతలను ఎలా అప్పగిస్తారని పీఆర్టీయూ నాయకులు ప్రశ్నించారు. ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికనే ఎంఈవో-1 నియామకాలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, సోలా రాఘవరాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 3, 4 జోన్ల ఆర్జేడీలు ఇప్పటికే పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎంఈవో ఇన్‌ఛార్జిలుగా నియమించారని, ఇది ఏకీకృత సర్వీసు రూల్ విధానానికి విరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా పరిషత్తు యాజమాన్యంలో ఎస్జీటీలుగా నియామకాలు పొందిన ఉపాధ్యాయులు 30 ఏళ్లు పని చేసి, అదే హోదాతో పదవీ విరమణ పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ యాజమాన్య ఎస్జీటీలు మూడు లేదా నాలుగేళ్లకే స్కూల్ అసిస్టెంట్లుగా, ఎంఈవోలుగా ఉద్యోగోన్నతులు పొందే విధానం సరికాదని వివరించారు. ఇప్పటికైనా అసమానతలను తొలగించాలని కోరారు. గతంలో ప్రభుత్వం విడుదల చేసిన 72, 73, 74 జీవోలకు అనుగుణంగా సమన్యాయం పాటించి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులతో ఎంఈవో-1 ఉద్యోగాలను భర్తీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -104 రిటైల్ ధర 126 చికెన్ విత్ స్కిన్ - 183, చికెన్ స్కిన్‌లెస్ - 208.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

వరదలో చిక్కుకున్న వ్యక్తి.. రక్షించిన ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది


సెల్వరాజ్‌ను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సిబ్బంది

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద నీటిలో చిక్కుకున్న వ్యక్తిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఘటన కనకదుర్గమ్మ వారధి దిగువన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అంకసెల్వరాజ్ (55) నున్న నివాసి. మతి స్థిమితం కోల్పోయిన అతడు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటాడు. బుధవారం సాయంత్రం వారధి దిగువన కృష్ణా నది ఇసుక తిన్నెలపై నిద్రించాడు. గురువారం ఉదయం ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి భారీగా నీటిని దిగువకు విడుదల చేశారు. వారధి దిగువకు పెద్ద మొత్తంలో వరద నీరు చేరింది. ఇసుకలో నిద్రించిన సెల్వరాజ్ ఉదయాన్నే లేచి చూడగా చుట్టూ పెద్ద మొత్తంలో నీరు ఉన్న విషయాన్ని గమనించాడు. ఏం చేయాలో తోచక పెద్దగా కేకలు వేశాడు. వారధి మీద నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు.. ఎస్డీఆర్ఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. పడవతో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వారు నది మధ్యలోకి వెళ్లి అతడిని పడవలో ఎక్కించుకుని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు.

రైతులకు రూ.13 కోట్ల బోనస్


మాట్లాడుతున్న ఆంజనేయులు. వేదికపై బోర్డు సభ్యులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: పీ4 లక్ష్యం దిశగా కృష్ణా మిల్క్ యూనియన్ అడుగులు వేస్తోందని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. విజయవాడ చిట్టినగర్‌లోని విజయ డెయిరీ కార్యాలయంలో గురువారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించి పలు అంశాలపై తీర్మానం చేశారు. చలసాని మాట్లాడుతూ.. పీ4లో భాగంగా రైతులను ఆదుకునేందుకు తమ సంస్థ అంకితభావంతో పని చేస్తోందన్నారు. సెక్స్ సార్టెడ్ సెమెన్ డోస్ ధర రూ.150 ఉండగా.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాడి రైతులకు రూ.50కే అందజేసి, మిగతా రూ.100 సబ్సిడీ సంస్థ భరిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పశువుల వసతి గృహాలను కృష్ణా జిల్లా, అవనిగడ్డ పరిధిలోని పెదకళ్లేపల్లిలో, ఎన్టీఆర్ జిల్లా, నందిగామ పరిధిలోని మునగచర్లలో త్వరలో తాము ప్రారంభించనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పాడి రైతులకు తొలి విడతగా ఆగస్టులో రూ.13 కోట్ల బోనస్ ఇచ్చేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. యూనియన్ పరిధిలోని ఉమ్మడి కృష్ణాజిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా పాడిరైతుల ఆరోగ్య పరిరక్షణకు ఏలూరులోని ఆశ్రం, చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భాగస్వామ్యంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని సంకల్పించినట్లు తెలిపారు. కృష్ణాజిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆడ పశువుల సంతతి పెంచాలన్నారు. సెమెన్ అందించడం వల్ల 90 శాతం పెయ్యదూడల ఉత్పత్తి జరుగుతోందని.. 3, 4 ఏళ్లకు అవి పాడి గేదెలుగా మారడంతో పాల దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. విజయ డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ఆశ్రం సీఈవో హనుమంతరావు, పిన్నమనేని హాస్పిటల్స్ సూపరింటెండెంట్ అనిల్, బోర్డు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైలులో 30 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడిన నిందితులతో రైల్వే పోలీసులు

విజయవాడ(రైల్వేస్టేషన్): విజయవాడ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సీఐ జేవీ రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతేవలీ ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖపట్నం నుంచి ముంబయి వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం తనిఖీ నిర్వహించారు. బీ4 బోగీలోని 41,44 బెర్తుల్లో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగులను సోదా చేయగా 30 కిలోల గంజాయి బయటపడింది. ముంబయికి చెందిన నిందితులు జయఅలీముల్ల సర్దార్, లక్ష్మీశంకర్ నాటేకర్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విశాఖపట్నం సమీపంలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ముంబయిలో విక్రయించేందుకు గంజాయిని తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

సీబీఐ పేరిట వృద్ధురాలి నుంచి రూ.50 లక్షలు స్వాహా

చెన్నై, న్యూస్‌టుడే: సీబీఐ అధికారుల పేరుతో ఓ వృద్ధురాలిని వాట్సాప్ కాల్ ద్వారా బెదిరించి రూ.50లక్షలను కాజేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురిని తూత్తుకుడి సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే... తూత్తుకుడి జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలితో ఇటీవల వాట్సాప్ కాల్‌లో సీబీఐ అధికారులమంటూ ముగ్గురు వ్యక్తులు మాట్లాడారు. వృద్ధురాలి పేరిట ముంబయిలో ఓ బ్యాంకు ఖాతా ఉందని, దాని నుంచి మానవ అక్రమరవాణా కేసులో రూ.2 కోట్లు నగదు లావాదేవీలు జరగడంతో ఆమెపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేయకుండా ఉండాలంటే రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయాందోళనకు గురైన ఆమె నగదును వారు చెప్పిన బ్యాంకు ఖాతాల్లో వేసింది. తర్వాత మోసపోయినట్లు గ్రహించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు తూత్తుకుడి సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. బాధితురాలు జమ చేసిన నగదుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాల ద్వారా నిందితులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన పల్లి పరమేశ్వరరావు (28), విజయవాడకు చెందిన చంద్రశేఖర్ (40), అడుసుమిల్లికి చెందిన శివరామ్‌ప్రసాద్ (43)గా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన పోలీసులు వారిని అరెస్టు చేసి తూత్తుకుడికి తీసుకొచ్చారు. వారిని మంగళవారం తూత్తుకుడి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. నిందితుల నుంచి 6 సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకాలు వంటివాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఎస్జీఎఫ్ కార్యదర్శి పదవికి దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : జిల్లాలో 2025-26, 2026-27 సంవత్సరాలకు గాను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆర్గనైజింగ్ కార్యదర్శి పదవి ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు (ఫిజికల్ ఎడ్యుకేషన్), పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 3వ తేదీ లోపు విజయవాడలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. గతంలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన వారు, క్రమశిక్షణ చర్యలు తీసుకున్న వారు అనర్హులని తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు 9063144762

? కొండపల్లి విద్యుత్తు వినియోగదారుల సేవా కేంద్రం రహదారిలో ఉన్న కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. -హరికృష్ణ, కొండపల్లి. ✔ వర్షాలు పడిన తర్వాత అనేక ప్రాంతాల్లోని కాలువల్లో ఇదే పరిస్థితి. ప్రాధాన్య క్రమంలో సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారు. -శ్రీను, పారిశుద్ధ్య మేస్త్రీ -న్యూస్‌టుడే, కొండపల్లి

? గొల్లపూడి రామరాజ్యనగర్ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారిపై వెళ్లే చిన్నారులు, స్థానికుల వెంట పడి గాయపరుస్తున్నాయి. -భాను, రామరాజ్యనగర్ ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం -కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? గొల్లపూడి సాయిపురంకాలనీ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు సక్రమంగా ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. -శ్రీరాం, సాయిపురంకాలనీ ✔ సిబ్బందిని పంపి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. -స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, గొల్లపూడి

? కొండపల్లి ఖిల్లారోడ్డు ప్రాంతంలో వద్ద ఎగువ నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు రహదారిపైకి వచ్చి నిలిచిపోతోంది. ఆటో రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉంది. -శ్యామ్‌బాబు, కొండపల్లి. ✔ రెండు నెలల కిందట అక్కడ తూము ఏర్పాటు చేశాం. అయినా సమస్య అలాగే ఉంది. మరో మార్గం ద్వారా మురుగు నీటిని కిందికి పంపే ప్రయత్నం చేస్తాం. -శ్రీను, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

స్పందనకు వందనం

★ స్థానిక పంచాయతీలోని 8 వార్డు డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడంలేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎ.రామారావు స్పందించారు. గురువారం కార్మికులను పంపి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

★ పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 17వ వార్డులో పోతిశెట్టి వెనుక రోడ్డులోని డ్రైనేజీలో పూడిక మట్టి, పిచ్చి మొక్కలు పెరగడంతో మురుగు నీరు పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె. మనోజ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 8వ వార్డులో సిటీ కేబుల్ ఆఫీస్ రోడ్డులో డ్రైనేజీలో పూడిక ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలపగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో మురుగు కాల్వలో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

నీటి వృథా అరికట్టారు

స్పందనకు వందనం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు పడుతున్న అవస్థలపై ఈ నెల 29న 'నీటి వృథా..తప్పని వ్యథ' శీర్షికతో చిత్ర వార్త ప్రచురించగా అధికారులు స్పందించారు. కృష్ణా జలాల పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

ఓపెన్ ఇంటర్ కేంద్రం మంజూరు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యా కేంద్రాన్ని మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సొంగా సరళకుమారి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, గరిష్ఠ వయో పరిమితి లేదని వివరించారు. వివరాలకు 99665 53949 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఏజీపీగా బాధ్యతల స్వీకరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వం తరఫున కేసులు వాదించడానికి ఏజీపీగా న్యాయవాది ఏడీ ప్రసాద్..ప్రస్తుత ఏజీపీ వీవీ సాంబశివరావు నుంచి గురువారం బాధ్యతలను స్వీకరించారు. బార్ నాయకులు, న్యాయవాదులు ఆయనను అభినందించారు.

దోమల మందు పిచికారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ముచ్చనపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం దోమల నివారణకు పొగ మందు పిచికారీ చేశారు. సర్పంచి జమలయ్య, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీ, పంచాయతీ కార్యదర్శి బాస్కరరావు, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

బడి భోజనం తనిఖీ

కంభంపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు కె.గోరి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం.ఏలియా బాబు గురువారం తనిఖీ చేశారు. ప్రభాకర రెడ్డి, వెంకయ్య, సిహెచ్, కృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక భవనంలో ఏపీ ఎస్ఏపీఈ సమావేశం గురువారం నిర్వహించగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీ ఎస్ఏపీఈ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏపీ రెడ్డి తెలిపారు. 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఏపీ రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా కె.నరసింహారెడ్డి(అనంతపురం), ప్రధాన కార్యదర్శిగా చాట్రగడ్డ సుధాకర్(కృష్ణాజిల్లా) కోశాధికారిగా కన్నమనాయుడు(విశాఖపట్నం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మిగిలిన కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలతో సన్మానించారు.

ఎల్‌వోసీ పత్రాల అందజేత

గొల్లపూడి: జి.కొండూరు మండలానికి చెందిన ఆరుగురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్‌వోసీ పత్రాలను ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ గొల్లపూడిలోని కార్యాలయంలో గురువారం అందజేశారు. ఆరుగురికి రూ.16.30లక్షలు మంజూరయ్యాయి.

అప్పుతెచ్చి కట్టాం.. అవస్థలు పడుతున్నాం..

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

నాలుగు చినుకులు పడగానే రహదారులు నీటమునుగుతాయి. నడిచే మార్గం బురదమయమవడంతో రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతుంటారు. కొండపైకి వర్షాల సమయంలో ఇళ్లలోనే నుంచి మెరక ప్రాంతాల్లో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లి ఉండాల్సిన పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా ఓ కొలిక్కి రాని ఈ సమస్యలు ఎక్కడో కాదు.. కొండపల్లి మున్సిపాలిటీ శివారులో ఉన్న సెంటు పట్టా భూముల్లో ఈ సంఘటనలు దర్శనమిస్తున్నాయి.



రోడ్డు మధ్యలో నీళ్లు నిలిచిపోవడంతో ఖాళీ అయిన ఇళ్లు



బురద కయ్యగా మారిన రహదారి

సెంటు పట్టా భూముల్లో నివాసితుల కష్టాలు

తిరిగి అద్దె ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది.

ఇబ్రహీంపట్నం శివారు సరకొత్తుల్లో, కొండపల్లి శివారు ఈలప్రోలు సమీపంలో సెంటు పట్టా భూముల్లో ఇదే పరిస్థితి నెలకొంది. 2020లో నాలుగు లేఔట్లలో అప్పటి ప్రభుత్వం అర్హులకు సెంటు భూములను కేటాయించింది. ఇక్కడ కాస్త ఊళ్లు నిర్మిస్తాం అని గొప్పలు చెప్పిన నాటి ప్రభుత్వం లబ్ధిదారులకు స్థలాలను మాత్రమే కేటాయించి వదిలేసింది. నిర్మాణాలు చేపట్టకపోతే స్థలాలు తొలగిస్తామని అధికారులు బెదిరించడంతో అప్పులు తెచ్చి అత్యధిక మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిర్మించుకున్న ఇళ్లలో ఉండలేక తిరిగి అద్దె ఇళ్లలోకి చేరుకుంటున్నారు. ★ దీనికితోడు అక్కడ నివాసముంటున్న 300 కుటుంబాలు తాగునీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు కి.మీ వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

కన్నీళ్లు ఒక్కటే తక్కువ: రాజ్యలక్ష్మి

వర్షం పడిన సందర్భంలో రాకపోకలు సాగించాలన్నా, తాగునీరు తెచ్చుకోవాలన్నా నానా బాధలు పడాల్సిందే. కొన్ని కొన్ని సార్లు ఏడుపు వస్తోంది. అప్పులు తెచ్చి కట్టుకున్న ఇల్లు వదిలి వెళ్లలేక ఇక్కడే అవస్థలు పడుతున్నాం.

రెండేళ్లుగా బాధలు: లక్ష్మీదేవి

సెంటు పట్టాల్లో స్థలం వచ్చిందని సంతోషించాం. రెండేళ్ల కిందట ఇల్లు కట్టుకున్నాం. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ సరైన రహదారి లేదు. మురుగు పోయేందుకు కాలువలు లేవు. తాగునీరు లేదు. ఎందుకు ఇక్కడికి వచ్చామా అని బాధపడుతూనే ఉన్నాం. మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించాం. అయినా ప్రయోజనం లేదు.

శాఖా పరమైన మార్పు జరగలేదు: రమ్యకీర్తన, కమిషనర్

జగనన్న కాలనీలు మున్సిపాలిటీ పరిధిలో రాలేదు. హౌసింగ్ డిపార్ట్‌మెంటు నుంచి మున్సిపాలిటీకి రావాల్సి ఉంది. అయితే బాధితుల అభ్యర్థన మేరకు మున్సిపాలిటీ కొన్ని పనులను నిర్వహిస్తూనే ఉన్నాం.

ఘనంగా సుదర్శన హోమం



తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి ఆలయంలో గురువారం శ్రావణమాసం సందర్భంగా లోకశాంతి కోసం అర్చకులు విరివాదాచార్యులు, గోపాలకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డి.రంగారావు, పలువురు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల్లా కలిసి ఉందాం



వీరాంజనేయస్వామికి వస్త్రాలు బహూకరించిన తెలంగాణ మంత్రి శ్రీనివాసరెడ్డి

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన జరిగినప్పటికీ తెలుగు రాష్ట్రాల ప్రజలంతా కలిసి ముందుకు సాగుదామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని మేడూరులో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ఆయన కుటుంబ సమేతంగా సందర్శించగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో అర్చకులు అంజనేయాచార్యులు విశేష పూజలు నిర్వహించగా మంత్రి కుటుంబ సభ్యులు స్వామివారికి వస్త్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్నదమ్ముల్లా..సుఖ సంతోషాలతో కలిసి ఉండాలన్నారు. తెదేపా మండల నాయకులు ఎం.రామకృష్ణ, ఆర్.వీరారెడ్డి, డి.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అడ్డుకోవాలి

తిరువూరు, న్యూస్‌టుడే: వినియోగదారులకు ఆర్థిక భారంగా ఉన్న విద్యుత్తు స్మార్ట్‌మీటర్లను బిగించవద్దని కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో స్మార్ట్ మీటర్లతో విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొనే ఇబ్బందులపై చర్చించారు. ప్రజలు కూడా స్మార్ట్‌మీటర్లు అమర్చకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా పార్టీల నాయకులు పి.శ్రీనివాసరావు, ఎం.నాగేంద్రప్రసాద్, ఎస్‌కే.సుభాని, ఎ.రవి, ఎస్.వీరభద్రం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుదపలో అధికారుల పర్యటన

రెడ్డిగూడెం: 'స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్' బృందం అధికారులు రెడ్డిగూడెం మండలం కుదప పంచాయతీలో గురువారం పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామంలోని గృహాల్లో మరుగు దొడ్ల నిర్వహణ పనులు పర్యవేక్షించారు. అధికారులతో పాటు డీఎల్‌పీవో రాఘవన్, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ఆగస్టు 2న జిల్లా స్థాయి న్యాయ విజ్ఞాన సదస్సు

ఎ.కొండూరు, తిరువూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలం గోపాలపురం కల్యాణ మండపంలో ఆగస్టు 2న జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న న్యాయ విజ్ఞాన సదస్సుకు జరుగుతున్న ఏర్పాట్లను గురువారం, న్యాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. గురువారం ఉదయం తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో కె. మాధురి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సాయంత్రం ఆర్డీవో, తిరువూరు న్యాయస్థానం జడ్జీలు ఎ.సింధూర, కె. సూర్యతేజ, వివిధ శాఖల అధికారులతో కలిసి కల్యాణ మండపాన్ని సందర్శించారు. సదస్సులో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ పథకాలు, మాదక ద్రవ్యాల అనర్థాలు, నియంత్రణ, చిన్నారుల న్యాయసేవలపై అవగాహనతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వివిధ సామాజిక వర్గీయులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యాయ శిబిరం వద్ద ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో సూచించారు.



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో మాధురి

వీరారావుకు సత్కారం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: స్థానిక స్టేట్ బ్యాంకులో క్యాష్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన కోగంటి వీరారావుకు సహచర సిబ్బంది సన్మాన కార్యక్రమాన్ని బ్యాంకు ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని సిబ్బంది గుర్తు చేసుకొన్నారు. అనంతరం వీరారావు రాజేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఇబ్రహీంపట్నం ఎస్‌బీఐ ఖాతాదారులు పాల్గొన్నారు.

దారిపొడవునా.. గుంతలే



విజయవాడ గ్రామీణ మండలం పరిధిలోని జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అనేక చోట్ల గోతులు పడడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జక్కంపూడి పాముల కాలువ సమీపంలో రహదారి ప్రమాదకరంగా ఉంది. ఆ గోతుల్లో ఇటీవల ఒక ట్యాంకర్ కూడా బోల్తా పడింది. మరమ్మతులు చేసేందుకు అధికారులు ఏవిధమైన చర్యలు చేపట్టని పరిస్థితి ఏర్పడింది. వెలగలేరు, మైలవరం తదితర ప్రాంతాలకు ఆ మార్గం నుంచే వెళ్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గొల్లపూడి

ఇక జరిమానా తప్పదండోయ్..

ఎవరూ చూడడంలేదులే అని అపసవ్య దిశలో వెళ్తున్నా, శిరస్త్రాణం ధరించకున్నా..ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నా, వివిధ వాహనాల్లో బెల్టు ధరించకుండా వెళ్లే వారి చిత్రాలు ఇట్టే పోలీసులకు చేరిపోతాయి. ఎలా అనుకుంటున్నారా..ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి ట్రాఫిక్ పోలీసులు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)తో చెక్ పెడుతున్నారు. ఇందు కోసం జాతీయ రహదార్లు, ప్రధాన రహదార్ల వద్ద ఏఐ అనుసంధానంతో పని చేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి వచ్చిన చిత్రాల సాయంతో జరిమానాలు పడుతాయి. ఆ జరిమానాల జాబితా ఆధార్‌కు అనుసంధానమైన చరవాణికి చేరతాయి. ఈ కెమెరాలు పోలీస్‌స్టేషన్ పరిధి నల్లగుంట నుంచి దొనబండ, కొండపల్లి వైపు ఏర్పాటు చేశామని సీఐ చంద్రశేఖర్, ఎస్సై లక్ష్మణరావులు తెలిపారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం గ్రామీణం



రింగు కూడలిలో సీసీ కెమెరా

కాలువ నిర్మాణానికి చర్యలు



విజయవాడ పశ్చిమ బైపాస్ వెంబడి కాలువ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. గొల్లపూడి వద్ద బైపాస్ వెంబడి కాలువ నిర్మాణాన్ని కొంత మేర చేపట్టలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రహదారిపై నీరు నిలిచి ఉంటుంది. ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులను నిర్వహిస్తుండడంతో వర్షపు సజావుగా వెళ్లేందుకు వీలుంది. రహదారికి ఇరువైపులా కాలువ నిర్మాణాన్ని చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగనున్నాయి. త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది. -న్యూస్‌టుడే, గొల్లపూడి

భావితరాలకు ఏం చెప్తారు..?

ఇబ్రహీంపట్నం రింగ్ కూడలిలోని 14వ శతాబ్దం నాటి తిమ్మరసు బావి ఆక్రమణలకు గురై దాదాపు కనిపించకుండా పోయింది. కొండపల్లి రాజ్యాన్ని సాధించాలని చూసిన కృష్ణదేవరాయుల సైన్యం ఇబ్రహీంపట్నం వద్ద బావిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే దానిని తిమ్మరసు బావి అని అంటారు. కొందరు దాని ఆక్రమణలకు దిగారు. చరిత్రకు సంబంధించిన అనేక ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోయినట్లుగా ఈ బావి, అక్కడి స్థలం ఆక్రమణకు గురైంది. చరిత్రకు ఆధారాలు ఉన్న బావిని కాపాడాలని ఇబ్రహీంపట్నం ప్రజలు అధికారులను కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



చెత్త పడేయడంతో పూడుకు పోయిన బావి

దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు, సీపీఎం నాయకుల నిరసన

మైలవరం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికురాలి భవానీపై దాడి చేసిన కటారు ఉమామహేశ్వరరావును వెంటనే అరెస్ట్ చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ (సీఐటీయూ) ఎ.కమల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దాడి చేసిన వ్యక్తిని ఇంకా అరెస్టు చేయకుండా ఉండడం పద్ధతి కాదన్నారు. అతనిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వీరమ్మ, చంద్రరావు, ప్రశాంత్, శివ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే: మైలవరంలో పంచాయతీ కార్మికురాలు భవానిపై దాడి చేసిన కటారు ఉమామహేశ్వరరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ గురువారం తిరువూరులో నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేశారు. పంచాయతీ కార్మికులకు రక్షణ కల్పించాలని, దాడికి పాల్పడిన నిందితుని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, కార్మికుల సంఘం నాయకులు రమణ, సామ్రాజ్యం, కృష్ణవేణి, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తున్నాం

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరులో గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా కుటుంబాలకు అమలైన సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఏడాదిగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తెదేపా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పీక్లానాయక్, జి.రామ్‌ప్రసాద్ రెడ్డి, నాయకులు జి.కృష్ణారెడ్డి, నరసింహయాదవ్, గిరి, జి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎ.కొండూరు: కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



కొండపల్లి: పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో

కొండపల్లి: ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం తీసుకెళ్తోందని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి పుట్టలమ్మగట్టు ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల వాగ్దానాల ప్రకారం సీఎం చంద్రబాబు ప్రతి హామీని నెరవేరుస్తున్నారన్నారు.

గోతులు పూడ్చించారు

ఈనాడు కథనానికి స్పందన



మండలంలోని పెనుగొలను ప్రధాన రహదారి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఏర్పడిన భారీ గుంతల్లో నీరు నిలిచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్న వైనంపై గత నెల 27న ఈనాడులో 'గుంతల రహదారిలో ప్రయాణం.. నరకమే' శీర్షికతో ప్రచురించిన కథనానికి సర్పంచి ఎస్.లలిత స్పందించారు. గుంతల్లో ప్రమాదాల నివారణకు కంకర పోసి పూడ్చించారు. -న్యూస్‌టుడే, పెనుగొలను(గంపలగూడెం)

బాధిత కుటుంబీకులకు రూ.లక్ష ఆర్థికసాయం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ఆకస్మిక మృతి చెందిన విస్సన్నపేట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజారావు కుటుంబానికి శాఖాపరంగా రూ.లక్ష ఆర్థికసాయం అందజేసినట్లు సీఐ కె.గిరిబాబు, ఎస్సై జి.రామకృష్ణ, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య గురువారం తెలిపారు. రాజారావు 32 ఏళ్ల పాటు పోలీస్‌శాఖలో ఉద్యోగిగా సేవలందించారని తెలిపారు. అతని కుటుంబానికి పోలీస్‌శాఖ నుంచి అండగా ఉంటామన్నారు. విజయవాడ దేవినగర్‌లో రాజారావు మృతదేహానికి నివాళులర్పించి, భార్యాబిడ్డలను పరామర్శించినట్లు ఎస్సై తెలిపారు.



నగదు అందజేస్తున్న సీఐ గిరిబాబు, ఎస్సై రామకృష్ణ

చేతివృత్తుల శిక్షణతో ఉపాధికి అవకాశాలు

మైలవరం: కుట్టు, అల్లికల వంటి చేతివృత్తులపై శిక్షణ కార్యక్రమాలు మహిళల స్వయం ఉపాధి అవకాశాలకు మేలు చేస్తాయని సీడీపీవో పుష్పలత పేర్కొన్నారు. మదర్‌థెరెసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మైలవరంలో ఉచిత కుట్టు శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించారు. రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణ ద్వారా బ్యాంకులు, ప్రభుత్వం ద్వారా రుణాలకు సహకరించడం తమ సంస్థ ధ్యేయమని ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. కార్యక్రమంలో జేపీ, విజయలక్ష్మి, డి.విజయలక్ష్మి, శిక్షకులు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో పుష్పలత

నారికింపాడులో నిలిచిన విద్యుత్తు సరఫరా

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడప శివారు నారికింపాడులో గురువారం ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచింది. రాత్రి వరకు సరఫరా పునరుద్ధరించక పోవడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై డిస్కం ఏఈ వాసును సంప్రదించగా చీమలపాడు విద్యుత్తు ఉపకేంద్రం నుంచి నారికింపాడుకు విద్యుత్తు సర్వీసు తీగలు ఉన్నాయని, అటవీ ప్రాంతలో తెగిపోవడంతో ఆటంకం ఏర్పడిందని, సిబ్బంది గుర్తించి మరమ్మతులు చేసే పనిలో ఉన్నారని తెలిపారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను, ఊటుకూరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలు, గుళ్లపూడి ఫీడర్, గంపలగూడెంలో శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్త లైన్ల నిర్మాణం కోసం విద్యుత్తు సరఫరా ఆపేస్తున్నట్లు ఏఈ కె.వాసు తెలిపారు.

పదవీ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం

జి.కొండూరు, న్యూస్‌టుడే: హ్యాండ్ బాల్ ఆటతో ఎంతో మంది విద్యార్థులను క్రమశిక్షణతో జాతీయస్థాయి క్రీడాకారులుగా నిలబెట్టిన ఘనత వ్యాయామ ఉపాధ్యాయుడు రావి సీజర్‌రెడ్డికి దక్కుతుందని హెచ్‌ఎం ఎం శ్రీలత అన్నారు. స్థానిక ఎస్ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె పాల్గొని సీజర్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఏపీ వ్యాయామోపాధ్యాయ సంఘం తరఫున వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల స్థలదాత శాగం శంకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, ఎన్టీఆర్ జిల్లా వ్యాయామోపాధ్యాయులు ఏ.పీ.రెడ్డి, కరీముల్లాబాషా తదితరులు పాల్గొన్నారు.



కొండూరులో సీజర్‌రెడ్డికి సత్కారం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అన్నేరావుపేట ఎంపీయూపీఎస్ హెచ్.ఎం. పి.షారోన్ కుమారి పదవి విరమణ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించారు. కాంప్లెక్స్ ఛైర్మన్ ఐ.ధర్మశీల, ఎంఈవో పి.రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కవులూరు శివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు చెరువుమాధవరం గ్రామానికి చెందిన దేరంగుల గోపి(32) ఓ గుత్తేదారు దగ్గర లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కవులూరు -కట్టుబడిపాలెం గ్రామాల మధ్యలో రహదారి పనులు జరుగుతున్న క్రమంలో గోపి వెట్‌మిక్స్ రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలకు తాను తీసుకువచ్చిన లోడ్‌ను అన్‌లోడ్ చేస్తుండగా కవులూరు శివారు శ్మశాన వాటిక సమీపంలో పైన ఉన్న తీగలు తగిలి విద్యుత్తు సరఫరా కావడంతో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



గోపి (పాత చిత్రం)

నెల్లూరులోనూ అదే అరాచకం

- పోలీసులను తోసుకుని రావాలని పిలిచిన జగన్
- కార్యకర్తల అలజడి మధ్య కొనసాగిన బలప్రదర్శన

ఈనాడు, నెల్లూరు, అమరావతి: అదే అరాచకం.. మమ్మల్ని ఆపుతారా అంటూ హుంకరింపు.. మేం ఆగేది లేదంటూ పోలీసులనే తోసేసుకుని ముందుకు వెళ్ల, ఎక్కడికక్కడ పోలీసులతో వాగ్వాదానికి దిగుతూ, హెచ్చరిస్తూ వైకాపా కార్యకర్తలు అలజడిని సృష్టించగా.. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ రోప్ పార్టీని తోసుకుని ముందుకు రావాలని పిలవడంతో కార్యకర్తలు రచ్చ రచ్చ చేశారు. సత్తెనపల్లి, బంగారుపాళ్యం లాగే గురువారం జగన్ నెల్లూరు పర్యటన కూడా నిబంధనల ఉల్లంఘనల మధ్య కొనసాగింది. ఇక్కడ జోరు మరికాస్త పెంచారు. జగన్ చేతులు ఊపుతూ రమ్మనడంతో కార్యకర్తలు పోలీసులను లెక్కచేయకుండా హడావుడి చేశారు. మరోవైపు జగన్ వాహనానికి ఇరువైపులా ఫుట్‌బోర్డు మీద నిలబడిన నేతలు ఎక్కడికక్కడ జనసమూహం వద్ద సైగలు చేస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టారు. దీంతో వారంతా 'రప్పా.. రప్పా.. సీఎం జగన్' అంటూ కేకలు వేస్తూ హంగామా సృష్టించారు.

బల ప్రదర్శన 'షో'

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసేందుకు నిబంధనలు పెట్టిన నేపథ్యంలో జనసమీకరణ వద్దని పోలీసులు సూచించినా వైకాపా నేతలు బేఖాతరు చేసి జనాన్ని తరలించారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి, రోప్ పార్టీలతో నియంత్రణ చర్యలు తీసుకున్నారు. అయినా నేతల సంజ్ఞలతో రెచ్చిపోయిన కార్యకర్తలు.. అనేకచోట్ల పోలీసులనే తోసేసుకుని ముందుకొచ్చారు. జైలు నుంచి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి వరకు సుమారు 8.4 కి.మీ. ప్రధాన రహదారిపై జగన్ రోడ్‌షో చేసుకుంటూ వచ్చారు. రోడ్డు పక్కన రోప్‌పార్టీలు అడ్డుకోవడం చూసిన జగన్ కార్యకర్తలను రావాలంటూ చేతులూపడంతో.. 'జగనన్న పిలుస్తున్నాడు' అంటూ పలుచోట్ల తోసుకురావడం ఉద్రిక్తతకు దారితీసింది. ఒకచోట తోపులాటలో ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా కిందపడ్డారు. పోలీసులు అప్రమత్తమై అందరినీ పక్కకు లాగేయడంతో ప్రమాదం తప్పింది.

ఇన్‌స్పెక్టర్‌ను నెట్టేసి.. మహిళా డీఎస్పీని బెదిరించి..

జగన్‌కు స్వాగతం పలికేందుకు రోడ్డుపైకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చుట్టూ భారీగా జనం పోగయ్యారు. అనుమతి లేదని పోలీసులు వారించారు. ముందుకు కదులుతున్న వారిని అడ్డుకునేందుకు జీజీహెచ్ సమీపంలో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఎందుకు వెళ్లనివ్వరంటూ వారిపై ప్రసన్నకుమార్‌రెడ్డి విరుచుకుపడ్డారు. ప్రసన్నను వెళ్లనివ్వాలని, అయితే వారిని అనుమతించవద్దని అక్కడున్న నెల్లూరు డీఎస్పీ సింధుప్రియ పోలీసులకు సూచించారు.. 'ఎందుకు ఆపుతారు' అంటూ డీఎస్పీపై ప్రసన్న అరవడంతో ఆయన వెనకున్న కార్యకర్తలు సైతం ఆమెను బెదిరించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అక్కడున్న కానిస్టేబుల్‌ను ప్రసన్న వెనక్కి నెట్టేసి, అక్కడున్న జనాన్ని రావాలని పిలిచారు. కార్యకర్తలు ముందుకు కదలడంతో అడ్డుకునేందుకు వచ్చిన ఇన్‌స్పెక్టర్‌ను కూడా ప్రసన్న నెట్టేశారు. కార్యకర్తలు వేగంగా ముందుకు కదలడంతో ఒక పోలీసు అధికారి కింద పడిపోగా, మిగిలిన పోలీసులు పక్కకు జరిగారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు లాఠీఛార్జీ చేసి వారందరినీ రోడ్డు మీద నుంచి పక్కకు పంపేశారు. ప్రసన్న కదలకపోవడంతో ఆయన్ను రోప్‌పార్టీతో పక్కకు తీసుకెళ్లారు. దీంతో ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. ఫలితంగా గందరగోళం నెలకొంది. ఈ తోపులాటలో కావలి స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్యపై వైకాపా కార్యకర్తలు పడటంతో.. ఆయనకు చెయ్యి విరిగిపోయింది.



లాఠీఛార్జికి నిరసనగా ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఎదుట రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నాయకులు



తోపులాటలో కింద పడిపోయిన సీఐ, మాజీ మంత్రి ప్రసన్న



తోపులాటలో చేయివిరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య

కాకాణితో ములాఖత్, ప్రసన్నకు పరామర్శ

గురువారం ఉదయం నెల్లూరుకు చేరుకున్న జగన్, తొలుత జిల్లా కేంద్ర కారాగారానికి వెళ్లి అక్కడ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ములాఖత్‌లో కలిసి మాట్లాడారు. అక్కడకు పది మందికే అనుమతి ఉందని పోలీసులు వారించినా వైకాపా నేతలు ముందుకు వెళ్లారు. తర్వాత ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి జగన్ వెళ్లి, ఆయన్ను పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులతో కాసేపు మాట్లాడారు. కాకాణి, ప్రసన్నకుమార్‌రెడ్డిలకు జగన్ పరామర్శ అటూ ఇటుగా అరగంటలో పూర్తయితే.. ఆయన వచ్చి వెళ్లేవరకు నాలుగున్నర గంటలపాటు నెల్లూరు ప్రజలు రోడ్లపై నరకం చూడాల్సి వచ్చింది.

జగన్ పర్యటనపై మూడు కేసులు నమోదు



పోలీసులను నెట్టుకొని వస్తున్న వైకాపా నాయకుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, నాయకులు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: జగన్ పర్యటనలో వైకాపా నాయకులు, కార్యకర్తలు నిబంధనలు ఉల్లంఘించడంతో పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. మాజీమంత్రి ప్రసన్న ఇంటి ఎదుట రోడ్డుపై పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లను వైకాపా నాయకులు, కార్యకర్తలు లాగి పడేశారు. ఈ క్రమంలో కావలికి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య బారికేడ్ కింద పడిపోవడంతో చేయి విరిగింది. ఈ ఘటనలో ప్రసన్న, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పాతపాటి ప్రభాకర్ తదితరులపై కేసు నమోదుచేశారు.

◆ జగన్ పర్యటన సందర్భంగా రోడ్డుపై ధర్నా చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినందుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మరికొందరిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదుచేశారు. ◆ నిబంధనలకు విరుద్ధంగా బైక్‌ర్యాలీ చేపట్టినందుకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదుచేశారు.

మహిళలకు జగన్ క్షమాపణ చెప్పాలి

- నీచంగా మాట్లాడిన ప్రసన్నకుమార్‌రెడ్డికి పరామర్శా?
- హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శలు



ఈనాడు, అమరావతి: 'చెల్లి వరసయ్యే ప్రశాంతిరెడ్డిని నీచాతినీచంగా మాట్లాడిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి జగన్ వెనకేసుకువస్తారా? ఇదేనా ఆయనకు మహిళలపై ఉన్న గౌరవం? ఎమ్మెల్యేగా ఉన్న మహిళపై ఆరు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి అలా మాట్లాడటమే తప్పు అయితే.. ఆయన దగ్గరకు వెళ్లి జగన్ పరామర్శించి ఏం చెప్పదలుచుకున్నారు? మహిళలందరికీ జగన్ క్షమాపణ చెప్పాలి' అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. 'ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడికి కారణమేంటో ఆలోచించక్కర్లేదా? ఆ దాడిపై కేసు నమోదైంది. బాధ్యులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. విచారణకు పిలిచారు. ప్రభుత్వం ఏమీ ఆ దాడిని సమర్థించడం లేదే!'. అని మంత్రి అన్నారు. సచివాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న అంశాలు, ఆయన తీరుపై ధ్వజమెత్తారు.

ఇదేనా సాక్షి విశ్వసనీయత?: 'ఒక కార్యక్రమంలో సాక్షి ఛైర్‌పర్సన్ భారతీరెడ్డి మాట్లాడుతూ పత్రికకు విశ్వసనీయత ఉండాలని చెప్పారు. అవతలి పక్షం వాదన సైతం పత్రికలో కనిపించాలన్నారు. మరి తన పినమామ వివేకానందరెడ్డి హత్యలో సాక్షాత్తూ తండ్రి గంగిరెడ్డి పాత్ర ఉంటే, నారాసుర రక్త చరిత్ర అని ఆనాడు ఎందుకు రాశారు?' అని అనిత నిలదీశారు.

పరామర్శ యాత్రా.. బల ప్రదర్శనా?: 'జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పరామర్శకు వెళ్తే ఎంతమంది వెళ్తారో, ఏ మార్గంలో వెళ్తారనే అడుగుతున్నాం. అవేవీ సరిగా చెప్పకుండా ఎందుకు ప్రభుత్వాన్ని విమర్శించడం? పరామర్శ యాత్ర పేరుతో బలప్రదర్శన చేయొద్దు అంటున్నాం. ఈరోజు జగన్ పర్యటనలో కూడా హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య చేయి విరిగింది. జగన్ ఎక్కడికి వెళ్లినా ఏదో ఒక ఘటన జరుగుతోంది' అని దుయ్యబట్టారు.

'తాండవ' పనులు ముందుగానే నిలుపుదల

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లాలో ఉన్న తాండవ రిజర్వాయర్ కాలువ ఆధునికీకరణ పనులను ముందస్తుగా ఆపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2007లో మాక్స్ ఇన్‌ఫ్రాతో కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్రంలో చికెన్ వ్యర్థాల ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు యోచన

- పురపాలక శాఖ మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సింగపూర్ తరహాలో చికెన్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసే యూనిట్లను ఏర్పాటు చేసే యోచనతో ప్రభుత్వం ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సింగపూర్‌లో మొట్టమొదటి జేటీసీ పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంత్రి గురువారం సందర్శించి అక్కడి ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు. లైవ్ చికెన్, ప్రాసెస్, ప్యాకింగ్, డెలివరీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. చికెన్ వ్యర్థాలతో ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్న యూనిట్‌ను మంత్రి సందర్శించారు. సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. ప్రజా రవాణా వ్యవస్థ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు అథారిటీ చూస్తున్నట్లు అక్కడి అధికారులు నారాయణకు వివరించారు. అమరావతిలోనూ రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌పై సంస్థ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు పాల్గొన్నారు.



సింగపూర్‌లోని జేటీసీ పౌల్ట్రీ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు

ప్రైవేటు బస్సుకు రూ.10 లక్షల జరిమానా



అధికారులు సీజ్ చేసిన బస్సు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సుకు ఆర్టీవో రూ.10 లక్షల జరిమానా విధించడం ఒడిశాలోని కటక్ జిల్లాలో చర్చనీయాంశమైంది. సరైన పత్రాలు, అనుమతులు లేకుండా బస్సును నడపడంతో.. ప్రయాణికుల భద్రత దృష్ట్యా కటక్ ఆర్టీవో కార్యాలయం చర్యలు తీసుకుంది. బస్సు శివ శంకర్ పేరుతో నమోదైనట్లు అధికారులు తెలిపారు. సంబంధిత బస్సుకు ఫిట్‌నెస్, బీమా, కాలుష్య నియంత్రణకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలూ లేనందున గురువారం రూ.10 లక్షల జరిమానా విధించామని, అది చెల్లించాకే బస్సును విడుదల చేస్తామని ఆర్టీవో కార్యాలయం పేర్కొంది.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో.. తదుపరి దర్యాప్తు చేసే స్వేచ్ఛ ఐఓకు ఉంటుంది

- మొదటి నుంచి, పునర్ దర్యాప్తు చేయనక్కరలేదు
- వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు వ్యాజ్యంలో స్పష్టత ఇస్తూ హైకోర్టు తీర్పు

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్, దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తు నిర్వహించుకునే స్వేచ్ఛ దర్యాప్తు అధికారికి(ఐఓ) ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పింది. సుబ్రహ్మణ్యం హత్య కేసులో తదుపరి దర్యాప్తు చేసేందుకు ఐఓకు అనుమతి ఇస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అనంతబాబు వేసిన వ్యాజ్యంలో హైకోర్టు సింగిల్ జడ్జి గురువారం తీర్పు వెలువరిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పును సమర్థించారు.

◆ వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 మే 19న డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారనే ఆరోపణతో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అనంతబాబు ఒక్కరినే పోలీసులు నిందితుడిగా చేర్చారు. తన కుమారుడి మృతదేహంపై 33 చోట్ల గాయాలు ఉండటంతో తల్లి నూకరత్నం సందేహం వ్యక్తంచేస్తూ కూటమి అధికారంలోకి వచ్చాక డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. తన కుమారుడి హత్య ఘటనలో మరికొందరి పాత్ర ఉన్నట్లు పేర్కొన్నారు. విచారణాధికారి సైతం ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమని భావించి, ఆ మేరకు అనుమతి కోసం ఎస్సీ, ఎస్టీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనికి కోర్టు అనుమతిస్తూ జులై 22న ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు అనంతబాబు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు.. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నిలుపుదలకు నిరాకరించింది.

◆ తదుపరి దర్యాప్తు పేరు చెప్పి.. పునర్ దర్యాప్తు చేస్తారేమోనని అనంతబాబు తరఫు సీనియర్ న్యాయవాది సి.రఘు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై న్యాయమూర్తి స్పష్టతనిస్తూ తదుపరి దర్యాప్తు మాత్రమే చేయాలి తప్ప.. మొదటి నుంచి, రీఇన్వెస్టిగేషన్ చేయడానికి వీల్లేదని ఐఓను ఆదేశించారు.

రాయితీ రుణాలకు ఎదురుచూపులు

మే నెలలో ఆగిన ప్రక్రియ

ఈనాడు, అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా యువతకు స్వయం ఉపాధి రాయితీ రుణాల మంజూరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ప్రక్రియ ప్రారంభించి మూడు నెలలు దాటినా ఇప్పటికీ కొన్ని కార్పొరేషన్ల పరిధిలో అర్హుల ఎంపిక పూర్తికాలేదు. మరికొన్నింటిలో లబ్ధిదారులను ఎంపిక చేసినా.. అక్కడితోనే ప్రక్రియ నిలిపివేశారు. రాయితీ రుణాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో ఇప్పటికే నిధులు కేటాయించింది. మే నెల నాటికే బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఈ రెండు వర్గాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 70 వేల మందికి రుణాలు అందించాలని లక్ష్యం పెట్టుకోగా.. దాదాపుగా 7 లక్షల మంది దరఖాస్తు చేశారు. అందులో 22 వేల మందికి రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొచ్చారు. కానీ, అక్కడితోనే ప్రక్రియ ఆగిపోయింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1.19 లక్షల మంది, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 25 వేల మంది ముస్లిం మైనారిటీలు, 800 మంది క్రైస్తవ యువత దరఖాస్తు చేశారు. ఆ దరఖాస్తుల పరిశీలన చేపట్టకుండానే ప్రక్రియ ఆగిపోయింది. ట్రైకార్ ద్వారా గిరిజన యువతకు స్వయం ఉపాధి రాయితీ రుణాలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

బీసీ రిజర్వేషన్లకు కేంద్రమే అడ్డు

మీనాక్షి నటరాజన్

పరిగి, పరిగి గ్రామీణ, పూడూరు, మొయినాబాద్, న్యూస్‌టుడే: అభివృద్ధిలో దేశానికి తెలంగాణ రోల్‌మోడల్ కావాలన్నది రాహుల్‌గాంధీ ఆకాంక్షని ఆ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్‌లో పార్టీ జెండాను ఎగురవేసి జనహిత పాదయాత్రను ప్రారంభించారు. పరిగి చేరుకున్న అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాదయాత్రలు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని చెప్పారు. పవిత్ర ప్రాంతాలకు నడుచుకుంటూ ఎలా వెళ్తామో ప్రజల వద్దకూ అలాగే వెళ్తున్నామని తెలిపారు. కష్టకాలంలో ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో అధికారంలోకి వచ్చామని. . రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పోరాడుతున్నారని.. కేంద్ర ప్రభుత్వం ఇందుకు అడ్డుగా మారిందన్నారు. రిజర్వేషన్లు సాధించేందుకు దిల్లీకి వెళ్తామని మీనాక్షి చెప్పారు.

మాజీ ఎంపీ ఎంవీవీ వీరంగం

- విశాఖలో నా బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు తిరస్కరిస్తారా?
- పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్‌పై ఆమె కార్యాలయంలోనే చిందులు
- వారం క్రితం ఘటన
- గోప్యంగా ఉంచిన డైరెక్టర్, అధికారులు

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే- విశాఖ కార్పొరేషన్: విశాఖ మాజీ ఎంపీ, వైకాపా నేత ఎంవీవీ సత్యనారాయణ వీరంగం సృష్టించారు. నగరం నడిబొడ్డున తనకు చెందిన ఎంవీవీ పీక్ ప్రాజెక్టులో 24 అంతస్తుల భారీ నిర్మాణానికి అనుమతులు తిరస్కరించడంపై రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ ఆర్జే విద్యుల్లతపై చిందులేశారు. లంచం తీసుకుని అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెడతారా? అని డైరెక్టర్ కార్యాలయంలో వారం క్రితం రచ్చరచ్చ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. ఈ విషయం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులకూ తెలియలేదు. డైరెక్టర్ కూడా ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ బంగ్లాకు అత్యంత సమీపంలో ఎంవీవీ పీక్ ప్రాజెక్టులో 24 అంతస్తుల భారీ నిర్మాణానికి అనుమతుల కోసం మాజీ ఎంపీ ఎంవీవీ దరఖాస్తు చేశారు. బహుళ అంతస్తులకు మంగళగిరిలోని పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ అనుమతులిస్తారు. దరఖాస్తుపై డైరెక్టర్ విద్యుల్లత కొన్ని కొర్రీలు వేసి తిరస్కరించారు. దీంతో ఎంవీవీ వారం క్రితం మంగళగిరిలోని పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ వద్దకు వెళ్లి ఆమెతో వాగ్వాదానికి దిగారు. అనుమతులు తిరస్కరిస్తారా అని పెద్దగా కేకలు వేసినట్లు తెలిసింది. డైరెక్టర్ కూడా ఘాటుగానే సమాధానమిచ్చారని తెలిసింది. మాజీ ఎంపీ మరింత రెచ్చిపోవడంతో మిగతా అధికారులు, సిబ్బంది వచ్చి ఆయన్ను బయటకు పంపారు. ఈ విషయాన్ని డైరెక్టర్ కార్యాలయం అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

హైదరాబాద్‌లో ఫులే విజ్ఞాన కేంద్రం నిర్మిస్తాం!

- బీసీ సంఘాలతో భేటీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి



ఉపముఖ్యమంత్రి భట్టితో జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో మహాత్మా జ్యోతిబా ఫులే విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన డిక్లరేషన్ మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచడంతోపాటు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు పెంచి బీసీ సబ్ ప్లాన్ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల ప్రతినిధులు గణేశ్‌చారి, శ్రీనివాస్, విక్రం, శ్యాం, మణిమంజరి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నరేశ్, లింగం తదితరులు భట్టిని ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై వినతి పత్రం ఇచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల కేటాయింపు, చట్టబద్ధమైన సబ్ ప్లాన్ అమలు, బీసీ విద్యార్థుల బోధన రుసుముల బకాయిల చెల్లింపు, ఫులె పేరిట ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, విదేశీ విద్యానిధి ఉపకారవేతనాల పెంపు, ప్రభుత్వ కాంట్రాక్టులలో బీసీలకు రిజర్వేషన్ల హామీ తదితరాలను నెరవేర్చాలని కోరారు. దీనిపై భట్టి మాట్లాడుతూ..బీసీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం తెచ్చిందని, నిధుల కేటాయింపులను పెంచుతున్నామని తెలిపారు. బీసీ విద్యార్థుల బోధన రుసుముల బకాయిలను దశలవారీగా చెల్లిస్తామన్నారు.

షెడ్డు కూల్చారని.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గేదెలతో నిరసన



భూపాలపల్లి, న్యూస్‌టుడే: తమ పశువుల షెడ్డును అధికారులు అక్రమంగా కూల్చివేశారంటూ దంపతులు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలోకి గేదెలను తోలుకొచ్చి నిరసన తెలిపిన ఘటన తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద సొంతింట్లో కూరాకుల ఓదేలు, లలిత దంపతులు కొన్నేళ్ల క్రితం గేదెల కోసం రేకులషెడ్డు నిర్మించారు. సీసీ రహదారి నిర్మాణం నిమిత్తం నోటీసు జారీ చేసినప్పటికీ ఓదేలు స్పందించలేదని అధికారులు తెలిపారు. గురువారం పోలీసుల సమక్షంలోనే షెడ్డును కూల్చివేశామన్నారు. దీంతో సాయంత్రం ఓదేలు, లలిత, వారి బంధువు గుండెబోయిన రమేశ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలోకి గేదెలను తీసుకొచ్చి నిరసన తెలిపారు. ఓదేలు పురుగుమందుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతో పాటు లలిత, రమేశ్‌లను స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే అధికారులు షెడ్డును కూల్చివేశారని వారు ఆరోపించారు.

ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా సుప్రీంకోర్టుకు!

భారాస నేతలతో భేటీలో కేసీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్సీలపై కూడా సుప్రీంకోర్టులో కేసు వేయాలని భారాస నిర్ణయించినట్లు తెలిసింది. ఎర్రవల్లి నివాసంలో భారాస అధినేత కేసీఆర్‌తో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, అనంతర పర్యవసానాలపై కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలివ్వడంతో.. స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదని, ఈ విషయంలో భారాస గట్టి పోరాటం చేసిందని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్సీలపైనా సుప్రీంకోర్టులో కేసు వేద్దామని నిర్ణయానికొచ్చినట్లు తెలిసింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని, అవసరమైతే ఈ విషయమై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిద్దామని కేసీఆర్ స్పష్టం చేసినట్లు సమాచారం.

జలాశయానికి సోలార్ సొబగులు



విశాఖ నగరంలోని ముడసర్లోవ జలాశయం.. చుట్టూ కొండలతో పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. తాజాగా ఇక్కడి జలాలపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంటు దీనికి అదనపు అకర్షణగా మారింది. నీటిపై పడే భానుడి కిరణాలు ఫలకాలపై పడి అందంగా మెరుస్తున్నాయి. సమీపంలోని పార్కుకు వచ్చే సందర్శకులు ప్లాంటును చూడటానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తవుతున్న 2 మెగావాట్ల విద్యుత్తును ఏపీఈపీడీసీఎల్‌కు విక్రయిస్తున్నారు. - ఈనాడు, విశాఖపట్నం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై రెండు కేసుల కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజాప్రతినిధుల కోర్టులో ఊరట లభించింది. ఆయనపై గతంలో నమోదైన రెండు కేసులను న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన ఒక నిరసన కార్యక్రమం నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ మెదక్ జిల్లా కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో 2018లో కేసు నమోదైంది. అప్పటి భారాస ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా వ్యవహరించారంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నల్గొండ రెండో పట్టణ పోలీసులు 2023లో మరో కేసు నమోదు చేశారు. వీటిపై పోలీసులు దర్యాప్తు చేసి అభియోగ పత్రం దాఖలు చేయగా.. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసుల్లో ఏవైనా ప్రత్యేక ఆధారాలు ఉంటే సమర్పించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో గత శనివారం సీఎం కోర్టుకు హాజరయ్యారు. రాజకీయ కక్షతో కేసులు నమోదయ్యాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకొని తీర్పును గురువారానికి వాయిదా వేసిన న్యాయస్థానం విచారణ అనంతరం కేసులను కొట్టివేసింది.

చేపల వేటకు వెళ్లి ముగ్గురి గల్లంతు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: సరదాగా చేపల వేటకు వెళ్లి... ముగ్గురు గల్లంతైన ఘటన తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం మండలంలోని బంజర గ్రామానికి చెందిన ఎనిమిది మంది మీనవోలు సమీపంలోని కట్లేరులో చేపల వేటకు వెళ్లారు. వీరిలో నీటిలో దిగిన బాదావత్ రాజు(50), భూక్యా కోటేశ్వరరావు(45), భూక్యా సాయి(25)లకు ఈత రాకపోవటంతో గల్లంతయ్యారు. వీరిని కాపాడేందుకు మిగిలినవారు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చి ముమ్మరంగా గాలించినా రాత్రి వరకు గల్లంతైనవారి ఆచూకీ లభించలేదు.

రాయితీ సిలిండర్లను పక్కదారి పట్టించిన గ్రామ సర్పంచి, డీలర్

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య దీపం పథకం కింద గిరిజనులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని, తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో రాయితీ సిలిండర్లను గ్రామ సర్పంచి, డీలరు బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముకొన్నారని అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం బుధరాళ్లకు చెందిన కూనిశెట్టి చంద్రరావు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన తండ్రి పేరుతో ఉన్న స్థలాన్ని అక్కాచెల్లెళ్లు దౌర్జన్యంగా రిజిస్టర్ చేయించుకున్నారని నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం చిన్నదేవళాపురానికి చెందిన రామకృష్ణ వాపోయారు. ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూమికి పాస్ పుస్తకాలు రాకుండా వైకాపా నాయకులు అడ్డుకుంటున్నారని విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గొట్టిపల్లికి చెందిన శ్రీను, అప్పారావు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్యమంటే వ్యాయామం, ఆహారమే కాదు..



ఆరోగ్యం లభించేది వ్యాయామం చేయడం, సమతులాహారం తీసుకోవడం వల్ల మాత్రమే కాదు. కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆనందాన్ని, ప్రేరణను కలిగించే వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యసనాలతో పాటు ఈర్ష్యాద్వేషాలను వదిలిపెట్టడం, మంచి అలవాట్లను కొనసాగించడం, కృతజ్ఞతాభావాన్ని అలవర్చుకోవడం.. ఇవన్నీ చేసినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుంది.

– యుంగ్ పుయెబ్లో, రచయిత

వసుంధర

vasundhara@eenadu.in

టైర్‌-2 నగరాలే జెన్‌జీల ఎంపిక..!



బాగా చదువుకోవాలి... మంచి ర్యాంకు సాధించాలి... పెద్ద నగరాల్లో ఉద్యోగ అవకాశాల్ని చేజిక్కించుకోవాలి... ఇదే లక్ష్యంగా అడుగులు వేసే వారు ఇదివరకు అమ్మాయిలు. అప్పటికి అదే గొప్ప మరి! 'మా అమ్మాయి ముంబయిలో పనిచేస్తోంది' 'దిల్లీలో పెద్ద కంపెనీలో ఉద్యోగం' అంటూ అమ్మానాన్నలూ గొప్పగా చెప్పుకొనే వారు. కానీ జెన్‌జీ అమ్మాయిలు, మెట్రో నగరాల్లో ఉద్యోగం వద్దు అంటున్నారు. 'కలుషిత వాతావరణం, జీవన వ్యయాలు, ట్రాఫిక్‌ రద్దీ ఇవన్నీ మా వల్ల కాదు. టైర్‌-2 నగరాల్లోనే మాకు ప్లేస్‌మెంట్స్‌ ఇవ్వండి' అని అడుగుతున్నారట. ఎంత మంచి ఉద్యోగమైనా వాళ్లకు నచ్చిన చోట పోస్టింగ్‌ ఇస్తేనే చేస్తాం అంటున్నారట. అలా కాని పక్షంలో నో చెప్పడానికీ వెనకాడటం లేదు. దాంతో లఖ్‌నవూ, జోధ్‌పుర్‌, జైపుర్‌, కోయంబత్తూరు, గువాహటి లాంటి టైర్‌-2 నగరాల్లో నియమకాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఇటీవల ఓ సర్వే వెల్లడించింది. ఎంతైనా జెన్‌జీ అమ్మాయిల ఆలోచనలే వేరు. చూశారా హెల్త్‌కీ, వెల్త్‌కీ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో! ఇప్పటికైనా మించి పోయింది లేదు.. . వాళ్ల ఆలోచన నచ్చితే ఫాలో అయిపోండి మరి.

అప్పుడు ఆ అడుగులెలా?



'రోజుకు ఇన్ని వేల అడుగులు...' చాలా మంది మహిళలు దీన్నో నియమంగా పెట్టుకుని పూర్తిచేస్తున్నవారే! దీనికోసం ఉదయాన్నే గంట ముందు లేవడమో... సాయంత్రం వీలు చేసుకోవడమో చేస్తున్నారు. సమస్యల్లా వానలతోనే. రెయిన్‌కోట్‌, గొడుగులతో బయటికెళ్లడమూ కుదరదు. చల్లగాలికి అనారోగ్యాల పాలవుతామేమోనన్న భయం. అలాగని ఈ కాలమంతా వ్యాయామానికి దూరంగా ఉంటామంటే కుదురుతుందా? మరేం చేద్దాం అంటే...

ఇంట్లోనే నడవండి. పనిగట్టుకుని నడవాలంటే కష్టం కానీ... టీవీ చూస్తున్నా, ఫోన్‌ మాట్లాడుతున్నా కూర్చోకుండా తిరుగుతూనే ఉండండి. సరదాగా ఉంటుంది. నచ్చిన పాట పెట్టుకుని డ్యాన్స్‌ ప్రయత్నించేయండి. జుంబా, జంపింగ్‌ జాక్స్‌, తాడాట... శరీరానికీ వ్యాయామం, అడుగులూ కలిసొస్తాయి. ఆఫీసుకి వెళ్లినా కుర్చీకే పరిమితం అవొద్దు. గంటకోసారి లేస్తూ నాలుగు అడుగులేయాలి. మామూలు కాల్స్‌ మాట్లాడుతూ కూడా కారిడార్లో నడవొచ్చు. విండో షాపింగ్‌కి వెళ్లండి... ట్రెండ్‌లు తెలుస్తాయి, తెలియకుండానే చాలా నడిచేస్తాం. అయితే షాపింగ్‌ మాల్‌లోకి వెళ్లేవరకూ తడవకుండా చూసుకోవాలి మరి. పిల్లలతో షటిల్‌, బ్యాడ్మింటన్‌ ఆడొచ్చు. ఒక్కరే ఉన్నా గాల్లోకి బంతిని కొడుతూ కింద పడకుండా ప్రయత్నించొచ్చు. చూశారా ఎన్ని ఆప్షన్లో! మన లక్ష్యం నెరవేరాలి అని బలంగా అనుకుంటే చాలు... వాన కూడా ఆపలేదు. కాబట్టి, చల్లగా ఉంది, వర్షం పడుతోందని సాకులు వెతక్కుండా ఎన్ని వేల అడుగులు లక్ష్యంగా పెట్టుకున్నారో దాన్ని పూర్తిచేయండి. ఎంతైనా ఇంట్లోనే... బోర్‌ కొడుతోంది అనిపిస్తే అప్పుడప్పుడూ గొడుగు, రెయిన్‌కోట్‌తో సరదాగా బయటికీ వెళ్లొచ్చు... అయితే అప్పుడప్పుడే మరి!

ఏఐ అక్షరాభ్యాసం!



అ, ఆ, ఇ, ఈ.... మన అక్షరాభ్యాసం మొదలైంది వీటితోనే. అయితే, మళ్లీ ఇప్పుడు మనం అక్షరాభ్యాసం మొదలుపెట్టాల్సి వచ్చింది. కానీ, అ, ఆలతో కాదు, ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌లోని ప్రాథమిక అంశాలతో. అవును మరి ఏఐ మన జీవితాల్లో అంతగా భాగమైపోయింది. అందుకే, దీన్ని గమనించిన 'నేషనల్‌ కమిషన్‌ ఫర్‌ విమెన్‌... 'యశోద ఏఐ అభియాన్‌ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. మహిళలకు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఏఐ ఎడ్యుకేషన్‌, సైబర్‌ సెక్యూరిటీ, డిజిటల్‌ సేఫ్టీ... వంటి నైపుణ్యాలు అందించటమే లక్ష్యంగా వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోంది సంస్థ. ఈ రకమైన క్యాంపులు మహిళల కోసం ఏర్పాటుచేయటం దేశంలో ఇదే తొలిసారి. ఏఐ పాస్‌పోర్ట్‌, ఏఐ లిటరసీ టూల్‌ కిట్‌ వంటివి 'యశోద ఏఐ'లో కీలకంగా ఉంటాయి. చాట్‌జీపీటీ, గూగుల్‌ జెమిని, నోషన్‌ ఏఐ, చాట్‌ పీడీఎఫ్‌, కాన్వాఏఐ... వంటి వాటికి ఏఐ పాస్‌పోర్ట్‌ సపోర్ట్‌ చేస్తుంది. టూల్‌కిట్ల ద్వారా ఏఐ రెస్పాన్సిబిలిటీ, ఫేక్‌ ప్రొఫైళ్లను గుర్తించటం, వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరచుకోవటం... వంటి నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. మహిళల హక్కులు, సైబర్‌ దాడి జరిగినప్పుడు కావాల్సిన న్యాయ సంబంధిత సలహాలూ దొరుకుతాయి. మే నెలలో యూపీలో అధికారికంగా ప్రారంభమైన ఈ వర్క్‌షాప్‌లను దేశవ్యాప్తంగానూ నిర్వహించబోతున్నారు అధికారులు.



ఇలా చేస్తే... మీరే లీడర్‌!

ఇప్పుడిప్పుడే మన దేశంలో సీనియర్‌ లీడర్‌షిప్‌ స్థానాల్లో మహిళల శాతం పెరుగుతోంది. అయితే, ఆ స్థాయికి చేరుకోవటానికి అమ్మాయిలు పుణికిపుచ్చుకోవాల్సిన లక్షణాలను బహ్వాన్‌ సైబర్‌టెక్‌ (బీసీటీ) డిజిటల్‌ సీఈఓ జయా వైద్యనాథన్‌... 'వసుంధర'తో చెప్పారిలా...

- కచ్చితత్వం అనేది ఒకప్పటి నాయకత్వ శైలి కావొచ్చు. కానీ, కొలాబరేటివ్‌గా ఉండటం అనేది సరికొత్త శైలి. జూనియర్లు, మగవాళ్లు... ఎవరిదగ్గరి నుంచైనా సరే మనం నేర్చుకునేలా ఉండాలి.
- నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలంటే చాలామంది అమ్మాయిలకు వాళ్ల మీద వాళ్లకే అనుమానం మొదలవుతుంటుంది. ఈ 'ఇంపోస్టర్‌ సిండ్రోమ్‌' నుంచి బయటకు రావాలి. ఒక్కో విషయం నేర్చుకుంటూ ముందుకెళ్లాలి.
- లింగ సమానత్వం సాధించాలంటే ప్రభుత్వ పాలసీల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉంది. జాతి వృద్ధి చెందాలంటే మహిళా శ్రామిక శక్తి కీలకం. అంతేకాదు, ఇప్పుడున్న తరం వాళ్ల అమ్మ ఉద్యోగం చేయడాన్ని చూసి పెరిగితే, భవిష్యత్తులో వాళ్ల ఆడవాళ్లకి విలువ ఇవ్వడం ఆటోమేటిక్‌గా నేర్చుకుంటారు.
- నా పరంగా నేనెప్పుడూ కఠినమైన మార్గాల్నే ఎంచుకున్నా. అందుకే... ఇంజినీరింగ్‌, ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకింగ్‌, పెద్ద ఆర్గనైజేషన్లకు నాయకత్వం వహించటం... ఇలా ప్రతిదీ ఓ సవాలుగానే తీసుకున్నా. అప్పుడే కదా మన మేంటో తెలిసేది.
- నేనూ అమ్మనీ, కూతుర్నీ, కోడల్నీ ఆంత్రప్రెన్యూర్‌నీ. కానీ అందుకోసం నన్ను నేను కోల్పోలేదు. జీవితంలో ఎప్పటికప్పుడు ప్రాధాన్యతలు మారుతూ ఉంటాయి. ఎప్పుడు ఏది ముఖ్యమో అర్థం చేసుకుని దానికి కావాల్సిన శ్రద్ధ పెట్టాలి. అంతేతప్ప అన్నింటికీ సమన్యాయం చేయాలని 'సూపర్‌ ఉమన్‌ సిండ్రోమ్‌' బారిన పడొద్దు. వర్క్‌ లైఫ్‌ బ్యాలెన్స్‌ చాలా ముఖ్యం. నా దృష్టిలో వారానికి 90 గంటలు పనిచేయడమనేది హాస్యాస్పదం.
- మన లక్ష్యానికి తోడుగా ప్రయాణించేవాళ్లే ఉద్యోగులు. వాళ్ల మీద నమ్మకం ఉంచి, స్వేచ్ఛ ఇస్తేనే ఆంత్రప్రెన్యూర్లుగా ఎదగగలం.
- కంఫర్ట్‌జోన్‌ నుంచి బయటకు వస్తేనే కొత్త అవకాశాలు వచ్చేది. ఓపిక, భావోద్వేగాల నియంత్రణ వంటివీ అవసరమే. అన్నింటికంటే ముఖ్యంగా ఇగోని వదిలేయాలి.
- కంపెనీలో మొదటి ఉద్యోగి మనమే. కాబట్టి, నాయకురాలిగా ఓ నిర్ణయం తీసుకున్నాక... మధ్యలో వదిలేస్తే మీరు మాత్రమే వదిలినట్లు కాదు, మీపై ఉద్యోగులు ఉంచిన నమ్మకాన్నీ వదిలేసినట్లే. కాబట్టి, వీటన్నింటినీ పాటిస్తూ ముందుకెళ్తే భవిష్యత్తులో మరింత మంది అమ్మాయిలు నాయకత్వ స్థానాల్లో

ఆ కిక్కు కోసమే!


ప్రతిభ

మార్షల్‌ ఆర్ట్స్‌ పోటీలే కాదు, ప్రాక్టీసూ కష్టమే. నిత్యం ఒంటినిండా గాయాలే. వీటిలో ఒక్క క్రీడ ఆడటమే కష్టం. అలాంటిది తక్కడపల్లి ప్రతిభ మాత్రం విభిన్న క్రీడల్లో రాణిస్తోంది. తాజాగా ఆరు స్వర్ణాలు సాధించింది. ఈ పతకాల వెనకున్న శ్రమ గురించి ఆమె మాటల్లోనే...

కిక్‌ బాక్సింగ్‌, థాయ్‌ బాక్సింగ్‌, తైక్వాండో, వుషూ, చెస్‌ బాక్సింగ్‌, మిక్స్‌డ్‌ మార్షల్‌, సిలంబం, గ్రాప్లింగ్‌... ఇలా ఎనిమిది రకాల మార్షల్‌ ఆర్ట్స్‌లో నాకు ప్రావీణ్యం ఉంది. ఈ జులైలో కోల్‌కతాలో నిర్వహించిన ఇండియన్‌ ఓపెన్‌ ఇంటర్నేషనల్‌ చెస్‌ బాక్సింగ్‌ ఛాంపియన్‌షిప్‌, ఏషియన్‌ చెస్‌ బాక్సింగ్‌ పోటీల్లో వివిధ విభాగాల్లో 6 బంగారు పతకాలు సాధించా. త్వరలోనే సెర్బియాలో జరిగే ప్రపంచ స్థాయి పోటీల్లోనూ పాల్గొంటా.

శక్తియుక్తులకు పరీక్ష...

ఆరున్నరేళ్లు వివిధ మార్షల్‌ ఆర్ట్స్‌ పోటీల్లో పాల్గొన్నాక, చెస్‌ బాక్సింగ్‌వైపు వచ్చా. రింగులోనే మూడు నిమిషాలు చెస్‌ ఆడి... ఆ వెంటనే గ్లవ్స్‌ తొడిగి అదే ప్రత్యర్థితో బాక్సింగ్‌ ఆడాలి. చెస్‌, బాక్సింగ్‌... మార్చి మార్చి కనీసం అయిదు రౌండ్లు ఆడాలి. ఎందులో ఓడినా మొత్తంగా ఓడిపోయినట్లే. ఒకే రౌండ్‌లో రెండు సార్లు, మొత్తంగా మూడు సార్లు పావుల్ని తప్పుగా కదిపినా ప్రత్యర్థి గెలిచినట్లే. శారీరక, మానసిక దృఢత్వాలను పరీక్షించే కఠినమైన క్రీడ ఇది. అమ్మ చిన్నప్పుడు చెస్‌ నేర్పింది. పోటీల కోసం మాత్రం హైదరాబాద్‌లో కోచ్‌ కంది రవి దగ్గర కొన్నాళ్లు శిక్షణ తీసుకున్నా.

మాది కామారెడ్డి జిల్లా పిట్లం. అమ్మ శ్యామల, నాన్న నర్సింగరావు ఓ పాఠశాల నడిపేవారు. చిన్నప్పట్నుంచీ పుస్తకాలతోనే దోస్తీ. పెద్దయ్యాక ఆటల్లోకి వచ్చా. మైక్‌టైసన్‌ వీడియోలు బాగా చూసేదాన్ని. మేరీకోమ్‌ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ సాధించి జాతీయ జెండాను పట్టుకోవడం పేపర్‌లో చూశాక బాక్సర్‌ అవ్వాలనుకున్నా. ఇంట్లో చెబితే 'ఇది అమ్మాయిల ఆట కాద'న్నారు. నాకేమో 'జీవితంలో ఆ మాత్రం కిక్కు లేకుంటే ఎలా' అనిపించేది. డిగ్రీ హైదరాబాద్‌లో చదువుకుంటానని ఇంట్లో ఒప్పించా. చదువుకుంటూనే మార్షల్‌ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకునే దాన్ని. పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ.. ఫీజులు చెల్లించేదాన్ని. మార్కులు తగ్గితే అనుమానం రావొచ్చుని... ఎన్ని ఇబ్బందులున్నా చదువు మానేదాన్ని కాదు. నాలుగేళ్లు అలా కష్టపడ్డా. ఓసారి శిక్షణలో కాలికి తీవ్ర గాయమైంది. రెండేళ్లు విశ్రాంతి తీసుకోమన్నారు వైద్యులు. దాంతో ఇంటికి వెళ్లా. అప్పుడు తెలిసి వద్దని వారించినా, ఏడాదికే తిరిగి ప్రాక్టీసు మొదలుపెట్టా.

ప్రాక్టీసు, ఆహారం, నిద్ర... వీటికి ప్రాధాన్యం ఇస్తా. ఉదయం నాలుగింటికే నిద్ర లేస్తా. 5:30 నుంచి 11:30 వరకూ మార్షల్‌ ఆర్ట్స్‌ ప్రాక్టీసు చేస్తా. తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి రాత్రి తొమ్మిది వరకూ ప్రాక్టీసుతోపాటు కొత్తవాటిలో శిక్షణ తీసుకుంటా. ప్రతి క్రీడకూ వారానికి ఒకట్రెండు రోజులు విశ్రాంతి ఉంటుంది. ఆ రోజుల్లో మరో ఆటలో శిక్షణ తీసుకునేదాన్ని. ఇబ్బంది అయినా వెనకడుగు వేయలేదు. అలా విభిన్న యుద్ధ విద్యలు నేర్చుకోగలిగా. హార్స్‌ రైడింగ్‌ వచ్చు. షూటింగ్‌, ఫెన్సింగ్‌లలో శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటివరకు అంతర్జాతీయ పోటీల్లో 18 బంగారు పతకాలు సాధించా. ఎప్పటికప్పుడు ఏదోక గాయమవుతుంది. ఇవన్నీ వదిలి పెళ్లి చేసుకోమంటారు ఇంట్లో. కానీ ఇంకా సాధించాల్సింది ఉందనిపిస్తుంది. ఊళ్లో గ్రౌండ్‌లేదని, కోచ్‌ లేరని ఆటల్లోకి రావడానికి సందేహిస్తారు కొందరు. కానీ సంకల్పబలం ఉంటే అవి సమస్యలే కాదు.



ఆత్మరక్షణ తరగతులు

హైదరాబాద్‌ జేఎన్‌టీయూ నుంచి ఎంబీఏ పూర్తిచేశా. కొన్నాళ్లు బిజినెస్‌ అనలిస్ట్‌గానూ పనిచేశా. నాకున్న నైపుణ్యాలతో దేశానికి పతకాలు తేవడమే కాదు, మరో రకంగానూ సమాజానికి సాయపడాలని... అమ్మాయిలకు ఆత్మరక్షణలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. దుండగులపైకి బలంగా, వేగంగా పంచ్‌, కిక్‌లు ఇవ్వడం సహా తమను రక్షించుకోవడానికి పలురకాల పద్ధతుల్ని నేర్పుతున్నా. ఇప్పటివరకూ ఆరు వేలమందికి శిక్షణిచ్చా. కామారెడ్డి జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించా. తెలంగాణ పోలీస్‌ అకాడమీతోపాటు, ఐఐటీ మద్రాస్‌లోనూ శిక్షణ ఇచ్చా.

- హరీష్‌ రాగళ్ల, కామారెడ్డి

మీకు తెలుసా?

శిశువులు పుట్టగానే తల్లి వాసనను పసిగట్టేస్తారట. ఈ సామర్థ్యమే వాళ్లకు తల్లితో అనుబంధం పెరిగేలా చేస్తుందట. అంతేకాదు, అమ్మపాలకీ, మిగతా తల్లుల పాలకీ తేడానూ గుర్తించగలరట. అమ్మ గర్భంలో ఉమ్మనీటికి ఉండే ప్రత్యేక వాసనలకు ఎక్స్‌పోజ్‌ అవటం కూడా దీనికి ఓ కారణమట.



భారత్‌లో నదుల్నీ, అడవుల్నీ, పర్యావరణాన్నీ రక్షిస్తున్న మహిళలు ఎందరో కనిపిస్తారు. ఈ పనిని వాళ్లు గుర్తింపు కోసం చేయడం లేదు. వాటి సంరక్షణ తమ ఉనికిలో భాగమని చేస్తున్నారు.

- దీప్తి ఆస్థానా, ఫొటోగ్రాఫర్‌, నేషనల్‌ జియోగ్రాఫిక్‌ ఎక్స్‌ప్లోరర్‌

నా గురించి పట్టించుకోరా?

ఇంటర్‌ ఫస్ట్‌ ఇయర్‌ చదువుతున్నా. ఉదయం ఆరింటికి ఇంట్లోంచి బయటకు వెళ్తే... ఇంటికి వచ్చేసరికి రాత్రి ఏడవుతుంది. మధ్యాహ్నం భోజనమూ కాలేజీలోనే. అన్ని గంటలు తరగతిలో కూర్చొని ఇంటికి వస్తే... పుస్తకాలు తీయమంటూ గోల. ఓపిక లేదంటే ఎన్నెన్ని డబ్బులు పోస్తున్నామో తెలుసా అంటున్నారు. వాళ్ల మాట వాళ్లదే కానీ నా గురించి పట్టించుకోరే? - ఓ సోదరి

నీ కష్టం నాకర్థం అవుతోంది. నువ్వు ఎదుర్కొంటున్న పరిస్థితే చాలామంది ఎదుర్కొంటున్నారు. ఇంత డబ్బు ఖర్చు పెడుతున్నాం, మంచి ర్యాంకులు రావాలన్న ఆరాటమే తప్ప పెద్దవాళ్లు... పిల్లలు ఎంత ఒత్తిడికి గురవుతున్నారో గుర్తించరు. అసలా విషయానికే ప్రాధాన్యం ఇవ్వరు. కానీ ఎవరైనా గమనించుకోవాల్సింది... ఎంతసేపు చదువుతున్నాం అన్నది కాదు. ఎంత బాగా విషయాన్ని గ్రహిస్తున్నాం, మెదడులో నిక్షిప్తం చేసుకుంటున్నామన్నది ప్రధానం. ఇందుకోసం అభ్యసించే పద్ధతి, గుర్తుపెట్టుకోవడానికి కావాల్సిన మెలకువలపై దృష్టిపెట్టడమూ ముఖ్యమే. అయినా 24 గంటలూ పుస్తకం పట్టుకుని కూర్చున్నంత మాత్రాన దానిలోని సమాచారమంతా బుర్రలోకి వెళ్లిపోదు. కాబట్టి, ఇంటికొచ్చాక తప్పనిసరిగా రిలాక్స్‌ అవ్వు. ఆ తరవాతే పుస్తకాలు తీసుకో. అప్పుడూ కొత్త అంశాలు చదవొద్దు. ఉదయం నుంచి చదివినవే మననం చేసుకోవడం, గుర్తుపెట్టుకునేలా మైండ్‌ మ్యాపింగ్‌ వంటివి తయారుచేసుకోవడం, కీవర్డ్స్‌ రాసుకోవడం వంటివి చెయ్యి. ఇవి నిన్ను రిలాక్స్‌ చేస్తాయి. ఒత్తిడినీ తగ్గిస్తాయి. ఏదైనా ఇష్టంగా చదువు... ఆసక్తి లేకపోతే సమయం తీసుకో. లేదంటే చదువు మీద అనాసక్తి ఏర్పడుతుంది. కాబట్టి, విశ్రాంతికి ప్రాధాన్యం తప్పక ఇవ్వు.

డియర్‌ వసుంధర


డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

నేనివ్వనంటే బాగుంటుందా?

డిగ్రీ చదువుతున్నా. క్లాసులో ఫ్రెండ్స్‌ పుట్టినరోజులు అందరూ కలిసి సెలబ్రేట్‌ చేయాలన్నది నియమం. దానికోసం అందరూ డబ్బులు వేసుకోవాలి. నేనొక్కదాన్నీ ఇవ్వనంటే బాగుంటుందా? అమ్మానాన్నలేమో ఆ మాట అర్థం చేసుకోరు. లేవని చెప్పాలంటే నాకేమో తల కొట్టేసినట్లు అవుతోంది. - ఓ సోదరి

స్నేహితులతో కలిసి పుట్టినరోజులు జరుపుకోవడం ఆనందకరమే. కానీ తరగతిలో చాలామందే విద్యార్థులు ఉంటారు. వాళ్లందరి బర్త్‌డేలనీ నిర్వహించడమంటే కష్టమే కదా? లేదు, నీతో సన్నిహితంగా ఉన్నవాళ్ల వాటివరకే ఈ నియమం అనుకున్నా... నీకెంతమంది స్నేహితులున్నారు? ఎక్కువమంది ఉంటే ప్రతిసారీ డబ్బులివ్వడమూ కష్టమే. అందరి తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితీ ఒకేలా ఉండదు. చిన్న మొత్తాలే అనిపించొచ్చు కానీ... కొందరికి అదీ భారమే. నీదీ అదే పరిస్థితేమో! కాబట్టి, ఎవరి బర్త్‌డేకి వాళ్లే పార్టీ ఇచ్చుకుని, అలా ఇవ్వలేని వాళ్లవి వరకే నిర్వహిస్తే మేలేమో ఆలోచించు. అప్పుడు ఆ ఫ్రెండ్‌ కూడా ఆనందంగా ఉంటారు. కొన్ని నియమాలు బాగానే ఉన్నట్టు అనిపించినా అందరికీ అనుకూలంగా ఉండకపోవచ్చు. పైగా భారంగా మారొచ్చు. కాబట్టి, ఎవరికీ ఇబ్బంది కాకుండా ఆనందంగా ఎలా నిర్వహించుకోవచ్చో ఆలోచించు. అంతేకానీ... అమ్మానాన్నలని ఇబ్బంది పెట్టకు.

ఏడేసి నిమిషాలు చాలు!

పేరెంటింగ్‌



పిల్లల పెంపకంలో తల్లిదండ్రులకు ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించేందుకు, ఇరువురి మధ్య అనుబంధాన్ని బలపరిచేందుకు అమెరికాకు చెందిన వెల్‌రూట్స్‌ కౌన్సెలింగ్‌ సంస్థ 7-7-7 పేరెంటింగ్‌ సూత్రాన్ని చెబుతోంది. ఇది ఒకరితో ఒకరు నాణ్యమైన సమయం గడిపేందుకు చక్కగా ఉపయోగపడుతుందట. చేయాల్సిందల్లా రోజులో ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పిల్లలకోసం ఏడేసి నిమిషాల చొప్పున సమయం కేటాయిస్తే చాలు... అదెలాగంటారా?

ఉదయం 7 నిమిషాలు...

పిల్లలతో సానుకూలంగా రోజుని ప్రారంభించాలి. ప్రేమగా నిద్ర లేపడం, నవ్విస్తూ మాట్లాడటం, ఓ మంచి మాట చెప్పడం... వంటివి ఆ రోజంతా సానుకూల ప్రభావం చూపిస్తాయి.

పాఠశాల తర్వాత 7 నిమిషాలు...

స్కూలు నుంచి రాగానే ఆ రోజు ఏం జరిగిందో మీ చిన్నారిని అడిగి తెలుసుకోండి. వారి స్నేహితుల గురించి ఆరా తీయండి. తరగతి గదిలో జరిగిన విషయాలు, తను నొచ్చుకున్న అంశాలు, సంతోషంగా గడిపిన క్షణాలు అన్నీ చెప్పనివ్వండి. ఈ టైమ్‌ మీ ఇద్దరి మధ్య ఒక ఎమోషనల్‌ బాండింగ్‌ ఏర్పరుస్తుంది.

నిద్రకు ముందు 7 నిమిషాలు...

పడకగదిని వీలైనంత ప్రశాంతంగా ఉంచుకోండి. ఆ సమయంలో ఓ మంచి కథ, ఓ చక్కటి అంశం... ఏదైనా చెప్పండి. వారి మనసుల్లో బలంగా నాటుకుపోతాయి. ఆందోళనల్ని తగ్గిస్తాయి.



	బంగారం (24క్యా)	ఆర్నమెంట్‌ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్‌	1,01,310	92,100	1,13,117
విజయవాడ	98,260	91,700	1,15,000
ప్రొద్దుటూరు	99,500	91,540	1,15,000
రాజమహేంద్రవరం	1,00,030	91,700	1,25,000
విశాఖపట్నం	99,680	91,700	1,20,000
తమిళనాడు	-----	91,700	1,25,000

బంగారం - వెండి
31న ముగింపు

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు.. ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్‌, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

కటాన్‌ కట్టేద్దామా?

ఫ్యాషన్‌ ఫ్యాషన్‌



అన్ని మాసాల్లో మగువలు మనసు పారేసుకునేది ఏదంటే శ్రావణం అని కచ్చితంగా చెప్పేస్తాం కదూ! ఇది కేవలం పూజలు, వ్రతాలకే కాదు... మోడరన్‌ నెట్‌వర్కింగ్‌కీ నెలవే! అదనంగా పెళ్లిళ్ల సందడి! ప్రతిఒక్కరూ సంప్రదాయానికి ప్రతిరూపంలా సిద్ధమవుతారు. బీరువాలోని పట్టుచీరలూ బయటికి వచ్చేస్తాయి. వరలక్ష్మీ వ్రతానికి అయితే ఓ కొత్త పట్టుచీర మన కలెక్షన్‌లో చేరిపోతుంది. అన్నట్టూ ఈ వ్రతానికి ఏ చీర కొన్నారు? ఏం కొనాలా అని ఆలోచిస్తోంటే 'కటాన్‌'కి ఓటేయొచ్చు. బనారసీ పట్టుచీర తెలుసుగా? దానిలో ఓ రకమే ఈ కటాన్‌. మొగలుల కాలం నాటినుంచీ ఉందట. ఫ్యాషన్‌ ప్రపంచంలో దీనికున్న పేరేంటో తెలుసా? 'ఎవర్‌గ్రీన్‌' అనే! కట్టుకున్నవారికి ఎలిగెంట్‌ లుక్‌ని తెస్తుంది. ఈ చీర తయారీకి స్వచ్ఛమైన మల్బరీ సిల్క్‌ దారాల్ని మెలితిప్పి మరీ నేస్తారట. దీనివల్ల చీర దృఢంగానే కాదు... మెత్తగా, మృదువుగానూ ఉంటుందట. కాబట్టే, ప్రపంచవ్యాప్తంగా ఈ చీరలకు ఆదరణ ఎక్కువ. జరీవర్క్‌, గంటలు, నెమళ్లు, మోటిఫ్‌లతో కూడిన వాటిని సంప్రదాయ కటాన్‌లనీ... ముదురు రంగుల్లో ఆధునిక డిజైన్లను అద్దుకున్న వాటిని మోడరన్‌ కటాన్‌ చీరలనీ పిలుస్తారు. నిజానికి ఎక్కువగా తయారయ్యేది వారణాసిలోనే కానీ దీని పుట్టుక జరిగింది మాత్రం పర్షియాలో అని చెబుతారు. మొగల్‌ రాణులు మనసు పారేసుకోవడంతో 'రాయల్‌ ఫాబ్రిక్‌'గానూ దీనికి పేరు. చూడటానికి భారీతనంతో ఆకర్షించేస్తుంది కానీ... కట్టుకోవడానికి చాలా అనువుగా ఉంటుంది. మెత్తగా తేలికగా మేనిని చుట్టేస్తుంది. అందుకే ఇది పెళ్లి సహా అన్ని వేడుకలకీ అనువే. అంతేనా ప్రత్యేకంగా కనిపించేలానూ చేస్తుంది. కాబట్టే, శారీ లవర్స్‌ ఎంపికలో దీనికి తప్పక చోటు ఉంటుంది. మరి మీ సంగతేంటి? మీ దగ్గరుందా ఓ బనారసీ కటాన్‌ చీర? లేదంటే ఒకటి తెచ్చేసుకోండి మరి!




కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మందుబాబులు

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి వినూత్న శిక్ష

చీరాల, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి బాపట్ల జిల్లా చీరాలలో న్యాయమూర్తి వినూత్న శిక్ష విధించారు. పోలీసులు గతనెల 30న చేపట్టిన తనిఖీల్లో పది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. కాత్యాయని నిందితులకు జరిమానా కాకుండా సామాజిక సేవగా కోర్టు ప్రాంగణంలో మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శుభ్రత పనులు చేయాలని ఆదేశించారు. సమయానికి హాజరు కాకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే జరిమానాతో పాటు 15 రోజుల జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. మరోసారి మద్యం తాగి పట్టుబడితే ఆరు నెలల జైలుశిక్ష విధిస్తామని స్పష్టం చేశారు. గురువారం వారు కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ 3 వారాల్లో లొంగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే.

అధికారం ఉన్నవారు బాధ్యతలూ తీసుకోవాలి

ఈ కేసులో సుమారు 2 గంటలపాటు సాగిన విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు, సంజయ్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు విన్న ధర్మాసనం ఈ నిర్ణయం వెలువరించింది. 'మనకు అధికారాలు ఇచ్చిన చట్టమే బాధ్యతలు కూడా అప్పగించింది. అంతిమ నిర్ణయాధికారం ఉన్నవారు అందులో ఏం జరిగినా బాధ్యతలు కూడా తీసుకోవాలి. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తి నైతిక బాధ్యత తీసుకోకపోతే ఆయనకు అంత ఉన్నత స్థానం ఎందుకు?' అని జస్టిస్ అసహనుద్దీన్ అమానుల్లా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కస్టడీకి పంపకుండా చూడాలన్న వాదనలతోనూ న్యాయమూర్తి ఏకీభవించలేదు. 'కస్టడీ ఎందుకు అవసరమో మేం ఇప్పుడే చెప్పలేం. దర్యాప్తు సంస్థ విచారణ మొదలుపెట్టాక చాలా విషయాలు వెలుగులోకి రావచ్చు. ముందస్తు బెయిల్ కేసులో హైకోర్టు న్యాయమూర్తి ప్రతి విషయాన్నీ పరిగణనలోకి తీసుకొని అవన్నీ ప్రొసీజరల్ లోపాలు అన్నట్లు చెప్పడం సమర్థనీయమా? క్వాషింగ్ పిటిషన్‌లోనో, డిశ్చార్జి పిటిషన్‌లోనో ఇలాంటి ఉత్తర్వులు ఇస్తే అర్థం చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు.

ప్రభుత్వ వాదన ఇదీ..

సంజయ్ ఏపీ సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నప్పుడు వివిధ జిల్లా కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు క్రిత్వ్యాప్ అనే ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందంపై ఇరుపక్షాలు 2024 జనవరి 31న సంతకాలు చేశాయి. అయితే ఈ కార్యక్రమాలు నిర్వహించేసినట్లు కాంట్రాక్ట్ సంస్థ అదే రోజు బిల్లులు సమర్పించింది. వాటిని ఏ మాత్రం తనిఖీ చేయకుండానే మొత్తం బిల్లుల చెల్లింపునకు అదే రోజు అనుమతిచ్చారు. ఇందులో సంజయ్ అవినీతి/ వ్యక్తిగత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంలో అన్ని దస్త్రాలపై తుది నిర్ణయం సంజయ్‌దే కాబట్టి నిధుల దుర్వినియోగానికీ ఆయన సమాధానం చెప్పాలి. ఆయన్ను ప్రత్యక్షంగా విచారిస్తే తప్ప ఇందులోని విషయాలు వెలుగులోకి రావు' అని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.

వినేకొద్దీ అనుమానాలొస్తున్నాయి

జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి జోక్యం చేసుకుంటూ 'ఫైళ్ల కదలిక తీరు ఉండాల్సింది ఇలా కాదు. ఇక్కడ ఏ కార్యక్రమంలో ఎంత మంది పాల్గొన్నారన్నది చూడకుండా మొత్తం బిల్లులు శాంక్షన్ చేసి, అవి తీసుకోవడానికి అనుమతిచ్చారు. కర్నూలు జిల్లాలో 28వ తేదీన కార్యక్రమాలు నిర్వహించినట్లు క్రిత్వ్యాప్ సంస్థ చెబుతుంటే.. మీ పెర్ఫార్మెన్స్ నివేదికలో 29న నిర్వహించినట్లు కనబడుతోంది. ఈ కేసులో వాదనలు వినేకొద్దీ మాకు అనుమానాలు పెరుగుతున్నాయి. ముందస్తు బెయిల్ కేసులో ఇచ్చిన తీర్పులో హైకోర్టు ప్రతి కోణాన్నీ స్పృశించింది. ఆ దశలో అలా వాటి జోలికి వెళ్లాల్సింది కాదు' అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల అవగాహన కోసం నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో 350 మంది సభ్యులు పాల్గొన్నట్లు చూపడం పట్ల న్యాయమూర్తులు అనుమానం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమంలోనూ ఒకే సంఖ్యలో ప్రజలు పాల్గొంటారా? అసలు హెచ్చుతగ్గులే ఉండవా అని సంజయ్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల అవగాహన కార్యక్రమాలకు ఒకేలా రూ.59,52,500, రూ.59,51,100 చెల్లించడంలోని ఆంతర్యమేంటనీ ప్రశ్నలు సంధించారు.

కలిసి మునగనీయండి

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలున్నాయి. భారత్‌కు చెందిన కాంచన్ పాలిమర్స్, ఆల్‌కెమికల్ సొల్యూషన్స్, రామ్‌నిక్‌లాల్ ఎస్ గోసాలియా అండ్ కో, జూపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్, పెర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌లపై ఆంక్షలు విధిస్తూ బుధవారం అమెరికా విదేశాంగశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

■ 50 మంది వ్యక్తులు, సంస్థలపై అమెరికా ఆర్థికశాఖ ఆంక్షలు విధించింది. దీంతోపాటు ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీకి రాజకీయ సలహాదారైన అలీ శంఖానీ కుమారుడు మహమ్మద్ హొస్సేన్ శంఖానీకి చెందిన 50 నౌకలపైనా అమెరికా ఆంక్షలు విధించింది. ఇవి పెట్రో ఉత్పత్తులను సరఫరా చేస్తుంటాయి. శంఖానీ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసే భారతీయుడు పంకజ్ నాగ్‌జీభాయ్ పటేల్‌పైనా అమెరికా ఆంక్షలు విధించింది. ఇంకా అమెరికా ఆంక్షలు విధించిన భారతీయుల్లో జాకబ్ కురియన్, అనిల్ కుమార్ పనక్కల్ నారాయణన్ నాయర్ తదితరులున్నారు.

భారత్‌కూ పాక్ చమురు అమ్మొచ్చు..

పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీనిద్వారా దక్షిణాసియాలో అతి పెద్ద చమురు నిల్వల దేశంతో కలిసి పనిచేయనున్నామని వెల్లడించారు. ఏదో ఒక రోజు భారతీయులకు పాకిస్థాన్ చమురు విక్రయించే స్థాయిలో ఉండొచ్చని రోజు రావొచ్చని పేర్కొంటూ సామాజిక మాధ్యమ పోస్టులో వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్‌లో చమురు నిల్వలపై ఏ సమాచారం ఆయనవద్ద ఉందో తెలియడంలేదు. ప్రస్తుతం పశ్చిమాసియా నుంచి చమురును పాక్ దిగుమతి చేసుకుంటోంది.

■ ట్రంప్ మృత ఆర్థిక వ్యవస్థ వ్యాఖ్యలపై రష్యా మాజీ అధ్యక్షుడు, దేశ భద్రతా మండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న మెద్వెదేవ్ తీవ్రంగా స్పందించారు. సోవియట్ కాలం నాటి ఆటోమేటిక్ అణ్వాయుధ సామర్థ్యాల ఉనికిని రష్యా కలిగి ఉండడాన్ని విషయాన్ని అమెరికా అధ్యక్షుడు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. 'ద వాకింగ్ డెడ్' చిత్రాలను గుర్తుంచుకోవాలని, అవి ఎంత ప్రమాదకరమో కూడా ఆయన చింపుకోవాలని హెచ్చరించారు. రష్యా.. ఇజ్రాయెల్, ఇరాన్ మాదిరిగా కాదని, దానికి చేసే ప్రతి హెచ్చరిక ముప్పేనని, యుద్ధంవైపు అడుగేనని పేర్కొన్నారు. రష్యా వార్తా సంస్థ టాస్ ప్రకారం.. 'డెడ్ హ్యాండ్' అనే పదం పాశ్చాత్య దేశాల్లో కోల్డ్‌వార్ కాలంలో వాడేవారు. అప్పట్లో అణు నిరోధక వ్యవస్థకు అది సూచిక. సోవియట్ యూనియన్‌పై ఏదైనా దాడి జరిగితే ప్రతీకారంగా ఈ ఆటోమేటిక్ వ్యవస్థ తక్షణమే స్పందించేందుకు దీన్ని రూపొందించారు.

8న తితిదే 'సౌభాగ్యం'

తిరుపతి (తితిదే, తిరుచానూరు), న్యూస్‌టుడే: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఈ నెల 8న తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు సంయుక్తంగా 'సౌభాగ్యం' పేరిట సుమంగళి ద్రవ్యాలు పంపిణీ చేయనుంది. ఇందుకు తితిదే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సౌభాగ్యం సామగ్రికి శ్వేత భవన హాల్‌లో గురువారం దేవస్థానం, డీపీపీ అధికారులు, శ్రీవారి సేవకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వారీగా మంగళ ద్రవ్యాల పార్సిల్ ప్యాకెట్లు సిద్ధం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న 51 ఆలయాల్లో వ్రతం రోజున 'సౌభాగ్యం' ప్రసాదాన్ని మహిళలకు పంపిణీ చేయనున్నారు. సుమంగళి ద్రవ్యాల్లో గాజులు, శ్రీవద్వాపతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలు ఉన్నాయి.

నందనవనంలా.. సుందర నగరంలా..

(మొదటి పేజీ తరువాయి)

కూడళ్లను హరితనందనంగా అభివృద్ధి చేయాలి. అమరావతిని గ్రీన్, బ్లూ నగరంగా తీర్చిదిద్దడంతోపాటు ఏడాది పొడవునా వేర్వేరు జాతుల పుష్పాలు వికసించేలా మొక్కలు నాటాలి. ప్రజలు, పర్యాటకులు వాటి గురించి మాట్లాడుకునేలా ఉండాలి. బెంగళూరు, సింగపూర్ సహా వివిధ ప్రాంతాలను పరిశీలించండి. ఔషధ మొక్కలు, అంతరించిపోతున్న అరుదైన జాతుల మొక్కలు, వృక్షాలను సంరక్షిస్తున్న ప్రాంతంగా అమరావతి ఉండాలి. ఔషధ మొక్కలను పెంచేందుకు ప్రముఖ యోగాగురు బాబా రామ్‌దేవ్ సూచనలు తీసుకోవాలి. కడియం నర్సరీలనూ ప్రోత్సహించాలి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ ప్రాంతాల్లో ఉన్న దేశీయ వృక్ష జాతులను కూడా అమరావతిలో పెంచేందుకు చర్యలు చేపట్టాలి' అని చంద్రబాబు సూచించారు.

సింగపూర్ బిడదారి తరహాలో చెట్లు

'అమరావతిలో గృహ నిర్మాణం అత్యంత నాణ్యంగా, అందరికీ అందుబాటులో ఉండాలి. సింగపూర్‌లోని బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు తరహాలో గృహనిర్మాణ ప్రాజెక్టుల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చెట్లు, పార్కులను ఏర్పాటు చేయాలి. 250 ఎకరాల ప్రాంతంలో 10 వేలమంది నివసించేలా సింగపూర్‌లో బిడదారి ఎస్టేట్‌ను


అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ బృహత్ ప్రణాళికపై సమీక్షిస్తున్న చంద్రబాబు

నిర్మించారు. రాజధానిలో నిర్మించే పార్కుల్లో వివిధ దేశాల పుష్ప జాతుల మొక్కలను పెంచాలి. వాటికి ఆయా దేశాల పేర్లు పెట్టాలి. అమరావతిలో కొండవీటి వాగు, పాలవాగు సహా కాలువలు అత్యంత సుందరంగా కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలి. కృష్ణాతీరం ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలి. రహదారులకు ఇరువైపులా సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలి. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న ఆరు దీవుల్ని కూడా సుందరంగా తీర్చిదిద్ది రివర్ ఫ్రంట్లుగా అభివృద్ధి పరచడంతోపాటు పర్యావరణానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలి. నగరం మధ్యలో ఉండవల్లి కొండ ప్రాంతం ఎక్కడి నుంచి చూసినా అందమైన వనంలా కనిపించేలా మొక్కలు నాటాలి' అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

ఐదేళ్లలో రూ.45వేల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, ఏ సమయంలోనైనా కూలిపోతుందని, పెట్టుబడులు పెట్టొద్దని మురళీకృష్ణ అనే వ్యక్తి అక్కడి ప్రభుత్వం, మంత్రులు, అధికారులు, హైకమిషనర్‌కు తప్పుడు ఈమెయిల్స్ పంపించారని లోకేశ్ పేర్కొన్నారు. "ఆ వ్యక్తి మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్‌ఆర్ కంపెనీతో, పలువురు వైకాపా మాజీ ఎమ్మెల్యేలతో తరచూ మాట్లాడినట్టు తెలిసింది. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకే జగన్ గ్యాంగ్ ఇలాంటి కుట్రలకు తెరలేపింది. టీసీఎస్‌కు విశాఖలో ఎకరం 99 పైసల చొప్పున భూమి కేటాయిస్తే... వైకాపా నేతలు కోర్టులో కేసులు వేశారు. చివరకు హైకోర్టు వారికే అక్షింతలు వేసింది" అని తెలిపారు. సింగపూర్ ప్రభుత్వానికి తప్పుడు ఈమెయిల్స్ పంపిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

సింగపూర్ సంస్థలకు చంద్రబాబు భరోసా

"సింగపూర్‌లో మేం ఒక మంత్రిని కలిశాక... ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఏపీతో తాము చేసుకున్న ఒప్పందాల్ని 2019లో వచ్చిన ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని వాపోయారు. జగన్ నిర్వాకం వల్ల సింగపూర్ సంస్థల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించేందుకు చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్, ఫ్రేమ్‌వర్క్ పెట్టుకుందామని, దానికి చట్టబద్ధత కల్పిద్దామని భరోసా ఇచ్చారు. వారు కూడా అమరావతితో పాటు, రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండళ్లు, పోర్టుల్లాంటి ప్రాజెక్టుల్లో కలసి పనిచేసేందుకు ముందుకొచ్చారు" అని లోకేశ్ తెలిపారు.

మోదీ స్ఫూర్తితోనే తక్కువ ధరకు భూములు

"టాటా కంపెనీ నానో కార్ల పరిశ్రమ ఏర్పాటుకు పశ్చిమబెంగాల్ సహకరించకపోతే... అప్పట్లో గుజరాత్ సీఎంగా ఉన్న నరేంద్రమోదీ వారికి ఎకరం రూపాయి చొప్పున భూములిచ్చారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న మా లక్ష్యసాధనలో భాగంగా ఐటీ కంపెనీలకు తక్కువ ధరకు భూములు కేటాయించాలన్న ఆలోచన అక్కడినుంచే వచ్చింది. మేము భారతి సిమెంట్స్‌కో, హెరిటేజ్‌కో భూములివ్వలేదు. యువతకు ఉద్యోగాలిచ్చే టీసీఎస్, కాగ్నిజెంట్, డేటా సెంటర్లకు ఇచ్చాం" అని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖలో సెప్టెంబరులో టీసీఎస్, అక్టోబరులో కాగ్నిజెంట్ కార్యకలాపాలు మొదలవుతాయని తెలిపారు.



పంకజ్ డబ్బులిస్తాడు.. ప్రభుత్వ పెద్దల మనుషులకు అందజేయ్

(మొదటి పేజీ తరువాయి)

దీనిలో కీలక పాత్రధారైన శ్రీకాంత్‌ను సిట్ అధికారులు గురువారం సుదీర్ఘంగా విచారించారు.

'పంకజ్ ఎవరు? అతనికి ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చేది' అనే అంశాలపై శ్రీకాంత్‌ను ప్రశ్నించి సిట్ అధికారులు వివరాలు రాబట్టారు. అదాన్, లీలా డిస్టిలరీస్‌ల ముసుగులో జరిగిన అక్రమ ఆర్థిక లావాదేవీలపైనా ఆరా తీశారు. ప్రధానంగా ఆ కంపెనీల ముసుగులో సాగిన నిధులు రూటింగ్‌పై ప్రశ్నించారు. అదాన్, లీలా డిస్టిలరీస్ రెండూ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి గుప్పిట్లోనే నడిచాయి. మద్యం సరఫరా ఆర్డర్ల కోసం మిగతా కంపెనీల మాదిరిగానే ఈ రెండు డిస్టిలరీలూ ముడుపులు చెల్లించాయి. పురుషోత్తం వరుణ్‌కుమార్ తొలుత అదాన్‌లో ఆపరేషన్స్ మేనేజర్‌గా, ఆ తర్వాత లీలా డిస్టిలరీస్‌కు ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన నేపథ్యంలో అతనితోనే ఈ ముడుపుల సొమ్ము ఇప్పించినట్లు సిట్ గుర్తించింది. దీనిపై మరింత లోతుగా వివరాలు సేకరిస్తోంది.



పని మొదలుపెడితేనే వాటితో ఉపయోగం

మీరు మెరుగైన భవిష్యత్తు గురించి రోజంతా ఆలోచిస్తూ ఉండొచ్చు. ఓ విషయంపై లోతుగా అధ్యయనం చేస్తుండొచ్చు. ఎన్నో నైపుణ్యాలు నేర్చుకోవచ్చు. వంద రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు. కానీ మీరు పని మొదలు పెట్టనంతవరకూ అవన్నీ నిష్ఫలమే అని తెలుసుకోండి. లక్ష్యం దిశగా అడుగు ముందుకు వేసిన క్షణం నుంచే అవి మీకు అస్త్రశస్త్రాలుగా ఉపయోగపడతాయి.

– మార్క్ మాన్సన్, రచయిత

మంత్రుల ఇళ్లపైకి మా వాళ్లను పంపి హత్యలు మొదలెడితే..

(మొదటి పేజీ తరువాయి)

మిథున్‌రెడ్డిని ఎలాగోలా జైల్లో పెట్టాలని చంద్రబాబు పైశాచికంగావ్యవహరిస్తున్నారు' అని విమర్శించారు. గురువారం నెల్లూరు పర్యటనలో భాగంగా ఆయన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటివద్ద విలేకర్లతో మాట్లాడారు.

మేమూ హత్యలకు శ్రీకారం చుడితే..

'రాజకీయాల్లో ప్రత్యర్థులు ఒకరిపై మరొకరు మీడియా ప్రకటనలు చేసుకోవడం సహజం. ఇటువైపు వాళ్లు అభ్యంతరకర భాషను వాడితే అవతలివాళ్లూ అదే భాషలోనే సమాధానం చెప్పడం రోజూ చూస్తుంటాం. ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన ప్రకటన నచ్చలేదని ఆయన ఇంటిపైకి మనుషులను మారణాయుధాలతో పంపుతారా? వాళ్లు ఇల్లు ధ్వంసం చేశారు, ఆ సమయంలో ప్రసన్న అక్కడ ఉంటే చంపేసేవారు కదా! చంద్రబాబును అడుగుతున్నా, రోజాపై మీ పార్టీ నగరి ఎమ్మెల్యే ఎంత హేయంగా మాట్లాడారు? విడదల రజినిని తెదేపా నాయకులు దారుణమైన భాషలో మాట్లాడలేదా? కృష్ణా జడ్పీ ఛైర్మన్ హారిక కారుపై దాడి చేసి, ఆమెను దుర్భాషలాడలేదా? ఇవన్నీ చేస్తున్నారని మేమూ మా వాళ్లను మంత్రులు, మీ ఎమ్మెల్యేల ఇళ్లపైకి పంపి హత్య చేయించే కార్యక్రమం మొదలుపెడితే.. రాజ్యాంగం అనేది బతుకుతుందా? రాష్ట్రంలో


నెల్లూరు జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించి వస్తున్న మాజీ సీఎం జగన్

శాంతిభద్రతలు ఉంటాయా?' అంటూ.. చేసిన పనులకు సిగ్గుతో తలదించుకోవాలని చంద్రబాబును గట్టిగా మందలిస్తున్నానని వ్యాఖ్యానించారు.

మాజీమంత్రిని జైల్లో పెట్టారు

'ఏం తప్పు చేశాడని కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైల్లో పెట్టారు? ఒకటి తర్వాత ఒకటి బయటకు తెచ్చి 14 కేసులు పెట్టి మాజీమంత్రిని 64 రోజుల నుంచి జైల్లోనే పెట్టారు. ఆయనపై పెట్టిన కేసుల్లో పసలేదు. మంత్రిగా ఉన్న వ్యక్తి క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ చేశారని కేసు పెట్టారు. ఆ కేసులో పేర్కొన్న తాటిపర్తిలో నాలుగేళ్ల నుంచి ఎలాంటి మైనింగ్ జరగలేదని ఆ గ్రామ వీఏఓనే చంద్రబాబు ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ విచారణలో స్పష్టంగా చెప్పారు. ఎప్పుడో అయిపోయిన మద్యం పంపిణీ కేసులోకి ఇప్పుడు గోవర్ధన్‌ను ఇరికించారు. ఇదే నెల్లూరు జిల్లాలో సిలికా, క్వార్ట్జ్ మైన్లు ఎవరికి ఉన్నా.. ఇక్కడ స్థానికంగా ఉన్న పెద్దమనిషి తెదేపా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి.. అదీ ఆయన నిర్ణయించిన ధరకే అమ్మాలి. అందులో కొంత వేమిరెడ్డి తీసుకుని, మిగిలింది లోకేశ్‌కు పంపుతున్నారు. ఈ మాఫియాపై మైన్స్ యజమానులు కోర్టుకు వెళ్లారు' అని పేర్కొన్నారు.

అధికారుల జమా లెక్కలు తేలుస్తా

'చంద్రబాబు అడుగులకు మడుగులొత్తుతున్న అధికారులందరి జమా లెక్కలను మా ప్రభుత్వం వచ్చాక తీస్తాం. ఈ రోజు చంద్రబాబు విత్తిన విత్తే రేపు రెండింతలైతే ఎలా ఉంటుంది? ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని తన నైజాన్ని మార్చుకోవాలి. లేకపోతే రేపు జరగబోయే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు.

నేనంటే ఎందుకంత భయపడుతున్నారు?

'ఒక రాజకీయ పార్టీ నాయకుడిగా నేను మా పార్టీకి చెందినవారిని కలవడానికి వస్తే నేరమా? నేను వచ్చినపుడు నన్ను అభిమానించేవాళ్లు నన్ను చూసేందుకు వస్తే తప్పా? ప్రతిపక్ష నాయకుడిని చూసి ఇంత భయపడుతున్నారంటే చంద్రబాబు బావి చూసుకుని దూకాలి' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

జగన్‌వి పచ్చి అబద్ధాలు: ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఈనాడు, నెల్లూరు: 'కాకాణిని, ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించడానికి వచ్చిన జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు' అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులో గురువారం మాట్లాడారు. 'వైకాపా నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నట్లు మాట్లాడుతున్న జగన్.. ముందు తప్పుడు కేసులంటే ఏమిటో తెలుసుకోవాలి' అని సోమిరెడ్డి దుయ్యబట్టారు.

ఏం సందేశమిస్తున్నారు?: ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ప్రసన్నను పరామర్శించి సమాజానికి ఏం సందేశమిస్తున్నారు జగన్?' అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశ్నించారు. జగన్ తీరును చూస్తుంటే మరో 30 ఏళ్లు అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి విమర్శిస్తారా అని ప్రశ్నించారు.

జగన్‌వి అనవసర మాటలు: ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(గ్రామీణం): ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిన జగన్.. అసహనం ఎక్కువై అనవసర మాటలు మాట్లాడుతున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరు రూరల్ బుజబుజనెల్లూరులో గురువారం ఆయన మాట్లాడారు. జగన్ ఒక్క మంచి పనినీ చేయలేదని, బూతులు మాట్లాడే వారినే తన పక్కన పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు.

ఎన్డీయే నుంచి వైదొలగిన పన్నీర్‌సెల్వం

చెన్నై (సైదాపేట), న్యూస్‌టుడే: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం(ఓపీఎస్) ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు ముఖ్య అనుచరుడైన రామచంద్రన్ గురువారం ప్రకటించారు. ఆ సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. చెన్నైలో గురువారం ఉదయం నడక సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్‌సెల్వం కలిశారు. ఆ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తదనంతరం ఎన్డీయే నుంచి పన్నీర్‌సెల్వం వైదొలగుతున్నట్లు ప్రకటన వచ్చింది. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు ఓపీఎస్ విలేకర్లకు తెలిపారు. పొత్తుల గురించి ఎన్నికల ముంగిట మాట్లాడుతానని చెప్పారు. ఆ తర్వాత గురువారం సాయంత్రం స్టాలిన్‌ను మరోసారి ఆయన కలిశారు. పన్నీర్‌సెల్వం ఒకప్పుడు అన్నాడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు.

ఈ 2 నెలల్లో వర్షాలు ఆశాజనకం

దిల్లీ, ఈనాడు-విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల సీజన్ రెండోభాగం (ఆగస్టు-సెప్టెంబరు)లో ఈశాన్య, తూర్పు భారతంలో కొన్ని చోట్ల మినహా దేశవ్యాప్తంగా అధిక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేస్తోంది. ప్రస్తుతం పసిఫిక్ సముద్రంలో ఎల్‌నినో తటస్థ పరిస్థితులు నెలకొంటున్నాయి. రుతుపవనాల కాలం ముగిసేవరకు ఈ పరిస్థితులు కొనసాగుతాయని మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టం, ఇతర వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. జూన్ 1 నుంచి జులై 31 వరకు దేశంలో 474.3 మి.మీ.ల వర్షం కురిసిందని, ఇది సాధారణ వర్షపాతం (445.8 మి.మీ) కంటే ఆరు శాతం అధికమని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర గురువారం చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు వచ్చాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో వరుసగా ఐదో ఏడాది తక్కువ వర్షం కురిసిందని, గత 30 ఏళ్ల వివరాలు పరిశీలిస్తే ఆ ప్రాంతాల్లో వర్షపాతం క్రమంగా తగ్గిపోతున్న సరళి కనిపిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో 25.3 శాతం లోటు..

నైరుతి రుతుపవనాల సీజన్ సగం ముగిసినా.. రాష్ట్రంలో వర్షాలు ఆశాజనకంగా లేవు. రాష్ట్ర వ్యాప్తంగా సగటున 25.3 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా మినహా మిగిలిన జిల్లాల్లో ఆగస్టు-సెప్టెంబరు మధ్యలో వర్షాలు సాధారణం కంటే ఎక్కువ కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

■ కొద్దిరోజులుగా రుతుపవన విరామం (బ్రేక్ మాన్‌సూన్) పరిస్థితులు నెలకొనడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవి తరహాలో వేడి, ఉక్కపోత ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టులో ఉత్తర కోస్తా, రాయలసీమలోని అధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. రాబోయే 5 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఆగస్టు రెండో వారంలో వర్షాలు జోరందుకోవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పాఠశాల దూరంగా ఉంటే రవాణా భత్యం

• మార్గదర్శకాలు విడుదల చేసిన సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించేందుకు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 79,860 మంది విద్యార్థులకు రూ.47.91 కోట్లు రవాణా భత్యం కింద చెల్లించనున్నారు. ఆవాసం నుంచి ప్రాథమిక పాఠశాల కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్నా.. ప్రాథమికోన్నత బడులు మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉంటే ఈ రవాణా భత్యం చెల్లిస్తారు. సెకండరీ పాఠశాలలు ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్నా భత్యం ఇస్తారు. నెలకు రూ.600 చొప్పున ఏడాదికి రూ.6 వేలు చెల్లిస్తారు. పాఠశాలకు వెళ్లేందుకు ప్రజా రవాణాను వినియోగిస్తూ ఉండాలనే నిబంధన పెట్టారు. రవాణా భత్యాన్ని నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు.

ఛాంపియన్




మాంచెస్టర్‌లో అసాధారణ పోరాటపటిమతో డ్రా చేసుకుని, సిరీస్‌ను సమం చేయడంపై ఆశలు రేపిన గిల్ బృందం.. ఓవల్‌లో తడబడింది. పచ్చిక పిచ్‌పై ఇంగ్లాండ్ పేసర్లను ఆడేందుకు చాలా కష్టపడింది. వర్షం అంతరాయం కలిగించిన తొలి రోజు.. ఆట చివరికి 204/6తో నిలిచింది. కరుణ్ నాయర్ పోరాడుతున్నాడు. సుందర్ సహకారంతో అతడు జట్టు కుప్పకూలకుండా అడ్డుకున్నాడు. గిల్ వరుసగా అయిదో టెస్టులోనూ టాస్ ఓడిపోయాడు.

తడబడి.. నిలబడి...

- ఆదుకున్న కరుణ్
- ఇంగ్లాండ్‌తో ఆఖరి టెస్టు

ఓవల్‌లో భారత్ 204/6



లండన్

సిరీస్‌లో చివరిదైన అయిదో టెస్టులో టీమ్‌ఇండియా గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. వర్ష ప్రభావిత తొలి రోజు చాలా ఇబ్బందిపడింది. గురువారం ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్; 98 బంతుల్లో 7×4) విలువైన అర్ధశతకంతో జట్టును ఆదుకున్నాడు. అతడికి తోడుగా వాషింగ్టన్ సుందర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కరుణ్, సుందర్ జంట అభేద్యమైన ఏడో వికెట్‌కు 51 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. సాయి సుదర్శన్ (38; 108 బంతుల్లో 6×4) బాగానే ఆరంభించినా.. పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. అట్కిన్సన్, టంగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

టాప్‌ఆర్డర్ విఫలం: ఓవల్‌లో గురువారం భారత బ్యాటర్లను ఇంగ్లాండ్ పేసర్లు పరీక్షించారు. కరుణ్ నాయర్ నిలవకపోతే తొలి రోజు టీమ్‌ఇండియా పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉండేదే. సిరీస్‌లోనే అత్యంత పచ్చిక పిచ్‌పై టాస్ గెలిచి ఇంగ్లాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. టీమ్‌ఇండియా పేలవంగా ఆరంభించింది. 38 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. పిచ్ సీమ్‌కు అనుకూలించింది. నాలుగో ఓవర్లోనే భారత్‌కు షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండు పరుగులకే వెనుదిరిగాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న అట్కిన్సన్.. తన రెండో ఓవర్లోనే భారత్‌ను దెబ్బతీశాడు. జైస్వాల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. మైదానం అంపైర్ ఔట్ ఇవ్వకపోయినా.. ఇంగ్లాండ్ సమీక్షలో సాధించుకుంది. అయితే జోష్ టంగ్, ఓవర్టన్ ఆరంభంలో నియంత్రణతో బౌలింగ్ చేయలేకపోయారు. టంగ్ తన తొలి ఓవర్లో రెండు వైడ్ల ద్వారా పది పరుగులు సహా మొత్తం 12 పరుగులిచ్చాడు. భారత్ 38/1తో కాస్త కుదురుకుంటున్నట్లే కనిపించింది. కానీ అంతలోనే రాహుల్ (40 బంతుల్లో 14) ఔటయ్యాడు. ఈ సిరీస్ ఆరంభం నుంచి నిలకడగా రాణిస్తోన్న అతడు.. రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. క్రిస్ వోక్స్ షార్ట్ బాల్‌ను కట్ చేయబోయిన రాహుల్.. స్టంప్స్ మీదికి ఆడుకున్నాడు. మరోవైపు పట్టుదలగా ఆడుతున్న సాయి సుదర్శన్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (21; 35 బంతుల్లో 4×4) తోడయ్యాడు. వీళ్లిద్దరూ చక్కగా బ్యాటింగ్ చేశారు. లంచ్ వరకు మరో వికెట్ పడనివ్వలేదు. టంగ్, వోక్స్ బౌలింగ్‌లో సాయి బౌండరీలు బాదాడు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన గిల్.. ఓవర్టన్ బౌలింగ్‌లో కవర్స్ మీదుగా బంతిని బౌండరీ దాటించాడు. అతడి తర్వాతి ఓవర్లోనూ కవర్స్‌లో అలవోకగా మరో బౌండరీ కొట్టాడు. ఈ బ్యాటర్లు నిలదొక్కుకోవడంతో 72/2తో టీమ్‌ఇండియా లంచ్‌కు కాస్త సంతృప్తిగానే వెళ్లింది. కానీ ఆ సంతృప్తి ఎంతో సేపు నిలవలేదు. లంచ్ తర్వాత ఇన్నింగ్స్ సాఫీగా సాగుతుండగా గిల్ అనవసరంగా, లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌటై జట్టును ఇబ్బందుల్లోకి నెట్టాడు. అట్కిన్సన్ బంతిని ఆఫ్‌సైడ్ నెట్టిన గిల్ పరుగందుకున్నాడు. కానీ బంతి బౌలర్‌కు దగ్గరగానే వెళ్లింది. పిచ్ మధ్య వరకు వెళ్లాక అది గుర్తించిన గిల్ వెనుదిరిగాడు. కానీ అప్పటికే ఆలస్యమైంది. ఫాలోత్రూలో బంతిని అందుకున్న అట్కిన్సన్.. స్టంప్స్‌ను కొట్టాడు. దీంతో 45 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇన్నింగ్స్‌లో ఇదే మలుపు అనుకోవచ్చు. కరుణ్ నాయర్‌తో కలిసి సుదర్శన్ జట్టు స్కోరును వంద దాటించాడు. కానీ పెద్ద ఇన్నింగ్స్ ఆడేలా కనిపించిన అతడు.. కీలక సమయంలో టంగ్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు. ఆడడానికి చాలా కష్టమైన ఔట్ స్వింగర్‌కు అతడు ఔట్ సైడ్ ఎడ్జ్‌తో వికెట్ కీపర్ స్మిత్‌కు చిక్కాడు. గత మ్యాచ్ హీరో జడేజా (9) ఎక్కువసేపు నిలవలేదు. టంగ్ బౌలింగ్‌లోనే అతడు కూడా వెనుదిరగడంతో 123/5తో భారత్ కష్టాల్లో పడింది. కానీ కరుణ్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. చక్కగా బ్యాటింగ్ చేసిన అతడు.. ముందు జురెల్ (19), తర్వాత సుందర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఆత్మవిశ్వాసంతో ఆడిన కరుణ్.. చక్కని బౌండరీలతో అలరించాడు. ఇంగ్లాండ్ బౌలర్ వోక్స్ తొలి ఆఖర్లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. ఎడమ భుజానికి దెబ్బ తగలడంతో అతడు నొప్పితో మైదానాన్ని వీడాడు.


అట్కిన్సన్

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ ఎల్బీ (బి) అట్కిన్సన్ 2; రాహుల్ (బి) వోక్స్ 14; సాయి సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38; శుభ్‌మన్ గిల్ రనౌట్ 21; కరుణ్ నాయర్ బ్యాటింగ్ 52; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9; ధ్రువ్ జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19; సుందర్ బ్యాటింగ్ 19; ఎక్స్‌ట్రాలు 30 **మొత్తం:** (64 ఓవర్లలో 6 వికెట్లకు) **204; వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153; **బౌలింగ్:** వోక్స్ 14-1-46-1; అట్కిన్సన్ 19-7-31-2; టంగ్ 13-3-47-2; ఓవర్టన్ 16-0-66-0; బెతెల్ 2-1-4-0

ఆటకు వర్షం దెబ్బ

తొలి రోజు ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. గురువారం 64 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఉదయం ఆట ఆలస్యంగా ఆరంభమైంది. వాన కారణంగా త్వరగా జట్లు త్వరగా లంచ్‌కు వెళ్లాయి. తొలి సెషన్లో 23 ఓవర్ల ఆట జరిగింది. లంచ్ తర్వాత ఆట తిరిగి మొదలయ్యాక ఆరు ఓవర్లు పడ్డాయో లేదో మళ్లీ వర్షం వచ్చింది. గంటకు పైగా ఆట నిలిచిపోయాక ఆట తిరిగి మొదలైంది. ఈ లోపు టీ విరామం తీసుకున్నారు.



పలు మార్పులతో..

ఈ మ్యాచ్‌కు భారత్ తుది జట్టులో నాలుగు మార్పులు చేసింది. తిరిగి ఫిట్‌నెస్ సాధించిన పేసర్ ఆకాశ్‌దీప్.. బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చాడు. అన్షుల్ కాంబోజ్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణకు, గాయపడ్డ వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌కు చోటు లభించింది. తొలి మూడు టెస్టుల్లో ఆడినా, రాణించలేకపోవడంతో నాలుగో టెస్టుకు దూరమైన కరుణ్ నాయర్‌కు మరో అవకాశం దక్కింది. శార్దూల్ ఠాకూర్‌ను తప్పించి అతణ్ని తీసుకున్నారు. పనిభార నిర్వహణలో భాగంగా బుమ్రాకు విశ్రాంతినిచ్చారు. మరోవైపు ఇంగ్లాండ్ కూడా నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. గాయం కారణంగా ఆ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో ఓలీ పోప్ ఇంగ్లాండ్‌కు నాయకత్వం వహిస్తున్నాడు.

విశాఖలో తొలి కూత

- 29న ప్రొ కబడ్డీ లీగ్ ప్రారంభం
- వేదికలుగా వైజాగ్, జైపుర్, చెన్నై, దిల్లీ

ముంబయి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) నగారా మోగింది. పీకేఎల్ 12వ సీజన్‌కు విశాఖపట్నంలో తెరలేవనుంది. ఈనెల 29న వైజాగ్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో తమిళ తలైవాస్ తలపడనుంది. అదే రోజు బెంగళూరు బుల్స్‌ను పుణెరి పల్టాన్ ఢీకొట్టనుంది. విశాఖతో పాటు జైపుర్, చెన్నై, దిల్లీ వేదికలు పీకేఎల్-12కు ఆతిథ్యమివ్వనున్నాయి. సెప్టెంబరు 12న రెండో అంచె పోటీలు జైపుర్‌లో ప్రారంభమవుతాయి. సెప్టెంబరు 29న చెన్నైలో మూడో అంచె.. అక్టోబరు 13న దిల్లీలో చివరి దశ మ్యాచ్‌లు మొదలవుతాయి. ప్లేఆఫ్స్‌కు ముందు అభిమానులకు మరింత వినోదాన్ని అందించేందుకు చివరి దశలో ట్రిపుల్ హెడర్ (రోజుకు మూడు మ్యాచ్‌లు) నిర్వహించనున్నట్లు గురువారం పీకేఎల్ ప్రకటించింది. "ఏడేళ్ల తర్వాత వైజాగ్‌కు పీకేఎల్ తిరిగి రావడం ఆనందంగా ఉంది. 2018లో ఆంధ్రప్రదేశ్ చివరి సారిగా ఆరో సీజన్ మ్యాచ్‌ల అనుభూతి పొందింది. అంతకుముందు 1, 3వ సీజన్‌లకు విశాఖ ఆతిథ్యమిచ్చింది. ప్రొ కబడ్డీ ఎదుగుదలలో 12వ సీజన్ కొత్త అధ్యాయంగా నిలుస్తుంది" అని పీకేఎల్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపాడు.

రచన, అశ్వినిలకు స్వర్ణాలు

అండర్-17 ప్రపంచ రెజ్లింగ్


అశ్విని


కాజల్


రచన


మోని

ఏథెన్స్: అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణులు అదరగొట్టారు. మహిళల 43 కేజీల విభాగంలో రచన, 65 కేజీల్లో అశ్విని విష్ణోయ్ స్వర్ణాలు సాధించగా.. మోని (57 కేజీలు), కాజల్ (74 కేజీలు) రజతాలు గెలిచారు. కోమల్ వర్మ 49 కేజీల విభాగంలో కాంస్యం నెగ్గింది. ఫైనల్లో రచన 3-0తో హువాంగ్ (చైనా)ను చిత్తు చేయగా.. అశ్విని అంతే తేడాతో ముఖాయో (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. మోని తుది పోరులో 5-6తో మద్ధియా (కజకిస్థాన్) చేతిలో పోరాడి ఓడింది. మరో ఫైనల్లో కాజల్.. వెన్‌జిన్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

తరుణ్, లక్ష్యసేన్ ముందంజ



మకావు: భారత అగ్రశ్రేణి డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో సత్తాచాటుతున్నారు. పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ సాత్విక్- చిరాగ్ జోడీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ 10-21, 22-20, 21-16తో కకెరు కుమగయ్- హిరోకి నిషి (జపాన్) జంటను చిత్తుచేసింది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాళ్లు లక్ష్యసేన్, తరుణ్ మన్నెపల్లి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ లీ చుక్ (హాంకాంగ్)కు తరుణ్ షాకిచ్చాడు. గంటకు పైగా ఉత్కంఠభరితంగా సాగిన పోరులో తరుణ్ 19-21, 21-14, 22-20తో లీ చుక్‌పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ లక్ష్యసేన్ 21-14, 14-21, 21-17తో చికో వార్దోయో (ఇండోనేసియా)పై గెలుపొందాడు. క్వార్టర్స్‌లో చూంగ్ జియాన్- మహ్మద్ హైకాల్ (మలేసియా)తో సాత్విక్- చిరాగ్, హు ఆన్ (చైనా)తో తరుణ్, షువాన్ చెన్ (చైనా)తో లక్ష్యసేన్ తలపడతారు. మహిళల సింగిల్స్‌లో రక్షితశ్రీ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో రక్షిత 21-14, 10-21, 11-21తో రెండో సీడ్ బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ 21-19, 13-21, 18-21తో జిమ్మీ వాంగ్- పీ జింగ్ (మలేసియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రియ- శ్రుతి జోడీ 14-21, 12-21తో మెలీసా ట్రయాస్- రాచెల్ అలేస్యా (ఇండోనేసియా) జంట చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్- సాయి ప్రతీక్ జోడీ 18-21, 18-21తో జునైది ఆరిఫ్- రోయ్ కింగ్ యాప్ (మలేసియా) జంట చేతిలో పరాజయం పాలైంది.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌పై వేటు

కార్యదర్శి, కోశాధికారిపై కూడా ● ఎపెక్స్ కౌన్సిల్ నిర్ణయం


జగన్‌మోహన్‌రావు

ఈనాడు, హైదరాబాద్: అవినీతి, అక్రమాల ఆరోపణలపై జుడిషియల్ రిమాండులో ఉన్న హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుపై వేటు పడింది. జగన్‌మోహన్‌రావుతో పాటు కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సి.జె.శ్రీనివాస్‌లను హెచ్‌సీఏ ఎపెక్స్ కౌన్సిల్ సస్పెండ్ చేసింది. జులై 28న జరిగిన అత్యవసర సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో హెచ్‌సీఏ ఎపెక్స్ కౌన్సిల్ పేర్కొంది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపింది. మోసం, నిధుల అక్రమాలు, అధికారిక దుర్వినియోగం విషయాల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ముగ్గురిపై హెచ్‌సీఏ నియమావళి ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఎపెక్స్ కౌన్సిల్ వెల్లడించింది. ఈ ఆరోపణలపై సీఐడీ, ఈడీ వంటి సంస్థల దర్యాప్తు కొనసాగుతోందని.. హెచ్‌సీఏ విశ్వసనీయత, విశాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించింది.

ఆటపైనే దృష్టి పెట్టా



నాగ్‌పుర్: హంపితో మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్లో తాను ఎలాంటి ఒత్తిడికి గురికాలేదని దివ్య దేశ్‌ముఖ్ చెప్పింది. తాను కోల్పోయేదేమీ లేకపోవడమే అందుకు కారణమని తెలిపింది. "ఫైనల్ సందర్భంగా నాకెప్పుడూ ప్రమాదంలో ఉన్నట్లు అనిపించలేదు. హంపి చేసిన ఆఖరి తప్పిదం నాకు విజయాన్నిచ్చింది" అని దివ్య వ్యాఖ్యానించింది. ఫైనల్లో ఎప్పుడైనా ఒత్తిడికి గురయ్యారా అన్న ప్రశ్నకు ఆమె ఇలా స్పందించింది. 19 ఏళ్ల దివ్య ఫైనల్లో టైబ్రేక్‌లో హంపిపై గెలిచిన సంగతి తెలిసిందే. ఆమె బుధవారం బాటుమి (జార్జియా) నుంచి భారత్ చేరుకుంది. "ఫలితం నా చేతుల్లో లేదు కాబట్టి నా ఆటపైనే దృష్టిపెట్టడానికి ప్రయత్నించా. దేని గురించీ ఆలోచించలేదు" అని దివ్య చెప్పింది. "నా ఈ విజయం తర్వాత అమ్మాయిలు పెద్ద ఎత్తున చెస్‌లోకి వస్తారని ఆశిస్తున్నా. యువ తరానికి నా వద్ద ఎలాంటి సందేశం లేదు. తల్లిదండ్రులకు మాత్రం.. వైఫల్యాల్లో పిల్లలకు మనస్ఫూర్తిగా మద్దతివ్వమని చెబుతా. విజయాల్లో మద్దతు పెద్దగా అవసరం లేదు" అని ఆమె పేర్కొంది. తన విజయానికి తన తల్లిదండ్రులే కారణమని దివ్య తెలిపింది. తన తొలి కోచ్ రాహుల్ జోషి తాను గ్రాండ్‌మాస్టర్ కావాలని కోరుకున్నారని చెప్పింది. జోషి 40 ఏళ్ల వయసులో 2020లో మరణించారు.



తల్లిదండ్రులతో దివ్య

కష్టాల్లో జింబాబ్వే



బులవాయో: న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో జింబాబ్వే బ్యాటింగ్ కష్టాలు కొనసాగుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలిన ఆతిథ్య జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. రెండో రోజు ఆట చివరికి బెనెట్ (18), బెన్ కరన్ (11)ల వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసింది. వెల్ష్ (2), మసికెవా (0) క్రీజులో ఉన్నారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే జింబాబ్వే ఇంకా 127 పరుగులు చేయాలి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 92/0తో గురువారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన న్యూజిలాండ్.. 307 పరుగులకు ఆలౌటైంది. ముజరబాని (3/73), చివంగ (2/51) ఆ జట్టును దెబ్బ తీశారు. ఓపెనర్ కాన్వే (88), మిడిలార్డర్ బ్యాటర్ డరిల్ మిచెల్ (80) కీలక ఇన్నింగ్స్ ఆడారు. యంగ్ 41, నికోల్స్ 34 పరుగులు చేశారు. కివీస్‌కు 158 పరుగుల ఆధిక్యం దక్కింది.

అక్కడ కుల్‌దీప్‌ను ఆడించాల్సింది


గంగూలీ

కోల్‌కతా: ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు (లార్డ్స్), నాలుగు (మాంచెస్టర్) టెస్టుల్లో ఎడమచేతి వాటం మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించాల్సిందని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. ఆఖరి రెండ్రోజుల ఆటలో నాణ్యమైన స్పిన్నర్ ఉంటే ఉపయోగపడేవాడని గంగూలీ అన్నాడు. "మాంచెస్టర్‌లో కుల్‌దీప్ ఆడితే బాగుండేది. లార్డ్స్‌తో పాటు బర్మింగ్‌హామ్ (రెండో టెస్టు)లో కూడిన అతను ఆడాల్సింది. నాణ్యమైన స్పిన్ లేకుండా టెస్టు మ్యాచ్‌లో నాలుగు, అయిదు రోజుల ఆటలో జట్టును ఆలౌట్ చేయడం కష్టమవుతుంది. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ పరిస్థితి చూశాం. కఠినమైన, కాస్త బంతి తిరిగే పిచ్‌పై భారత బ్యాటర్లు బ్యాటింగ్ కొనసాగించారు. నాణ్యమైన స్పిన్నర్ లేకపోవడంతో ఇంగ్లాండ్ 20 వికెట్లు పడగొట్టలేకపోయింది. గిల్ అత్యుత్తమంగా ఆడుతున్నాడు. బాధ్యత అప్పగిస్తే ఫలితాలు అందిస్తారనడానికి గిల్ నిదర్శనం. ఈ సిరీస్‌లో గిల్ గొప్పగా బ్యాటింగ్ చేశాడు. భారత జట్టులో ఎంతోమంది నాణ్యమైన ఆటగాళ్లు ఉండటం చూస్తుంటే నాకెంతో గర్వంగా ఉంది" అని గంగూలీ పేర్కొన్నాడు.

ఆస్ట్రేలియా పర్యటనకు కెప్టెన్‌గా ఆయుష్


ఆయుష్ మాత్రే

ముంబయి: ఆస్ట్రేలియాలో పర్యటించే భారత అండర్-19 జట్టుకు ఆయుష్ మాత్రే సారథ్యం వహించనున్నాడు. సెప్టెంబరు 21న ప్రారంభమయ్యే పర్యటన కోసం 17 మందితో కూడిన జట్టును శుక్రవారం సెలెక్టర్లు ప్రకటించారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో అదరగొట్టిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు కల్పించారు. ఈ పర్యటనలో భారత అండర్-19 జట్టు 3 వన్డే మ్యాచ్‌లు ఆడుతుంది. 2 నాలుగు రోజుల మ్యాచ్‌ల్లో బరిలో దిగుతుంది. సెప్టెంబరు 21, 24, 26 తేదీల్లో బ్రిస్బేన్‌లోని ఇయాన్ హీలీ ఓవల్ మైదానంలో వన్డేలు జరుగుతాయి. సెప్టెంబరు 30న ఇయాన్ హీలీ ఓవల్‌లో మొదటి, అక్టోబరు 7న క్వీన్స్‌ల్యాండ్‌లోని మెకేలో రెండో నాలుగు రోజుల మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

భారత అండర్-19 జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్‌వంశ్ సింగ్ (వికెట్ కీపర్), ఆర్.ఎస్.అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, నమన్ పుష్పక్, హెనిల్ పటేల్, డి.దీపేశ్, కిషన్ కుమార్, అన్మోల్‌జీత్ సింగ్, ఖిలన్ పటేల్, ఉద్ధవ్ మోహన్, అమన్ చౌహాన్, **స్టాండ్ బైస్:** యుధజిత్ గుహ, లక్ష్మణ్, బి.కె.కిషోర్, అలంకృత్ రాపోలు, అర్నవ్ బగ్గా

ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజ్ ఖరారు

దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజ్ జాబితాను ఖరారు చేసినట్లు ఎన్నికల సంఘం (ఈసీ) గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి.. ఈసీ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో అది కొనుగోలుకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. గత నెల 21న ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఉప రాష్ట్రపతి స్థానం ఖాళీ అయిన సంగతి తెలిసిందే. రాజ్యసభకు ఎన్నికైన, నామినేటైన సభ్యులతోపాటు లోక్‌సభకు ఎన్నికైన ఎంపీలతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. లోక్‌సభలో మొత్తం సీట్ల సంఖ్య 543 కాగా, ఒక సీటు ఖాళీగా ఉంది. రాజ్యసభలో 245 స్థానాలకుగాను ఐదు ఖాళీలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఉభయ సభల్లోని మొత్తం సభ్యుల సంఖ్య 782గా ఉంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గెలవాలంటే 392 మంది ఎంపీల మద్దతు అవసరం. అధికార ఎన్డీయే కూటమి బలం రెండు సభల్లో కలిపి 422గా ఉంది.

నౌకాదళం చేతికి ‘హిమగిరి’!



కోల్‌కతా: అధునాతన గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ యుద్ధ నౌక ‘హిమగిరి’ భారత నౌకాదళం చేతికి అందింది. కోల్‌కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ) సంస్థ దీన్ని రూపొందించింది. ప్రాజెక్ట్-17ఏ కింద ఈ సంస్థ నిర్మించే మూడు యుద్ధ నౌకల్లో ఇది మొదటిది. వీటి విలువ రూ.21,833.36 కోట్లు. హిమగిరి యుద్ధనౌక పొడవు 149 మీటర్లు కాగా బరువు 6,670 టన్నులు. ఇందులో బ్రహ్మోస్, బరాక్-8 క్షిపణులు ఉంటాయి. ఈ యుద్ధనౌక.. నింగి, సముద్రతలంలోని లక్ష్యాలను ఛేదించగలదు. సాగరగర్భంలోని జలాంతర్గాములను వేటాడగలదు. హిమగిరి రాకతో భారత నౌకాదళ దాడి సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఆత్మహత్యల నివారణకు ఐఐటీ ఖరగ్‌పుర్‌లో చిన్న ఫ్యాన్లు!



ఇంటర్నెట్ డెస్క్: విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో పశ్చిమబెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పుర్ వార్తల్లో నిలుస్తోంది. “అసలు ఐఐటీ ఖరగ్‌పుర్‌లో ఏం జరుగుతోంది? ఎందువల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు” అని సుప్రీంకోర్టు సైతం ఇటీవల ప్రశ్నించింది. క్యాంపస్‌లో ఈ విషాదాలను నివారించేందుకు ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకున్న విద్యాసంస్థ.. తాజాగా హాస్టల్ గదుల్లో పెద్ద సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో చిన్న పాటి ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. “చిన్న ఫ్యాన్ల ఏర్పాటు మానసిక సమస్యలకు పరిష్కారం కానప్పటికీ, ఆవేశంలో తీసుకునే తీవ్ర నిర్ణయాల కట్టడికి దోహదపడుతుందని భావిస్తున్నాం. ఐఐటీ ఖరగ్‌పుర్‌లో దాదాపు 16 వేలమంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి 21 హాస్టళ్లలోని ఫ్యాన్లను దశలవారీగా మార్చాలని భావిస్తున్నాం” అని విద్యాసంస్థ డైరెక్టర్ సుమన్ చక్రవర్తి ఓ వార్తాసంస్థకు తెలిపారు.

రైలు మార్గాల నిర్మాణానికి రూ.11వేల కోట్లు

దిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన గురువారం దిల్లీలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలో రైల్వే నెట్‌వర్క్ పరిధిని పెంచే చర్యల్లో భాగంగా ఆరు రాష్ట్రాల పరిధిలోకి వచ్చే 13 జిల్లాల్లో 574 కి.మీ.పొడవైన రైలు మార్గాలను నిర్మించనున్నారు. దీనికి గాను రూ.11,169 కోట్లు ఖర్చయ్యే నాలుగు ప్రాజెక్టులకు పీఎం-గతి శక్తి జాతీయ బృహత్ ప్రణాళిక కింద సీసీఈఏ ఆమోదం తెలిపింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాకులకు సమాంతరంగా కొన్ని చోట్ల మూడో మార్గాన్ని, మరికొన్ని చోట్ల నాలుగో మార్గాన్ని కొత్తగా నిర్మిస్తారు. ■ జాతీయ సహకారాభివృద్ధి సంస్థకు రూ.2 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని అందించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ■ దేశంలో ఆహార శుద్ధి రంగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన (పీఎంకేఎస్‌వై) పథకానికి మరో రూ.1,920 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ■ ఆహార పదార్థాల నిల్వ సాంకేతికతలను వినియోగిస్తున్న 50 పారిశ్రామిక యూనిట్లు, ఆహార నాణ్యతను పరీక్షించే 100 ప్రయోగశాలల కోసం అదనపు నిధులను వినియోగిస్తారు.



మీ లక్ష్యాలు మిమ్మల్ని భయపెట్టాలి

శ్రమించడం ఇష్టం లేక
సులువుగా అనిపించే లక్ష్యాలను
ఎంపిక చేసుకుంటే,
మీ భవిష్యత్తు కష్టంగా మారుతుంది.
అలా కాకుండా కష్టంగా అనిపించే
వాటిని ఎంపిక చేసుకుంటే,
భవిష్యత్తులో సుఖపడతారు. అందుకే
అందుకోగలనో లేదో అని మీరు
భయపడేలా ఉండే లక్ష్యాలపైనే
దృష్టిసారించండి.

– జెర్రీ గ్రెగొరెక్, పాజిటివిటీ కోచ్

దేశ ప్రయోజనాలను కాపాడతాం

- ట్రంప్ సుంకాలపై పార్లమెంటులో కేంద్ర మంత్రి గోయల్ ప్రకటన



దిల్లీ: అమెరికా సుంకాల నేపథ్యంలో మన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని, భారత్ ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. ఈ అంశంపై గురువారం పార్లమెంటు ఉభయ సభల్లో ఆయన వివరణ ఇచ్చారు. ‘దేశ ప్రయోజనాలు, చిన్న పరిశ్రమలు, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. ట్రంప్ సుంకాల ప్రకటనపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. గత 11 సంవత్సరాలుగా మన ఎగుమతులు పెరిగాయి. బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర దేశాలతో భారత్ పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది’ అని గోయల్ వెల్లడించారు. తాము ఇతర దేశాలతో ఇలాంటి వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ‘భారత్-అమెరికా పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. అక్టోబరు- నవంబరు నాటికి ఒప్పందం మొదటి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం’ అని గోయల్ తెలిపారు.

ట్రంప్ నిజం మాట్లాడినందుకు సంతోషిస్తున్నా: రాహుల్



దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందని ట్రంప్ నిజం మాట్లాడారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందన్న విషయం ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తప్ప ప్రతి ఒక్కరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ట్రంప్ నిజం మాట్లాడినందుకు సంతోషిస్తున్నానని పార్లమెంటు ఆవరణలో మీడియాతో ఆయన వ్యాఖ్యానించారు. ‘విదేశీ వ్యవహారాల మంత్రి మన విదేశీ విధానం అద్భుతంగా ఉందని ప్రసంగాలు ఇస్తున్నారు. కానీ ఒకపక్క భారత్‌తో స్నేహాన్ని అమెరికా దుర్వినియోగం చేస్తోంది. మరోపక్క చైనా వెంటాడుతోంది. వారికి (భాజపా సర్కారుకు) దేశాన్ని ఎలా నడపాలో తెలియదు. వారు దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు’ అని కేంద్రంపై రాహుల్ ధ్వజమెత్తారు.

వ్యర్థాల బెడదకు ఐఐటీ మద్రాసు పరిష్కారం

జ్ఞాన నేత్రం

దిల్లీ: పంట వ్యర్థాలు తగులబెట్టడం వల్ల దిల్లీని పొగ మేఘాలు చుట్టుముట్టి పౌరులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి పరిష్కారాన్ని ఐఐటీ-మద్రాసు పరిశోధకులు కనుగొన్నారు. సమాజానికీ, పర్యావరణానికీ ఇదెంతో మేలు చేస్తుందని పరిశోధక బృంద సారథి లక్ష్మీనాథ్ కుందనాటి వివరించారు. దేశంలో ఏటా 35 కోట్ల టన్నుల పంట వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోంది. పంట వ్యర్థాలతో పాటు చిత్తు కాగితాలపైన గానోడెర్మా ల్యూసిడియం, ప్లురోటస్ ఆస్ట్రియాటస్ అనే శిలీంధ్రాలను పెంచి జీవ మిశ్రమ పదార్థాలను తయారుచేయడంలో ఐఐటీ-మద్రాసు బృందం సఫలమైంది. ప్యాకేజింగ్ షీట్ల తయారీలో ప్లాస్టిక్కుకు ప్రత్యామ్నాయంగా ఇవి ఉపకరిస్తాయి. భారత్‌లో ఏటా 40 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతూ పర్యావరణానికి హానికరంగా తయారవుతున్నాయి. తాజా ఆవిష్కరణ అటు ప్లాస్టిక్, ఇటు పంట వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి తోడ్పడుతుంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నమాట.

ట్రంప్, మోదీ స్నేహం బెడిసికొట్టిందా?

- ఆ 3 కారణాల వల్లేనా..



ఈటీవీ భారత్: గత మూడు దశాబ్దాల్లో భారత్, అమెరికా బాగా దగ్గరయ్యాయి. ఇరు దేశాల మధ్య స్నేహ బంధం బలోపేతమైంది. పలు విషయాల్లో పరస్పరం సహకరించుకున్నాయి. అంతర్జాతీయ వేదికల్లో ఒకే వాణిని వినిపించాయి. అయితే ఈ సంబంధాలు ఇటీవల కాలంలో దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. గతంలో పలుమార్లు భారత ప్రధాని నరేంద్ర మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు ట్రంప్. మోదీని పొగడ్తలతో ముంచెత్తారు. అయితే ఇటీవల కాలంలో వారి స్నేహం మూడు కారణాలవల్ల బెడిసికొట్టినట్లు కనిపిస్తోంది.

1 అత్యధిక సుంకాలు, వాణిజ్య అడ్డంకులు..

భారత్, అమెరికా వాణిజ్య చర్చలపట్ల ట్రంప్ నిరాశకు గురైనట్లు కనిపిస్తోంది. వివాదాస్పద సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యంగా భారతదేశ వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తుల్లోకి అమెరికాకు ప్రవేశం కల్పించడానికి సంబంధించి సంధానకర్తలు అనేక రౌండ్ల చర్చలు జరిపారు. కానీ ఎటువంటి పురోగతి లేదు. ఈ క్రమంలో భారత దిగుమతులపై డొనాల్డ్ ట్రంప్ 25 శాతం అదనపు టారిఫ్ ప్రకటించారు. ఇతర వాణిజ్య ఒప్పందాల మాదిరిగానే జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు భారత ప్రభుత్వం తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఆగ్రహంతో భారత్‌పై టారిఫ్‌ల మోత మోగించినట్లు తెలుస్తోంది. భారత్ కఠినమైన ద్రవ్యేతర వాణిజ్య అడ్డంకులపైనా ట్రంప్ గత కొంత కాలంగా ఆగ్రహంగా ఉన్నారు.

2 రష్యాతో భారత్ సంబంధాలు

అమెరికా-భారత్‌ల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి మరొక కారణం భారత్-రష్యాల దీర్ఘకాల బంధం అని చెప్పొచ్చు. ఇదే విషయాన్ని భారత్‌పై సుంకాలు విధించిన సమయంలో ట్రంప్ చెప్పారు. ఒకవైపు ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం చేస్తుంటే.. భారత్, చైనాలు ఆ దేశానికి అతి పెద్ద ఇంధన కొనుగోలుదారులుగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. రష్యా నుంచి భారత్ చాలా వరకు సైనిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తోందని విమర్శించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్, రష్యా ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు 68.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత్ 35-40 శాతం ముడి చమురును రష్యా నుంచే దిగుమతి చేసుకుంటోంది.

3 బ్రిక్స్‌పై వ్యతిరేకత

రష్యానే కాదు.. బ్రిక్స్ కూటమి దేశాలనూ అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకమైనవిగా ట్రంప్ చూస్తారు. బ్రిక్స్ కూటమిని గతంలో అమెరికా వ్యతిరేకిగా ఆయన అభివర్ణించారు. డాలర్‌పై దాడి చేసేందుకు బ్రిక్స్ ఏర్పాటు చేశారని ఇటీవల ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి మోదీతో వ్యక్తిగత స్నేహం ఉందని, అయితే భారత్ ద్వంద్వ వైఖరిని సమర్థించబోమని స్పష్టం చేశారు.
■ గతేడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలవాలని భారతీయులు కోరుకున్నారు. కానీ ఆయన అధ్యక్షుడు అయినప్పటి నుంచి భారత్‌కు షాకుల మీద షాకులిస్తున్నారు. వీసాలు, సుంకాలు.. ఇలా ప్రతిసారీ భారత్‌కు ప్రతికూలంగానే మాట్లాడుతున్నారు. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ఇప్పటికే పదులసార్లు వ్యాఖ్యానించారు.

మాలేగావ్ పేలుళ్ల కేసులో ఆ ఏడుగురూ నిర్దోషులే



సమీర్ కులకర్ణి, మేజర్ రమేశ్ ఉపాధ్యాయ, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, ప్రజ్ఞాసింగ్, అజయ్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది

ముంబయి: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరికీ ఉపశమనం లభించింది. మాజీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞా సింగ్ సహా అభియోగాలు ఎదుర్కొన్న ఏడుగురినీ ముంబయిలోని ప్రత్యేక కోర్టు గురువారం నిర్దోషులుగా ప్రకటించింది. కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోపాలున్నాయని ప్రత్యేక న్యాయమూర్తి ఎ.కె.లహోటీ అభిప్రాయపడ్డారు. పేలుడుకు వినియోగించారని భావిస్తున్న ద్విచక్రవాహనం ప్రజ్ఞా సింగ్‌దేనన్న వాదనకు తగిన సాక్ష్యాలు లేవు. ఆ వాహనానికి అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకూ ఆధారాలు లేవు. మరో నిందితుడు లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ ఇంట్లో పేలుడు పదార్థాలు ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) నిరూపించలేకపోయింది. ఘటనా స్థలం నుంచి వేలిముద్రలు, డీఎన్ఏ నమూనాలను సేకరించలేదు. ఉగ్రవాదానికి మతం లేదు. ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో కోర్టు ఎవరినీ శిక్షించదు. అనుమానాలే తప్ప.. ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు’ అని కోర్టు తీర్పు వెల్లడించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) ఈ కేసుకు వర్తించదని న్యాయస్థానం స్పష్టం చేసింది. మాలేగావ్ పేలుళ్లలో మృతిచెందిన ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి. ఈ కేసులో తాజా తీర్పుతో భాజపా నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, విశ్రాంత మేజర్ రమేశ్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిర్దోషులుగా తేలారు.

భారత్‌పై ట్రంప్ సుంకాలు ఓ పాచిక: శశి థరూర్



దిల్లీ: భారత ఉత్పత్తులపై 25 శాతం సుంకంతోపాటు జరిమానాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన బేరసారాల కోసం వేసిన ఓ పాచికని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల ప్రతినిధుల మధ్య జరుగుతున్న చర్చల్లో భారత్ తలొగ్గనవసరం లేదని, మనకు అనుకూలంగా ఉండేలా ఒప్పందానికి ప్రయత్నించాలని సూచించారు. ఒకవేళ అలాంటిది సాధ్యం కాకపోతే చర్చల నుంచి బయటకు వచ్చేయాలని పేర్కొన్నారు. పార్లమెంటు వెలుపల శశి థరూర్ మీడియాతో మాట్లాడారు. ‘భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 9 వేల కోట్ల డాలర్ల వరకూ ఉంటాయి. సుంకాల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే మనకు నష్టమే. అయినా అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం’ అని పేర్కొన్నారు. ‘పాక్‌లో చమురు నిల్వలను ఏర్పాటు చేయాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఊహల్లో విహరిస్తున్న వారికి నా బెస్ట్ ఆఫ్ లక్. ఒకప్పుడు పాక్, భారత్ ఒకే దేశంగా ఉన్నాయి. చరిత్ర చూసినప్పుడు ఆ దేశంలో భారీ మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయని నాకైతే ఎక్కడా కనిపించలేదు’ అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

అందుకే డెడ్ ఎకానమీ అనే మాటలు

- ట్రంప్ తీరును తప్పుబట్టిన నేతలు

ఇంటర్నెట్ డెస్క్: రష్యా, భారత్ మృత ఆర్థిక వ్యవస్థలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడాన్ని భారత నేతలు తప్పుబట్టారు. అహంకారం, అజ్ఞానం నుంచే ఇలాంటి మాటలు వస్తాయని మండిపడ్డారు.

‘ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవం. మన ఆర్థిక వ్యవస్థ ఆయన చెప్పిన విధంగా లేదు. ఎవరైనా మనల్ని ఆర్థికంగా దెబ్బతీయగలం అని అన్నారంటే.. అది మనల్ని సరిగా అర్థం చేసుకోకపోవడంవల్లే కావొచ్చు. ట్రంప్ ఒక మాయలో జీవిస్తున్నారు’ అని రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నేత రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు.
■ ప్రపంచంలోని 5 అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఉందని తెలుసుకునేందుకు కావాల్సినంత సమాచారం అందుబాటులో ఉందని మరో విపక్ష నేత ప్రియాంకా చతుర్వేది ట్రంప్‌నకు చురక అంటించారు. అహంకారం, అజ్ఞానంతోనే మృత ఆర్థిక వ్యవస్థ అనే మాటలు వస్తుంటాయని ధ్వజమెత్తారు. వాణిజ్య చర్చలను ముగించి, ఒక ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఇది ట్రంప్ వేసిన ఎత్తుగడ అని అభిప్రాయపడ్డారు.
■ ‘ట్రంప్ చెప్పింది వాస్తవం. ఈ విషయం ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసు’ అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడంపై భాజపా మండిపడింది. భారత ప్రజల ఆకాంక్షలు, విజయాలను ఆయన అవమానిస్తున్నారని వ్యాఖ్యానించింది. భారత ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉందని పేర్కొంది.

ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు దేశాలుగా ఉండటమే పరిష్కారం

- రాజ్యసభకు సమాధానంలో కేంద్రం

దిల్లీ: చర్చల ద్వారా ఒక అవగాహనతో ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు సార్వభౌమ, స్వతంత్ర దేశాలుగా ఏర్పడి సరిహద్దుల్ని పరస్పరం గుర్తించుకోవడమే వాటిమధ్య ఘర్షణకు పరిష్కారమని కేంద్రం పేర్కొంది. పాలస్తీనాకు మద్దతు ఇవ్వడం మన విదేశాంగ విధానంలో భాగమా అనే ప్రశ్నకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం రాజ్యసభలో ఈ మేరకు సమాధానమిచ్చింది. ఇజ్రాయెల్‌తో సరిహద్దు పంచుకుంటూ శాంతియుతంగా పాలస్తీనా ఉండాలనేది మన విధానమని ఈ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాతపూర్వక జవాబు ఇచ్చారు. ఆ ప్రాంతంలో భద్రతపై మనం ఆందోళన వ్యక్తం చేశామని, కాల్పుల్ని విరమించి.. బందీలను విడుదల చేసి.. చర్చలు, దౌత్యం ద్వారా శాంతియుత పరిష్కారం సాధించాలనేదే భారత్ ఉద్దేశమని చెప్పారు.

అఫ్జల్ గురు ఉరిశిక్ష నావల్ల ఆగలేదు: చిదంబరం

దిల్లీ: 2001 డిసెంబరు 18న పార్లమెంటుపై దాడి చేసిన ఉగ్రవాది అఫ్జల్ గురుకు ఉరిశిక్ష తనవల్లే ఆగిందని రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం స్పందించారు. అమిత్ షా వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని, ఆయన వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ‘పి.చిదంబరం హోం మంత్రిగా ఉన్నంత కాలం అఫ్జల్ గురును ఉరి తీయలేదని అమిత్ షా రాజ్యసభలో పేర్కొన్నారు. ఇది పూర్తిగా అబద్ధం. అఫ్జల్ గురు దోషిగా నిర్ధారణ అయిన తర్వాత అతడి భార్య 2006 అక్టోబరులో రాష్ట్రపతి ముందు క్షమాభిక్ష అభ్యర్థనను దాఖలు చేసింది. దీన్ని అప్పటి రాష్ట్రపతి 2013 ఫిబ్రవరి 3వ తేదీన తిరస్కరించారు. 9వ తేదీన అఫ్జల్‌కు ఉరి శిక్ష అమలైంది. నేను 2008 డిసెంబరు నుంచి 2012 జులై వరకూ హోం మంత్రిగా ఉన్నా. నా పదవీకాలం మొత్తం క్షమాభిక్ష అభ్యర్థన రాష్ట్రపతి ముందు పెండింగులో ఉంది. క్షమాభిక్షపై నిర్ణయం తీసుకునే వరకూ ఉరి శిక్షను అమలు చేయకూడదన్నది చట్టం’ అని చిదంబరం సమాధానమిచ్చారు.

మోదీ మౌనవ్రతం: ఖర్గే



దిల్లీ: భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణపై పార్లమెంటులో మోదీ ‘మౌన వ్రతం’ పాటించారని, భారత్-రష్యాల స్నేహం, ఆర్థిక పతనంపై ఇప్పుడైనా మాట్లాడతారా.. అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ‘భారత్‌కు స్నేహితుడిని అంటూనే మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ సమస్యను కేంద్రం.. స్వయం సమృద్ధి దిశగా దేశాన్ని నడిపించే అవకాశంగా చూడాలి’ అని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి వ్యాఖ్యానించారు.

48 మంది పాలస్తీనీయుల మృతి

డెయిర్ అల్-బలా: గాజాస్ట్రిప్‌లో ఆహార శిబిరం వద్ద నిరీక్షిస్తున్నవారిపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 48 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. చర్చల నిమిత్తం అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ఇజ్రాయెల్‌కు చేరుకుంటున్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది.

డబ్బు డిపాజిట్‌పై నిందితుల హామీపత్రం ఆధారంగా బెయిలివ్వొద్దు

- ఆ విధానాన్ని పూర్తిగా ఆపేయండి
- హైకోర్టులు, విచారణ కోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

దిల్లీ: పూచీకత్తు కింద డబ్బు డిపాజిట్ చేస్తామంటూ నిందితులు లేదా వారి కుటుంబ సభ్యులు ఇచ్చే హామీ పత్రం (అండర్‌టేకింగ్) ఆధారంగా బెయిలు మంజూరు చేసే విధానాన్ని పూర్తిగా నిలిపివేయాలని హైకోర్టులు, విచారణ కోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండకుండా పలువురు కోర్టులను మోసం చేస్తుండటమే ఇందుకు కారణమని తెలిపింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం జులై 28న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్ బెయిలుకైనా, ముందస్తు బెయిలుకైనా ఇదే ఆదేశం వర్తిస్తుందని స్పష్టం చేసింది. బెయిలు పిటిషన్లపై పూర్తిగా ఆయా కేసుల మెరిట్‌ల ఆధారంగానే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఒకవేళ ఏదైనా హైకోర్టు అపీలుదారును బెయిలుపై విడుదల చేయాలని భావిస్తే.. ముందే డబ్బు డిపాజిట్ చేయించి, ఆ తర్వాతే విడుదలకు ఆదేశాలివ్వాలని పేర్కొంది. రూ.25 లక్షలు డిపాజిట్ చేసేందుకు సిద్ధమంటూ బాంబే హైకోర్టుకు ఓ వ్యక్తి హామీ పత్రం సమర్పించి, బెయిలు పొందాక హామీని నెరవేర్చని వ్యవహారంపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.

చర్చించాలనుకుంటే కూర్చోండి.. నినాదాలు ఇవ్వాలంటే వీధుల్లోకి వెళ్లండి

- విపక్షాల మీద స్పీకర్ ఆగ్రహం
- బిహార్ అంశంపై పార్లమెంటులో నిరసనలు



దిల్లీ: పార్లమెంటు ఉభయ సభల్లో గురువారం సయితం ఎలాంటి కార్యకలాపాలు ముందుకు సాగలేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ‘ప్రత్యేక ముమ్మర సవరణ’ (ఎస్ఐఆర్) అంశంపై విపక్షాలు గళమెత్తి సభా కార్యకలాపాలను స్తంభింపజేశాయి. మనపై అమెరికా విధించిన 25% సుంకాల గురించి వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన చేసిన వెంటనే లోక్‌సభ శుక్రవారానికి వాయిదాపడింది. అంతకు ముందు సభాపతి స్థానం వద్ద విపక్షాలు బైఠాయించి నిరసనలు తెలిపాయి. ‘నినాదాలు చేయడం ఆపండి. అంశాలపై చర్చ జరగడం మీకు ఇష్టం లేదా? సభలో నినాదాలు ఇవ్వడానికే ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారా? సభ ఉన్నది చర్చలు కోసం. మీ తీరు సబబు కాదు. చర్చ కావాలంటే మీమీ స్థానాల్లోకి వెళ్లి కూర్చోండి. నినాదాలు ఇవ్వాలనుకుంటే వీధుల్లోకి వెళ్లండి’ అని స్పీకర్ ఓంబిర్లా వారికి సూచించారు. అయినా సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు కూడా సభ పలుమార్లు వాయిదాపడింది. నాసాతో కలిసి ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై శాస్త్రవేత్తల్ని లోక్‌సభ అభినందించింది. బిహార్ ఎస్ఐఆర్ ఉపసంహరణకు రాజ్యసభలోనూ సభ్యులు డిమాండ్ చేశారు. ఆ కసరత్తును ఉపసంహరించుకోవాల్సిందేనని నినదాలిచ్చారు. అమెరికా టారిఫ్‌ల ప్రభావం నుంచి దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలూ చేపడతామని గోయల్ ఈ సభలోనూ ప్రకటించారు. ఆ వెంటనే సభ వాయిదాపడింది. ఆపరేషన్ సిందూర్‌పై వివరణ ఇవ్వడానికి ప్రధాని మోదీ రాజ్యసభకు రావాలని విపక్షం చేసిన డిమాండును అధికారపక్షం తోసిపుచ్చింది.
■ అహ్మదాబాద్ దుర్ఘటన సహా ఈ ఏడాది ఇంత వరకు ఎనిమిది విమాన ప్రమాదాల్లో 274 మంది ప్రాణాలు కోల్పోయారని పౌరవిమానయాన శాఖ పార్లమెంటుకు తెలిపింది.

నేడు బిహార్ ఓటరు ముసాయిదా జాబితా విడుదల

దిల్లీ: బిహార్ ఓటరు ముసాయిదా జాబితాను శుక్రవారం విడుదల చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం వెల్లడించారు. అందులో సవరణలకు నెల రోజుల (సెప్టెంబరు 1 వరకు) గడువు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులుగా భావించినవారి పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయొచ్చని స్పష్టం చేశారు. ముసాయిదా జాబితాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు చాలాకాలంగా నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే.



దిల్లీలోని ప్రగతి మైదాన్‌లో గురువారం జరిగిన 6వ డ్రోన్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పో, 10వ అంతర్జాతీయ పోలీస్ ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఓ డ్రోన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

రష్యా, భారత్ చమురు బంధమే ఇబ్బందికరం

అమెరికా విదేశాంగ మంత్రి రుబియో వ్యాఖ్య

న్యూయార్క్, వాషింగ్టన్: భారత్ కొంటున్న చమురుతోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని రష్యా కొనసాగించగలుగుతోందని, ఇదే భారత్‌తో చర్చల్లో తమను ఇబ్బందిపెట్టే అంశమని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. ‘ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాదారు. వ్యూహాత్మక భాగస్వామి. అయితే అన్ని అంశాల్లో మాదిరిగా విదేశాంగ విధానంలోని ప్రతి విషయంలో 100 శాతం సమయం కేటాయించడం సాధ్యం కాదు’ అని గురువారం ఫాక్స్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రుబియో పేర్కొన్నారు. ‘భారత్‌కు భారీగా ఇంధన అవసరాలున్నాయి. అన్ని దేశాల్లాగే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు చమురు, బొగ్గు, గ్యాస్ కొనగలిగే శక్తి దానికి ఉంది. అయితే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఆంక్షలవల్ల అక్కడ చమురు చౌకగా లభిస్తోంది. దురదృష్టవశాత్తూ అదే యుద్ధంలో మనగలగడానికి రష్యాకు ఉపయోగపడుతోంది’ అని ఆయన వ్యాఖ్యానించారు.



విమానంలో భారీ కుదుపులు.. 25 మందికి గాయాలు

న్యూయార్క్: అమెరికాలోని సాల్ట్‌లేక్ సిటీ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానమొకటి బుధవారం తీవ్ర కుదుపులకు లోనైంది. సీటు బెల్టు పెట్టుకోని పలువురు ప్రయాణికులు ఆ తీవ్రతకు పలుమార్లు ఎగిరి విమానం పైకప్పునకు తాకి కిందకు పడ్డారు. అనంతరం లోహవిహంగాన్ని పైలట్ దారి మళ్లించి మినియాపోలిస్-సెయింట్ పాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దించారు. కుదుపుల దెబ్బకు గాయపడిన 25 మంది ప్రయాణికులను ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ దయా నాయక్ పదవీ విరమణ

ముంబయి: మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరుగాంచిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) దయా నాయక్ గురువారం పదవీ విరమణ పొందారు. 1995 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయిన దయా నాయక్‌కు మూడు రోజుల కిందటే ఏసీపీగా పదోన్నతి లభించింది. మొత్తం 30 ఏళ్లపాటు మహారాష్ట్ర పోలీసు విభాగంలో పనిచేసిన ఆయన.. 80 మందికిపైగా గ్యాంగ్‌స్టర్లను ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం.

తీరొక్క రంగుల అన్నం..



నేటి యువత, పిల్లలకు రోజూ భోజనంలో స్పెషల్ కావాలి. అలానే రోజూ తెల్లన్నమే ఎందుకు తినాలి అని అనుకునే వారూ ఉంటారు. దీంతోపాటు ఆరోగ్యరీత్యా కూడా కొన్నేళ్లుగా బ్లాక్‌రైస్, రెడ్‌రైస్, బ్రౌన్‌రైస్ తదితర దేశవాళీ ధాన్యం రకాలూ ఆదరణ పొందుతున్నాయి. ఇలా తీరొక్క రకాల ధాన్యాన్ని పండిస్తూ రైతులూ ఆదాయం పొందుతున్నారు.

కాలాబట్టి, చిన్నార్, బంగారు గులాబీ, కల్యాణి..

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన చిన్న గంగారాం ఎలియాస్ చిన్ని కృష్ణుడు (72).. మూడున్నర ఎకరాల్లో కాలాబట్టి, చిన్నార్, బంగారు గులాబీ, కల్యాణి తదితర 50 రకాల వరి వడ్లను పండిస్తూ అబ్బుర పరుస్తున్నారు. వేప, పల్లి నూనెతో తయారు చేసిన సేంద్రియ ఎరువులను వాడుతున్నారు. ఆయన ముగ్గురు కుమారులు అమెరికాలో స్థిరపడగా, అక్కడి నుంచీ పలు రకాల విత్తనాలు సేకరించి సాగుచేస్తున్నారు. నల్ల వడ్లు ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, పెట్టుబడి రూ. 10 వేల వరకు ఉండగా, మార్కెట్‌లో కిలో రూ.250 ధర ఉందని గంగారాం తెలిపారు.



వ్యవసాయ క్షేత్రంలో రైతు చిన్నికృష్ణుడు

నవారా, రక్తశాలి, పుంగార్



కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన గరంపల్లి శ్రీకాంత్ 30 ఎకరాల్లో బ్లాక్ రైస్‌లో కాలాబట్టి, కర్పూర కవని రకాలను.. ఎర్ర ధాన్యంలో మాపిళ్లై సాంబా, నవారా, రక్తశాలి, పుంగార్ రకాలను, బ్రౌన్ రైస్‌లో... సుస్ర యుదేనిక, ఆరాధ్య కురువై రకాలను పండిస్తున్నారు. కిలో బియ్యాన్ని ఆన్‌లైన్‌లో రూ.150-200కు విక్రయిస్తున్నారు.

- ఈనాడు, నల్గొండ కరీంనగర్, నిజామాబాద్

కుంకుమ పువ్వు.. మైసూర్ మల్లిక



నల్గొండ జిల్లా చండంపల్లి రైతు గాదె రాంరెడ్డి 1.7 ఎకరాల్లో కుంకుమ పువ్వు, 18 గుంటల్లో మైసూర్ మల్లిక వరి రకాలను సాగు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ఈ విత్తనాలు తెచ్చారు. పులియపెట్టిన మజ్జిగ, జీవామృతాన్ని ఎరువుగా వాడుతున్నారు.

రెడ్, బ్లాక్, బహురూపి



నల్గొండ జిల్లా మునుగోడు మండలం జక్కులవారిగూడెంలో యువ రైతు జక్కుల వెంకటేశ్ 10 ఎకరాల్లో రెడ్, బ్లాక్‌రైస్, బహురూపి రకాలను పండిస్తున్నారు. 'తులసీ బస్మభోగ్' అనే చిట్టిముత్యాల రకాన్నీ సాగు చేస్తున్నారు.



ఈ నోటికి రూ.16.5 కోట్ల బీమా!

ఆరోగ్య బీమా, వాహన బీమా లాంటివి మనకు తెలిసిందే. బ్రిటిష్ నటి, గాయని సింథియా ఎరివో (38) తన నోటికి రూ. 16.5 కోట్ల బీమా చేయించారు. మౌత్‌వాష్ బ్రాండు 'లిస్టెరిన్' నిర్వహిస్తున్న 'వాష్ యువర్ మౌత్' కార్యక్రమానికి సింథియా ప్రచారకర్తగా ఉన్నారు. పై దంతాలు రెండింటి మధ్య ఉన్న గ్యాప్‌ను.. తన విలక్షణ నవ్వు, గళాన్ని కాపాడుకునేందుకే ఈ బీమా వైపు మొగ్గు చూపినట్లు ఆమె చెబుతారు. హాలీవుడ్‌లో 'అత్యంత విలువైన చిరునవ్వు' కలిగిన మహిళగా గుర్తింపు పొందిన సింథియా ఎమ్మీ, గ్రామీ వంటి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. హాలీవుడ్ సెలబ్రిటీల్లో శరీర భాగాల బీమా కొత్త కాదు. జెన్నిఫర్ లోపెజ్ తన వీపు భాగాన్ని రూ. 200 కోట్లకు బీమా చేయించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అమెరికన్ గాయని మారియా కరే తన కాళ్లు, స్వరపేటికలను రూ. 500 కోట్లకు బీమా చేయించారు. —ఇంటర్నెట్ డెస్క్

భూమిపైన రోదసిలో 10 రోజులు

'అనుగామి అంతరిక్షయాత్ర'లో తెలుగుతేజం

స్వీయ మానవసహిత అంతరిక్షయాత్రకు సన్నద్ధమవుతున్న భారత్.. కీలక మైలురాయిని సాధించింది. వ్యోమగాముల ఎంపిక, శిక్షణతో ముడిపడిన వైద్య, మానసికపరమైన విధివిధానాలను దేశీయంగా నిర్వహించిన ప్రయోగంలో తొలిసారిగా పరీక్షించి చూసింది. 'అనుగామి' పేరుతో బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ (ఐఏఎం) ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమానికి ఎంపికైన ముగ్గురిలో తెలుగు తేజం **ఆకుల మోహన సాయి** ఉన్నారు. సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌కు చెందిన ఆయన.. ఈ కార్యక్రమంలో పౌరప్రతినిధిగా పాల్గొన్నారు.

ఐఏఎంలో సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ సౌగంధి ఎన్ చతుర్వేదుల ఆధ్వర్యంలో అనుగామి కార్యక్రమ రూపకల్పన జరిగింది. ఐఏఎం, భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) సంయుక్తంగా దీన్ని నిర్వహించాయి. జులై 7 నుంచి 16 వరకూ పది రోజుల పాటు ఇది సాగింది. భారత దీర్ఘకాల అంతరిక్ష యాత్రను తీర్చిదిద్దడంలో భాగంగా తెరపైకి తెచ్చిన గగన్‌యాన్ అనలాగ్ ఎక్స్‌పెరిమెంట్ (గ్యానెక్స్)లో భాగంగా దీన్ని చేపట్టారు. ఇప్పటివరకూ వ్యోమగామి సన్నద్ధత కోసం భారత్.. ఎక్కువగా అంతర్జాతీయ భాగస్వామ్యాలవైపు మొగ్గేది. దీనికి భిన్నంగా.. భవిష్యత్ రోదసియాత్రల కోసం భారత వ్యోమగాముల శిక్షణ, పర్యవేక్షణ, సన్నద్ధతను దేశీయంగానే చేపట్టడం తాజా ప్రాజెక్టు ఉద్దేశం.

ఎవరు పాల్గొన్నారు?

మానవసహిత అంతరిక్ష యాత్రల్లో ఎదురయ్యే సంక్లిష్టతలు, పరిస్థితులను అనుకరించి చూడటం అనుగామి ప్రయోగ ముఖ్య ఉద్దేశం. ఇందులో ఉత్పన్నమయ్యే అంశాల ఆధారంగా వాస్తవ అంతరిక్ష యాత్రకు వ్యోమగాములను సన్నద్ధం చేస్తారు. అనుగామిలో భిన్న నేపథ్యాలున్న సిబ్బందిని ఎంపిక చేశారు. వీరిని గగన్స్‌గా పిలుస్తారు. గగన్‌యాన్ కోసం ఎంపికైన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్ దీనికి నేతృత్వం వహించారు. నౌకాదళంలోని మిగ్-29కె యుద్ధవిమాన పైలట్ రాజీవ్ ప్రసన్న, స్వతంత్ర అనలాగ్ వ్యోమగామి, పౌర పరిశోధకుడు మోహనసాయి సభ్యులుగా ఎంపికయ్యారు. ఇలా భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన సిబ్బందిని ఎంపిక చేయడంవల్ల వ్యోమగాముల పనితీరుకు సంబంధించిన విభిన్న అంశాలపై డేటా సేకరించడానికి వీలవుతుంది.



ఏం చేశారు?

తొమ్మిదిన్నర రోజుల పాటు.. అంతరిక్ష కేంద్రాన్ని పోలిన ఆవాసంలో మోహన సాయి బృందం నివసించింది. రోదసి పరిస్థితులను అనుకరించేలా వారి ఆహారం, నిద్ర ఉంది. అనేక శాస్త్రీయ ప్రయోగాలు చేపట్టారు. భూమికి దూరంగా ఉన్నప్పుడు సిబ్బంది సమన్వయం చేసుకోవాల్సిన తీరును ఇందులో అనుకరించారు. చివర్లో.. రాకెట్ ప్రయోగం, తిరుగుప్రయాణంలో భూవాతావరణంలోకి ప్రవేశించడం వంటి అంశాలను పరీక్షించారు. భారరహితస్థితికి సర్దుబాటు అయ్యేలా యోగా, మానసిక అప్రమత్తత, మొక్కల పెంపకం వంటి ప్రయోగాలను నిర్వహించారు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులకు స్పందించడం కూడా ఇందులో భాగంగా ఉంది.

- అనుగామి మిషన్‌లో భావోద్వేగ, ఆరోగ్య పరిశీలన కోసం ఓ అత్యాధునిక వ్యవస్థ ఉంది. శిక్షణలో ఉన్నవారు ఒత్తిడిలో, చికాకుగా ఉన్నప్పుడు అది గుర్తిస్తుంది. వారు సాధారణ స్థితికి రావడానికి ధ్యానం, ఇతరత్రా సూచనలు చేస్తుంది.
- ఈ ప్రయోగంలో మోహన సాయి పాల్గొనడం వల్ల.. అంతరిక్ష యాత్రల్లో పాల్గొనే పౌర పరిశోధకులకు సంబంధించి స్పష్టమైన ప్రమాణాలను నిర్వచించడానికి వీలైంది. ఆయన.. ఆస్ట్రోబయాలజీ, స్పేస్‌సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. మోహన సాయి ప్రస్తుతం ఐఏఎంలో రీసెర్చ్ సైంటిస్టు-1గా పని చేస్తున్నారు. గతంలో విదేశాల్లో నిర్వహించిన అనలాగ్ మిషన్‌లలో పాల్గొన్నారు. అనుగామి మిషన్.. భారత అంతరిక్ష ప్రస్థానంలో ప్రధాన మైలురాయి అని ఆయన 'న్యూస్‌టుడే'తో అన్నారు. తనకు అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు.

—న్యూస్‌టుడే, హుజూర్‌నగర్

మన పిల్లలే.. మాణిక్యాలే..



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వారు. తమ పాఠశాలలోని అంశాలను, ఆ గ్రామంలో జరిగిన విషయాలను వార్తల్లా రాసుకుంటారు. ఛానళ్లలో యాంకర్లు వార్తలు చదివినట్లు చదువుతారు. విద్యార్థులే వాటిని రికార్డు చేస్తారు. ఎడిట్ చేస్తారు. తమ పాఠశాల పేరుతో ప్రారంభించిన యూట్యూబ్ ఛానల్‌లో నెలకోసారి వాటిని అప్‌లోడ్ చేస్తారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో చేస్తున్న ఈ ప్రయత్నం ప్రశంసలు అందుకుంటోంది. పాఠశాల పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహణతో పాటు.. ఆంగ్ల ఉపాధ్యాయులు ఉమారెడ్డి, సువితల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ క్లబ్‌ను ఏర్పాటు చేసి... నెలలో మూడు సార్లు ఆంగ్లంలో ఉపన్యాస పోటీలు, చర్చలు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై భయం పోవడంతో పాటు భావ వ్యక్తీకరణ మెరుగవుతోందని ప్రధానోపాధ్యాయుడు సంపత్‌కుమారాచారి చెప్పారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.. విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



– న్యూస్‌టుడే, వీణవంక

ముట్టుకుంటే చుట్టుకుపోతా త్వరలోనే ఎగిరిపోతా!





గొంగళిపురుగు అని వినబడగానే దాని రూపం గుర్తొచ్చి ఒళ్లంతా జలదరించిన భావన కలుగుతుంది. కానీ ఈ చిత్రంలో పసుపు వర్ణంలో మెరిసిపోతూ ముద్దొస్తున్నది కూడా గొంగళిపురుగే. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో కనిపించిన ఈ జీవి ముట్టుకుంటే ముడుచుకుపోయి పువ్వులా మారిపోతోంది. ఈ తరహా గొంగళి పురుగులు ఇక్కడ అరుదుగా కనిపిస్తాయని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల జంతుశాస్త్రం ఉపాధ్యాయురాలు గుర్రమ్మ పేర్కొన్నారు. కొన్ని రోజుల తర్వాత సీతాకోకచిలుకగా మారిపోతుందని వివరించారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట

వరదల్లో కొట్టుకుపోయిన రూ.12 కోట్ల విలువైన బంగారం



చైనాలోని షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. వుచి కౌంటీలో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. బాక్సులో 20 కిలోల బంగారంతో పాటు భారీగా నగదు ఉన్నట్లు యజమాని పేర్కొన్నారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి వెతకడం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. —ఇంటర్నెట్ డెస్క్



ఇగ్లూలు కాదు.. బొగ్గుల బట్టీలు

అతిశీతల ప్రాంతాల్లో.. ప్రజలు నివసించే మంచు గృహాలను ఇగ్లూలు అంటారనే సంగతి తెలిసిందే. అచ్చం వాటిని పోలి ఉన్న నిర్మాణాలు నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామ సమీపంలో కనిపించాయి. ఇలా ఎందుకు నిర్మించారని ఆరా తీయగా బొగ్గుల బట్టీలని తెలిసింది. బొగ్గుల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్న వారు.. ఇటుకలు, మట్టితో అర్ధగోళాకారంలో బట్టీలు నిర్మించారు. వాటికి కిటికీ పరిమాణంలో ద్వారం ఏర్పాటు చేశారు. దీని ద్వారా వీటిలోకి కలప, మొద్దులు వేసి నిప్పంటించి ద్వారాన్ని మట్టితో పూడ్చేస్తారు. అవి కాలి బొగ్గుగా మారాక బయటకు తీసి విక్రయిస్తున్నారు. – ఈనాడు, నంద్యాల

గంట గంటకో ప్రవచనం



ప్రతి గంటకూ ప్రవచనాలు చెప్పే టవర్ క్లాక్ ఇది. తమిళ ప్రాచీన కవి తిరువళ్లువర్ రచించిన తిరుక్కురళ్ సూక్తులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) దీనిని ఏర్పాటు చేసింది. తండయారుపేటలో ఉన్న ఈ టవర్ క్లాక్ ఏర్పాటుకు రూ. 8 లక్షలు ఖర్చు చేశారు. ఈ క్లాక్ ప్రతి గంటకోసారి వివిధ భాషల్లో సమయం వెల్లడించి, ఒక తిరుక్కురళ్ సూక్తిని వినిపిస్తుంది. - **న్యూస్‌టుడే, చెన్నై**

30 ఏళ్లు పిండంగా.. ఇప్పుడు శిశువుగా..



వాషింగ్టన్: దాదాపు 30 ఏళ్లపాటు శీతలీకరించిన ఒక పిండం ఇప్పుడు శిశువుగా పురుడుపోసుకుంది. ఇది ప్రపంచ రికార్డు అని నిపుణులు చెబుతున్నారు. ఇంత దీర్ఘకాలం పాటు భద్రపరిచిన పిండం.. శిశువుగా మారిన ఉదంతాలేవీ ఇప్పటివరకూ లేవని వివరించారు. అమెరికాలోని ఒహాయోకు చెందిన లిండ్సే, టిమ్ పియర్స్ జంటకు మగశిశువుగా ఈ పిండం జన్మించింది. ఇది సైన్స్ కాల్పనిక సినిమాలా ఉందని ఆ జంట.. సంభ్రమాశ్చర్యాలకు లోనైంది. వీరు సంతానం కోసం ఏడేళ్లు నిరీక్షించారు. వారి ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో.. లిండా ఆర్చర్డ్ అనే మహిళకు సంబంధించిన పిండాన్ని స్వీకరించాలని నిర్ణయించారు.

సహజసిద్ధంగా సంతానం కలగకపోవడంతో 1994లో లిండా ఆర్చర్డ్.. ఐవీఎఫ్ విధానం వైపు మొగ్గారు. ఇందుకోసం వైద్యులు.. ఆమె అండాలు, ఆమె భర్త వీర్యకణాలతో ఫలదీకరణ చేయించి నాలుగు పిండాలను వృద్ధి చేశారు. ఇందులో ఒక పిండం ద్వారా లిండా ఆర్చర్డ్ ఆడ సంతానాన్ని పొందారు. మిగతా మూడు పిండాలను భద్రపరిచారు. ఆ తర్వాత భర్త నుంచి విడిపోయినప్పటికీ ఆ పిండాలను ఆర్చర్డ్ వదులుకోలేదు. వాటిని పరిశోధనకు లేదా గుర్తుతెలియని కుటుంబానికి దానమివ్వడం ఆమెకు ఇష్టంలేదు. పిండాలను భద్రపరిచేందుకు ఆమె.. ఏటా వేలాది డాలర్లను చెల్లించారు. తర్వాత ఒక క్రిస్టియన్ పిండ దత్తత కేంద్రం.. వాటి బాధ్యతను స్వీకరించింది. అమెరికాలోనే ఉండే వివాహిత, శ్వేతజాతి క్రిస్టియన్ జంటకు ఆ పిండాలను ఇవ్వాలని ఆర్చర్డ్ నిర్దేశించారు. ఈ షరతులు లిండ్సే, టిమ్ జంటకు సరిపోలాయి. దీంతో రెండు పిండాలను లిండ్సే గర్భంలోకి ప్రవేశపెట్టారు. అందులో ఒకటి శిశువుగా వృద్ధి చెందింది. ఆర్చర్డ్‌కు ఇప్పుడు 62 ఏళ్లు. ఆమె కుమార్తెకు 30 ఏళ్లు. శిశువుగా మారిన తన పిండం ఫొటోను చూసి ఆర్చర్డ్ సంతోషపడ్డారు.

ఎవ్వరినీ దేనికోసమూ వేడుకోవద్దు




జీవితంలో ఎవ్వరినీ దేనికోసమూ వేడుకోకండి. ఒకరి ప్రేమాభిమానాలను పొందడానికి అర్రులు చాచకండి. వారు మీకు నిజంగా విలువ ఇస్తుంటే, మీతో గడపడానికి ప్రాముఖ్యతనిస్తారు. ప్రేమ రెండు వైపులా ఉన్నప్పుడే బంధం బలంగా ఉంటుంది. **– రోజియాన్, పర్సనల్ గ్రోత్ కోచ్**

విమానాశ్రయాల్లో బాద్‌షా.. 'శంషాబాద్'



దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విస్తీర్ణం పరంగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అగ్రస్థానంలో నిలిచింది. 'ఫోర్బ్స్ ఇండియా' తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాలు ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నాయని వివరించింది. విద్య, వ్యాపార అవసరాల నేపథ్యంలో కొన్నేళ్లుగా దేశీయ విమానాల్లో రాకపోకలు పెరగడంతో.. దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని విమానాశ్రయాల్లో రద్దీ అంతకంతకూ పెరుగుతోంది. – ఈనాడు, హైదరాబాద్



అలలు చాచి ఆహ్వానం



కొంచెం ధైర్యం..అంతకు మించి సముద్రపు లోతులను ఆస్వాదించాలనే ఆసక్తి ఉంటే చాలు.. 'స్కూబా డైవింగ్' చేయించేందుకు ఉత్తరాంధ్రలో సంస్థలున్నాయి. ఓషన్ స్విమ్మింగ్, అండర్ వాటర్ డైవింగ్, స్నోర్కెల్లింగ్, కయాకింగ్‌లాంటి జల క్రీడలకూ, విశాఖ అలలు చాచి ఆహ్వానిస్తోంది. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అనుమతితో మూడు సంస్థలు ఇందుకు అనుమతి పొందాయి.

ఏ ప్రాంతాల్లో..?

- విశాఖలో రుషికొండ, మంగమారిపేట, సాగర్‌నగర్, తిమ్మాపురం, భీమిలి
- విజయనగరంలో చింతపల్లి, శ్రీకాకుళంలో బారువ తీరాలు

ప్రత్యేకమేంటి?

ఉత్తరాంధ్రలోని సముద్ర తీరంలో గొప్ప జీవవైవిధ్యం ఉంటుంది. నీటి అడుగున పది మీటర్ల లోతులోనే రంగురంగుల జలచరాలను చూడొచ్చు.

- వీటికితోడు అద్భుతమైన పగడపు దిబ్బలు మరో ప్రపంచాన్ని తలపిస్తాయి.
- గుంపులు కట్టి తిరిగే చేపలను వీక్షించొచ్చు. తాబేళ్లను, స్టార్‌ఫిష్‌లను, భారీ జలచరాలను చూడొచ్చు.
- విజయనగరం జిల్లా చింతపల్లి తీరం నుంచి కిలోమీటరు లోపలికి వెళ్తే కొన్నేళ్ల కిందట నీట మునిగిన నౌకను చూడొచ్చు. శ్రీకాకుళం జిల్లా బారువ తీరంలో మునిగిన నౌక దృశ్యాలనూ వీక్షించవచ్చు.

ఈత రాకున్నా..

- స్కూబా డైవింగ్‌కు ఈత రావడం తప్పనిసరి కాదు. సేఫ్టీ బ్రీఫింగ్, డైవ్ ప్లానింగ్‌పై గంట పాటు అవగాహన కల్పిస్తారు.
- లోపలికి తీసుకువెళ్లే ముందు శిక్షకుడు అరగంట పాటు బ్రీతింగ్ వ్యాయామం చేయిస్తారు.
- ఆక్సిజన్ సిలిండర్ల నిర్వహణపై తర్ఫీదు ఇచ్చి ఆ పరికరాలు అమర్చుకోవడం, గాలి పీల్చుకోవడం నేర్పిస్తారు.
- అకస్మాత్తుగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తితే సైగలతో ఎలా సూచించాలో తెలియజేస్తారు.

నీటి అడుగున ఎంతసేపు?

ముగ్గురు, నలుగురు కలిపి బృందంగా వెళ్లే ప్రతి ఒక్కరికీ ఒక్కో డైవర్ సహాయకుడిగా ఉంటారు. లైఫ్‌జాకెట్లు అందుబాటులో ఉంచుతారు. స్విమ్ సూట్లు ధరించాక బోటులో తీరం నుంచి లోపలికి కిలోమీటరు వరకు తీసుకువెళ్తారు. అలలు లేని ప్రాంతంలో నీటిలోపలికి దించుతారు. 10 నుంచి 30 అడుగుల లోతుకు తీసుకువెళతారు. సుమారు 20 నుంచి 30 నిమిషాల పాటు ఈ అండర్ వాటర్ డైవ్ ఉంటుంది. ఆ జ్ఞాపకాలను మరొకరు క్యాప్చర్ చేస్తారు. వీడియోలు చిత్రీకరిస్తారు.

ధర ఎంత?

ఏపీటీడీసీ నిర్ణయించిన ధర రూ. 2500. సూట్లు, ఆక్సిజన్ సిలిండర్, శిక్షణ అన్నీ అందులోనే. ఆయా ప్రాంతాల్లోని దూరం, లోపల గడిపే సమయం ఆధారంగా ధరల్లో మార్పులుంటాయి.

స్కూబా డైవింగ్ చేయాలంటే అండర్ వాటర్ విజిబులిటీ బాగుండాలి. ఆగస్టు నుంచి మార్చి వరకు మన దగ్గర సముద్రగర్భంలో అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో చేపలు, తాబేళ్లను అతి సమీపం నుంచి చూడొచ్చు.

- పదేళ్లలోపు పిల్లలకు అనుమతి లేదు.
- హృదయ సంబంధ వ్యాధులు, ఆయాసం, ఊపిరితిత్తుల సమస్య, చెవి సైనస్ సంబంధ వ్యాధులున్న వారికి సురక్షితం కాదు.

- ఆధార్ లేదా ఏదైనా ధ్రువీకరణపత్రం • స్విమ్ వేర్ • టవల్స్ • మెడికల్ ఫిట్‌నెస్ • వాటర్ బాటిల్ • పొడిదుస్తులు ఒక జత

- ఈనాడు, విశాఖపట్నం

ఇద్దరు బాలలు.. ఓ పసి పిచ్చుక



యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో మణిరామ్, మిన్ను స్నేహితులు. స్కూల్ నుంచి రాగానే.. మణిరామ్ పెరట్లోని నీటి తొట్టెలో చిన్న పిచ్చుక పడి కొన ఊపిరితో ఉండడాన్ని గమనించాడు. ఎగరలేని స్థితిలో ఉన్న దానిని ఇద్దరూ కలిసి బయటకు తీశారు.

ఇంట్లోకి తీసుకెళ్లి టవల్‌తో తుడిచి పాలుపట్టారు. రెండు గంటల తర్వాత బుడిబుడి అడుగులతో ఎగిరే ప్రయత్నం చేయడంతో పెరట్లోకి తీసుకెళ్లి వదిలారు.

చిన్ని పిచ్చుక.. కిచకిచలు చేయడంతో తల్లి పిచ్చుక వచ్చి అక్కున చేర్చుకుంది. అంతలోనే తుర్రున ఎగిరిపోయి ఓ పురుగును నోట తీసుకొచ్చి చిన్ని పిచ్చుకకు తినిపించింది.

వీటి అరుపులకు మరిన్ని పిట్టలు రావడంతో.. అన్నీ కలిసి ఎగిరిపోయాయి. ఈ క్రమంలో ట్యూషన్‌కు వెళ్లడం ఆలస్యం కాగా.. టీచర్ అడగడంతో ఈ కథంతా చెప్పారు. నిజమేనా అని టీచర్ నిలదీయడంతో.. వారి బంధువు తీసిన ఫొటోలను చూపారు. దీంతో టీచర్ అభినందించారు.

– న్యూస్‌టుడే, సంస్థాన్ నారాయణపురం

మీ ఆర్థికారోగ్యం.. బలం ఎంత?



పురాతన్ భారతి

చాలా మంది స్వల్పకాలం లోనే తమ పెట్టుబడులు రెట్టింపు కావాలని ఆశిస్తున్నారు. ఇది ఎంత వరకు ఆచరణీయం

(మొదటి పేజీ తరువాయి)

డబ్బు కూడబెడతారు అనేది ఇప్పుడున్న జీవన శైలిపై ఆధారపడి ఉంటుంది. ఉద్యోగ జీవితంలోకి ఇల్లు కట్టుకోవడం, పిల్లల చదువులు, వారి పెళ్లి, ఇలా కొన్ని 'కామన్ ప్లానింగ్' ఉంటాయి. వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని వేరే విధంగా చూడాలి. వీటికోసం డబ్బు కూడబెట్టినప్పుడు, నష్టభయం భరించే శక్తి ఉండేలా చూసుకోవాల్సిందే.

ప్రతి ఒక్కరి పెట్టుబడి ప్రణాళికలో కచ్చితంగా ఉండాల్సిన ప్రాథమిక అంశాలేమిటి

పోషకాహారం అని ఏదో ఒకటి తింటే సరిపోదు. అది మన శరీరానికి కీడు చేస్తుంది. అదే విధంగా పెట్టుబడుల్లోనూ ఆర్థికంగా స్థిరత్వం లేకపోతే ఊహించని ఒత్తిడి మానసికంగా ఇబ్బంది పెడుతుంటుంది. కనీసం 6 నెలల అత్యవసర నిధి, తగినంత బీమా రక్షణ, ద్రవ్యోల్బణం నుంచి రక్షించేలా ఈక్విటీ పెట్టుబడులను ప్రాథమిక అవసరాలుగా పరిగణించాలి.

ఇక్కడ ఒక విషయం చెప్పొచ్చు.. ఉదయం అల్పాహారం వండేందుకు ఎంత సమయం పడుతుంది? మధ్యాహ్నం లేదా రాత్రి భోజనం వండేందుకు పట్టే సమయం ఎంత? ఈ రెండింటి మధ్య తేడా కచ్చితంగా ఉంటుంది కదా.. దేనికైనా కాస్త ముందుగానే సిద్ధం కావాల్సిందే. పెట్టుబడులకూ ఇదే సూత్రాన్ని అన్వయించొచ్చు. స్వల్పకాలిక లక్ష్యాలు, దీర్ఘకాలిక లక్ష్యాలను వేర్వేరుగా చూడాలి. రెండు, మూడేళ్లలో సాధించే లక్ష్యాల కోసం అధిక నష్టభయం ఉన్న పథకాలను ఎంచుకోవడం సరికాదు. ఇదే విధంగా పదేళ్లకు మించి సమయం ఉన్నప్పుడు.. సంప్రదాయ పొదుపు పథకాలు ఫలితం ఇవ్వవు. దీనికి వృద్ధి ఆధారిత ఉత్పత్తులు అంటే ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవాలి. వంట చేసేటప్పుడు రుచికరంగా ఉండాలని చూస్తాం. పెట్టుబడుల విషయంలోనూ రుచి అంటే.. వచ్చే లాభాలే.

మనవాళ్లు చేస్తున్న పొరపాట్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి?

మనలో చాలామందికి స్థిరాస్తి, పెట్టుబడులపై అమితాసక్తి ఉంటుంది. దీనివల్ల తమ దగ్గరున్న నగదును ఇతర పెట్టుబడులకు వాయిదాలేసిపోతుంటారు. మరొకటి.. సరైన మొత్తానికి బీమా రక్షణ లేకపోవడం. చాలామంది తమకు నాలుగైదు పాలసీలున్నాయని అనుకుంటారు. కానీ, వాటి వాస్తవ విలువ ఎంత అనే విషయంలో వారికి ఏమాత్రం అవగాహన ఉండదు. వార్షిక సంపాదనకు 20 రెట్ల వరకు బీమా ఉండాలి. అదే విధంగా సురక్షిత పథకాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. చాలామంది క్రిప్టో కరెన్సీలు, తక్కువ ధరల్లో ఉండే 'పెన్నీ స్టాక్స్' వెంటపడుతూ 'ట్రెండ్స్ ఫాలో అవుతున్నారు' అనుకుంటున్నారు. కానీ, తమ కష్టార్జితాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఊహించడం లేదు. వీటిని అధిగమించాలంటే సరైన అవగాహన పెంచుకోవాల్సిందే. పోషకాహార నిపుణుడిని సంప్రదించాకే డైటింగ్ లాంటివి చేయాలి. పెట్టుబడుల కోసమూ విశ్వసనీయ ఆర్థిక సలహాదారులను ఎంచుకోవాలి.

పెట్టుబడుల జాబితాలో పథకాల వైవిధ్యం ఎలా ఉండాలి

సమతుల భోజనం అంటే పిండి పదార్థాలు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు, కొవ్వులు అన్నీ సరైన నిష్పత్తిలో ఉండాలి. ఏది ఎక్కువైనా ఆరోగ్యం ఎర్ర దెబ్బతింటుంది. పెట్టుబడుల కేటాయింపులోనూ ఈ జాగ్రత్త తప్పదు. మనకున్న ఆర్థిక లక్ష్యాలు ఇందుకు కీలకం. పెట్టుబడి వృద్ధికి ఈక్విటీలు అవసరం. స్థిరత్వం కోసం డెట్ పథకాలు ఎంచుకోవాలి. ఆర్థిక రక్షణ కోసం బంగారం అవసరం. దీర్ఘకాలిక విలువ సృష్టించేందుకు స్థిరాస్తిలో పెట్టుబడి పెట్టాలి. ఆల్ఫా జనరేషన్ (అధిక రాబడి) కోసం ఎన్నో ప్రత్యామ్నాయ పెట్టుబడులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పరిశీలించాలి.

పెట్టుబడులను నిర్వహించేప్పుడు ఎలాంటి వ్యూహాలు పాటించాలి?


కాలంతో పాటు పెట్టుబడుల నిర్వహణ తీరూ మారుతుండాలి. ఒక కాలంలో ఒకరకం కూరగాయలు అధికంగా పండుతాయి. సరఫరా అధికంగా ఉంటుంది కాబట్టి, తక్కువ ధరకే లభిస్తుంటాయి. వర్షాకాలంలో రోజూ వాతావరణ సూచనలు వినాల్సిన అవసరం లేదు. ఒక గొడుగు వెంట ఉంచుకోవడం మేలు. పెట్టుబడుల విషయంలోనూ ఇదే వ్యూహం పాటించాలి. కంపెనీ పనితీరు బాగున్నా, కొన్ని షేర్లు తక్కువ ధరకు వస్తుంటాయి. వీటిని చేజిక్కించుకోవడానికి ప్రయత్నించాలి. మార్కెట్ ఏ దశలో ఉన్నా.. పెట్టుబడులు పెట్టేందుకు కొంత నగదు ఉంచుకోవాలి. అప్పుడే మంచి లాభాలు సంపాదించేందుకు వీలవుతుంది. ఎవరైనా అనారోగ్యంగా ఉన్నప్పుడు రోగ నిరోధక వ్యవస్థను పెంచే ఆహారాన్ని సూచిస్తుంటారు. ఇలాగే 2020లో కొవిడ్ సంక్షోభంలో మార్కెట్లు బాగా పడిపోయినప్పుడు.. ఈక్విటీ కేటాయింపులు అధికంగా చేసిన వారు, మార్కెట్లు రాణించాక ఎంతో లాభపడ్డారు.

ఆర్థికంగా మనం విజయం సాధించామని ఎప్పుడు అనుకోవచ్చు?

ఆర్థికంగా ఏ అవసరం వచ్చినా ఒక్క రూపాయి అప్పు చేయని స్థితి చేరుకోవాలి. గృహరుణం తీసుకున్నా.. దాన్ని ఎంత వేగంగా తీర్చగలం అన్నదే ప్రధానం. పిల్లల చదువుల విషయంలో రాజీ పడని స్థితి రావాలి. గౌరవంగా పదవీ విరమణ చేయాలి. ఇవి సాకారం కావాలంటే, సంపాదిస్తున్న డబ్బును ఎలా వినియోగిస్తున్నాం అన్నది కీలకం. వచ్చిన డబ్బులో 30% పెట్టుబడులకు కేటాయించాలి. మిగిలిన మొత్తంతోనే మీ అవసరాలు, కోరికలు, విలాసాలు, రుణాలకు ఈఎంఐ చెల్లించేందుకు సరిపెట్టుకోవాలి. మీ అవసరాలను బట్టి, సంపాదన ఉండకపోవచ్చు. కానీ, మీ సంపాదనను మించి అవసరాలు ఉంటే మాత్రం ఎప్పటికీ ఆర్థిక విజయం సాధ్యం కానే కాదు.

ఎంత తరచుగా పోర్ట్‌ఫోలియోను సమీక్షించాలి?

వంటగదిని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటాం. ఇదే పద్ధతి పోర్ట్‌ఫోలియో విషయంలోనూ పాటించాలి. మధ్యమధ్యలో షేర్లను తనిఖీ చేసుకోవాలి. ఏ విభాగానికి ఎంత కేటాయింపులుండాలని నిర్ణయించుకుంటామో.. అందులో 5-10 శాతానికి మించి తేడా ఉండకూడదు. వివాహం, ఉద్యోగం మార్పు, ఆదాయంలో తేడా.. జీవితంలో ఇతర మార్పులు ఈ కేటాయింపులను ప్రభావితం చేస్తాయి. ఆరోగ్యం లేదా కుటుంబ ప్రాధాన్యతలూ పెట్టుబడుల్లో మార్పులకు కారణం అవుతాయి.



- ఈనాడు బిజినెస్ బ్యూరో, హైదరాబాద్

మద్యం కుంభకోణం తిమింగలాలు త్వరలో జైలుకు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



పీవీఎన్ మాధవ్‌కు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి సత్యకుమార్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్ తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: 'వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారాన్ని ఆర్థిక దోపిడీకి మారుపేరుగా మార్చారు. తీగ లాగితే.. డొంక కదిలింది. తిమింగలాలు త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయం' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి గురువారం ఆయన నిర్వహించారు. అంతకుముందు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. 'ప్రజల సొమ్మును దోచుకుని వైకాపా నేతలు అడ్డంగా దొరికిపోయారు. డిజిటల్ లావాదేవీలు లేకుండా.. డబ్బులు తీసుకుని మద్యం అమ్మి... పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు' అని విమర్శించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాను ఉద్యాన హబ్‌గా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. తర్వాత మాధవ్, సత్యకుమార్‌లు... సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ట్రస్టీ రత్నాకర్‌తో మాట్లాడి సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు.

అవినీతి శాస్త్రవేత్త జగన్ గుట్టురట్టు

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్

ఈనాడు, దిల్లీ: అవినీతి శాస్త్రవేత్త జగన్ గుట్టు బట్టబయలైందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. మద్యం కుంభకోణం గురించి ఆయన ఎప్పటిలాగే తనదైన శైలిలో స్పందించారు. 'జగన్ లూటీ చేసిన దాంట్లో తొలి ఇన్‌స్టాల్‌మెంట్ ఇప్పుడు పోలీసు కస్టడీలో ఉంది. హైదరాబాద్‌లోని ఓ ఫాంహౌస్ నుంచి రూ.11 కోట్లను సీజ్ చేశారు. ముమ్ముందు మద్యం మాఫియా క్యాష్‌ట్రయల్ గుట్టు అంతా రట్టవుతుంది. జగన్ మద్య నిషేధ వాగ్దానం... దోపిడీకి వేసిన ముసుగు మాత్రమే. ఆయన రూ.3,500 కోట్ల మేర ముడుపులు కొల్లగొట్టారు. లీలా డిస్టిలరీ ద్వారా రూ.62 కోట్లు లాండరింగ్ చేశారు. రూ.224 కోట్లు టర్నోవర్ చేసిన యూవీ డిస్టిలరీస్‌కు జగన్ పార్టీతో సంబంధం ఉంది. సీబీఐ, సిట్ దస్త్రాలు మరిన్ని విషయాలపై ఇంకా గట్టిగా మాట్లాడతాయి. ప్రస్తుతం చట్టం తన పని తాను చేసుకుపోతోంది' అని మాణికం ఠాగూర్ పేర్కొన్నారు.

విజయవాడలో ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ ఆధారిత వ్యవస్థ

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి



దాతలు అందజేసిన డ్రోన్లను చూపుతున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు తదితరులు

ఈనాడు, అమరావతి: 'విజయవాడలో త్వరలో అన్ని ప్రధాన కూడళ్లు, శివారు ప్రాంతాల్లో ఏఐ ఆధారిత కేంద్రీకృత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను తీసుకొస్తాం. తద్వారా మేలైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం. గత ఏడాదిగా విజయవాడ నగరంలో సీపీ రాజశేఖర్‌బాబు తీసుకుంటున్న అనేక చర్యలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆచరణీయంగా ఉన్నాయి' అని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో ట్రాఫిక్ పోలీసులకు డ్రోన్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర ఉపకరణాలను డీజీపీ అందజేశారు. ట్రాఫిక్ నిర్వహణలో డ్రోన్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. పోలీసులకు ఇచ్చిన ద్విచక్ర వాహనాలను డీజీపీ జెండా ఊపి ప్రారంభించారు. డ్రోన్లను సమకూర్చిన దాతలను సత్కరించారు.

తప్పిపోయిన బాలికల ఆచూకీ కోసం 'ఆపరేషన్ ట్రేస్'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఏడీజీపీ మధుసూదన్‌రెడ్డి తదితరులు

తప్పిపోయిన బాలికల ఆచూకీ గుర్తించి, వారిని ఆయా కుటుంబాలకు అప్పగించేందుకు 'ఆపరేషన్ ట్రేస్'ను ప్రారంభించినట్లు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ద్వారా అన్ని జిల్లాల్లో ఆగస్టు 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్‌గా దీన్ని అమలు చేయనున్నట్టు వెల్లడించారు. శక్తి యాప్‌లో ''రిపోర్టు మిస్సింగ్ చిల్డ్రన్'' అనే ఫీచర్, 112, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181, శక్తి వాట్సప్ నంబర్ 79934 85111 ద్వారా తప్పిపోయిన పిల్లల గురించి ఫిర్యాదు చేయవచ్చు. ఆపదలో ఉన్నప్పుడు ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే పోలీసులు తక్షణం స్పందిస్తారు' అని డీజీపీ వివరించారు. కార్యక్రమంలో ఏడీజీపీ మధుసూదనరెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్‌ఛార్జి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల అని అబార్షన్.. వికటించి గర్భిణి మృతి



నందికొట్కూరు, పగిడ్యాల, న్యూస్‌టుడే: పుట్టబోయేది ఆడ బిడ్డ అని తెలుసుకొని.. ఆర్ఎంపీతో అబార్షన్ చేయించగా.. అది వికటించి గర్భిణి మృతి చెందింది. ఈ ఘటన నంద్యాల జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. నంద్యాల జిల్లా గడివేముల మండలం గని గ్రామానికి చెందిన శ్రీవాణి(25), బీరవోలుకు చెందిన లోకేష్‌కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. శ్రీవాణి మళ్లీ గర్భం దాల్చడంతో భర్త స్కానింగ్ చేయించి, ఆడపిల్ల పుట్టబోతోందని తెలుసుకున్నారు. ఆడపిల్ల వద్దని నందికొట్కూరులోని గీతారాణి అనే ఆర్ఎంపీ వద్ద గతనెల 28న గర్భవిచ్ఛిత్తి చేయించారు. 29న డిశ్చార్జి అయ్యాక.. 30న శ్రీవాణికి తీవ్ర రక్తస్రావమైంది. ఆరోగ్యం బాగా దెబ్బతింది. దీంతో బాధితురాలి తల్లి వచ్చి శ్రీవాణిని అదే రోజు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పుట్టింటి వారికి తెలియకుండా ఎలా అబార్షన్ చేయిస్తారని మృతురాలి బంధువులు అత్తింటి వారిని నిలదీశారు. శ్రీవాణి తల్లి శివమ్మ ఫిర్యాదుతో ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పీడ్ పోస్టులో రిజిస్టర్డ్ పోస్టుల విలీనం

సెప్టెంబరు ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమలు

ఈనాడు, అమరావతి: బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న రిజిస్టర్డ్ పోస్టు విధానాన్ని తపాలా శాఖ స్పీడ్ పోస్టులో విలీనం చేయబోతోంది. ఈ విధానం సెప్టెంబరు ఒకటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారులకు అత్యంత వేగవంతమైన, మెరుగైన సేవల్ని అందించడం, ట్రాకింగ్ విధానాన్ని సులభతరం చేయడం, అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తేవాలని తపాలా శాఖ నిర్ణయించింది. ఆమేరకు దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్ల పరిధిలోని మెయిల్ ఆపరేషన్ డివిజన్లకు ఆదేశాలు అందాయి. అవసరమైతే 'రిజిస్టర్డ్ పోస్టు'ను స్పీడ్ పోస్టు టెర్మినాలజీతో భర్తీ చేయాలని లేకపోతే తొలగించాలని పేర్కొంది.

ఆ రూ.11 కోట్లు మాచవరం ఎస్‌బీఐలో డిపాజిట్ చేయాలి

ఉత్తర్వులిచ్చిన ఏసీబీ కోర్టు న్యాయాధికారి

ఈనాడు, అమరావతి: శంషాబాద్ ఫామ్‌హౌస్‌లో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నగదును బ్యాంకులో డిపాజిట్ చేయాలని విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. సీజ్ చేసిన డబ్బుపై సిట్ అధికారులు కోర్టులో బుధవారం మెమో దాఖలుచేశారు. విజయవాడలోని మాచవరం స్టేట్ బ్యాంకు శాఖలో ఖాతా తెరిచి ఆ సొమ్ము జమచేయాలని న్యాయాధికారి తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద



సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 2,73,659 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం 8 క్రస్టుగేట్ల ద్వారా 2,16,152 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 66,079 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.70 అడుగులు, నీటినిల్వ 202.9673 టీఎంసీలుగా నమోదైంది.

వివాదాలకు తావు లేకుండా మార్గదర్శులను గుర్తించండి

కలెక్టర్లకు సీఎస్ విజయానంద్ ఆదేశం

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర పీ4 మార్గదర్శులను గుర్తించే విషయంలో ఎలాంటి వివాదాలు, విమర్శలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. సీఎం ఆదేశించిన విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చే మార్గదర్శులకే బంగారు కుటుంబాల దత్తత ఇవ్వాలని, అప్పుడే బంగారు కుటుంబాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ.. 'ఆగస్టు 16న ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో ప్రారంభించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నందున 15వ తేదీ లోపు నిర్ణీత లక్ష్యాలను సాధించాలి' అని సూచించారు.



ఆంత్రప్రెన్యూర్‌ల నుంచి ఏం నేర్చుకోవాలంటే..

ఆంత్రప్రెన్యూర్‌లలో మనల్ని ఆకర్షించే అంశాలు:

- నచ్చిన సమయంలో పని చేసే వెసులుబాటు.
- ఎక్కడి నుంచైనా కార్యకలాపాలు నిర్వహించగలిగే సౌలభ్యం.
- కళ్లు చెదిరే సంపాదన.

వారి నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు:

- అనిశ్చితిని ఎదుర్కొనే తెగువ
- సవాళ్లకు, బాధ్యతలకు వెరవని మనస్తత్వం
- నిరంతరం ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే సామర్థ్యం

– జాన్ బ్రోసియో, కంటెంట్ క్రియేటర్

మద్యం ముడుపుల లెక్కలు జగన్ బాగా చెబుతారు

- మంత్రి లోకేశ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో ఎంత మొత్తంలో డబ్బులు చేతులు మారాయో మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అడిగితే లెక్కలు బాగా చెబుతారని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. ముడుపుల సొమ్ము.. నగదు రూపంలో, పలు ఖాతాలకు చెక్కుల ద్వారానూ వెళ్లినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని గురువారం ఉండవల్లిలోని నివాసంలో విలేకర్లతో లోకేశ్ పేర్కొన్నారు. రూ.11 కోట్ల ముడుపుల సొమ్ము హైదరాబాద్‌లో పట్టుబడటంపై విలేకర్ల ప్రశ్నకు బదులిస్తూ.. ఏ పెట్టెలో ఎంత డబ్బు పడుతుందో జగన్‌కు బాగా తెలుసునన్నారు. ఆ డబ్బు తనది కాదని రాజ్ కెసిరెడ్డి కోర్టులో అఫిడవిట్ వేశారు కదా? అన్న ప్రశ్నకు ''ఆ డబ్బు ఆయనది కాదు, జగన్‌దని చెబుతున్నారని అర్థం చేసుకోవాలి'' అని లోకేశ్ బదులిచ్చారు. జగన్‌ను అరెస్ట్ చేస్తారా? అన్న ప్రశ్నకు చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. కుంభకోణంలో ఇప్పటివరకు బయటపడింది తక్కువేనని, ఐదేళ్ల రికార్డులు చూసేందుకు సమయం పడుతుందని తెలిపారు. ''దేశంలో ఎక్కడైనా మద్యం కంపెనీ రూ.400 కోట్ల బంగారం కొంటుందా? అవినీతి సొమ్ముతో కూడా పెట్టుబడులు పెట్టొచ్చని నిరూపించారు. వాళ్లు కొన్నప్పుడు బంగారం ధర తక్కువ. ఇప్పుడు బాగా పెరగడంతో వారికి మరింత లబ్ధి చేకూరింది'' అని తెలిపారు. ఆ మద్యం కంపెనీ జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ తప్ప అంతకుముందు, తర్వాత ఎప్పుడూ బంగారం కొనలేదని, దీన్నిబట్టే ఆ బంగారం ముడుపుల రూపంలో ఎవరికి వెళ్లిందో అర్థమవుతోందని తెలిపారు.

పెద్దిరెడ్డి కంపెనీకి..

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఓ అవినీతి కంపెనీ అని, అదాన్ డిస్టిలరీ నుంచి ఆ కంపెనీకి మద్యం ముడుపులు వెళ్లాయని లోకేశ్ పేర్కొన్నారు. పెద్దిరెడ్డిపై వ్యక్తిగత కక్షతోనే వేధిస్తున్నారని వైకాపా నేతలు ఆరోపిస్తున్నారు కదా? అన్న ప్రశ్నకు.. ''వ్యక్తిగత కక్ష ఉంటే 2014-19 మధ్య బయట తిరిగేవారా? తప్పు చేశారు కాబట్టే ఇప్పుడు చర్యలు తీసుకుంటున్నాం'' అని తెలిపారు.

జగన్ బయట తిరగగలరా?

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులున్నాయన్న జగన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ''జగన్ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వెయ్యి నుంచి మూడు వేల మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నాం. సీఎంకి కూడా అంత భద్రత లేదు. నిజంగా రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులుంటే జగన్ బయట తిరిగేవారా? జగన్ పర్యటనకు వెళ్లినప్పుడు వైకాపావాళ్లే జనాన్ని తరలిస్తున్నారు. వాళ్లు జగన్ మీద పడితే భద్రత కల్పించలేదని వాళ్లే ఏడుస్తారు. పోలీసులు నియంత్రిస్తుంటే... ఆంక్షలు పెట్టారంటున్నారు. అనంతపురం పర్యటనలో కార్యకర్తల్ని దగ్గరకు రమ్మని జగనే పిలిచారు. వాళ్లంతా మీద పడి హెలికాప్టర్ అద్దం పగలగొడితే.. రూ.16 లక్షల నష్టం వచ్చిందని దాన్ని అద్దెకిచ్చిన కంపెనీ వాపోయింది. జగన్ సత్తెనపల్లి వెళితే.. ఆయన కారు కిందపడి ఒకరు, గుండెపోటుతో ఒకరు, అంబులెన్స్‌లో చిక్కుకుని మరొకరు చనిపోయారు. కనీసం వారిని పరామర్శించలేదు'' అని ధ్వజమెత్తారు.

స్వార్థం కోసం ప్రాంతీయ విద్వేషాలు

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ నేతల ఆందోళన గురించి విలేకర్లు ప్రస్తావించగా.. ''కాళేశ్వరం ప్రాజెక్టుకు మేమెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. సముద్రంలోకి పోతున్న గోదావరి మిగులు జలాల్ని వాడుకునేందుకు మేం బనకచర్ల ప్రాజెక్టు చేపడితే వారికేంటి ఇబ్బంది? కొందరు రాజకీయ స్వార్థం కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి తెలుగువారి మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు'' అని లోకేశ్ ధ్వజమెత్తారు.

మద్యం కుంభకోణంలో డొల్ల కంపెనీలపై సిట్ గురి

- ముంబయికి వెళ్లిన దర్యాప్తు బృందాలు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం ముడుపుల సొమ్ము మళ్లించడానికి వినియోగించిన డొల్ల కంపెనీలపై సిట్ గురిపెట్టింది. వాటి గుట్టు తేల్చేందుకు దర్యాప్తు బృందాలు గురువారం ముంబయికి వెళ్లాయి. ఓల్విక్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రిపటి ఎంటర్‌ప్రైజ్ ప్రైవేట్ లిమిటెడ్, నైస్నా మల్టీవెంచర్ ప్రైవేట్ లిమిటెడ్, ట్రిప్పర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, విక్సో ఎంటర్‌ప్రైజెస్, దీపక్ ఎంటర్‌ప్రైజెస్, విశాల్ ఎంటర్‌ప్రైజెస్, కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహా పలు డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని వైకాపా మద్యం ముఠా పెద్దఎత్తున దోచుకుంది. ఆయా కంపెనీలు ఎవరెవరి పేర్లతో ఉన్నాయి? వారెవరు? అనే వివరాల్ని సిట్ ఇప్పటికే సేకరించింది. ఆయా కంపెనీలను నిందితుల జాబితాలో చేర్చింది. వాటి లావాదేవీలు, జీఎస్టీలు, ఆదాయ పన్నుకు సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టేందుకు సిట్ బృందాలు ముంబయికి వెళ్లాయి.

ధర్మస్థలలో కంకాళాల కలకలం

మంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ధర్మస్థల పరిసరాల్లో పలువురు మహిళలను దారుణంగా హింసించి, కడతేర్చారన్న ఆరోపణలు రాష్ట్రాన్ని కుదిపేస్తున్నాయి. వాస్తవాలు వెలికి తీయడానికి రంగప్రవేశం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం కొనసాగించిన పరిశోధనలో పుర్రెలు, ఎముకలు వెలుగు చూడటం సంచలనం సృష్టిస్తోంది. అవి ఇద్దరు మహిళలకు చెందినవి కావచ్చని ప్రాథమికంగా అంచనావేస్తున్నారు. అటవీ ప్రాంతం కావడం, దానికితోడు భారీ వర్షాల వల్ల దర్యాప్తులో జాప్యం జరుగుతోందని సిట్‌కు నేతృత్వం వహిస్తున్న డాక్టర్ ప్రణబ్ మొహంతి తెలిపారు.





అటవీ ప్రాంతంలో దొరికిన పుర్రెలు, ఎముకలు మూటగట్టుకుని వెళ్తున్న కార్మికులు ● నేత్రవతీ నది ఒడ్డున సిట్ తవ్వకాలు జరుపుతుండడంతో వంతెనపై బారులుతీరిన జనం

బయటపడింది ఇలా..

ధర్మస్థల పరిధిలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేసిన ఒక వ్యక్తి దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీ అరుణ్‌కు ఇటీవల ఒక లేఖ రాశారు. 'గతంలో ఇక్కడ మహిళలు, బాలికలపై ఎన్నో దారుణాలు జరిగాయి. నేనే ఎన్నో శవాలను పూడ్చిపెట్టా' అంటూ ధర్మస్థలలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన ఒక వ్యక్తి (62) చెప్పడంతో దేశమంతా ఉలిక్కిపడింది. '1998 నుంచి 2014 మధ్య వందకు పైగా మృతదేహాలను ఖననం చేశాను. ఆ వ్యక్తులే మా కుటుంబానికి చెందిన యువతిపై అనుచితంగా ప్రవర్తించడంతో మేం దూరంగా వెళ్లిపోయాం. నన్ను పాపభీతి వెంటాడుతోంది. నాకు రక్షణ కల్పిస్తే నాటి ఘటనలను బయటపెడతా' అని ఆ లేఖలో పేర్కొన్నాడని ఎస్పీ తెలిపారు. ఇదే సమయంలో.. 20 ఏళ్ల కిందట తన కుమార్తె అయిన వైద్యవిద్యార్థిని ధర్మస్థలకు వచ్చి కనిపించకుండా పోయిందని సుజాత భట్ అనే మహిళ ఆరోపించారు. పోలీసులు ఫిర్యాదు కూడా తీసుకోలేదని వెల్లడించారు. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం జులై 19న నలుగురు ఐపీఎస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. మృతదేహాలను ఖననం చేశానని చెప్పిన వ్యక్తిని వారు విచారించారు. అతడు చెప్పిన 13 చోట్ల ప్రస్తుతం తవ్వకాలు జరుపుతున్నారు.

450 మంది అదృశ్యం!

దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ఓ చిన్నగ్రామం. ఎన్నో ఏళ్ల కిందటే ఇక్కడ మంజునాథ స్వామి ఆలయం విస్తరించింది. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వీరేంద్ర హెగ్డే ఐదు దశాబ్దాలుగా ఆలయానికి ధర్మాధికారిగా వ్యవహరిస్తున్నారు. గత ఐదు దశాబ్దాల్లో ధర్మస్థల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎన్నో వైద్య కళాశాలలు, ఆయుర్వేద కళాశాలలు, విద్యాసంస్థలు వెలిశాయి. భక్తుల రాకపోకలు పెరిగాయి. అలాంటిచోట తాజా ఆరోపణలు విస్మయం కలిగిస్తున్నాయి. గత పదేళ్లలో ధర్మస్థల, బెళ్తంగడి, ఉజిరె ఠాణాల పరిధిలో 450 మంది అనుమానాస్పదంగా కనిపించకుండాపోయారు. వీటిలో ఒక్క కేసునూ పూర్తి స్థాయిలో విచారించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. పేదలు నోరు మెదపకుండా డబ్బుతో నోరు మూయించారని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. 2014లో కూడా ఒక కళాశాల విద్యార్థిని హత్యాచారానికి గురైంది. స్థానిక మోతుబరి కుటుంబానికి చెందినవారు సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేశారని ఆమె కుటుంబ సభ్యులు పలు ప్రజాసంఘాలతో కలిసి అప్పట్లోనే ఆందోళనలు చేశారు. తమకు అనుమానం ఉన్న కొందరు వ్యక్తులను విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయంటూ వారు తాజాగా కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఇన్నిరకాల ఆరోపణల నేపథ్యంలో స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో ధర్మస్థల పేరు మారుమోగిపోతోంది. దీంతో పలువురు యూట్యూబర్లు తమను లక్ష్యంగా చేసుకుని పోస్టులు, వీడియోలు పెడుతున్నారంటూ కొందరు పెద్దలు బెంగళూరులోని సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. అసత్య ప్రచారం చేయవద్దని న్యాయస్థానం సామాజిక మాధ్యమాలపై నిర్బంధాన్ని విధించింది. దాన్ని ప్రశ్నిస్తూ ఒక యూట్యూబ్ ఛానెల్ ప్రతినిధులు సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లినా వారి ప్రయత్నం ఫలించలేదు.

EENADU Vol: 51, Issue: 353 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

బ్రెజిల్‌పై 50 శాతం సుంకం

- అమెరికా అధ్యక్షుడి ప్రకటన
- మెక్సికోకు 90 రోజుల చర్చల గడువు
- అప్పటిదాకా 25% అమలు

వాషింగ్టన్: బ్రిక్స్ దేశాలపై సుంకాల మోత మోగిస్తానన్న ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్‌పై 25 శాతం సుంకాలను విధించిన ఆయన.. బ్రెజిల్‌పై సుంకాలను ఏకంగా 50శాతానికి పెంచారు. శుక్రవారం నుంచే ఇవి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. మరోవైపు పొరుగుదేశం మెక్సికోపై కొంత కరుణ చూపారు. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం కోసం 90 రోజుల సమయమిచ్చారు. అయితే ఈ సమయంలో 25శాతం సుంకం అమల్లో ఉంటుందని గురువారం ప్రకటించారు.

✦ బ్రెజిల్‌పై 50 శాతం సుంకాలను విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై బుధవారం ట్రంప్ సంతకం చేశారు. దీంతో ఆ దేశంపై ఇప్పటికే ఉన్న 10శాతం సుంకాలకు అదనంగా 40 శాతం జతకానుంది.

✦ మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌తో జరిగిన చర్చలు విజయవంతమయ్యాయని, మరిన్ని చర్చలద్వారా రెండు దేశాలు ఒకదానినొకటి అర్థం చేసుకోవడానికి అవకాశం లభిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. అందుకే 90 రోజుల సమయం ఇస్తున్నానని వెల్లడించారు.

క్రైస్తవ సన్యాసినుల విడుదలకు చర్యలు తీసుకోండి

- అమిత్ షాకు కేరళ ఎల్డీఎఫ్ ఎంపీల వినతి

దిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేరళకు చెందిన ఎల్డీఎఫ్ ఎంపీలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు దిల్లీలో గురువారం విజ్ఞాపనపత్రం సమర్పించారు. వారి అరెస్టు తీవ్ర అన్యాయమని, దేశంలో క్రైస్తవ మిషనరీలను లక్ష్యంగా చేసుకొని దాడులు పెరుగుతున్న కోణంలో ఈ పరిణామాన్ని చూడాలని అందులో పేర్కొన్నారు. క్రైస్తవులపై హింస ఘటనలు నిరుడు దేశవ్యాప్తంగా 834 నమోదయ్యాయని తెలిపారు. సీపీఎం నేతలు జాన్ బ్రిటాస్, వి.శివదాసన్, అమ్రా రామ్, ఆర్.సచ్చిదానందమ్, కె.రాధాకృష్ణన్, ఎ.ఎ.రహీమ్, సీపీఐ నాయకులు పి.సందోష్‌కుమార్, పి.పి.సునీర్ తదితరులు విన్నపత్రంపై సంతకాలు చేశారు. మరోవైపు- ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన క్రైస్తవ సన్యాసినుల విడుదలకు చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ ఇచ్చినట్లు కేరళ యూడీఎఫ్ ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్ దిల్లీలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు.

గుజరాత్‌లో స్వల్ప భూకంపం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని కచ్ జిల్లాలో స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేలుపై దీని తీవ్రత 3.3గా నమోదైంది. గురువారం ఉదయం 9.52 గంటల సమయంలో ప్రకంపనలు సంభవించాయి. జిల్లాలోని బేలాకు నైరుతి దిశలో 16 కి.మీ దూరంలో భూకంపం కేంద్రాన్ని గుర్తించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని జాతీయ విపత్తు సంస్థ వెల్లడించింది.

కీవ్‌పై క్షిపణి దాడి

- 11 మంది మృతి... 124 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై క్షిపణులు, డ్రోన్లతో రష్యా చేసిన దాడుల్లో ఆరేళ్ల బాలుడు సహా 11 మంది మృతి చెందారు. 124 మంది గాయాలపాలయ్యారు. 'రష్యా దాడిలో తొమ్మిది అంతస్తుల భవనం కుప్పకూలింది. శిథిలాల కింద ఇంకా కొంత మంది చిక్కుకున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దాడుల్లో కీవ్‌లోని 27 ప్రదేశాలు దెబ్బతిన్నాయి' అని గురువారం ఉక్రెయిన్ సైనిక పరిపాలన అధిపతి తైమూర్ త్కాచెంకో తెలిపారు.

సాంకేతిక సమస్యతో ఎయిరిండియా విమానం టేకాఫ్ నిలిపివేత

దిల్లీ: దేశరాజధాని దిల్లీ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రన్‌వేపై ప్రయాణిస్తున్న విమానాన్ని దిల్లీ విమానాశ్రయం అధికారులు వెనక్కి రప్పించారు. ప్రయాణికులను లండన్‌కు చేరేందుకు ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ సంస్థ అధికారి ఒకరు తెలిపారు.

ఫ్రాన్స్, బ్రిటన్ బాటలోనే కెనడా

- పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటన

ఒట్టావా: ఫ్రాన్స్, బ్రిటన్ బాటలో కెనడా కూడా పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటించింది. సెప్టెంబరులో జరగనున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఈ మేరకు నిర్ణయం తీసుకొనే ఆలోచన ఉందని తెలిపింది. అయితే ఇది ఇజ్రాయెల్ వైఖరిపై ఆధారపడి ఉంటుందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. అదే సమయంలో పాలస్తీనా కూడా కొన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య సంస్కరణలతో పాటు, హమాస్ లేకుండా గాజా ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ అంగీకరించకపోతే పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని బ్రిటన్ ప్రకటన చేసిన మరుసటి రోజే కెనడా కూడా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ కూడా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. కెనడా ప్రకటనను ఇజ్రాయెల్ తప్పుబట్టింది. ఇది హమాస్‌కు లబ్ధి చేకూర్చేలా, గాజాలో కాల్పుల విరమణ దెబ్బతినేలా ఉందంటూ ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ విమర్శించింది.

లిథువేనియా ప్రధాని రాజీనామా

విల్నియస్: లిథువేనియా ప్రధానమంత్రి గింటౌటాస్ పలుకస్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన వ్యాపార లావాదేవీలపై దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో పదవి నుంచి తప్పుకొంటున్నట్లు గురువారం ప్రకటించారు. అక్టోబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల అనంతరం ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో ప్రధాని బాధ్యతలను స్వీకరించారు.

పాక్‌తో చమురు ఒప్పందం వెనుక

అమెరికా వ్యూహమేంటి?

- అసలు దాయాది దేశంలో ఉన్న చమురు నిల్వలెన్ని..



ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై సుంకాల యుద్ధానికి దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. దాయాది దేశం పాకిస్థాన్‌తో మాత్రం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా పాక్‌లో భారీ చమురు నిక్షేపాల వెలికితీతలో అమెరికా సాయపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో అసలు పాక్‌తో ఒప్పందం వెనుక అమెరికా వ్యూహం ఏంటి.. చైనా, భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలపై ఈ ఒప్పందం ప్రభావం ఉంటుందా.. అసలు పాక్‌లో ఉన్న చమురు నిల్వలెన్ని.. ఈ ఒప్పందంతో భారత్ నష్టపోతుందా.. పాక్‌ను సంతోషపెట్టేందుకే ట్రంప్ భారత్‌పై సుంకాలు వేశారా.. అనేవి ఆసక్తికరంగా మారాయి.

పాక్‌లో చమురు నిల్వల సంగతి ఇదీ..

పాక్ గురించి ట్రంప్ ఎంత గొప్పగా మాట్లాడినా వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. పాకిస్థాన్ వద్ద ప్రస్తుతం అంతగా చమురు నిల్వలు లేవు. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఈఐఏ), వరల్డ్ మీటర్ డేటా ప్రకారం 2016 నాటికి పాకిస్థాన్‌వద్ద 353.5 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలున్నాయి. ప్రపంచంలోని మొత్తం నిల్వల్లో ఇది కేవలం 0.021శాతమే. ఈ నిల్వలు అధికంగా కలిగి ఉన్న దేశాల్లో పాక్‌ది 52వ స్థానం. ప్రస్తుతం పాక్‌కు రోజుకు దాదాపు 5,56,000 బ్యారెళ్ల చమురు అవసరం. పాకిస్థాన్ రోజువారీ చమురు ఉత్పత్తి దాదాపు 88,000 బ్యారెళ్లు. దీంతో దాదాపు 85శాతం చమురును పాక్ దిగుమతి చేసుకుంటోంది. అయితే పాక్‌లోని సింధూ బేసిన్‌లో ఇటీవలే భౌగోళిక సర్వే జరిగింది. అక్కడి నీటి అడుగున చమురు, గ్యాస్ నిల్వలను గుర్తించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అక్కడి చమురును వెలికితీస్తే వెనిజువెలా, సౌదీ అరేబియా, ఇరాన్ తర్వాత ప్రపంచంలోని ఎక్కువ చమురు నిల్వలు ఉన్న దేశంగా పాక్ ఉండొచ్చని సమాచారం. అందుకే ట్రంప్ దాయాది దేశంతో డీల్ కుదుర్చుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

చైనాను అడ్డుకునేందుకేనా?

పాకిస్థాన్.. చైనాకు వ్యూహాత్మక భాగస్వామిగా ఉంది. చైనా నుంచి జేఎఫ్-17 యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తోంది. పాక్‌తో అమెరికా ఎంత స్నేహం చేసినా చైనాలా కుదరట్లేదు. దీంతో చమురు ఒప్పందం ద్వారా పాకిస్థాన్‌ను పూర్తిగా చైనా శిబిరంలోకి వెళ్లకుండా నిరోధించాలని ట్రంప్ ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పాకిస్థాన్‌ను ఈ ఒప్పందం ద్వారా తమ ఆధీనంలో ఉంచుకోవాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ, ఆర్థిక, భౌగోళిక కారణాలు

అమెరికా, పాక్ ఒప్పందం కుదరడానికి బీజం ఈ ఏడాది జూన్‌లోనే పడింది. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌ను ట్రంప్ విందుకు ఆహ్వానించారు. అలాగే జులై 26న పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోను కలిశారు. పాకిస్థాన్‌తో చమురు ఒప్పందాన్ని ట్రంప్ కుదుర్చుకోవడం వెనుక చాలా కారణాలున్నాయి. ఎందుకంటే ట్రంప్ ఏదైనా దేశంతో అంత సులభంగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోరు. అధ్యక్షుడి నిర్ణయం.. అమెరికాకు ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తుందనే వాదనలున్నాయి. ప్రాంతీయ, భౌగోళిక రాజకీయాల్లో అనేక లక్ష్యాలను ఛేదించే వ్యూహం కూడా ఉందని చెబుతున్నారు. చమురును వెలికితీసే ప్రాజెక్టును అమెరికన్ కంపెనీని అప్పగించనున్నారు.



యుద్ధనౌక స్టెల్త్ గైడెడ్-మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నంపై అమితాబ్ బచ్చన్. ఈ చిత్రాన్ని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

రోహింగ్యాలు చొరబాటుదారులా?.. శరణార్థులా?: సుప్రీం కోర్టు



దిల్లీ: "రోహింగ్యాలు శరణార్థులా లేక అక్రమ చొరబాటుదారులా? అన్నదే ప్రధాన సమస్య.. తొలుత దీనిపై స్పష్టతవస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయి" అని అత్యున్నత న్యాయస్థానం గురువారం పేర్కొంది. ఒకవేళ రోహింగ్యాలు చొరబాటుదారులైతే వారిని బహిష్కరిస్తున్నారా? అని ప్రశ్నించింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. "శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, అధికారాలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు కాకుండా అక్రమ వలసదారులైతే.. వారిని బహిష్కరించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్య సరైనదేనా? చొరబాటుదారులని తేలినప్పటికీ వారిని నిరవధికంగా నిర్బంధించవచ్చా? కోర్టు బెయిల్‌పై విడుదల చేయవచ్చా? చేస్తే ఎలాంటి షరతులు విధించవచ్చు? రోహింగ్యాలు చట్ట విరుద్ధంగా ప్రవేశించినట్లయితే వారిని బహిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయా? అని ధర్మాసనం ప్రశ్నించింది. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని పిటిషనర్ల తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది.

సోనియా, రాహుల్ క్షమాపణ చెప్పాలి

- మాలేగావ్ పేలుళ్ల కేసులో భాజపా డిమాండ్

దిల్లీ: మాలేగావ్ కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా కోర్టు ప్రకటించడంపై భాజపా, ఆరెస్సెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు ఓట్ల కోసం కాంగ్రెస్ చేసిన కుట్ర అని ధ్వజమెత్తారు. కాషాయంపై ఉగ్రవాదాన్ని బలవంతంగా రుద్దడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నం విఫలమైందని భాజపా నేత రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలందరూ హిందువులకు క్షమాపణ చెప్పాలని భాజపా ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయా డిమాండ్ చేశారు. కోర్టు తీర్పుతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని ఆరెస్సెస్‌కి చెందిన అఖిలభారత ప్రచార్ ప్రముఖ్ సునీల్ అంబేకర్ తెలిపారు.

ప్రభుత్వ ద్వంద వైఖరి: అసదుద్దీన్

పేలుళ్లు జరిగిన 17 ఏళ్ల తర్వాత నిందితులను నిర్దోషులుగా ప్రకటించడం.. దర్యాప్తుపై పలు సందేహాలను కలిగిస్తోందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. 'ఉగ్రవాద కేసుల్లో ప్రభుత్వం ద్వంద వైఖరి అనుసరిస్తోంది. ఉగ్రవాదానికి రెండు విధానాలు ఉండకూడదు. మసీదుల దగ్గర బాంబు పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు ఎలాంటి న్యాయం జరగలేదు' అని తెలిపారు.

ఏ మతమూ ఉగ్రవాదాన్ని సమర్థించదు: దిగ్విజయ్ సింగ్

"ఏ మతంతోనూ ఉగ్రవాదాన్ని ముడి పెట్టకూడదు. ఏ మతం కూడా ఉగ్రవాదాన్ని సమర్థించదు. మతాన్ని వక్రీకరించి ద్వేషాన్ని వ్యాప్తి చేసేవారే నిజమైన ఉగ్రవాదులు" అని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు.

ఏమిటీ మాలేగావ్ కేసు..

ముంబయి: మహారాష్ట్రలో ముంబయి నగరానికి 200 కి.మీ దూరంలో ఉన్న మాలేగావ్‌లో మసీదు వద్ద 2008 సెప్టెంబరు 29న బాంబు పేలి ఆరుగురు దుర్మరణం చెందారు. 100 మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో భాజపా నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకుర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, రిటైర్డ్ మేజర్ రమేశ్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిందితులుగా ఉన్నారు. 220 మంది సాక్షులను విచారించగా.. వారిలో 15 మంది అంతకుముందు తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మాట్లాడటం గమనార్హం. 2018లో ప్రారంభమైన విచారణ ఈ ఏడాది ఏప్రిల్ 19న ముగిసింది. అప్పుడు రిజర్వు చేసిన తీర్పును జడ్జి గురువారం వెలువరించారు.

జడ్జి గారూ.. రూ.750 ఇప్పించండి..

- మాలేగావ్ తీర్పు సమయంలో ఆసక్తికర ఘటన

ముంబయి: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. అయితే, తీర్పు సమయంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. నిర్దోషులుగా విడుదలవ్వబోయే వారి డిమాండ్లు కోర్టులో ఉన్నవారందరినీ ఒకింత ఆశ్చర్యానికి గురిచేశాయి. నిర్దోషులుగా తేలిన వారిలో సమీర్ కులకర్ణి ఒకరు. అరెస్టు సమయంలో తన దగ్గర నుంచి రూ.900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, రికార్డుల్లో రూ.750 మాత్రమే చూపించారని కోర్టుకు తెలిపారు. రూ.150 వదిలేసినా మిగిలిన రూ.750 తిరిగి తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు. దీనిపై ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కేసుకు సంబంధించిన వస్తువులుగానీ, నగదుగానీ తిరిగి ఇచ్చేందుకు కుదరదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. "జైలు నుంచి విడుదలైనా మీ రూ.750 తిరిగి పొందాలంటే కొన్నాళ్లు వేచి ఉండాల్సిందే"నని తెలిపారు. అంతేకాకుండా 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేసేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేయగా..నిబంధనలకు విరుద్ధమంటూ జడ్జి నిరాకరించారు.



అంజలి కుమారి, అన్షుల్ కుమార్

పట్నాలో ఇద్దరు పిల్లల దహనం

పట్నా: బిహార్ రాజధాని నగరం పట్నాలోని జానీపుర్ ప్రాంతంలో గురువారం హృదయ విదారక ఘటన వెలుగు చూసింది. ఓ ఇంట్లో ఇద్దరు అక్కాతమ్ముళ్ల మృతదేహాలను కాలిన స్థితిలో గుర్తించారు. చనిపోయిన పిల్లల పేర్లు అంజలి కుమారి (15), అన్షుల్ కుమార్ (10) కాగా, వారి మృతదేహాలు పడున్న పరుపు కూడా కాలిపోయి ఉంది. పట్నాలోని ఎయిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న శోభాదేవి, ఈసీ కార్యాలయ ఉద్యోగి లాలన్ కుమార్‌ల పిల్లలే వీరు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదని, అగ్నిప్రమాదం కూడా కావచ్చని పట్నా నగర ఎస్పీ భానుప్రతాప్ సింగ్ మీడియాకు తెలిపారు. పిల్లలు ఉన్న గదికి బయట నుంచి గొళ్లెం వేసి ఉన్నట్లు తల్లిదండ్రులు చెప్తున్నారు. బిహార్‌లో ఎవరూ సురక్షితంగా లేరని ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ ఈ ఘటనపై 'ఎక్స్‌'లో పోస్టు పెట్టారు.

ఖాళీ మద్యం సీసా తిరిగిస్తే.. రూ.20 వాపస్

ఇంటర్నెట్ డెస్క్: మద్యం తాగాక ఖాళీ బాటిళ్లను పక్కకు విసిరేయడం చాలామంది మందుబాబులకు అలవాటు. ఈ కారణంగా ఖాళీ బాటిళ్లు పేరుకుపోయి



పర్యావరణానికి హానికరంగా మారుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కేరళ ప్రభుత్వం కొత్త చిట్కా అమలుకు నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి మద్యం బాటిలుపై అదనంగా రూ.20 ముందస్తుగా జమ చేయాలని ప్రకటించింది. మళ్లీ అదే దుకాణంలో ఖాళీ బాటిలు తిరిగి ఇస్తే... డిపాజిట్ సొమ్మును వాపసు చేస్తారని తెలిపింది. కేరళ రాష్ట్రవ్యాప్తంగా బేవరేజస్ కార్పొరేషను ద్వారా ఏటా 70 కోట్ల సీసాల మద్యం విక్రయిస్తుండగా.. ఇందులో 56 కోట్ల బాటిళ్లు మాత్రమే రీసైకిలు అవుతున్నాయి. మిగతావన్నీ వ్యర్థాలుగా మిగిలిపోతున్నాయి. దీనిని తగ్గించేందుకే 20 రూపాయల నిర్ణయం తీసుకొన్నట్లు కేరళ అబ్కారీ శాఖ మంత్రి ఎం.బి.రాజేశ్ వెల్లడించారు. రూ.800 కంటే తక్కువ ధర కలిగిన మద్యాన్ని మాత్రమే ప్లాస్టిక్ బాటిళ్లలో సరఫరా చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. సెప్టెంబరులో కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ విధానం ప్రవేశపెట్టి.. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. తమిళనాడు ఇప్పటికే ఈ తరహా బైబ్యాక్ విధానాన్ని అనుసరిస్తోంది.

ఆరెస్సెస్ మహిళా విభాగ మాజీ చీఫ్ ప్రమీలా మృతి

నాగ్‌పుర్: ఆరెస్సెస్ మహిళా విభాగం రాష్ట్రీయ సేవికా సమితి మాజీ ప్రముఖ్ సంచాలిక(చీఫ్) ప్రమీలా తాయీ మేఢే మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె 97 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. నాగ్‌పుర్‌లోని తన నివాసం దేవి అహల్యా మందిర్‌లో గురువారం ఉదయం 9.05 గంటలకు మేఢే మరణించినట్లు రాష్ట్ర సేవికా సమితి ప్రకటించింది. ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్, రాష్ట్రీయ సేవికా సమితి అధ్యక్షురాలు శాంతక్క నాగ్‌పుర్‌కు చేరుకుని ప్రమీలా పార్థివదేహానికి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'ఎక్స్‌'లో మేఢేకు నివాళులర్పించారు. ప్రమీలా తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారని, మహిళా సాధికారత, సామాజిక సేవకు ఆమె చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని ప్రధాని మోదీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. రాష్ట్రీయ సేవికా సమితి ఏర్పడిన తొలినాళ్ల నుంచి ప్రమీలా తాయీ సేవలను అందించారు. సమితికి ఆమె నాలుగో ప్రముఖ్ సంచాలికగా మేఢే బాధ్యతలు నిర్వహించారు.



ప్రమీలా తాయీ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఆరెస్సెస్ అధినేత భాగవత్

మేఢే చివరి కోరిక మేరకు శుక్రవారం ఉదయం ఆమె పార్థివదేహాన్ని ఎయిమ్స్ నాగ్‌పుర్‌కు దానం చేయనున్నారు.

ఈడీ అధికారాలపై సుప్రీంకోర్టు సమీక్ష

దిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారాలపై 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్షకు దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరించవచ్చా అనే అంశంపై మొదట వాదప్రతివాదాలను ఆలకిస్తామని సర్వోన్నత న్యాయస్థాన త్రిసభ్య ధర్మాసనం గురువారం తెలిపింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని అరెస్టు చేయడానికి, వారి ఆస్తులు జప్తు చేయడానికి ఈడీకి అధికారాలు ఉన్నాయని మూడేళ్ల క్రితం ఇచ్చిన తీర్పులో ఉంది. ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికే 2002 నాటి పీఎంఎల్ఏ చట్టాన్ని తెచ్చిందని ఆరోపిస్తూ దాఖలైన 200 పిటిషన్లపై ఆ తీర్పు చెప్పింది. నగదు అక్రమ చలామణి నేరారోపణను ఎదుర్కొంటున్న వ్యక్తి ఆస్తులు అక్రమార్జన అని నిరూపించాల్సిన బాధ్యత ఈడీకి లేదని, తనవి సక్రమ ఆస్తులని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిదేనని దానిలో పేర్కొంది. సుప్రీంకోర్టు ఈ రెండు అంశాలపైనే నోటీసులు ఇచ్చిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ రెండు అంశాలను దాటి విచారణ జరపకూడదని కేంద్రం కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 6న చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది.

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఈసీ కార్యాలయం వరకు ర్యాలీ

- వచ్చేవారం చేపట్టే యోచనలో విపక్ష పార్టీలు

దిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటరు జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)'కు వ్యతిరేకంగా పార్లమెంటు లోపల, వెలుపల విపక్ష ఇండియా కూటమి పార్టీలు నిరసనలు కొనసాగించనున్నాయి. దిల్లీలో గురువారం జరిగిన కూటమి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. వచ్చేవారం ఈసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టే అవకాశాలపై కూడా అవి చర్చించాయి. పార్లమెంటు ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో ఎస్ఐఆర్‌ను ప్రాధాన్యాంశంగా తీసుకొని, దానిపై చర్చకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని తీర్మానించుకున్నాయి. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'ఓట్ల దోపిడీ', 'ఓట్ల రద్దు' వంటి పదాలను ఉపయోగిస్తూ ప్రచార కార్యక్రమాలు చేపట్టే అవకాశాలపైనా విపక్ష పార్టీలు చర్చించాయి. రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ నేత డెరెక్ ఓబ్రియెన్, డీఎంకే నేతలు టి.ఆర్.బాలు, తిరుచ్చి శివ, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బిహార్ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ దిల్లీలో విపక్షాల ధర్నా

దిల్లీ: ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ దిల్లీలోని పార్లమెంటు ప్రాంగణంలో గురువారం విపక్ష ఎంపీలు ధర్నా చేశారు. ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎంపీలు ప్రియాంకా గాంధీ, అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ)తో పాటు డీఎంకే, టీఎంసీ, ఆర్జేడీ, వామపక్షాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. గత 8రోజులుగా వీరు నిరసనను కొనసాగిస్తున్నారు.

చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు

- జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి అంతర్జాతీయ టెండర్లకు ఆహ్వానం

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూకశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టిపెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది.

కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఇన్నాళ్లూ పక్కన పెట్టాల్సి వచ్చింది. ఇటీవల సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేతతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవరోధాలు తొలగిపోయినట్లయ్యింది. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్ కేంద్రం నిర్మాణానికి దాదాపు రూ.22వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే మొదలుపెట్టి కొంత ఖర్చు కూడా చేసినట్లు సమాచారం. 2021లో కేంద్రం జోక్యం చేసుకుని ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యం చేయడంతో పాటు పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అవరోధాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది.

సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతో పాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నీరు నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించాలన్నా.. పాకిస్థాన్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఎటువంటి అనుమతులు, సమాచారం పంచుకోవడం అవసరం లేదు.

నాలుగేళ్లలో 78 వేల హెక్టార్లకు పైగా అటవీ భూమిని మళ్లించాం

- రాజ్యసభకు తెలిపిన కేంద్రం

దిల్లీ: గత నాలుగేళ్లలో వివిధ ప్రాజెక్టుల కోసం దేశవ్యాప్తంగా 78,100 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలిపింది. ఒక్క 2025 ప్రథమార్థంలోనే 12,324.32 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఎగువ సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందులో 2021 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు 78,135.84 హెక్టార్ల భూమిని అటవీయేతర వినియోగానికి ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 17,393.65 హెక్టార్ల భూమి ఆమోదం పొందింది. ఆ తర్వాత ఒడిశాలో 11,033.08 హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్‌లో 1020.63 హెక్టార్ల భూమిని, కర్ణాటకలో 1385.38 హెక్టార్లు, దిల్లీ 118.59 హెక్టార్ల అటవీ భూమిని నిర్మూలించారు. 2014 నుంచి 2024 వరకు 1.73 లక్షల హెక్టార్ల అటవీ భూమిని మైనింగ్, జల విద్యుత్ ప్రాజెక్టులు సహా ఇతర ఇతర ప్రయోజనాల కోసం మళ్లించినట్లు గతంలో పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలిపింది.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో గురువారం గోస్వామి తులసీదాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

వరదలతో వృద్ధులకు ఆరోగ్య సమస్యలు

దిల్లీ: వరద ప్రాంతాల వృద్ధులలో చర్మ, నాడీసంబంధ సమస్యలు, కీళ్ల సమస్యలు పెరుగుతాయని అమెరికాలో 17 ఏళ్ల వరద, ఆరోగ్య బీమా సమాచారాల విశ్లేషణ వెల్లడించింది. వరద సమయంలో నీరు కలుషితం కావడం, పారిశుద్ధ్య సౌకర్యాలు దెబ్బతినడం వల్ల 65 ఏళ్లుపైబడిన వృద్ధులలో చర్మ సమస్యలతో ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య 3 శాతం పెరుగుతోంది. ఆదుర్దా, ఆందోళన వల్ల నాడీసంబంధ సమస్యలు వచ్చి ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య 2.5 శాతం ఎక్కువైంది. కండరాలు, కీళ్ల సమస్యలతో, గాయాలతో, నీరు, ఆహారం కలుషితం కావడంతో ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య 1 శాతం పెరిగిందని హార్వర్డ్ తదితర సంస్థల పరిశోధకులు తెలిపారు. 2000-2016 మధ్య కాలంలో వరదలు వచ్చిన ప్రాంతాలలో 65 ఏళ్లుపైబడిన వారి ఆరోగ్య బీమా క్లెయిములను పరిశీలించిన మీదట పై అంశాలను నిర్ధారించారు.

ఈనాడు సినిమా


కియారా, హృతిక్

ఊపిరి ఊయలగా

'వార్ 2' ప్రచార హంగామా షురూ అవుతోంది. త్వరలోనే ఎన్టీఆర్ కూడా రంగంలోకి దిగనున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆయన సినిమాకి కొన్ని రోజులు విరామం ఇచ్చి 'వార్ 2' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు ఎన్టీఆర్. ఆయన, బాలీవుడ్ స్టార్ హృతిక్‌రోషన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమే 'వార్ 2'. కియారా అడ్వాణీ కథానాయిక. యశ్‌రాజ్ ఫిలిమ్స్ తన ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తున్న చిత్రమిది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాత. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'నీ గుండె గుమ్మంలోకి ప్రతి రోజూ... వస్తూ పోతుంటా ఊపిరి ఊయలగా...' అంటూ సాగే పాటని ఇటీవల విడుదల చేశారు. హృతిక్‌రోషన్, కియారాలపై చిత్రీకరించిన ఈ పాటని తెలుగులో శశ్వాత్‌సింగ్, నిఖితా గాంధీ ఆలపించారు. చంద్రబోస్ సాహిత్యం అందించారు. ప్రీతమ్ స్వరకర్త. "హృతిక్, కియారాల మధ్య అందమైన కెమిస్ట్రీని ఆవిష్కరించే పాట ఇది. లొకేషన్స్, చిత్రీకరణ ఆకట్టుకునేలా ఉంటాయి. హృతిక్, ఎన్టీఆర్ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగే పోరాట సన్నివేశాలు అలరిస్తాయి. ఈ చిత్రం హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'పెద్ది' సందడి


రామ్‌చరణ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్‌తో పాటు, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.

'కింగ్డమ్ 2'లో మరొక అగ్ర హీరో కూడా!


సత్యదేవ్, విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్'తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేస్తూ చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ప్రేక్షకుల స్పందన మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని పంచింది. అమెరికాలో ప్రదర్శనలు మొదలైనప్పటి నుంచి నాకు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. 'అన్నా... మనం హిట్ కొట్టినం' అంటూ భావోద్వేగంతో మాట్లాడుతున్నారు. ఆ ఆనందంలో నన్ను కూడా ఏడిపించారు. అందరి ప్రేమతోనే ఈ విజయం సాధ్యమైంది. నిర్మాత నాగవంశీకి ఈ సినిమాపై ఉన్న నమ్మకం నిజమైంది. నా నటనకి ఇన్ని ప్రశంసలు వస్తున్నాయంటే దానికి కారణం దర్శకుడు గౌతమ్. టీజర్‌కి వాయిస్ ఓవర్ ఇచ్చిన ఎన్టీఆర్ అన్నకు, అభిమానులకి, తెలుగు ప్రేక్షకులకు నా కృతజ్ఞతలు" అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం" అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ "విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

మనం కొట్టినం: రష్మిక

'కింగ్డమ్' సినిమాకి లభిస్తున్న ఆదరణపై కథానాయిక రష్మిక ఎక్స్ ద్వారా స్పందించారు. విజయ్ దేవరకొండని ఉద్దేశించి ఆమె పంచుకున్న పోస్ట్‌లో 'నీకు, నిన్ను ప్రేమిస్తున్నవారికి ఈ విజయం ఎంత ముఖ్యమో నాకు తెలుసు. మనం కొట్టినం' అంటూ వ్యాఖ్యతో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. విజయ్ కూడా 'మనం కొట్టినం' అంటూ ప్రతిస్పందించారు. 'అన్నా... మనం హిట్ కొడుతున్నాం' అంటూ తన అభిమానులు ఎంతో నమ్మకంగా ఉన్నారంటూ విజయ్ దేవరకొండ 'కింగ్డమ్' ప్రచార కార్యక్రమాల్లో చెప్పేవారు. ఆ విషయాన్నే ప్రస్తావిస్తూ రష్మిక పోస్ట్‌ని పంచుకున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన విజయ్, రష్మిక మందన్న మధ్య మంచి స్నేహం ఉంది.

కొత్త పాట గురూ!

ఎందుకంత పంతం... వినండి కొంచెం!


నారా రోహిత్

"వీడంతటోడు ఏ ఊళ్లో లేడు... ఓసారి గూగుల్ తిరగేసి చూడు..." అంటూ ఓ అబ్బాయి గురించి గొప్పగా చెప్పారు స్నేహితులంతా కలిసి! అదంతా ఎందుకోసం? ఇంతకీ ఆ అబ్బాయి ప్రత్యేకత ఏమిటో తెలియాలంటే 'సుందరకాండ' చూడాల్సిందే. నారా రోహిత్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘాని కథానాయికలు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. వినాయక చవితి సందర్భంగా ఆగస్టు 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఈ చిత్రంలోని "ప్లీజ్ ప్లీజ్ ప్లీజ్ మేమ్... మీకెందుకు ఇంత పంతం... వినండి కొంచెం' అంటూ సాగే పాటని విడుదల చేశారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ పాటని అర్జున్ చాందీ, దీపక్ బ్లూ, అరవింద్ శ్రీనివాస్, సాయిశరణ్, రేష్మా శ్యామ్, హరిప్రియ, లవితా లోబో కలిసి ఆలపించారు. లియోన్ జేమ్స్ స్వరపరిచారు. "నారా రోహిత్ కెరీర్‌లో మైలురాయిలాంటి ఆయన 20వ చిత్రమిది. విభిన్నమైన కథ, కథనాలతో సరదా సరదాగా సాగుతుంది. ప్లీజ్ మేమ్... అంటూ సాగే పాటలో నారా రోహిత్, శ్రీదేవి విజయ్ కుమార్ మధ్య కెమిస్ట్రీ అందంగా ఉంటుంది. ట్రెండీగా సాగే ఈ పాట చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ రెండు చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమైంది. తాజాగా 'ఓ భామ.. అయ్యో రామ', 'రెడ్ శాండల్ వుడ్' చిత్రాలు అలరిస్తున్నాయి.

ఈటీవీ విన్‌లో వినోదాలు



భామతో ప్రేమ: తల్లిని కోల్పోయిన రామ్(సుహాస్) ఆ బాధలో ధైర్యాన్ని కోల్పోయి.. భయంతో తన కలలకి కూడా దూరంగా ఉంటాడు. అనుకోకుండా ఓ రోజు తాగిన మత్తులో ఉన్న సత్యభామ (మాళవిక మనోజ్) ఎదురవుతుంది. ఆమెని జాగ్రత్తగా తీసుకెళ్లి ఇంటి దగ్గర దింపుతాడు రామ్. అలా ఆ మంచితనం నచ్చి సత్య తనని ప్రేమిస్తుంది. మరి ప్రేమతో సత్య వచ్చాక రామ్ జీవితం ఎన్ని మలుపులు తిరిగింది? వీరి ప్రేమ కథ తెలియాలంటే 'ఓ భామ..అయ్యో రామ' సినిమా చూడాల్సిందే. ఈటీవీ విన్ వేదికగా నేటి నుంచి ప్రసారం కానుంది. రామ్ గోదల దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మించిన ఈ సినిమాలో అలీ, అనిత తదితరులు నటించారు.



ఎర్రచందనం స్మగ్లింగ్ చుట్టూ: ఉత్తర మద్రాస్ నుంచి తన ప్రియురాలి సోదరుడిని వెతుక్కుంటూ ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంటకు ప్రయాణిస్తుంటాడు ఒక బాక్సర్. తన ప్రయాణంలో అనుకోకుండా ఒక ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే ప్రమాదకరమైన ప్రదేశాన్ని కనుగొంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? ఆ స్మగ్లింగ్ చుట్టూ ఉన్న వాస్తవ సంఘటనలను తెలుసుకోవాలంటే చూడాల్సిందే 'రెడ్ శాండల్ వుడ్' సినిమా. గురువారం నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రసారం అవుతున్న ఈ సినిమాని మీరూ చూసేయండి. వెట్రీ, దివ్య మయూరి, గణేష్ వెంకట్రామన్ ప్రధాన పాత్రల్లో గురు రామానుజం తెరకెక్కించారు. విశ్వామిత్ర యూనివర్సల్స్ సమర్పణలో జేఎన్ సినిమాస్‌పై జె.పార్థసారథి నిర్మించారు.

నవ్వుల పుష్కరం... జబర్దస్త్ మెగా సంబరం




ఇంటింటా నవ్వులు పూయిస్తోంది. ఎంతోమందికి అవకాశాల్ని కల్పించింది. సామాన్యులని సెలబ్రిటీలుగా మార్చింది. కొంతమందికి ఇంటి పేరు అయ్యింది. ప్రపంచంలో మరే ప్రోగ్రామ్‌కి సాధ్యం కాని విధంగా... రికార్డు స్థాయిలో ప్రేక్షకుల ఆదరణని సొంతం చేసుకొంది. - ఇలా తెలుగునాట జబర్దస్త్ షో సృష్టించిన సంచలనాలు అన్నీ ఇన్నీ కావు. అందుకే అది ఖతర్నాక్ కామెడీ షోగా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. అలరించే పంచ్‌లు, ఆకట్టుకునే కథలు, కాన్సెప్ట్‌లు, ఆలోచన రేకెత్తించే వర్తమాన అంశాలు, గుర్తు చేసే మనవైన ఆచార సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తూ వినోదం పంచింది ఈ షో. నవ్వులతోపాటు, అప్పుడప్పుడు భావోద్వేగాల్నీ పంచింది. వేణు వండర్స్, అదిరే అభి, చలాకీ చంటి, ధనాధన్ ధన్‌రాజ్, రాకెట్ రాఘవ, రోలర్ రఘు, సునామీ సుధాకర్, బుల్లెట్ భాస్కర్, హైపర్ ఆది, ఆటో రాంప్రసాద్, గెటప్ శ్రీను, సుడిగాలి సుధీర్... ఇలా ఎంతోమందికి ఇంటి పేరు అయ్యింది ఈ షో. ప్రతిభావంతులకి చిరునామాగా కొనసాగుతూ ఎంతోమందిని వెలుగులోకి తీసుకొచ్చింది. ఈటీవీలో వారంలో రెండు రోజులపాటు ప్రదర్శితమవుతున్న జబర్దస్త్ 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఇప్పటికీ వన్నెతగ్గని షోగా ఆదరణని సొంతం చేసుకొంటోంది. పన్నెండేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా జబర్దస్త్ ఖతర్నాక్ కామెడీ షో మెగా వేడుకలు జరగబోతున్నాయి. నేడు రాత్రి 9.30 గంటలకి ఈటీవీ ఛానల్‌లో ప్రసారమయ్యే ఆ వేడుకలు ప్రేక్షకులకు మరింతగా వినోదం పంచనున్నాయి.

ప్రీం చిత్రం ప్రారంభం


పవన్, చమిందా వర్మ, సందీప్‌కిషన్

పవన్ తాత, చమిందా వర్మ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'ప్రీం'. రాజేశ్ రావూరి దర్శకత్వం వహిస్తున్నారు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మిస్తున్నారు. సుజాత సమర్పకులు. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు సందీప్‌కిషన్ క్లాప్‌నివ్వగా, నటుడు రాజీవ్ కనకాల కెమెరా స్విచ్చాన్ చేశారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ "ఇందులో ఓ కీలకమైన పాత్రని పోషిస్తున్నా. కథానాయిక చమిందా వర్మ దుబాయ్‌లో వైద్యురాలు. ఈ చిత్రంలో నటించడానికి దుబాయ్ నుంచి వచ్చిన తెలుగమ్మాయి. ఈ సినిమా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఇందులో ఓ బలమైన పాత్రని పోషిస్తున్నానని చెప్పారు నటుడు బెనర్జీ. ఈ కార్యక్రమంలో అలీ, విజయేంద్రరెడ్డి, జనార్దన మహర్షి, కె.బాబురెడ్డి, జి.సతీశ్‌కుమార్, హరీశ్ నాగరాజ్, ముకేశ్ ప్రజాపతి, బెజవాడ బేబక్క, వనిత, శ్రీవాణి త్రిపురనేని తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అరవింద్, సంగీతం: మార్కస్.యం., కూర్పు: ప్రణీత్‌కుమార్, కళ: సుధీర్ మాచర్ల.

వస్తున్నాడు గౌతమ్


అశ్విన్ బాబు

అశ్విన్‌బాబు కథానాయకుడిగా ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. రియా సుమన్ కథానాయిక. అయేషాఖాన్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు. టి.గణపతి రెడ్డి నిర్మాత. ఇటీవల తెరకెక్కించిన యాక్షన్ ఘట్టాలతో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని చేసుకుంటోంది. నేడు అశ్విన్‌బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా ఓ ప్రత్యేకమైన ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ కథా నేపథ్యం, అత్యాధునిక సాంకేతిక హంగులతో రూపొందించిన యాక్షన్ ఘట్టాలు సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామ"ని చెప్పారు నిర్మాత. మురళీశర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్, వీటీవీ గణేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌర హరి.

మరో యాక్షన్ కథలో టైగర్


టైగర్ ష్రాఫ్

తెరపై యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు నటుడు టైగర్ ష్రాఫ్. ఈ మధ్యనే ఆయన నటిస్తున్న 'బాగీ 4' సినిమా చిత్రీకరణని పూర్తి చేసుకున్నారు. తదుపరి ప్రాజెక్ట్‌గా ఓ హై కాన్సెప్ట్ యాక్షన్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని 'అవనే శ్రీమన్నారాయణ' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సచిన్ రవి, మురాద్ ఖేతాని తెరకెక్కించనున్నట్లు సమాచారం. "టైగర్ ష్రాఫ్ కొంతకాలంగా యాక్షన్ ఫార్మాట్ కోసం చూస్తున్నారు. అప్పుడే మురాద్ ఖేతాని, సచిన్ రవి ఆ కాన్సెప్ట్‌తో అతనిని సంప్రదించారు. వారు కథ చెప్పే విధానం ష్రాఫ్‌ని పూర్తిగా ఆకట్టుకుంది. వెంటనే ప్రాజెక్టు చేయడానికి సిద్ధంగా ఉన్నానని అంగీకరించారు. అక్టోబరు నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రఖ్యాత అంతర్జాతీయ యాక్షన్ బృందాన్ని నియమించనున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు చెప్పినట్లు సమాచారం.

థ్రిల్లర్ 'నిషాంచీ'


'నిషాంచీ'

బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నిషాంచీ'. బాల్‌ఠాక్రే మనవడు ఐశ్వరీ ఠాక్రే ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రానికి అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 19న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలుపుతూ.. గురువారం సోషల్ మీడియా వేదికగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ఈ పోస్టర్ 80ల కాలంనాటి యాక్షన్ థ్రిల్లర్ సినిమాగా తెలుస్తోంది. క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పింటో మోనికా పన్వార్, మహ్మద్ జీషాన్ అయూబ్, కుముద్ మిశ్రా కీలక పాత్రలు పోషించనున్నారు.

జూలియట్ @ డెకాయిట్


మృణాల్ ఠాకూర్

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'డెకాయిట్'. ప్రేమ ప్రతీకారం నేపథ్యంలో షానియల్ డియో రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మృణాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఆమెకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "ఈ చిత్రంలో మృణాల్‌ది కేవలం గ్లామర్ పాత్ర కాదు. ప్రతీకారం నేపథ్యంలో సాగే ఈ కథకి కీలకం"అని చిత్రవర్గాలు తెలిపాయి. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

జీవితాన్నే మార్చేసిన పరిచయం



సినిమా: 'మై ఆక్స్‌ఫర్డ్ ఇయర్'
నటీనటులు: సోఫియా కార్సన్, కోరీ మైల్‌క్రీస్ట్
విడుదల: శుక్రవారం, ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

రెడీ ఇన్ ఓటీటీ

కథాంశం: కొన్ని పరిచయాలు జీవితంలో ఎదుగుదలకు తోడ్పడతాయి. మరికొన్ని జీవిత పాఠాల్ని నేర్పిస్తాయి కానీ కొన్నింటినీ శాశ్వతంగా కావాలనుకుంటే వాటి కోసం ఇంకేవో కోల్పోవాల్సి ఉంటుంది. అలాంటిదే అన్నా డి లా వేగా(సోఫియా కార్సన్) జీవితం. చిన్ననాటి నుంచే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదవాలనే ఆశయంతో కష్టపడుతుంది. అలా చదివి ఆ యూనివర్సిటీలో స్థానం దక్కించుకుంటుంది. అక్కడ తన భవిష్యత్తుని ఎంతో అందంగా, ప్రశాంతంగా ఉండేలా ప్రణాళిక చేసుకుంటుంది. కానీ విధి దీనికి భిన్నంగా వ్యవహరిస్తుంది. ప్రణాళికలో లేని జామీ డావెన్‌పోర్ట్(కోరీ మైల్‌క్రీస్ట్) అనే వ్యక్తిని పరిచయం చేస్తుంది. అది తన జీవితాన్నే మార్చేస్తుంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా భావోద్వేగాలతో కూడిన బంధంగా బలపడుతుంది. అలా వారి ప్రేమ ప్రయాణం సరదాగా సాగిపోతూనే కెరీర్ అనే ఆలోచనలను పక్కకు పెడుతుంది. అలా తన జీవితంలో చదువు కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే ప్రేమ చేరాక అన్నా ఆక్స్‌ఫర్డ్ కలతో పాటు ప్రేమలోనూ తనను తాను కోల్పోయిందా? లేదా గెలిచిందా అనేది తెలుసుకోవాలంటే మై ఆక్స్‌ఫర్డ్ ఇయర్ సినిమా చూడాల్సిందే. ఈ సినిమాని అమెరికన్ రచయిత్రి జూలియ వీలన్ రాసిన నవల ఆధారంగా రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఇయాన్ మోరిస్ తెరకెక్కించారు.

ఈనాడు బిజినెస్

అమెరికాకే ఎక్కువ నష్టం

● ఔషధ సుంకాలపై పరిశ్రమ అంచనా ● ప్రత్యామ్నాయ మార్కెట్లపై కంపెనీల దృష్టి



ఈనాడు - హైదరాబాద్

మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాలపైనా నేటి (ఆగస్టు 1) నుంచి సుంకాల భారం అధికం కానుంది. దీని వల్ల మన కంపెనీలకు జరిగే నష్టం కంటే, మందుల ధరలు పెరిగి అమెరికా ప్రజలపైనే అధిక భారం పడుతుందని పరిశ్రమ వర్గాలు వివరిస్తున్నాయి. మనదేశం నుంచి అమెరికా దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై 25%+ పన్నులు వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. మందులూ ఈ జాబితాలోకి వస్తున్నాయి. దీనివల్ల కలిగే నష్టాలను అంచనా వేసి, దానిని ఎదుర్కొనే మార్గాలు, ప్రత్యామ్నాయాలపై సంబంధిత వర్గాలు దృష్టి సారిస్తున్నాయి.

మూడోవంతు అక్కడికే

గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం 30.47 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్ల) విలువైన మందులు ఎగుమతి చేసింది. ఇందులో మూడో వంతు అమెరికాకే చేరాయి. ఇందులో ప్రధానంగా ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) ఔషధాలు, ఫార్ములేషన్లు (ట్యాబ్లెట్లు, క్యాప్సూల్స్, ఇంజెక్షన్లు) ఉంటాయి. అమెరికాలో గతేడాది దాదాపు 138 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12 లక్షల కోట్ల) విలువైన జనరిక్ ఔషధాల అమ్మకాలు నమోదయ్యాయి. 2033 నాటికి ఈ మార్కెట్ 188 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16.35 లక్షల కోట్ల)కు పెరుగుతుందని అంచనా. ఈ విభాగంలో మన ఫార్మా కంపెనీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కంపెనీలు ఏటా అత్యధిక సంఖ్యలో డీఎంఎఫ్, ఏఎన్‌డీఏ దరఖాస్తులను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) వద్ద దాఖలు చేస్తున్నాయి. అమెరికా వెలుపల అత్యధిక సంఖ్యలో యూఎస్‌ఎఫ్‌డీఏ అనుమతి గల యూనిట్లు ఉన్నది మనదేశంలోనే.

మందులు కొనక తప్పదు

ట్రంప్ ఎంత అధికంగా సుంకాలు విధించినా, తప్పనిసరి కాబట్టి మన వద్ద మందులు కొనుగోలు చేయక తప్పదు. అదనపు సుంకాల భారాన్ని ఇక్కడి కంపెనీలు కొంతమేర భరిస్తాయని, మిగిలింది అమెరికా ప్రజల మీదే పడుతుందని ఫార్మాగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా దక్షిణ కొరియా, జపాన్, చైనా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా, ఐరోపా, దక్షిణ అమెరికా దేశాల్లో అమ్మకాలు పెంచుకునే యత్నాలను మన కంపెనీలు ముమ్మరం చేస్తాయని పేర్కొన్నారు.

అరబిందోకు కలిసిరానున్న కొనుగోలు

అమెరికాలో 400 కోట్ల డోసుల తయారీ సామర్థ్యం ఉన్న లానెట్ కంపెనీని కొనుగోలు చేయడం కోసం అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. 250 మి. డాలర్ల (రూ.2185 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువతో ఈ కొనుగోలు వల్ల అమెరికా ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్‌లోనూ అరబిందో పాల్గొనే వీలు కలగనుంది. అమెరికాలో ఔషధ పంపిణీ సులభం కానుంది.

లక్ష ఉద్యోగాలు పోతాయా?



● రత్నాభరణాల రంగంపై ప్రతికూల ప్రభావం
● దుస్తులు, రాగి ఎగుమతులపైనా

మన ఉత్పత్తులపై అమెరికా విధించిన అదనపు 25% సుంకం ఆగస్టు 1 (నేటి) నుంచే అమల్లోకి రానుంది. దీని ప్రభావంతో రత్నాభరణాల రంగంలోనే లక్ష మంది ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఆందోళనలు వెలువడుతున్నాయి. చేతితో తయారు చేసే ఆభరణాల ధరలు పెరిగి, అక్కడ అమ్ముడుపోక పోవచ్చని రత్నాభరణాల దేశీయ మండలి ఛైర్మన్ రాజేశ్ రోక్డే అంటున్నారు. 'గతంలో అమెరికా 10% సుంకం విధించినపుడు 50,000 మంది ఉపాధి కోల్పోయారు. కొత్త టారిఫ్ (ప్రస్తుత 5-13.5%పై 25% అదనం) అమలుతో లక్షమందికి పైగా ఉపాధి కోల్పోవచ్చ'ని రోక్డే పేర్కొన్నారు.

రాగి ఉత్పత్తులపై 50% సుంకం

రాగి ఆధారిత ఉత్పత్తులపై 50 శాతం సుంకాన్ని విధించారు. 2024-25లో అమెరికాకు మనదేశం 360 మిలియన్ డాలర్ల విలువైన రాగి ఉత్పత్తులను ఎగుమతి చేసింది.

దుస్తుల ఎగుమతి తగ్గొచ్చు

తాజా సుంకాల (ప్రస్తుత 12%పై 25% అదనం) వల్ల దుస్తుల ఎగుమతులు తగ్గొచ్చు. మన రెడీమేడ్ దుస్తుల ఎగుమతుల్లో అమెరికాకు చేరుతున్నవే 33% కావడం గమనార్హం. అమెరికా దిగుమతి చేసుకునే దుస్తుల్లో భారత్ వాటా 2020లో 4.5% కాగా, 2024లో 5.8 శాతానికి చేరింది. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లకు కలిపి 49% వాటా ఉంది.

✦ మన బియ్యం ఎగుమతులకు టారిఫ్ తాత్కాలిక అడ్డంకిగా మారొచ్చు. వియత్నాం, పాకిస్థాన్ వంటి పోటీదేశాలతో పోలిస్తే బియ్యం ధర-నాణ్యత పరంగా భారత్‌దే పైచేయి అని బియ్యం ఎగుమతిదార్ల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ గార్గ్ పేర్కొన్నారు.

✦ భారత్‌తో పోలిస్తే పోటీదేశాలైన వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలపై తక్కువ సుంకాలున్నందున తమ రంగం ఆందోళన చెందుతోందని ప్లాస్టిక్ ఉత్పత్తుల ఎగుమతిదారు అరవింద్ గోయెంకా పేర్కొన్నారు.

✦ తోలు ఉత్పత్తులు, పాదరక్షల ఎగుమతిదార్లు సైతం 60% ఆర్డర్లు రద్దు కావొచ్చని అంచనా వేస్తున్నారు.

✦ మనపై పెనాల్టీ విధించేందుకు రష్యా నుంచి చమురు కొనడాన్ని కారణంగా ట్రంప్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ రంగ చమురు శుద్ధి కంపెనీలు వారం రోజులుగా రష్యా చమురును కొనలేదు. ప్రైవేటు సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ మాత్రమే కొంటున్నాయి.

ఆగస్టు 1 నుంచీ ఇవీ కొత్త సుంకాలు

రంగం	సుంకం(%లో)
టెలికాం	25
రత్నాభరణాలు	30–38.5
ఆహార-వ్యవసాయ ఉత్పత్తులు	29–30
దుస్తులు	37%
డెయిరీ ఉత్పత్తులు	188
పళ్లు-కూరగాయలు	132
కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు	53
తృణ ధాన్యాలు	193
నూనెగింజలు, నూనెలు	164
బెవరేజెస్, పొగాకు	150
ఖనిజాలు, లోహాలు	187
రసాయనాలు	56

ఎంత విధిస్తారో తెలియని పెనాల్టీ వీటికి అదనం

హెచ్‌యూఎల్ లాభం రూ.2,768 కోట్లు

దిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజ సంస్థ హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో రూ.2,768 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,612 కోట్లతో పోలిస్తే ఇది 6% ఎక్కువ. ఉత్పత్తుల విక్రయం ద్వారా లభించిన ఆదాయం రూ.15,497 కోట్ల నుంచి 5.15% పెరిగి రూ.16,296 కోట్లకు చేరింది. పరిమాణ వృద్ధి 4 శాతంగా నమోదైంది. కంపెనీ మొత్తం వ్యయాలు 7.25% పెరిగి రూ.13,284 కోట్లకు చేరాయి. సమీక్షా త్రైమాసికంలో ఎబిటా మార్జిన్ 130 బేసిస్ పాయింట్లు తగ్గి 22.8 శాతంగా నమోదైంది.

✦ గృహ సంరక్షణ విభాగంలో ఆదాయం 1.83% పెరిగి రూ.5,777 కోట్లకు చేరింది. సౌందర్య, సంక్షేమ విభాగాదాయం 10.7% వృద్ధితో రూ.3,631 కోట్లకు చేరింది. వ్యక్తిగత సంరక్షణ విభాగాదాయం 6.45% పెరిగి రూ.2,540 కోట్లకు చేరింది. బ్రూక్‌బాండ్, లిప్టన్, హార్లిక్స్, బూస్ట్, బ్రూ, కిసాన్, వంటి బ్రాండ్లు కలిగిన ఆహార విభాగాదాయం 4.3% పెరిగి రూ.4,016 కోట్లకు చేరింది. ఇతర విభాగాదాయం (ఎగుమతులు కలిపి) 6.38% పెరిగి రూ.550 కోట్లకు చేరింది.

టీ ధర తగ్గుతోంది: కమొడిటీ ధరలు తగ్గడం, పోటీ ఉండటంతో టీ, గృహ సంరక్షణ విభాగాల్లోని ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నట్లు హెచ్‌యూఎల్ ప్రకటించింది. పామాయిల్ ధరలు పెరగడంతో చర్మ సంరక్షణ విభాగంలోని ఉత్పత్తుల ధరలు పెంచుతున్నట్లు తెలిపింది.

✦ 'ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులకు గిరాకీ స్థిరంగా ఉంది. క్రమంగా ఇది పెరిగే అవకాశం కనిపిస్తోంది. అనుకూల ఆర్థిక గణాంకాలతో పెట్టుబడులు పెంచుతున్నాం. ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను కూడా పెంచుకుంటున్నామ'ని హెచ్‌యూఎల్ సీఈఓ, ఎండీ రోహిత్ జావా వెల్లడించారు.

కోడి గుడ్డు

ఆగస్టు 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	420
వరంగల్	422
విజయవాడ	475
గోదావరి	460
విశాఖపట్నం	460
చిత్తూరు	493

డిసెంబరులోపు 20,000 నియామకాలు: కాగ్నిజెంట్

వేతన పెంపూ అమలు చేస్తాం



దిల్లీ: ఈ ఏడాది (2025)లో 15,000- 20,000 మంది తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్ల)ను నియమించుకోవాలన్న తమ లక్ష్యంలో ఎటువంటి మార్పు లేదని ఐటీ సేవల దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ గురువారం స్పష్టం చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ చివరకు 7,500 మందిని నియమించుకోగా, మొత్తం సిబ్బంది సంఖ్య 3,42,800కు చేరింది. ఈ ఏడాది ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతనాల పెంపూ ఉంటుందని నాస్‌డాక్‌లో నమోదైన ఈ సంస్థ సంకేతాలిచ్చింది. అయితే వేతన పెంపునకు స్పష్టమైన సమయాన్ని వెల్లడించలేదు.

14% పెరిగిన కాగ్నిజెంట్ లాభం: కాగ్నిజెంట్, ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో అంచనాల కంటే మెరుగైన ఫలితాలను ప్రకటించింది. కంపెనీ లాభం గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 14% పెరిగి 645 మిలియన్ డాలర్లుగా నమోదైంది. పూర్తి ఏడాది (2025)కి ఆదాయ వృద్ధి అంచనాలను 4-6 శాతానికి కంపెనీ పెంచింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కాగ్నిజెంట్ ఆదాయం 8.1% వృద్ధి చెంది 5.25 బిలియన్ డాలర్లకు చేరింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఆదాయం 7.2% పెరిగింది. ప్రస్తుత మూడో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో ఆదాయం 4.6%- 6.1% పెరిగి 5.27- 5.35 బి. డాలర్ల మధ్య ఉండొచ్చని పేర్కొంది. పూర్తి ఏడాదిలో ఆదాయం 4.7- 6.7% వృద్ధితో 20.7 - 21.1 బి. డాలర్లుగా నమోదు కావచ్చని సంస్థ వెల్లడించింది.

బంగారానికి గిరాకీ 10% తగ్గింది

● ఏప్రిల్-జూన్‌లో 134.9 టన్నులే ● అధిక ధరల వల్లే: డబ్ల్యూజీసీ

ముంబయి: మనదేశంలో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 134.9 టన్నుల బంగారానికి గిరాకీ ఏర్పడిందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదికలో తెలిపింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఏర్పడిన గిరాకీ 149.7 టన్నుల కంటే ఇది 10% తక్కువ. ఈసారి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షకు మించడం వల్లే, గిరాకీ తగ్గినట్లు వివరించింది. అధిక ధరల వల్ల, విలువ పరంగా చూస్తే రూ.93,850 కోట్ల నుంచి 30% అధికమై రూ.1,21,800 కోట్ల విలువైన పసిడికి గిరాకీ ఏర్పడిందని డబ్ల్యూజీసీ ప్రాంతీయ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు.



✦ ఆభరణాలకు గిరాకీ 106.5 టన్నుల నుంచి 17% తగ్గి 88.8 టన్నులకు పరిమితమైంది. వీటి విలువ పరంగా మాత్రం రూ.66,810 కోట్ల నుంచి 20% పెరిగి రూ.80,150 కోట్లకు చేరింది.

✦ ఈ ఏడాది జనవరి-జూన్‌లో దేశీయంగా మొత్తం 253 టన్నుల బంగారానికి గిరాకీ ఏర్పడింది.

అంతర్జాతీయంగా 3% తగ్గింది

అంతర్జాతీయంగా పసిడికి గిరాకీ ఏప్రిల్-జూన్‌లో 3% పెరిగి 1249 టన్నులకు చేరినట్లు డబ్ల్యూజీసీ వెల్లడించింది. పెట్టుబడుల రీత్యా అధికమొత్తాలు రావడమే ఇందుకు కారణమని పేర్కొంది. పసిడి ఈటీఎఫ్‌లలోకి 170 టన్నుల మేర వచ్చినట్లు తెలిపింది. పసిడి నాణేలు, బిస్కెట్లలోకి 11% అధికమై 307 టన్నులకు చేరింది.

మారుతీ లాభం రూ.3,792 కోట్లు



దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో రూ.3,792 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,760 కోట్లతో పోలిస్తే ఈసారి అతిస్వల్పంగా పెరిగింది. మొత్తం ఆదాయం రూ.36,840 కోట్ల నుంచి రూ.40,493 కోట్లకు చేరింది. స్టాండలోన్ ప్రాతిపదికన కంపెనీ నికర లాభం రూ.3,650 కోట్ల నుంచి 2% పెరిగి రూ.3,712 కోట్లకు చేరింది. నికర విక్రయాలు రూ.33,875 కోట్ల నుంచి రూ.36,625 కోట్లకు పెరిగాయి. దేశీయ విక్రయాలు 4.5% తగ్గాయి. ఎగుమతులు 37.4% పెరిగాయి. సమీక్షా త్రైమాసికంలో విక్రయాల పరిమాణం 1.1% పెరిగింది. కంపెనీ జూన్ త్రైమాసికంలో 5,27,861 వాహనాలను విక్రయించింది.

కొత్త వ్యాపారాల్లోకి అడుగు!

మారుతీ సుజుకీ తన మెమొరాండమ్ ఆఫ్ అసోసియేషన్ (ఎంఓఏ)లో ఆబ్జెక్ట్ క్లాజ్ (నిబంధన)కు మార్పులు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. దీంతో ఇప్పటి వరకు వాహన తయారీ రంగంలో ఉన్న కంపెనీ, ఇతర రంగాలకు విస్తరించే అవకాశం ఉంది. సవరించిన నిబంధన ప్రకారం.. డ్రోన్లు, మానవ రహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), మానవ రహిత విమాన వ్యవస్థల (యూఏఎస్) తయారీతో పాటు ప్రొపల్షన్, నియంత్రణ వ్యవస్థలకు సంబంధించిన సాంకేతికతలను రూపొందించేందుకూ ఎంఎస్ఐకి అవకాశం లభిస్తుంది. వాహన లీజింగ్, సబ్‌స్క్రిప్షన్, షేర్డ్ మొబిలిటీ, వినియోగించిన కార్ల విక్రయాల సేవల్లోకి ప్రవేశించడానికీ అనుమతిస్తుంది.

ద్రవ్య లోటు రూ.2.80 లక్షల కోట్లు

ఏప్రిల్-జూన్‌పై సీజీఏ

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.2,80,732 కోట్లుగా నమోదైందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గురువారం వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించుకున్న రూ.15.69 లక్షల కోట్ల (జీడీపీలో 4.4%)లో 17.9 శాతానికి ద్రవ్య లోటు చేరిందని పేర్కొంది. 2024-25 ఏప్రిల్-జూన్‌లో ద్రవ్య లోటు 8.4 శాతంగా నమోదైంది. ప్రభుత్వ ఆదాయం, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్య లోటుగా పరిగణిస్తారు. సీజీఏ ప్రకారం 2025 జూన్ ఆఖరుకు కేంద్రం నికర పన్ను వసూళ్లు రూ.5.4 లక్షల కోట్ల (2025-26 బడ్జెట్ అంచనాల్లో 19%)కు చేరాయి. 2024-25 జూన్ త్రైమాసికం చివరకు బడ్జెట్ అంచనాల్లో ఇవి 21.3 శాతంగా నమోదయ్యాయి. ఈసారి మొత్తం వ్యయాలు రూ.12.22 లక్షల కోట్లకు (బడ్జెట్ అంచనాల్లో 24.1%) చేరాయి. 2024-25 ఇదే సమయంలో బడ్జెట్ అంచనాల్లో వ్యయాలు 20.1 శాతానికి పరిమితమయ్యాయి.

రూ.16 లక్షల కోట్ల స్థిరాస్తి కంపెనీలు



ముంబయి: దేశంలో 150 పెద్ద స్థిరాస్తి సంస్థల విలువ కలిపి రూ.16 లక్షల కోట్ల (188 బిలియన్ డాలర్ల)ను మించినట్లు హురున్ రీసెర్చ్, గ్రోహె 2025 జాబితా వెల్లడించింది. 2023తో పోలిస్తే 2024లో ఈ విలువ 70% పెరగ్గా, గతేడాదితో పోలిస్తే, ఈసారి 14 శాతమే (రూ.1.4 లక్షల కోట్లు) మాత్రమే పెరిగిందని వివరించింది. దేశంలో అత్యధిక విలువ కలిగిన స్థిరాస్తి సంస్థగా డీఎల్ఎఫ్ రూ.2.07 లక్షల కోట్లతో నిలిచింది. శాస్త్రీయ పద్ధతిలో ఈ రంగం విలువను లెక్కవేసినట్లు నివేదిక తెలిపింది. జాబితాలోని కంపెనీల కనీస విలువ రూ.1,000 కోట్లు అంతకంటే ఎక్కువే. 150 కంపెనీల్లో 33 సీఈఓల ఆధ్వర్యంలో నడుస్తుండగా.. అందులో నాలుగింటినే మహిళలు నడిపిస్తున్నారు. ఈ జాబితాలో హైదరాబాద్ నుంచి 13 సంస్థలున్నాయి. వీటి మొత్తం విలువ రూ.93,700 కోట్లు. నగరాల ర్యాంకుల్లో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది.

గౌతమ్ అదానీ 'స్థిరాస్తి' విలువ తగ్గింది

గౌతమ్ అదానీకి స్థిరాస్తి వ్యాపారంలో ఉన్న సంపద విలువ జూన్ చివరకు 7% తగ్గి రూ.52,320 కోట్లకు పరిమితమైంది. దీంతో ఈ రంగంలోని సంపన్నుల్లో మూడో స్థానానికి పరిమితమయ్యారు. ధారావి, మోతీలాల్ నగర్ పునః అభివృద్ధి ప్రాజెక్టులను నిర్వహిస్తున్న అదానీ అయిదేళ్లలో ఈ రంగంలో అత్యంత సంపన్న వ్యక్తిగా మారనున్నారని నివేదిక అంచనా వేసింది. డీఎల్ఎఫ్‌కు చెందిన రాజీవ్ సింగ్ రూ.1.27 లక్షల కోట్లతో మొదటి స్థానంలో, మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా రూ.92,340 కోట్లతో రెండో స్థానంలో నిలిచారు.

అగ్రగామి 10 కంపెనీలు

సంస్థ	విలువ (రూ.కోట్లు)
డీఎల్ఎఫ్	2,07,400
లోధా	1,38,200
ఇండియన్ హోటల్స్	1,08,300
ప్రెస్టీజ్	71,500
గోద్రెజ్ ప్రాపర్టీస్	70,600
ఓబెరాయ్ రియాల్టీ	69,400
ది ఫీనిక్స్ మిల్స్	55,900
అదానీ రియాల్టీ	52,400
ఎం3ఎం ఇండియా	37,400
అపర్ణా కన్‌స్ట్రక్షన్స్	37,400

✦ దీపక్ పరేఖ్‌కు చెందిన స్కాలస్ బెంగళూరు జాబితాలో తక్కువ వయసున్న సంస్థ. ఆరేళ్లలోనే రూ.13,600 కోట్లకు చేరింది. 1871లో స్థాపితమైన పెనిన్సులా ల్యాండ్(రూ.1000 కోట్లు) అత్యంత ఎక్కువ చరిత్ర కలిగిన కంపెనీ. రితేశ్ అగర్వాల్‌కు చెందిన ఓయో తొలిసారిగా టాప్-15లోకి చేరింది.

జాబితాలో తెలుగువారు

స్థిరాస్తి సంపన్నుల్లోని అగ్రగామి - 10 మందిలో తెలుగువారూ చోటు చేసుకోవడం విశేషం. అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్‌కు చెందిన ఎస్. సుబ్రమణ్యం రెడ్డి, సి. వెంకటేశ్వర రెడ్డి రూ.18,690 కోట్లు, రూ.18,490 కోట్లతో వరుసగా 8వ, 9వ స్థానాల్లో నిలిచారు. అగ్రగామి-10 మందిలో బెంగళూరుకు చెందిన వారు నలుగురు ఉండగా, ముంబయి నుంచి ముగ్గురు, హైదరాబాద్ నుంచి ఇద్దరు, అహ్మదాబాద్, దిల్లీ నుంచి ఒకరు కనిపించారు. పదో ర్యాంకులో ముగ్గురు ఉన్నారు.

సైయెంట్, జీనియర్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: ఫీల్డ్ సర్వీస్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఎస్ఎం) సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ అయిన జీనియర్‌తో హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. సైయెంట్ అమలు, సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ నైపుణ్యాలు అధికంగా ఉన్న సంస్థ. జీనియర్‌తో భాగస్వామ్యం వల్ల ఏఐ ఆధారిత ఎఫ్ఎస్ఎం సేవలను వివిధ విభాగాల క్లయింట్లకు విస్తృత స్థాయిలో అందించడానికి వీలు కలుగుతుందని సైయెంట్ పేర్కొంది.

నిరుత్సాహకరంగా 'న్యూలాండ్' ఫలితాలు

ఈనాడు, హైదరాబాద్: న్యూలాండ్ లేబొరేటరీస్ జూన్ త్రైమాసికానికి రూ.300.6 కోట్ల ఆదాయం, రూ.13.7 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.444.4 కోట్లు, నికరలాభం రూ.98.3 కోట్లు ఉన్నాయి. వీటితో పోల్చితే ఈసారి ఆదాయం 32.40%, నికరలాభం 86.10% తగ్గాయి. ఆర్డర్లు తక్కువగా ఉండటం దీనికి కారణమని న్యూలాండ్ వైస్‌ఛైర్మన్ సుచేత్ దావులూరి పేర్కొన్నారు.

ఎన్‌సీసీకి మరో 2 కొత్త ఆర్డర్లు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల రంగానికి చెందిన సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్‌కు ఈ ఏడాది జులైలో మరో 2 కొత్త ఆర్డర్లు లభించాయి. జులై 11న రూ.2,269 కోట్ల ఆర్డర్ వచ్చినట్లు సంస్థ ప్రకటించిన విషయం విదితమే. రూ.791.54 కోట్ల విలువైన మరో 2 కొత్త ఆర్డర్లు వచ్చినట్లు తాజాగా వెల్లడించింది. ఇందులో బిల్డింగ్స్ డివిజన్‌కు రూ.461.39 కోట్ల ఆర్డర్, ఎలక్ట్రికల్ డివిజన్‌కు రూ.330.15 కోట్ల ఆర్డర్ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఈ రెండు ఆర్డర్లు వచ్చినట్లు ఎన్‌సీసీ పేర్కొంది.

స్విగ్గీ నష్టం రెట్టింపు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్‌లో స్విగ్గీ రూ.1,197 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల నష్టం రూ.611 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. మొత్తం ఆదాయం రూ.3,310 కోట్ల నుంచి రూ.5,048 కోట్లకు పెరగ్గా, వ్యయాలూ రూ.3,908 కోట్ల నుంచి రూ.6,244 కోట్లకు చేరాయి. క్విక్ కామర్స్ విభాగంలో రూ.896 కోట్ల నష్టాన్ని సంస్థ నమోదు చేసింది.

సూచీలకు టారిఫ్ ఒడుదొడుకులు



సమీక్ష

అమెరికాకు ఎగుమతి అయ్యే మన దేశ ఉత్పత్తులపై ఆగస్టు 1 నుంచి 25% సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో గురువారం దేశీయ సూచీలు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. దిగువ స్థాయుల్లో వచ్చిన కొనుగోళ్లతో భారీ నష్టాల నుంచి తప్పించుకోగలిగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 15 పైసలు కోలుకుని 87.65 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.74% నష్టంతో 72.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి నష్టపోగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.2.57 లక్షల కోట్లు తగ్గి రూ.449.72 లక్షల కోట్లు (5.14 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 786 పాయింట్ల (క్రితం ముగింపు 81,481.86) నష్టంతో 80,695.50 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. దిగువ స్థాయిల్లో కొనుగోళ్లతో పుంజుకున్న సూచీ, ఇంట్రాడేలో 81,803.27 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో మళ్లీ అమ్మకాలు రావడంతో 296.28 పాయింట్ల నష్టంతో 81,185.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 86.70 పాయింట్లు కోల్పోయి 24,768.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,635-24,956.50 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టపోయాయి. టాటా స్టీల్ 2.20%, సన్‌ఫార్మా 1.69%, అదానీ పోర్ట్స్ 1.50%, రిలయన్స్ 1.39%, ఎన్‌టీపీసీ 1.37%, భారతీ ఎయిర్‌టెల్ 0.93%, టైటన్ 0.89% డీలాపడ్డాయి. హెచ్‌యూఎల్ 3.48%, ఎటెర్నల్ 1.40%, ఐటీసీ 1.01%, కోటక్ బ్యాంక్ 0.96% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో. టెలికాం 1.80%, చమురు-గ్యాస్ 1.47%, ఇంధన 1.40%, లోహ 1.18%, కమొడిటీస్ 1.03%, మన్నికైన వినిమయ వస్తువులు 0.78% పడ్డాయి. ఎఫ్ఎంసీజీ, సేవలు రాణించాయి. బీఎస్ఈలో 2502 షేర్లు నష్టపోగా, 1525 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 126 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

సెన్సెక్స్	నిఫ్టీ
▼296	▼87
81186	24768

✦ ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించడంతో హెచ్‌యూఎల్ షేరు 3.48% లాభంతో రూ.2,521.85 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.19,936 కోట్లు పెరిగి రూ.5.92 లక్షల కోట్లుగా నమోదైంది.

✦ జూన్ త్రైమాసికంలో లాభం 49% తగ్గడంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3.99% నష్టపోయి రూ.2,430.95 దగ్గర స్థిరపడింది.

✦ త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో సన్ ఫార్మా 1.69% నష్టంతో రూ.1,705.55 వద్ద ముగిసింది.

✦ ప్లాంట్ల సామర్థ్యాలను విస్తరించేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.7500 కోట్ల మూలధన వ్యయాలను సెయిల్ ఖర్చుచేయనుంది.

✦ ఇటలీ వాణిజ్య వాహన సంస్థ ఇవెకో గ్రూప్ కొనుగోలు కోసం ఈక్విటీ రూపంలో 1 బిలియన్ యూరోలు (దాదాపు రూ.10,000 కోట్లు) సమీకరించడానికి టాటా మోటార్స్ సన్నాహాలు చేస్తోంది.

✦ వచ్చే అయిదేళ్లలో భారత్‌కు ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఇచ్చిన రుణాలు 20 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇవి 12 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

జౌళి, ఔషధ, వాహన షేర్లకు నష్టాలు

అమెరికా సుంకాల నేపథ్యంలో జౌళి, ఔషధ, వాహన, ఐటీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. జౌళి షేర్లలో పెర్ల్ గ్లోబల్ 7.32%, గోకల్‌దాస్ 4.37%, అరవింద్ 4.33%, వర్ధమాన్ టెక్స్‌టైల్స్ 4.23%, వెల్‌స్పన్ లివింగ్ 3.92%, కేపీఆర్ మిల్ 3.12%, అలోక్ ఇండస్ట్రీస్ 2.51% నష్టపోయాయి. ఔషధ షేర్లలో జుబిలంట్ ఫార్మోవా 3.65%, ఇప్కా ల్యాబ్ 3.14%, లుపిన్ 2.98%, నాట్కో 2.03%, సన్ ఫార్మా 1.69%, డాక్టర్ రెడ్డీస్ 1.61%, ఆర్‌పీజీ లైఫ్ 0.83% తగ్గాయి. ఫోర్స్ మోటార్స్, బజాజ్ ఆటో, అశోక్ లేలాండ్, టాటా మోటార్స్ ఎం అండ్ ఎం షేర్లు నీరసపడ్డాయి. ఐటీ షేర్లలో హెగ్జావేర్ 1.26%, విప్రో 0.74%, ఇన్ఫోసిస్ 0.69%, హెచ్‌సీఎల్ 0.64%, టీసీఎస్ 0.53% పడ్డాయి.

ఐపీఓ సమాచారం

✦ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ షేరు ఇష్యూ ధర రూ.90తో పోలిస్తే 8.88% నష్టంతో రూ.82 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.81.49 వద్ద కనిష్ఠాన్ని తాకిన షేరు, చివరకు 5.11% తగ్గి రూ.85.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,243.86 కోట్లుగా నమోదైంది.

✦ ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ రెండో రోజుకే 5 రెట్ల స్పందన నమోదైంది. ఇష్యూలో భాగంగా 3,51,27,002 షేర్లను ఆఫర్ చేయగా, 17,65,16,388 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 4.17 రెట్ల స్పందన కనిపించింది.

✦ ఎం అండ్ బీ ఇంజినీరింగ్ ఐపీఓ రెండో రోజుకు 2.90 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 97,98,309 షేర్లను ఆఫర్ చేయగా, 2,83,79,046 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ శ్రీ లోటస్ డెవలపర్స్ ఐపీఓ రెండో రోజుకు 10.34 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 3,96,58,730 షేర్లను జారీ చేయగా, 40,99,20,100 షేర్లకు బిడ్లు వచ్చాయి.

✦ లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ ఐపీఓ చివరి రోజుకు 1.85 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 1,13,12,816 షేర్లను జారీ చేయగా, 2,09,59,744 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 2.19 రెట్ల స్పందన కనిపించింది.

ఆదిత్య ఇన్ఫోటెక్ ఐపీఓకు 100 రెట్ల స్పందన

సీపీ ప్లస్ బ్రాండ్ కింద నిఘా పరికరాలను విక్రయించే ఆదిత్య ఇన్ఫోటెక్ రూ.1300 కోట్ల ఐపీఓ చివరి రోజుకు 100.69 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో 1,12,23,759 షేర్లను ఆఫర్ చేయగా, 1,13,00,92,216 షేర్లకు బిడ్లు వచ్చాయి. క్యూఐబీ విభాగంలో 133.21 రెట్లు, ఎన్ఐఐల నుంచి 72 రెట్లు, రిటెయిల్‌లో 50.87 రెట్ల స్పందన వచ్చింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
కోల్ ఇండియా1	8734.17	10943.55	37458.05	39388.47
హెచ్‌యూఎల్	2768.00	2612.00	16296.00	15497.00
సన్ ఫార్మా	2279.00	2836.00	14316.00	13185.00
వేదాంతా	5000.00	4457.00	37434.00	35239.00
డాబర్	508.29	494.35	3404.58	3349.11
టీవీఎస్ మోటార్	610.00	461.00	12250.00	10355.00
ఎంబసీ రీట్	871.80	757.50	------	------
ఇమామీ	164.00	150.60	904.10	906.10
థెర్మాక్స్	151.00	109.00	2150.00	2184.00
అంబుజా సిమెంట్స్	969.66	783.13	10244.11	8292.10
డా.లాల్‌పాథ్ ల్యాబ్స్	134.00	108.00	620.00	602.00
జిల్లెట్ ఇండియా	145.69	115.97	706.72	645.33
డీసీబీ బ్యాంక్	157.00	131.00	2050.00	1632.00
ఇక్రా	42.80	35.90	124.50	114.80
ర్యాడికో ఖైతాన్	130.52	75.38	5313.51	4265.62
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	743	522	5,411	3,043
జీహెచ్‌సీఎల్	144.11	150.63	822.54	848.76
ఐషర్ మోటార్స్	1,205	1,101	5,042	4,393
మ్యాన్‌కైండ్ ఫార్మా	445	538	3,570	2,868
టీమ్‌లీజ్ సర్వీసెస్	25.01	19.37	2,891.40	2,579.85

1) తొలి మధ్యంతర డివిడెండ్ రూ.5.50

స్థిరాదాయం లేదు.. అయినా రిటర్నులు దాఖలు చేయాలా? ఈ సందేహం చాలామందిలో ఉంటుంది. ముఖ్యంగా **గృహిణులు** తమకు రిటర్నులు అవసరం లేదు అనుకుంటారు. కానీ, వాస్తవం వేరు.

రిటర్నులు దాఖలు చేయాలా?



మీరు గృహిణి అయినప్పటికీ.. బ్యాంకు వడ్డీ, డివిడెండు, ఆస్తుల నుంచి అద్దె ఆదాయాలు అందుకుంటూ ఉంటే.. ఆదాయపు పన్ను రిటర్ను(ఐటీఆర్) సమర్పించాల్సిందే. మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్)లాంటివి ఉన్నప్పుడు ఇది ఒక తప్పనిసరి అవసరం కూడా. రుణాలు, వీసాల కోసం దరఖాస్తు చేసినప్పుడూ ఐటీఆర్ దాఖలు చేసిన ఆధారాలు ఉంటే పని సులువు అవుతుంది.

ఏ ఆదాయాలు

బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, మ్యూచువల్ ఫండ్లు లేదా షేర్ల నుంచి లభించిన డివిడెండ్ ఆదాయం, అద్దె ద్వారా ఆదాయం, ఇల్లు లేదా షేర్లు అమ్మినప్పుడు వచ్చిన మూలధన లాభం.. ఇవన్నీ జీతం లేకపోయినా పన్ను పరిధిలోకి వస్తాయి. మీ మొత్తం ఆదాయం ఏడాదికి రూ.2.5 లక్షల ప్రాథమిక మినహాయింపు (పాత పన్ను విధానంలో) పరిమితిని మించితే (60 ఏళ్లలోపు వారికి) ఐటీఆర్ పరిధిలోకి వచ్చినట్లే. పరిమితి కంటే ఆదాయం తక్కువగా ఉన్నా టీడీఎస్‌లు ఉంటే.. రిటర్నులు దాఖలు చేయడం ద్వారా రిఫండును క్లెయిం చేసుకోవచ్చు.

సరైన ఫారంలో..

వేతనం ద్వారా ఆదాయం ఆర్జించే వ్యక్తులకు ఐటీఆర్-1 లేదా ఐటీఆర్-2 వర్తిస్తుంది. గృహిణిగా పెట్టుబడుల ద్వారానే ఆదాయం ఆర్జిస్తున్నందున ఐటీఆర్-2 ఉపయోగించడం మంచిది. మూలధన రాబడి, డివిడెండ్, ఇతర ఆదాయాలను నివేదించేందుకు సరిపోతుంది. అద్దె ఆదాయం, విదేశీ పెట్టుబడులున్నప్పటికీ, ఈ ఫారంలో వివరించేందుకు వీలవుతుంది.

26ఏఎస్‌తో పోల్చుకోండి..


రిటర్నులు దాఖలు చేసే ముందు మీ ఫారం 26ఎస్, వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)ను తనిఖీ చేయండి. ఇవి బ్యాంకులు, ఫండ్ సంస్థలు మూలం వద్ద పన్ను కోత వివరాలను తెలియజేస్తాయి. మీరు దాఖలు చేసిన ఆదాయం ఏఐఎస్‌లో చూపించిన ఆదాయం మధ్య వ్యత్యాసం ఉంటే, పన్ను నోటీసులు రావడం, రిఫండు ఆలస్యంలాంటివి ఎదురవుతాయి.

మినహాయింపులు క్లెయిం చేసుకోవచ్చు.

జీతం లేకపోయినా సెక్షన్ 80సీ, సెక్షన్ 80డీలాంటి మినహాయింపులను క్లెయిం చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందీ లేదు. పెట్టుబడులు, డిపాజిట్లు చేసేటప్పుడే అవసరం మేరకు ఫారం-15జీ లేదా ఫారం-15హెచ్ దాఖలు చేస్తే, టీడీఎస్ మినహాయింపు ఉండదు. అయినప్పటికీ, రిటర్నులు దాఖలు చేసి, పన్ను బాధ్యత లేదు అని చూపించడం మంచిది.

మీకు ఎంత బీమా ఉంది?

బీమా పాలసీలను కొనుగోలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. తగినంత భరోసా లేకపోతే అవి ఉన్నా పెద్దగా ప్రయోజనం లేనట్లే. తక్కువ బీమా మీ దీర్ఘకాలిక ఆర్థిక శ్రేయస్సును దెబ్బతీస్తుంది. అందుకే, బీమా పాలసీ ఏదైనా సరే.. సరైన మొత్తానికి తీసుకోవడం చాలా కీలకం.



జీవిత బీమా పాలసీని కొనుగోలు చేసేటప్పుడు అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటో తెలుసా? సరైన పాలసీని, బీమా సంస్థను ఎంచుకోవడం. దీనితోనే మీ బీమా ప్రణాళికకు ప్రారంభం కావాలి.

నాలుగు విధాలుగా..

ఆర్జించే వ్యక్తికి ఏదైనా జరిగినప్పుడు అతను/ఆమెపై ఆధారపడిన కుటుంబానికి పూర్తి ఆర్థిక భరోసా ఉండాలి. ఇదే బీమా పాలసీ లక్ష్యం.

❖ **నెలవారీ ఖర్చులు:** ముందుగా మీ నెలవారీ ఖర్చులు ఎంతో తెలుసుకోండి. ఇందులో అన్ని ఖర్చులనూ కలపండి. దేనినీ విస్మరించకూడదు. దీన్నిబట్టే మనకు ఎంత బీమా ఉండాలన్నది కచ్చితంగా అంచనా వేసేందుకు వీలవుతుంది. కిరాణా ఖర్చులు, విద్యుత్, నీటి బిల్లులు, మొబైల్ రీఛార్జీలనూ లెక్కించాలి.

❖ **పొదుపు ఎంత?:** బీమా పాలసీని కొనుగోలు చేసేటప్పుడు ఇప్పటి వరకూ మీరు ఎంత పొదుపు చేశారన్నది లెక్క తీయండి. పెట్టుబడులనూ చూసుకోండి. ఈపీఎఫ్, పీపీఎఫ్, పన్ను ఆదా పథకాలు.. ఇలా మీరు ఎక్కడెక్కడ సొమ్ము దాచారో అవన్నీ ఒకచోట రాసి పెట్టుకోండి. వాటి విలువ ఎంతో చూడండి.

❖ **బాధ్యతలు:** ఇది ఎంతో కీలకం. ఇప్పటికే తీసుకున్న రుణాలు.. అంటే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బిల్లులు.. పిల్లల చదువులు, వారి పెళ్లి.. ఇలా అన్ని బాధ్యతలనూ ఒకసారి విశ్లేషించండి. వీటిన్నింటికీ ఎంత మొత్తం అవసరం అనేది చూడండి.

❖ **చివరగా:** నెలవారీ ఖర్చులు కనీసం 200 నెలలు, బాధ్యతలు కలపండి. ఇప్పుడు ఈ మొత్తంలో నుంచి మీ పొదుపు-పెట్టుబడులను తీసేయండి. చివరగా వచ్చిన ఫలితమే మీరు ఎంత బీమా తీసుకోవాలన్న మొత్తం.

ఇక్కడ ఉదాహరణకు కుమార్ నెలవారీ ఖర్చులు రూ.25,000 ఉన్నాయనుకుందాం. అప్పుడు 200 నెలలకు రూ.50లక్షలు అవసరం. బాధ్యతల కోసం మరో రూ.2 కోట్లు అవసరం అనుకుందాం. అతని పెట్టుబడులు రూ.50 లక్షల వరకూ ఉంటే.. మిగతా రూ.2 కోట్లకు బీమా పాలసీ తీసుకోవాలి. అప్పుడే అతని కుటుంబం ఆర్థికంగా భరోసాగా ఉంటుందని చెప్పొచ్చు. ఒకసారి మీకు తగినంత బీమా ఉందా అనేది లెక్క చూసుకోండి మరి!

siri@eenadu.net

నగదు నిల్వ 50 సార్లు చూసుకోవచ్చు

నగదు రహిత చెల్లింపులు చేసేందుకు వినియోగించే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో ఆగస్టు 1 నుంచి కీలక మార్పులు రానున్నాయి. అవేమిటంటే..

✦ యూపీఐ యాప్ ద్వారా బ్యాంకులో ఉన్న నగదు నిల్వను రోజుకు గరిష్ఠంగా 50 సార్లు మాత్రమే తనిఖీ చేసుకోగలరు. మీరు రెండు యాప్‌లను వినియోగిస్తుంటే ఈ పరిమితి వేర్వేరుగా ఉంటుంది.



✦ ఈఎంఐలు, సిప్, ఓటీటీ వేదికలకు చెల్లింపులు యూపీఐ ద్వారా వెళ్తుంటే.. అవి ఉదయం 10 గంటలకు ముందు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 9.30 గంటల తర్వాతే ప్రాసెస్ అవుతాయి.

✦ యూపీఐ లావాదేవీల స్థితి తక్షణమే అంటే సెకన్లలోనే తెలిసిపోతుంది.

✦ చెల్లింపును స్వీకరించే వారి పూర్తి పేరు ఇప్పుడు యాప్‌లో కనిపిస్తుంది. దీనివల్ల పొరపాట్లు తగ్గడంతోపాటు, మోసాలకూ ఆస్కారం ఉండదు.

✦ 12 నెలలకు మించి నిష్క్రియంగా ఉన్న మొబైల్ నంబర్లకు అనుసంధానం చేసిన యూపీఐ ఐడీలు రద్దవుతాయి.

✦ కొత్త బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసేటప్పుడు, ధ్రువీకరణలతోపాటు, వెరిఫికేషన్ కాస్త కఠినంగానే ఉండబోతోంది.

ఈక్విటీలతో పొదుపు

బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ నుంచి ఒక ఈక్విటీ సేవింగ్స్ ఫండ్ అందుబాటులోకి వచ్చింది. బజాజ్ ఫిన్‌సర్వ్ ఈక్విటీ సేవింగ్స్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 11. ఎన్‌ఎఫ్‌ఓలో కనీస పెట్టుబడి రూ.500. ఈక్విటీ షేర్లలో, రుణ పత్రాల్లో పెట్టుబడులు పెట్టటంతో పాటు ఆర్బిట్రేజ్ అవకాశాలను ఈ పథకం అన్వేషిస్తుంది. పోర్ట్‌ఫోలియోలో దాదాపు 65 శాతం వరకూ ఈక్విటీ వాటా ఉంటుంది. తత్ఫలితంగా ఈ పథకానికి దీర్ఘకాలిక లాభాల పన్ను నిబంధనలు వర్తిస్తాయి. దీర్ఘకాలిక మదుపరులకు ఈ తరహా పథకాలు అనువుగా ఉంటాయి. తక్కువ రిస్కులో ఒక మోస్తరు ప్రతిఫలంతో సరిపెట్టుకోదలచిన వారు ఈ పథకంలో పెట్టుబడి పెట్టే అంశాన్ని పరిశీలించవచ్చు.

ఒత్తిడిని తట్టుకుంటే

ఇప్పటికే ఎన్నో మ్యూచువల్ ఫండ్ సంస్థలు మిడ్ క్యాప్ పథకాలను నిర్వహిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఈ తరగతికి చెందిన పథకాన్ని తీసుకొచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 14న ముగుస్తుంది. ఎన్‌ఎఫ్‌ఓలో కనీస పెట్టుబడి రూ.5,000. మిడ్‌క్యాప్ పథకాలు గత కొంతకాలంగా ఆకర్షణీయమైన లాభాలు నమోదు చేసిన విషయం విదితమే. సమీప భవిష్యత్తులోనూ మిడ్ క్యాప్ తరగతికి చెందిన పథకాలు మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం లేకపోలేదు. కాకపోతే ఈ తరహా పథకాల నుంచి మంచి లాభాలు ఆర్జించటానికి కనీసం 3 నుంచి 5 ఏళ్ల పాటు ఎదురుచూడాలి. నష్టభయమూ ఎక్కువగా ఉంటుంది. పెట్టుబడుల విలువ భారీగా హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది. ఇలాంటి ఒత్తిళ్లను తట్టుకోగల మదుపరులు మిడ్ క్యాప్ పథకాల్లో పెట్టుబడి పెట్టే అంశాన్ని పరిశీలించవచ్చు. నిఫ్టీ మిడ్ క్యాప్ 150 టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది.

పెట్టుబడి... వైవిధ్యంగా

మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్‌ను 360 వన్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చింది. ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 13. కనీస పెట్టుబడి రూ.1,000. ఈక్విటీతో పాటు ఇతర రకాలైన ఆస్తుల్లో పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించటం ఈ పథకం ప్రధానోద్దేశం. ఈక్విటీ షేర్లకు 15- 35 శాతం నిధులు కేటాయిస్తారు. రుణ పత్రాలకు 25- 50 శాతం, బంగారం- వెండితో సహా ఇతర రకాలైన కమొడిటీలకు 25- 40 శాతం నిధులు కేటాయించే అవకాశం ఉంది. మంచి అవకాశం అని భావిస్తే రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన రీట్, ఇన్విట్‌లోనూ పెట్టుబడి పెడతారు. ఈ పథకం పనితీరుకు బీఎస్ఈ 500 (25 శాతం), నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్ (45 శాతం), దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధర (30 శాతం) కొలమానంగా ఉంటాయి. పెట్టుబడి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ, దీర్ఘకాలంలో మెరుగైన లాభాలు ఆర్జించేందుకు ప్రయత్నించాలనేది ఈ పథకం వ్యూహం. విభిన్నమైన ఆస్తులతో కూడిన పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేస్తారు. కాబట్టి, నష్టభయం కొంత తక్కువగా ఉంటుంది. అదే సమయంలో దీర్ఘకాలం పాటు ఎదురు చూస్తేనే లాభాలు కనిపిస్తాయి.

ధర పెరుగుతున్న షేర్లలో

కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్న పథకాన్ని ఆవిష్కరించింది. కోటక్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్ అనే ఈ పథకం ప్రధానంగా మొమెంటమ్ పెట్టుబడులపై ఆధారపడి అధిక లాభాలు ఆర్జించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మొమెంటమ్ ఇన్వెస్టింగ్ అంటే ఆకర్షణీయంగా ధర పెరుగుతున్న షేర్లలో పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను నిర్మించడమనే విషయం విదితమే. దీంతోపాటు ఆయా కంపెనీల పునాదులు ఎంత బలంగా ఉన్నాయి.. వృద్ధి అవకాశాలు, మేనేజ్‌మెంట్ సత్తా, సంబంధిత వ్యాపార రంగాల తీరుతెన్నులు వంటి వివిధ అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటారు. కోటక్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్ పనితీరుకు నిఫ్టీ 500 ఇండెక్స్ టీఆర్ఐ సూచీ కొలమానంగా ఉంటుంది. ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ముగింపు తేదీ ఈ నెల 12. దాదాపు 250 కంపెనీలను పరిశీలించి అందులో ఆసక్తికరంగా ఉన్న 40-50 కంపెనీలను ఎంపిక చేసి, పోర్ట్‌ఫోలియోను నిర్మిస్తారు.

మూడేళ్లలో రూ.10లక్షలు సాధ్యమేనా?

నా వయసు 23. ఇటీవలే ఉద్యోగంలో చేరాను. రూ.50 లక్షల వరకూ టర్మ్ పాలసీ తీసుకోవాలని అనుకుంటున్నాను. చిన్న వయసులో ఉన్న వారికి ఇంత మొత్తంలో పాలసీ ఇవ్వరు అంటున్నారు. నిజమేనా? నెలకు రూ.10వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. కనీసం 20 ఏళ్ల తర్వాత ఎంత మొత్తం జమయ్యే అవకాశం ఉంది? - హర్షిత్

■ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని ఆదాయం ఆధారంగా ఇస్తారు. మీకు నెలకు కనీసం రూ.30 వేల వరకూ ఆదాయం ఉంటే, రూ.50లక్షల టర్మ్ పాలసీని తీసుకోవచ్చు. మంచి క్లెయిం చెల్లింపుల చరిత్ర ఉన్న బీమా సంస్థ నుంచి ఈ పాలసీని తీసుకోండి. ముందుగా మీరు ఆరు నెలలకు సరిపోయే అత్యవసర నిధిని సిద్ధం చేసుకోండి. ఆ తర్వాతే పెట్టుబడి గురించి ఆలోచించండి. మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.10 వేలను డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి. నెలకు రూ.10 వేల చొప్పున 20 ఏళ్లపాటు మదుపు చేస్తే, సగటున 12 శాతం వార్షిక రాబడి అంచనాతో.. దాదాపు రూ.92 లక్షలు అయ్యే వీలుంది.

మా అమ్మాయి వయసు 4. తన పేరుమీద నెలకు రూ.8వేల వరకూ పెట్టుబడి పెట్టాలనేది ఆలోచన. ఇందుకోసం ఎలాంటి పథకాలను ఎంచుకోవడం మంచిది? - వందన

■ పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే వారి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడులు పెట్టాలి. దీనివల్ల తక్కువ మొత్తంతోనూ అధిక నిధిని సృష్టించే అవకాశం లభిస్తుంది. కాస్త నష్టభయం ఉన్న పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తే, మంచి లాభం వస్తుంది. మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న రూ.8వేలను హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం ద్వారా మదుపు చేయండి. మీ ఆదాయం పెరిగినప్పుడల్లా మీ పెట్టుబడులు పెంచుకునే ప్రయత్నం చేయండి. మీ అమ్మాయి భవిష్యత్తు అవసరాలకు డబ్బు సమకూర్చడంతోనే సరిపెట్టుకోకూడదు. తన లక్ష్యాలకు తగిన భద్రత కల్పించడమూ ముఖ్యమే. దీనికోసం కుటుంబంలో ఆర్జించే వ్యక్తి పేరుమీద తగిన మొత్తానికి టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోండి.

నేను ఇటీవలే పదవీ విరమణ చేశాను. దాదాపు రూ.20 లక్షల వరకూ ఉన్నాయి. వీటిని మంచి ఆదాయం వచ్చేలా ఎలాంటి పథకాల్లో మదుపు చేయాలి? రెండేళ్ల తర్వాత నుంచి ఆదాయం వస్తే చాలు. - నరేందర్

■ పదవీ విరమణ తర్వాత కనీసం 20-25 ఏళ్లపాటు డబ్బు అందుబాటులో ఉండేలా ప్రణాళిక ఉండాలి. మీ దగ్గర రూ.20లక్షలు మాత్రమే ఉంటే, కాస్త పెంచుకునే ప్రయత్నం చేయండి. పెట్టుబడి కోసం హైబ్రిడ్ ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లను ఎంచుకోండి. రెండేళ్ల తర్వాత సమకూరిన మొత్తం నుంచి ఏడాదికి 8 శాతం చొప్పున వెనక్కి తీసుకోవచ్చు.

మార్గదర్శి

నాకు మూడేళ్ల తర్వాత రూ.10లక్షలు అవసరం. దీనికోసం ఇప్పటి నుంచి నెలకు రూ.15వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. ఇది సాధ్యమవుతుందా? ఎలాంటి పెట్టుబడులను ఎంచుకోవాలి? - శ్రీకాంత్

■ మీరు పెట్టాలనుకుంటున్న పెట్టుబడితో మీ లక్ష్యాన్ని చేరుకోవడం కాస్త కష్టమనే చెప్పాలి. నెలకు రూ.15వేలతో మూడేళ్లలో రూ.10లక్షలు జమ కావాలంటే.. వార్షిక సగటు రాబడి 75శాతానికి మించి రావాలి. మీకు ఎక్కువ సమయం లేదు కాబట్టి, పెట్టిన పెట్టుబడి సురక్షితంగా ఉండేలా చూసుకోవడమే మేలు. సగటున 7 శాతం రాబడినిచ్చే పథకాల్లో మదుపు చేస్తే.. మూడేళ్ల తర్వాత రూ.6లక్షల వరకూ జమ అయ్యే అవకాశం ఉంది.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

(ఆర్థిక విషయాల్లో మీకున్న సందేహాలను siri@eenadu.netకు మెయిల్ చేయండి.)

ఇంటి రుణం కావాల్సినంత రావాలంటే

గృహరుణ వడ్డీ రేట్లు అందుబాటులోకి రావడంతో ఇప్పుడు సొంతింటి కోసం ఆలోచిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో ఇంటి కొనుగోలుకు అవసరమైన మేరకు రుణం రావాలంటే ఏం చేయాలనే సందేహం ఎంతోమందికి వస్తోంది. బ్యాంకు లేదా గృహరుణ సంస్థ ఒక వ్యక్తికి రుణాన్ని ఇచ్చేటప్పుడు ఏయే అంశాలను పరిశీలిస్తుంది. రుణ గ్రహీత తన అర్హతను పెంచుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది తెలుసుకుందాం.



క్రెడిట్ స్కోరు ఎంతుంది?: ఇప్పటి వరకూ తీసుకున్న రుణాలను ఎలా చెల్లించారు అనేది ధ్రువీకరించేది క్రెడిట్ నివేదిక. కొత్త అప్పును తీసుకోవాలనుకున్నప్పుడు క్రెడిట్ స్కోరు ఎంతో కీలకంగా మారుతుంది. 750కి మించి స్కోరున్నప్పుడే రుణం తేలిగ్గా లభిస్తుంది. 800 దాటితే వడ్డీలోనూ 0.5 శాతం వరకూ తగ్గింపు లభిస్తుంది. కాస్త ఎక్కువ మొత్తంలో రుణం తీసుకునేందుకూ వీలవుతుంది.

ఉమ్మడిగా: కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువమంది ఆర్జిస్తుంటే ఉమ్మడిగా రుణం తీసుకోవచ్చు. దీనివల్ల అధిక మొత్తం లభిస్తుంది. జీవిత భాగస్వామి, తల్లిదండ్రులతో కలిసి ఈ ఉమ్మడి రుణం తీసుకోవచ్చు. రుణ అర్హత పెరగడమే కాకుండా ఈఎంఐ భారాన్ని పంచుకోవచ్చు. ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఇది ఉపయోగపడుతుంది.

వ్యవధి పెంచుకోవాలి: అధిక మొత్తంలో అప్పు అవసరమైనప్పుడు వ్యవధి వీలైనంత ఎక్కువ కాలం ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గి, మీ రుణం పెరుగుతుంది. కాకపోతే వడ్డీ భారం అధికంగా ఉంటుందన్న సంగతి మర్చిపోవద్దు.

ఇతర అప్పులు: గృహరుణ అర్హతను నిర్ణయించడంలో ఇతర అప్పులూ కీలకమే. ఇప్పటికే రెండుమూడు అప్పులుంటే వీటికి చెల్లించే ఈఎంఐ కొత్త రుణానికి అడ్డంకిగా మారుతుంది. కాబట్టి, చిన్న రుణాలను వీలైనంత మేరకు తీర్చేందుకు ప్రయత్నించండి. ఆదాయంలో 40 శాతానికి మించి ఈఎంఐలు ఉండటం అంత మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో 50 శాతం వరకూ ఉండొచ్చు.


ఇతర ఆదాయాలు: వేతనం ఒక్కటే కాకుండా, ఇతర మార్గాల నుంచీ ఆదాయం వస్తుంటే.. ఆ లెక్కలను రుణదాతకు తెలియజేయండి. ఉదాహరణకు అద్దె, వ్యాపారం, వ్యవసాయం, వడ్డీలు ఇలా అన్ని రకాల ఆదాయ ఆధారాలనూ చూపించండి. దీనివల్ల మీకు కావాల్సినంత రుణం సులభంగా లభిస్తుంది.

స్వయం ఉపాధి పొందుతున్నా: గృహరుణాలు కేవలం ఉద్యోగులు, అధిక ఆదాయం ఉన్న వ్యక్తులకే అన్న అపోహ చాలామందిలో ఉంది. కానీ, ఇది నిజం కాదు. స్వయం ఉపాధి పొందుతున్న వారికీ ఇప్పుడు చాలా సంస్థలు గృహరుణాలు అందిస్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకులూ గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. వడ్డీ కాస్త అధికంగా ఉండే అవకాశం ఉంది.

అధికంగా చెల్లిస్తే.. సాధారణంగా బ్యాంకులు, రుణ సంస్థలు ఇంటి విలువలో 90 శాతం వరకూ రుణాన్ని ఇస్తుంటాయి. మిగతా మొత్తాన్ని మనమే సమకూర్చుకోవాలి. మీరు తక్కువ మార్జిన్ మనీని చెల్లిస్తే ఎక్కువ రుణం తీసుకోవాల్సి వస్తుంది. వడ్డీ భారమవుతుంది. వీలైనంత వరకూ మీ దగ్గర అందుబాటులో ఉన్న మొత్తం చెల్లించి, అవసరమైన మేరకే రుణం తీసుకునే విషయాన్నీ పరిశీలించాలి.

అన్నీ తెలుసుకున్నాకే: గృహరుణం తీసుకునే తొందరలో కొన్ని ముఖ్యమైన అంశాలను మర్చిపోతుంటాం. ముందుగా ఏ బ్యాంకు/రుణ సంస్థను సంప్రదించాలో నిర్ణయించుకోండి. వడ్డీ ఎంత విధిస్తున్నారు పరిశీలించండి. మీ క్రెడిట్ నివేదికను చూడండి. ఏమైనా తప్పులుంటే సరిచేసుకోండి. పరిశీలనా రుసుములు, ఇతర ఖర్చులనూ బేరీజు వేసుకున్నాకే రుణ సంస్థను ఎంపిక చేసుకోవాలి.

బ్యాలెన్స్‌డ్‌గా వెళ్దాం



పెట్టుబడులు పెట్టేటప్పుడు మర్చిపోకూడని మొదటి సూత్రం.. నష్టాలను పరిమితం చేసుకుంటూ.. మంచి రాబడిని ఆర్జించాలి. ఇది అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. ముఖ్యంగా మార్కెట్లు అస్థిరంగా ఉన్నప్పుడు. ఈ సమయంలోనే బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు ఒక ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తాయి. ఈ ఫండ్లు ఈక్విటీ, డెట్‌ల మధ్య సమతుల్యతను సాధిస్తూ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులను సర్దుబాటు చేస్తాయి.

మ్యూచువల్ ఫండ్లు అందించే హైబ్రిడ్ ఫండ్లలో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు ఒక రకం. ఇవి ప్రధానంగా ఈక్విటీ (షేర్లు), డెట్ (బాండ్లు) మధ్య పెట్టుబడులను సందర్భానుసారం మారుస్తూ ఉంటాయి. ఈ ఫండ్ల లక్ష్యం మార్కెట్ అస్థిరతను తగ్గించి, స్థిరమైన రాబడిని అందించడం. ఫండ్ మేనేజర్ మార్కెట్ పరిస్థితులు, వడ్డీ రేట్లు, ఆర్థిక సూచీల ఆధారంగా ఈక్విటీ, డెట్‌ల మధ్య కేటాయింపులను సర్దుబాటు చేస్తారు.

ఉదాహరణకు ఈక్విటీ మార్కెట్లు బాగున్నప్పుడు వీటికి కేటాయింపులు 65 శాతం వరకూ పెంచి, రాబడిని ఆర్జించేందుకు ప్రయత్నిస్తారు. మార్కెట్లు హెచ్చుతగ్గుల్లో ఉంటే, పెట్టుబడులను డెట్ వైపు మళ్లిస్తారు. దీనివల్ల నష్టభయాన్ని తగ్గిస్తారు. ఈ సర్దుబాటు వల్ల ఈ పథకాలు సామాన్య పెట్టుబడిదారులకు సురక్షితమైన ఎంపికగా మారుతున్నాయి.

ఎలా పనిచేస్తాయంటే..

బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లు విలువ ఆధారిత విధానాలను ఉపయోగించుకుంటాయి. ఉదాహరణకు షేరు ధర, సంపాదన నిష్పత్తి, డివిడెండ్ రాబడి, బాండ్ రాబడులను పరిగణనలోకి తీసుకుంటాయి. మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు ఈక్విటీల్లో పెట్టుబడులను తగ్గించి, డెట్‌లో పెంచుతాయి. దీనివల్ల నష్టభయాన్ని నియంత్రిస్తూ, దీర్ఘకాలిక రాబడిని సాధించడంలో సహాయం చేస్తాయి.

ఈ ఫండ్లు పన్ను పరంగానూ ప్రయోజనమే.. ఈక్విటీ కేటాయింపు 65 శాతానికి మించి ఉంటే, ఈక్విటీ ఫండ్ల మాదిరిగా పన్ను లెక్కిస్తారు. ఒక సంవత్సరానికి మించి ఇందులో కొనసాగితే, దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను (ఆర్థిక సంవత్సరంలో మూలధన లాభం రూ.1.25లక్షలు దాటిన తర్వాత ఆ పై మొత్తానికి 12.5శాతం) వర్తిస్తుంది.

పరిమితులున్నాయి..

ప్రతి పెట్టుబడి పథకంలోనూ కొన్ని పరిమితులున్నట్లే.. వీటిలోనూ కొన్ని చిక్కులు ఉన్నాయి.

✦ ఈక్విటీ కేటాయింపు వల్ల మార్కెట్ తగ్గినప్పుడు కొంత నష్టం రావచ్చు. కానీ, పూర్తిస్థాయి ఈక్విటీ ఫండ్లతో పోలిస్తే తక్కువే.

✦ ఫండ్ మేనేజర్ తీసుకున్న నిర్ణయాలు రాబడిపై ప్రభావం చూపిస్తాయి. సరైన సమయంలో సరైన నిర్ణయం ఇక్కడ ఎంతో ముఖ్యం.

✦ ఈ ఫండ్లలో ఖర్చుల నిష్పత్తి కొద్దిగా అధికంగానే ఉంటుంది. ఇది దీర్ఘకాలంలో రాబడిని తగ్గించే అవకాశం ఉంది.

✦ దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. మరీ స్వల్పకాలం కోసం వీటిని ఎంచుకుంటే ఇబ్బంది ఎదురవుతుంది.

ఎవరికి అనుకూలం..

✦ ఇప్పటి వరకూ మార్కెట్లో ఎలాంటి పెట్టుబడులూ పెట్టని వారికి ఈ ఫండ్లు అనుకూలమని చెప్పొచ్చు.

✦ కాస్త నష్టభయం భరించగలిగే సామర్థ్యం ఉన్న వారికి ఈ ఫండ్లు సరిపోతాయి.

✦ పదవీ విరమణ లేదా ఇతర లక్ష్యాల కోసం మరో 5-10 ఏళ్ల సమయం ఉన్న వారు వీటిని పరిశీలించవచ్చు. పదవీ విరమణ అనంతరం పెట్టుబడిని క్రమానుగతంగా వెనక్కి తీసుకోవాలని (ఎస్‌డబ్ల్యూపీ) అనుకున్నప్పుడూ ఎంచుకోవచ్చు.

ఎంపిక ఇలా..

✦ కనీసం 5-10 ఏళ్ల ఫండ్ చరిత్రను పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలి.


✦ మీరు ఎంచుకున్న ఫండ్‌ను నిర్వహిస్తున్న ఫండ్ మేనేజర్ గురించీ తెలుసుకోండి. వివిధ మార్కెట్ పరిస్థితుల్లో పెట్టుబడులను ఎలా మార్పులు, చేర్పులు చేశారో పరిశీలించండి.

✦ ఖర్చుల నిష్పత్తి తక్కువగా ఉండాలి. దీనివల్ల దీర్ఘకాలంలో అధిక రాబడిని ఆశించవచ్చు. అదే సమయంలో మంచి ఫండ్ సంస్థ (ఏఎంసీ) అందించే ఫండ్లనే ఎంచుకోవడం మంచిది.

✦ మీ పెట్టుబడులు వైవిధ్యంగా ఉండాలి. మీ నష్టభయ సామర్థ్యం, లక్ష్యాలను ఒకసారి సమీక్షించుకోండి. అందుకు అనుగుణంగా ఈ ఫండ్లను ఎంచుకోవాలి.

చర్యారేటును నిర్ధారించే.. ఉత్తేజిత శక్తి

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం — కెమిస్ట్రీ



రసాయన గతికశాస్త్రం

చర్యారేటుపై ఉష్ణోగ్రత ప్రభావం

అనేక రసాయన చర్యల రేటు ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ చాలా ఎక్కువగా పెరుగుతుంది. చాలా చర్యల్లో ప్రతి $10^{\circ}C$ ఉష్ణోగ్రత పెరుగుదలకు చర్యారేటు 2-3 రెట్లు పెరుగుతుంది.

✦ ఉష్ణోగ్రత ప్రభావాన్ని ఉష్ణోగ్రత గుణకంగా తెలియజేస్తారు.

✦ $10^{\circ}C$ వ్యత్యాసం ఉన్న రెండు ఉష్ణోగ్రతల వద్ద చర్యారేట్ల నిష్పత్తిని ఉష్ణోగ్రత గుణకం అంటారు.

$$\text{ఉష్ణోగ్రత గుణకం} = \frac{35^{\circ}C \text{ వద్ద చర్యారేటు స్థిరాంకం}}{25^{\circ}C \text{ వద్ద చర్యారేటు స్థిరాంకం}}$$


✦ అనేక చర్యలకు ఉష్ణోగ్రత గుణకం 2-3 మధ్య ఉంటుంది.

✦ సాధారణ శక్తి కలిగిన క్రియాజనక అణువు, తాడనం ద్వారా క్రియాజన్యంగా మారడానికి దానికి అదనంగా అవసరమయ్యే శక్తిని ఉత్తేజిత శక్తి అంటారు.

✦ క్రియాజనక అణువు శక్తిని E_R అని, క్రియాజన్యంగా మారేందుకు ఉండాల్సిన శక్తిని E_T అనుకుంటే,

ఉత్తేజిత శక్తి $E_a = E_T - E_R$

✦ ఉత్తేజిత శక్తి చర్యారేటును నిర్ధారిస్తుంది. గది ఉష్ణోగ్రతలో అధిక ఉత్తేజిత శక్తి ఉన్న చర్య నెమ్మదిగా, అల్ప ఉత్తేజిత శక్తి ఉన్న చర్య వేగంగా జరుగుతుంది.



✦ చర్యారేటుకు ఉష్ణోగ్రతకు మధ్య ఉన్న సంబంధాన్ని తెలిపే అనుభావిక సమీకరణాన్ని అర్హీనియస్ ప్రతిపాదించారు. దీన్నే అర్హీనియస్ సమీకరణం అంటారు. ఉత్తేజిత శక్తిని ఈ సమీకరణం ద్వారా నిర్ధారించవచ్చు.

✦ అర్హీనియస్ ప్రకారం $K = Ae^{-\frac{E_a}{RT}}$


ఇక్కడ, K = రేటు స్థిరాంకం, A = పౌనఃపున్య గుణకం,
E_a = చర్య ఉత్తేజిత శక్తి, R = వాయు స్థిరాంకం,
T = పరమ ఉష్ణోగ్రత

శూన్యక్రమాంక చర్యారేటు

స్థిరాంకానికి సమీకరణం: శూన్యక్రమాంక చర్యలో చర్యారేటు, క్రియాజనకాల గాఢతపై ఆధారపడకుండా చర్యాకాలం అంతా స్థిరంగా ఉంటుంది. అంటే, చర్యారేటు $\frac{dx}{dt} = K$

పై సమీకరణాన్ని సమాకలనం చేస్తే, $x = Kt$ (లేదా) $K = \frac{x}{t}$.

ఇక్కడ, x = వినియోగమైన క్రియాజనకాల గాఢత
t = చర్యాకాలం, K = చర్యారేటు స్థిరాంకం



▮ శూన్యక్రమాంక చర్యారేటు సమీకరణం ఆధారంగా వినియోగమైన గాఢత (x), చర్యాకాలం (t)కి మధ్య రేఖీయ సంబంధం ఉంటుంది. చర్యాకాలం (t)ను x - అక్షంలో, వినియోగించిన గాఢత (x)ను y - అక్షంలో తీసుకుని గ్రాఫ్ గీస్తే, మూలబిందువు ద్వారా వెళ్లే సరళరేఖ లభిస్తుంది.

అభిలాక్షణీయ ధర్మాలు:

i. స్థిరాంకం ప్రమాణాలు: K ప్రమాణాలు = మోల్ లీ$^{-1}$. సెకన్$^{-1}$

☛ ప్రమాణాల ఆధారంగా శూన్యక్రమాంక చర్యారేటు స్థిరాంకం విలువ గాఢత, కాలం ప్రమాణాలపై ఆధారపడుతుంది.

ii. అర్ధ జీవితకాలం: క్రియాజనకాల గాఢత, ప్రారంభ గాఢతల్లో సగం తగ్గడానికి పట్టే సమయాన్ని అర్ధ జీవితకాలం అంటారు. దీన్ని $t_{1/2}$ తో సూచిస్తారు.

☛ అర్ధ జీవితకాలం నిర్వచనం ప్రకారం, వినియోగమైన గాఢత $x = \frac{a}{2}$ అయితే $t = t_{1/2}$ అవుతుంది.

☛ అర్ధ జీవితకాలం $t_{1/2} = \frac{a}{2k}$

a = క్రియాజనకాల ప్రారంభ గాఢత
$t_{1/2}$ = అర్ధజీవిత కాలం, K = చర్యారేటు స్థిరాంకం

☛ దీని ఆధారంగా శూన్యక్రమాంక చర్య అర్ధ జీవితకాలం ప్రారంభ గాఢతకు అనులోమానుపాతంలో ఉంటుంది.

ప్రథమ క్రమాంక చర్యారేటు

స్థిరాంకం సమీకరణం: ప్రథమ క్రమాంక చర్యల్లో చర్యారేటు, ఒక క్రియాజనకం గాఢతపై ఆధారపడుతుంది.

i) A ⟶ క్రియాజన్యాలు ii) A + B (excess) క్రియాజన్యాలు

● చర్యారేటు, $-\frac{d[A]}{dt} = K[A] \longrightarrow$ (i)

క్రియాజనకం ప్రారంభ గాఢత a మోల్. లీ$^{-1}$, మొదటి t సెకన్ల కాలంలో వినియోగించిన క్రియాజనకం గాఢత 'x' మోల్. లీ$^{-1}$ అనుకుంటే, అప్పుడు t కాలం తర్వాత క్రియాజనకం గాఢత (a - x) మోల్. లీ$^{-1}$గా ఉంటుంది. క్రియాజనకం గాఢతను సమీకరణం (i) లో ప్రతిక్షేపించగా,


$$\frac{dx}{dt} = K(a - x) \longrightarrow \text{(ii)}$$

పై సమీకరణాన్ని సమాకలనం చేస్తే, $K = \frac{2.303}{t}\log\frac{a}{a-x}$

ఇదే ప్రథమ క్రమాంక చర్యారేటు స్థిరాంకం సమీకరణం.

● కాలవ్యవధిని X - అక్షంలో, $\log\frac{a}{a-x}$ విలువలను Y - అక్షంలో తీసుకుని గ్రాఫ్ గీస్తే, మూల బిందువు ద్వారా వెళ్లే సరళరేఖ ఏర్పడుతుంది.

ఈ రేఖ వాలు $\frac{K}{2.303}$ కి సమానం.



i. స్థిరాంకం ప్రమాణాలు:
K ప్రమాణాలు = సెకన్$^{-1}$

▮ ప్రమాణాల ఆధారంగా ప్రథమ క్రమాంక చర్యారేటు స్థిరాంకం విలువ కేవలం కాలం ప్రమాణాలపై ఆధారపడుతుంది.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

728 Word of the Day

Idealistic

Telugu meaning: ఆదర్శవాద, గొప్పబుద్ధి గల

English meaning: The word idealistic (ఐడియలిస్టిక్) is an adjective that describes someone who is guided by high or noble principles, often impractical in real-world scenarios.

Synonyms: Dreamy, Visionary

Antonyms: Realistic, Practical

Usage: **1.** Her idealistic plans for world peace were admirable but lacked practical steps.
2. As a young teacher, he was full of idealistic enthusiasm to change the system.

నోటిఫికేషన్స్

ఇంజినీర్ పోస్టులు

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ఘజియాబాద్ యూనిట్ ఫీల్డ్ ఆపరేషన్ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్-1 పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 32. దరఖాస్తు ఫీజు రూ.400. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 4, 5 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

గ్రూప్-సి ఉద్యోగాలు

జబల్‌పూర్‌లోని ఐసీఎఫ్ఆర్ఈ - ట్రోపికల్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎఫ్ఆర్ఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 14. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 10.

సెక్యూరిటీ అసిస్టెంట్/ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

భారత ప్రభుత్వ హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) సెక్యూరిటీ అసిస్టెంట్/ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 4,987. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 1) చివరి తేదీ

✦ ఎడ్‌సిల్ ఇండియా లిమిటెడ్‌లో సీనియర్ కన్సల్టెంట్ పోస్టులు. బీటెక్ (సివిల్), ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

✦ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో సీనియర్ కన్సల్టెంట్ పోస్టులు. డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


వరల్డ్ వైడ్ వెబ్ దినోత్సవం

ఆగస్టు 1 — చరిత్రలో ఈనాడు

వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) ఆవిష్కరణకు గుర్తుగా ఏటా ఆగస్టు 1న 'వరల్డ్ వైడ్ వెబ్ దినోత్సవం'గా (World Wide Web Day) నిర్వహిస్తారు. వరల్డ్ వైడ్ వెబ్‌ను సంక్షిప్తంగా 'వెబ్' లేదా 'డబ్ల్యూ 3' అని పిలుస్తారు. ఇది హైపర్ మీడియా ఆధారిత సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ. దీన్ని ఉపయోగించాలంటే ఇంటర్నెట్ అవసరం. హైపర్ టెక్స్ట్, గ్రాఫిక్స్, ఆడియో, వీడియో, మల్టీమీడియాను ఏకీకృతం చేసి దాదాపు ప్రతి విషయంపై వెబ్ సమాచారాన్ని అందిస్తుంది. ఇది సమాచారాన్ని పంచుకోవడం, వినియోగించడాన్ని సులభతరం చేస్తుంది. కమ్యూనికేషన్, ఈ-కామర్స్, వినోదం మొదలైనవాటితో సహా వివిధ ఆన్‌లైన్ కార్యకలాపాలకు వెబ్ ఒక వేదికగా ఉంది. సమాచార మార్పిడి నుంచి వాణిజ్యం వరకు వెబ్ మానవులను ఎలా ప్రభావితం చేసిందో తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

▮ ప్రస్తుతం వెబ్ 2.0 వర్షన్ వినియోగంలో ఉంది. 1991-2004 మధ్యకాలంలో వెబ్ 1.0 వాడుకలో ఉండేది. ఆ సమయంలో బ్రౌజర్లు, వెబ్‌సైట్ల కోసం దీన్ని వాడేవారు.

▮ వెబ్ 2.0లో కంపెనీలు యాప్‌లు, సోషల్ మీడియా, వికీపీడియా లాంటివాటిని అభివృద్ధి చేయడం ప్రారంభించాయి.




చారిత్రక నేపథ్యం:

యూరోపియన్ సెంటర్ ఫర్ న్యూక్లియర్ రిసెర్చ్ (సీఈఆర్ఎన్)లో పనిచేసే టిమ్ బెర్నర్స్-లీ అనే శాస్త్రవేత్త 1989లో 'వరల్డ్ వైడ్ వెబ్'ను ఆవిష్కరించారు. ఆ సమయంలో ఇది కమ్యూనికేషన్ మాధ్యమంలా ఉండి సమాచారాన్ని పంచుకోవడం, వినియోగించడంలో విప్లవాత్మక మార్పులకు కారణమైంది. ప్రస్తుతం ఇది అన్ని వర్గాల ప్రజలను అనుసంధానిస్తూ ప్రపంచ నెట్‌వర్క్‌గా ఎదిగింది.

☛ 1990 చివరి నాటికి బెల్జియం సిస్టమ్స్ ఇంజినీర్ రాబర్ట్ కైలియాతో కలిసి టిమ్ బెర్నర్స్-లీ మొదటి వెబ్ సర్వర్, బ్రౌజర్‌ను అభివృద్ధి చేశారు. ప్రపంచంలోనే మొట్ట మొదటి వెబ్‌సైట్ అయిన info.cern.ch 1991, ఆగస్టు 6న లైవ్‌లోకి వచ్చింది. అందులో 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ'ను వివరించడంతోపాటు దాన్ని ఎలా ఉపయోగించాలో సూచనలు అందించారు.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత



వేడి లేదా చల్లదనం స్థాయిని సూచించే ఒక భౌతిక పరిమాణమే ఉష్ణోగ్రత. దీన్ని వస్తువులోని అణువుల కదలిక శక్తి ఆధారంగా నిర్ణయిస్తారు. ఉష్ణోగ్రతను సెల్సియస్ (°C), ఫారెన్‌హీట్ (°F) లేదా కెల్విన్ (K) యూనిట్లలో కొలుస్తారు. ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత జీవుల జీవన విధానం, పర్యావరణ ప్రక్రియలు, రసాయన చర్యలపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఇది జీవుల జీవక్రియ, పెరుగుదల, పునరుత్పత్తి, పంపిణీని నిర్ణయిస్తుంది.

జీవులపై ఉష్ణోగ్రత ప్రభావం

ప్రతి జీవికి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత పరిధి ఉంటుంది. దీన్నే సహనశీలత అంటారు. ఈ పరిధి పెరిగితే జీవనం కష్టతరమవుతుంది.

మొక్కల జీవన ప్రక్రియలు – ఉష్ణోగ్రత ప్రాథమిక ప్రభావం

మొక్కల జీవన విధానంలో ఉష్ణోగ్రత కీలకమైన ఆవరణ కారకం. ఇది పెరుగుదల, జీవక్రియ, పునరుత్పత్తి, సహనశీలతను నిర్ణయిస్తుంది. మొక్కలు ఎక్టోథర్మ్ జీవులుగా ఉంటాయి. బాహ్య వాతావరణంపై ఆధారపడి ఇవి తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

✦ ఉష్ణోగ్రత మొక్కల్లో జరిగే కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియ, బాష్పోత్సేకం లాంటి ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది.

పర్యావరణ ప్రక్రియలు – ఉష్ణోగ్రత ప్రభావం

పర్యావరణ ప్రక్రియల్లో ఉష్ణోగ్రత కీలకపాత్ర పోషిస్తుంది.

✦ నీటిచక్రంలో సాంద్రీకరణం, ఘనీభవనం ఉష్ణోగ్రతపై ఆధారపడతాయి.

ఎక్టోథర్మ్‌లు, ఎండోథర్మ్‌లపై ఉష్ణోగ్రత ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ - పరిణామాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

International Tiger Day is observed on...

Current Affairs

1. International Tiger Day is observed on which date every year to raise awareness about tiger conservation?
A) 5th June B) 11th July
C) 29th July D) 14th August

2. Who has been recently nominated as a Director on the Central Board of the Reserve Bank of India (RBI), with effect from July 24, 2025?
A) Anuradha Thakur B) Ajay Seth
C) M. Nagaraju D) Sanjay Malhotra

3. Which Indian chess player became the fourth Indian woman to earn the title of Grandmaster after winning the 2025 FIDE Women's World Cup?
A) R. Vaishali B) Koneru Humpy
C) Dronavalli Harika D) Divya Deshmukh

4. Who defeated Pankaj Advani in the final of the 2025 IBSF World 6-Red Snooker Championship to claim the title?
A) Aditya Mehta
B) Ishpreet Singh Chadha
C) Muhammad Asif
D) Riley Powell

5. On which date is World Nature Conservation Day observed annually to raise awareness about protecting natural resources?
A) 5 June B) 22 April
C) 11 July D) 28 July

6. Who ended India's 15-year drought by winning a bronze in the women's singles at the 2025 World Junior Squash Championships?
A) Joshna Chinappa
B) Dipika Pallikal
C) Sivasangari Subramaniam
D) Anahat Singh

SSC Exams Special

General Awareness

History

7. Which city is regarded as the birthplace of the fourth Jain Tirthankara, Abhinandannath?
A) Rajgir B) Varanasi
C) Ayodhya D) Hastinapur

8. Which English sea captain visited the court of Mughal emperor Jahangir in 1608?
A) Thomas Roe
B) William Baffin
C) Captain William Hawkins
D) John Mildenhall

9. Who was the third son of Shah Jahan and Mumtaz Mahal, and is considered the last effective ruler of the Mughal Dynasty?
A) Akbar B) Aurangzeb
C) Jahangir D) Humayun

10. The Battle of Raichur (1520) was fought between the Vijayanagara Empire and which Sultanate?
A) Bijapur B) Golconda
C) Ahmadnagar D) Berar

Geography

11. Which Five Year Plan introduced high-yielding variety seeds to promote food security and agricultural modernization?
A) First Five Year Plan
B) Second Five Year Plan
C) Fourth Five Year Plan
D) Third Five Year Plan

12. Who is credited with introducing the coffee plant to Chikkamagaluru, Karnataka in 1670?
A) Vasco da Gama B) Baba Budan
C) Tipu Sultan D) Mir Qasim

13. When was the Purple Revolution initiated and under which mission?
A) 2014, Swachh Bharat Mission
B) 2016, Aroma Mission
C) 2015, Digital India Mission
D) 2017, Make in India

14. According to Census 2011, what percentage of India's total population was made up of children aged 0.6 years?
A) 11.5% B) 13.1%
C) 14.8% D) 12.3%

Polity

15. The powers and functions of the Chief Minister of the state are analogous to which of the following?
A) Prime Minister B) President
C) High Court Chief Justice
D) Governor

16. Who among the following was responsible for the annexation of Sindh in 1843?
A) Lord Dalhousie B) Lord Wellesley
C) Lord Cornwallis
D) Lord Ellenborough

17. National Legal Services Authority (NALSA) has been constituted under which act of Parliament?
A) Legal Services Authorities Act, 1958
B) Legal Services Authorities Act, 1967
C) Legal Services Authorities Act, 1987
D) Legal Services Authorities Act, 1990

18. Which Article of the Indian Constitution allows for the enlargement of the jurisdiction of the Supreme Court?
A) Article 131 B) Article 136
C) Article 138 D) Article 141

19. Which Article of the Indian Constitution deals with the Presidential elections in India?
A) Article 71 B) Article 58
C) Article 77
D) Article 54

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

కరెంట్ అఫైర్స్

■ రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2025 ను ఇటీవల ఏ నగరంలో నిర్వహించారు?



(ప్రధాని నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారంభించారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో విభిన్న రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్యాలను పెంపొందించడం ద్వారా సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు.) జ: న్యూదిల్లీ

మాదిరి ప్రశ్నలు

■ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో దాదాపు ఎంత మొత్తం మిగులు బదిలీకి భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) ఆమోదం తెలిపింది? (ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 616వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.) జ: రూ.2.69 లక్షల కోట్లు

■ 2025, జులై 13 నుంచి 20 వరకు చైనాలోని షెన్‌జెన్‌లో జరిగిన ఎఫ్ఐబీఏ మహిళల ఆసియా కప్ బాస్కెట్ బాల్ టోర్నీకి ఎవరు రాయబారిగా వ్యవహరించారు?
జ: ప్రఖ్యాత చైనా బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి మియావో లిజీ

మరింత సమాచారం

■ దేశంలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ సాధించిన 24వ రాష్ట్రంగా ఇటీవల ఏది వార్తల్లో నిలిచింది? జ: గుజరాత్

దరఖాస్తు చేశారా?

☛ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలు (691) (చివరి తేదీ: 05.08.2025)

☛ ఇంటలిజెన్స్ బ్యూరోలో ఏసీఐఓలు (3,717) (చివరి తేదీ: 10.08.2025)

నిర్లక్ష్యంతో ప్రమాదం.. నిర్వహిస్తే ప్రయోజనం!

పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణకు తప్పనిసరిగా ఘన వ్యర్థాల నిర్వహణ అవసరం. అందులోనూ ప్రజారోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేసే ప్రమాదకర ఘనవ్యర్థాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆస్పత్రుల్లో పోగయ్యే బయోమెడికల్ వ్యర్థాలు, కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ పరికరాలు సృష్టిస్తున్న ఇ-వ్యర్థాలు ఈ కోవలోకే వస్తాయి. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, నిర్వహణ సరిగా లేకపోయినా ఆరోగ్యపరంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనర్థాలను కలిగిస్తాయి. వాతావరణాన్నీ కలుషితం చేస్తాయి. ఈ ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ నియమాలు, ప్రభుత్వ నిబంధనల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశంలో వీటి విడుదల తీరుతెన్నులు, జరుగుతున్న నష్టాలతోపాటు సక్రమ నిర్వహణతో ఉన్న ప్రయోజనాలనూ తెలుసుకోవాలి.





భారత్‌లో ముఖ్య ఘనవ్యర్థాలు

(బయోమెడికల్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)

CPCB

బయోమెడికల్ వ్యర్థం: వ్యాధి నిర్ధారణ, చికిత్స, నివారణ ప్రక్రియల్లో భాగంగా వైద్యరంగంలో విడుదలయ్యే ఘనవ్యర్థాన్ని 'బయోమెడికల్ వ్యర్థం' అంటారు. వాడిన సిరంజీలు, సూదులు, మలమూత్ర, రక్త నమూనాలు; శరీరం నుంచి తొలగించిన కణతులు, ట్యూమర్లు, ప్రసవం, పిండస్రావాల సమయంలో విడుదలయ్యే వ్యర్థాలు, ఉపయోగంలేని పాత ఔషధాలు, బ్యాండేజ్‌లు-వీటన్నింటితో బయోమెడికల్ వ్యర్థం ఏర్పడుతుంది. దీన్ని సరిగా నిర్వహించకపోతే తీవ్రస్థాయి సమస్యలు తలెత్తుతాయి.



భారత్‌లో రోజుకు 484 టన్నుల బయోమెడికల్ వ్యర్థం ఉత్పత్తి అవుతున్నట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంచనా వేసింది. కొవిడ్ తీవ్రంగా ఉన్నప్పుడు నిర్వహణకు మించిన మోతాదులో బయో వ్యర్థం విడుదలైంది. ఆస్పత్రుల్లో రోజుకు ఒక పడక నుంచి 1-2 కిలోలు, సాధారణ క్లినిక్‌ల్లో ఒక పడకకు రోజుకు 600 గ్రా. బయోవ్యర్థం ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. మొత్తం బయోవ్యర్థంలో 15% మాత్రమే ప్రమాదకరమైంది. ఈ వ్యర్థం ఉత్పాదనలో కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. అత్యధికంగా కర్ణాటకలో ఈ రకమైన వ్యర్థాన్ని సరిగా నిర్వహించడం లేదని గుర్తించారు.

నష్టాలు: * బయోమెడికల్ వ్యర్థంలోని జీవపదార్థం కుళ్లి హానికర సూక్ష్మజీవులు, వాటిని వ్యాప్తి చేసే ఈగలు విస్తరిస్తాయి. * చికిత్స పరికరాల పదునైన భాగాలను ఉపయోగించిన వెంటనే వేరు చేసి సరిగా నిర్వహించకపోతే ఆరోగ్య సిబ్బంది, వ్యర్థాలు తీసుకెళ్లే కార్మికులు గాయపడే ప్రమాదం ఉంది. వారిలోకి సూక్ష్మవ్యాధి కారకాలు ప్రవేశిస్తాయి. * ఆస్పత్రుల్లో ఎప్పటికప్పుడు బయో వ్యర్థాన్ని తొలగించి శుభ్రపరచకపోతే ఆస్పత్రులకు వచ్చే రోగులు కొత్తవ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. ఈ విధంగా ఆస్పత్రుల్లో జనించే వ్యాధులను 'నోసోకోమియల్ ఇన్ఫెక్షన్స్' అంటారు. * ఆస్పత్రుల్లో బయో వ్యర్థం పేరుకుపోతే సూపర్ బగ్స్ అనే వ్యాధికారకాలు అభివృద్ధి చెందుతాయి. ఇవి అన్ని రకాల మందుల పనితీరును నిరోధిస్తాయి.

నిర్వహణ నియమాలు: * బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ కోసం భారత ప్రభుత్వం తొలిసారిగా 1998లో నియమాలను విడుదల చేసింది. 2000, 2003, 2008, 2014ల్లో వీటిని సవరించారు. చివరిసారిగా 2016, మార్చి 27న నూతన నియమాలు విడుదలయ్యాయి. బయో వ్యర్థాన్ని విడుదలైన ప్రాంతంలోనే వేరు చేయడంతో పాటు నియమాలను అతిక్రమించినవారికి కఠిన శిక్షలను ఇందులో పొందుపరిచారు. * రానున్న రెండేళ్లలో క్లోరినేటెడ్ ప్లాస్టిక్ బ్యాగులను దశలవారీగా పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించారు. * ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమాలకు అనుగుణంగానే బయోమెడికల్ వ్యర్థాన్ని శుద్ధి చేయాలని కొత్త నియమాలు సూచిస్తున్నాయి. * వివిధ దేశాల్లో బయోమెడికల్ వ్యర్థాన్ని గరిష్ఠంగా 10 రకాలుగా విభజించి ప్యాకింగ్ చేస్తున్నారు. కొత్త నియమాల ప్రకారం నాలుగు విభాగాల్లోకి వేరుచేయాలి. * ప్రస్తుతం దేశంలో 198 కామన్ బయోమెడికల్ వ్యర్థ నిర్వహణ కేంద్రాలు ఉన్నాయి. వీటిని ఇంకా పెంచాలని పర్యావరణ మంత్రిత్వశాఖ నిర్ణయించింది.

ఆస్పత్రుల బయోవ్యర్థాన్ని నాలుగు రకాలుగా వేరుచేసి ప్యాకింగ్ చేయాలి.

1) పసుపు రంగు కంటైనర్లు: బ్యాండేజ్‌లు, శరీర వ్యర్థం, మలమూత్ర నమూనాలు.
2) ఎరుపు రంగు కంటైనర్లు: ప్లాస్టిక్ వ్యర్థాలు ముఖ్యంగా సిరంజీలు, ట్యూబింగ్‌లు.
3) నీలి రంగు కంటైనర్లు: గాజు పరికరాలు, పాత ఔషధాలు.
4) నలుపు రంగు కంటైనర్లు: సూదులు, బ్లేడ్లు, అన్నిరకాల లోహ పరికరాలు.



ఎలక్ట్రానిక్ వ్యర్థం (ఇ-వ్యర్థం): నిరర్థక ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరికరాలు, వాటి విడిభాగాలను 'ఎలక్ట్రానిక్ వ్యర్థం' అంటారు. ఆయా పరికరాల జీవితకాలం పూర్తయి నిరర్థకంగా మారినప్పుడు విడుదలయ్యే వ్యర్థం ఇది. కేంద్ర పర్యావరణ అడవుల మంత్రిత్వ శాఖ ప్రకారం 2019-20లో దేశంలో 10,14,961 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థం జనించింది. 2018-19తో పోలిస్తే ఇది 32% అధికం. 'అసోచాం-ఇవై' 2021 నివేదిక ప్రకారం ఇ-వ్యర్థ ఉత్పాదనలో చైనా, అమెరికా తర్వాత భారత్ ఉంది. దీని ప్రకారం దేశంలో ఏటా 3.2 మిలియన్ టన్నుల ఇ-వ్యర్థం పోగవుతోంది.

దేశంలో ఇ-వ్యర్థ ఉత్పాదనలో మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. నగరాల పరంగా ముంబయి, న్యూదిల్లీ, బెంగళూరు ముందు వరుసలో ఉన్నాయి. ఇ-వ్యర్థాల రీసైక్లింగ్‌లో దిల్లీ మొదటి స్థానంలో ఉండగా, బెంగళూరు, చెన్నై తర్వాత నిలిచాయి.



ఎలక్ట్రానిక్ వ్యర్థాన్ని సక్రమమైన రీతిలో నిర్వహిస్తే దాని నుంచి విలువైన లోహాలు లభిస్తాయి. యూఎన్‌ఈపీ ప్రకారం ఒక టన్ను ఇ-వ్యర్థాల రీసైక్లింగ్ నుంచి 340 గ్రాముల బంగారం, 300 కిలోల వెండి, 140 గ్రాముల పెల్లేడియం, 130 కిలోల రాగి లభిస్తుంది.



ప్రభావాలు: * దేశంలో రీసైక్లింగ్ అవుతున్న ఇ-వ్యర్థంలో 95% పైగాఅసంఘటిత రంగంలోనే జరుగుతోంది. శిక్షణలేని కార్మికులు రక్షణ చర్యలు లేకుండా ఇ-వ్యర్థాలను దహనం చేసి రీసైక్లింగ్ చేస్తున్నారు. దాంతో వీరు ప్రమాదానికి గురవడమే కాకుండా విపరీతమైన వాయు, జల, భూకాలుష్యానికి కారణమవుతున్నారు. * ఈ రంగంలో ఎక్కువమంది చిన్నారులు పనిచేస్తుండటంతో 35-45 ఏళ్ల వయసు వచ్చేసరికి క్యాన్సర్ లాంటి రుగ్మతలకు గురవుతున్నారు. * ఇ-వ్యర్థాన్ని సక్రమంగా నిర్వహించకపోతే నీరు, నేల, గాలిలోకి ప్రమాదకర పదార్థాలు చేరతాయి. వీటిలోని పాదరసం, సీసం, కాడ్మియం, పాలిక్లోరినేటెడ్ బైఫినైల్స్, ఫ్యూరాల్స్ తదితర రసాయనాలు ఆరోగ్యపరంగా అత్యంత హానికరం.

భారత్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థ నిర్వహణ

దేశంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఇ-వ్యర్థాన్ని రీసైక్లింగ్ చేసే కంపెనీలు తక్కువగా ఉన్నాయి. ఉదా: అట్టెరో రీసైక్లింగ్, ఇ-పరిసర. ఇలాంటి కంపెనీలు కూడా ఇ-వ్యర్థం సేకరణ కోసం అసంఘటిత రంగ యూనిట్లతో పోటీ పడాల్సి వస్తోంది. భారత ప్రభుత్వం తొలిసారిగా 2011లో ఇ-వేస్ట్ నిర్వహణ నియమాలను విడుదల చేసింది. ఇవి 2012, ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చాయి. 2016, మార్చి 23న నూతన నియమాలు విడుదలయ్యాయి. ఇందులోని ముఖ్యాంశాలు- * ఇ-వ్యర్థాన్ని నిర్వహిస్తున్న అసంఘటిత రంగ పరిశ్రమలన్నీ నిర్ణీత గడువులో రిజిస్టర్ చేసుకోవాలి. * ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి కంపెనీలు ఆ పరికరాల వ్యర్థ నిర్వహణ బాధ్యత కూడా నిర్వర్తించాలి. * రీసైక్లింగ్ పరిశ్రమల్లో పని చేసే వారి భద్రత, ఆరోగ్యాన్ని పెంపొందించే రక్షణ చర్యలు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలి. * ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి పరిశ్రమలన్నీ ఉమ్మడి బాధ్యతగా సంస్థను ఏర్పాటు చేసుకుని, అంతర్గత సమన్వయంతో ఇ-వ్యర్థాన్ని సేకరించి, రీసైక్లింగ్ యూనిట్లకు తరలించాలి. * పాదరసం ఎక్కువగా ఉండే సీఎఫ్ఎల్ లైట్లను కూడా ఈ నియమాల పరిధిలోకి తీసుకొచ్చారు. * ఇ-వ్యర్థం రీసైక్లింగ్ యూనిట్లకు గుర్తింపునిచ్చే బాధ్యతను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించాలి.

ఘనవ్యర్థాల నిర్వహణకు సరికొత్త నియమాలు: కేంద్ర పర్యావరణ, అడవుల, శీతోష్ణస్థితి మార్పు మంత్రిత్వశాఖ 2016, ఏప్రిల్ 5న సరికొత్త ఘన వ్యర్థ పదార్థ నిర్వహణ, నియమాలను విడుదల చేసింది. ఇదివరకే వివిధ రకాల ఘన వ్యర్థాలకు సంబంధించిన భిన్న నియమాలు అమలులో ఉన్నప్పటికీ అన్నిరకాల ఘనవ్యర్థాల నిర్వహణకు ఉద్దేశించి వీటిని తీసుకొచ్చింది. దీనిప్రకారం 10 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని నగరాలు వచ్చే రెండేళ్లలో వ్యర్థ నిర్వహణ సదుపాయాలను ఏర్పాటు చేయాలి. 10 లక్షల్లోపు జనాభా నగరాల్లో ల్యాండ్‌ఫిల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఘనవ్యర్థాల నియమాల పరిశీలన కోసం ఒక కేంద్ర పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేశారు. అది ఏటా సమావేశమై నియమాల అమలును సమీక్షిస్తుంది.

ముఖ్యాంశాలు: * మున్సిపాలిటీ పరిధిలోనే కాకుండా చిన్న పట్టణాలు, పారిశ్రామిక వాడలు, టౌన్‌షిప్‌లు, భారతీయ రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులు, రక్షణ వ్యవస్థలు, సెజ్‌లు, తీర ప్రాంతాలకు కూడా ఈ నియమాలు వర్తిస్తాయి. చెత్త జనించిన చోటే దాన్ని తడి, పొడి, ప్రమాదకరం అని మూడు రకాలుగా వేరుచేయాలి. దీన్నే 'సెగ్రిగేషన్ ఎట్ సోర్స్' అంటారు. * చెత్త సేకరించేవారు, జంక్ డీలర్లను బృందాలుగా మార్చి సంఘటిత రంగంలోకి తీసుకురావాలి. * ఏ వ్యక్తి లేదా సంస్థ తమ వ్యర్థాన్ని వీధుల్లో వేయకూడదు. జలాశయంలోకి విడుదల చేయకూడదు, మండించకూడదు. * చెత్త ఉత్పత్తికి కారణమయ్యేవారు, సేకరించేవారికి యూజర్ ఫీజు చెల్లించాలి. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేవారికి స్పాట్‌ఫైన్ విధిస్తారు. * హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార వ్యర్థాలను ప్రాంతీయ సంఘాల సమన్వయంతో బయో కంపోస్టింగ్‌కు తరలించాలి. * 5000 చ.మీ.కు మించిన ప్రాంతంలో ఉన్న నివాస సముదాయాలు, కాలేజీలు తమ వద్ద ఏర్పడే పొడి వ్యర్థాన్ని నేరుగా రీసైక్లింగ్ పరిశ్రమలు లేదా పురపాలక సంఘాలకు అందించాలి. * కొత్త టౌన్‌షిప్‌ల నిర్మాణ సమయంలో ఘనవ్యర్థ పదార్థ నిర్వహణ సదుపాయాలను కచ్చితంగా కల్పించాలి. * సెజ్ పారిశ్రామిక వాడలు, ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణ సమయంలో మొత్తం నిర్మాణ ప్రాంతంలో 5% స్థలాన్ని రీసైక్లింగ్ సదుపాయాల నిర్మాణానికి వినియోగించాలి. * నిరర్థక ఎలక్ట్రానిక్ పరికరాలను తిరిగి కంపెనీలు సేకరించే బాధ్యత తీసుకోవాలి.





రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

కామన్స్ సభలో అట్లీ అత్యున్నత ప్రకటన!

క్విట్ ఇండియా ఉద్యమం ప్రభావంతో భారత స్వాతంత్ర్య పోరాటం పతాక స్థాయికి చేరుకుంది. బ్రిటిష్ ప్రభుత్వానికి పాలనపై పట్టు సడలడంతో స్వాతంత్ర్యం ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. బ్రిటన్‌లో ఉదారవాద లేబర్ పార్టీ అధికారంలోకి రావడంతో వలస పాలన నుంచి భారతదేశ విముక్తికి మార్గం సుగమమైంది. ఈ క్రమంలో వరుసగా వెలువడిన వేవెల్ ప్రణాళిక, కేబినెట్ మిషన్ ప్రణాళిక, మౌంట్‌బాటన్ దేశవిభజన ప్రణాళిక, భారత స్వాతంత్ర్య చట్టం తదితర కీలక విధానాల్లోని ముఖ్యాంశాలతో పాటు రాజ్యాంగసభ ఎన్నికల ఫలితాలు, నెహ్రూ నేతృత్వంలో ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశ విభజన విషయంలో కాంగ్రెస్, ముస్లింలీగ్ వైఖరులు, ఇరు దేశాల ఏర్పాటు, స్వాతంత్ర్యానంతరం స్వదేశీ సంస్థానాలు భారత్‌లో విలీనమైన తీరును క్రమానుగతంగా అర్థం చేసుకోవాలి.

భారత రాజ్యాంగం చారిత్రక పరిణామక్రమం


ఇండియన్ పాలిటీ

1. 'అమేరి-వేవెల్' ప్రణాళికలోని అంశాన్ని గుర్తించండి.
   - ఎ) వైస్రాయ్, గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలోని 14 మంది సభ్యుల్లో 13 మంది భారతీయ సభ్యులు ఉంటారు.
   - బి) కార్యనిర్వాహక మండలిలో 6 స్థానాలు ముస్లింలకు, 7 స్థానాలు ముస్లిమేతరులకు కేటాయించారు.
   - సి) కార్యనిర్వాహక మండలి తీసుకునే నిర్ణయాలపై గవర్నర్ జనరల్‌కు 'వీటో' అధికారం ఉంటుంది.
   - డి) భారతదేశంలో బ్రిటిషర్ల ప్రయోజనాలు కాపాడేందుకు ఒక హైకమిషనర్‌ను నియమిస్తారు.


   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

2. 'సిమ్లా సమావేశం - 1945'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) 'అమేరి-వేవెల్' ప్రణాళికలోని అంశాలను చర్చించేందుకు గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ 1945, జులైలో సిమ్లాలో సమావేశం ఏర్పాటు చేశారు.
   - బి) ఈ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ దేశ విభజనకు అంగీకరించింది.
   - సి) భారత ముస్లింలకు ముస్లింలీగ్‌ను మాత్రమే ఏకైక ప్రతినిధిగా పరిగణించాలని, ముస్లింలీగ్‌లో సభ్యులు కాని ముస్లింలను వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో చేర్చుకోరాదని మహ్మద్ అలీ జిన్నా వాదించారు.
   - డి) భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) యునైటెడ్ ఇండియా కోసం, ముస్లింలీగ్ దేశ విభజన కోసం పట్టుబట్టాయి.

   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి


లార్డ్ వేవెల్

3. కేబినెట్ మిషన్ (మంత్రిత్రయ రాయబారం)లోని సభ్యులను గుర్తించండి.
   1) సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి. అలెగ్జాండర్, లిన్‌లిత్‌గో
   2) పెథిక్ లారెన్స్, సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్
   3) ఎ.వి.అలెగ్జాండర్, ఎ.వి.అనెగ్జాగ్రాం, పెథిక్ లారెన్స్
   4) ఎం.వి.పైలీ, పెథిక్ లారెన్స్, సర్ స్టాఫర్డ్ క్రిప్స్


సర్ స్టాఫర్డ్ క్రిప్స్

4. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) బ్రిటన్‌లో 1945లో జరిగిన సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది.
   - బి) క్లెమెంట్ అట్లీ బ్రిటన్ ప్రధాని పదవి చేపట్టారు.
   - సి) క్లెమెంట్ అట్లీ భారతదేశానికి మంత్రిత్రయ రాయబారాన్ని పంపారు.
   - డి) మంత్రిత్రయ రాయబారం (కేబినెట్ మిషన్) తన ప్రణాళికను 1946, మే 16న ప్రకటించింది.

   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

5. కేబినెట్ మిషన్ ప్లాన్‌లోని అంశాలను గుర్తించండి.
   - ఎ) కేంద్రంలో పరిపాలనా నిర్వహణ కోసం ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది.
   - బి) రాజ్యాంగ రూపకల్పన కోసం రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది.
   - సి) బ్రిటిష్ పాలిత రాష్ట్రాలు, సంస్థానాలు కలిసి అఖిల భారత సమాఖ్య ఏర్పాటవుతుంది.
   - డి) పాకిస్థాన్ దేశ ఏర్పాటు సాధ్యం కాదు.

   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

6. ముస్లింలీగ్ 'ప్రత్యక్ష చర్య దినోత్సవం' (డైరెక్ట్ యాక్షన్ డే)ను ఎప్పుడు చేపట్టింది? (దీనివల్ల హిందూ-ముస్లింలు పరస్పరం దాడులు, హింసకు దిగారు.)
   1) 1946, జులై 18 2) 1946, ఆగస్టు 16 3) 1947, ఆగస్టు 12 4) 1947, ఆగస్టు 14


7. జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడింది?
   1) 1946, సెప్టెంబరు 2 2) 1946, డిసెంబరు 30 3) 1947, ఆగస్టు 3 4) 1947, ఆగస్టు 15

8. కేబినెట్ మిషన్ సిఫార్సుల మేరకు నెహ్రూ నేతృత్వంలో ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగ్ ఎప్పుడు చేరింది?
   1) 1946, సెప్టెంబరు 26 2) 1946, సెప్టెంబరు 30 3) 1946, అక్టోబరు 26 4) 1947, ఆగస్టు 3

9. కేబినెట్ మిషన్ సిఫార్సుల మేరకు రాజ్యాంగ సభకు ఎప్పుడు ఎన్నికలు జరిగాయి?
   1) 1946, జులై 2) 1947, ఆగస్టు 3) 1947, నవంబరు 4) 1948, నవంబరు

10. అట్లీ ప్రకటన, 1947కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) బ్రిటన్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947, ఫిబ్రవరి 20న కామన్స్ సభలో కీలక ప్రకటన చేశారు.
   - బి) భారతదేశం నుంచి బ్రిటిషర్లు 1948, జూన్ 30 లోగా వైదొలగుతారని ప్రకటించారు.
   - సి) ఈ ప్రకటనను విన్‌స్టన్ చర్చిల్ సమర్థించారు.
   - డి) దీన్ని బ్రిటిషర్లు జారీచేసిన ప్రకటనల్లో అత్యున్నతమైందని గాంధీజీ పేర్కొన్నారు.

   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


క్లెమెంట్ అట్లీ

11. డిక్కీబర్డ్ ప్రణాళికగా దేన్ని పేర్కొంటారు?
   1) మౌంట్ బాటన్ ప్రణాళిక 2) అట్లీ ప్రణాళిక 3) క్రిప్స్ ప్రతిపాదన 4) కేబినెట్ మిషన్ ప్రణాళిక


12. కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సయోధ్య కుదర్చడం సాధ్యం కాదని భావించిన గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటన్ దేశవిభజన ప్రణాళికను ఎప్పుడు ప్రకటించారు?
   1) 1947, ఆగస్టు 14 2) 1947, ఆగస్టు 13 3) 1947, జూన్ 3 4) 1947, జులై 3

13. మౌంట్ బాటన్ ప్రణాళిక - 1947లోని అంశాన్ని గుర్తించండి.
   - ఎ) ఇండియన్ యూనియన్.. భారత్, పాకిస్థాన్ అనే రెండు దేశాలుగా విభజితమవుతుంది.
   - బి) కామన్వెల్త్ కూటమిలో చేరే విషయంలో భారత్, పాకిస్థాన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.
   - సి) అస్సాం భారతదేశ అంతర్భాగంగా ఉంటుంది. బెంగాల్, పంజాబ్‌ల విభజన మత ప్రాతిపదికపై జరుగుతుంది.
   - డి) బెలూచిస్థాన్, వాయవ్య ప్రాంతాలు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.

   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

14. భారత స్వాతంత్ర్య చట్టం, 1947కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) భారత స్వాతంత్ర్య బిల్లును 1947, జులై 4న బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.
   - బి) భారత స్వాతంత్ర్య బిల్లును 1947, జులై 15న బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించింది.
   - సి) దీన్ని 1947, జులై 18న అప్పటి బ్రిటిష్ చక్రవర్తి జార్జ్-6 ఆమోదించడంతో చట్టంగా మారింది.
   - డి) ఇది 1947, జులై 19న ప్రీవి కౌన్సిల్ సమీక్షను విజయవంతంగా ఎదుర్కొంది.

   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి


జార్జ్-6

15. 1946, సెప్టెంబరులో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించిన మంత్రులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) సర్దార్ వల్లభాయ్ పటేల్	1) కార్మిక శాఖ
బి) డా.బాబూ రాజేంద్రప్రసాద్	2) హోం, సమాచార శాఖ
సి) సి.రాజగోపాలాచారి	3) వ్యవసాయం, ఆహారం
డి) డా.బాబూ జగ్జీవన్ రాం	4) విద్య

   1) ఎ-2, బి-3, సి-4, డి-1 2) ఎ-3, బి-2, సి-4, డి-1 3) ఎ-1, బి-3, సి-4, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

16. 'భారత స్వాతంత్ర్య చట్టం, 1947'లోని అంశాన్ని గుర్తించండి.
   - ఎ) 1947, ఆగస్టు 14న (గురువారం) పాకిస్థాన్ ఏర్పాటైంది.
   - బి) 1947, ఆగస్టు 15న (శుక్రవారం) ఇండియా ఏర్పాటైంది.
   - సి) స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారం అంతమైంది.
   - డి) రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరిస్తుంది.

   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

17. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయానికి సుమారు 562 స్వదేశీ సంస్థానాలున్నాయి.
   - బి) స్వదేశీ సంస్థానాలు ఇండియాలో లేదా పాకిస్థాన్‌లో చేరవచ్చని ఆంగ్లేయులు అవకాశం కల్పించారు.
   - సి) భారతదేశంలో 554 స్వదేశీ సంస్థానాలు చేరాయి.

   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

18. 1947, ఆగస్టులో ఇండియా, పాకిస్థాన్‌లో చేరకుండా స్వతంత్రంగా ఉన్న స్వదేశీ సంస్థానాలను గుర్తించండి.
   1) ట్రావెన్‌కోర్, జునాగఢ్, జమ్ము-కశ్మీర్, గ్వాలియర్
   2) హైదరాబాద్, ట్రావెన్‌కోర్, జునాగఢ్, జమ్ము-కశ్మీర్,
   3) జమ్ము-కశ్మీర్, జునాగఢ్, ఇండోర్, జైపుర్
   4) లాహోర్, ముజఫరాబాద్, జమ్ము-కశ్మీర్, జునాగఢ్

19. పలు సందర్భాల్లో, రకరకాల కారణాలతో ఇండియాలో విలీనమైన స్వదేశీ సంస్థానాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) ట్రావెన్‌కోర్ సంస్థానం ఎలాంటి షరతులు లేకుండా నేరుగా విలీనమైంది.
   - బి) హైదరాబాద్ సంస్థానం పోలీసు చర్య ద్వారా విలీనమైంది.
   - సి) గ్వాలియర్ సంస్థానం 'రిఫరెండం' ద్వారా విలీనమైంది.
   - డి) జునాగఢ్ సంస్థానం 'ప్లెబిసైట్' ద్వారా విలీనమైంది.

   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి

20. 'ప్రపంచం మొత్తం నిద్రావస్థలో మునిగి ఉన్నప్పుడు భారతదేశం మేల్కొని ఊపిరిని, స్వేచ్ఛను పొందుతుంది. భారతదేశ సేవ అంటే భారతదేశంలోని కోట్లాది పీడితుల సేవ' అని ఎవరు వ్యాఖ్యానించారు?
   1) మహాత్మా గాంధీ 2) జవహర్‌లాల్ నెహ్రూ 3) డా.బాబూ రాజేంద్రప్రసాద్ 4) అరుణా అసఫ్ అలీ

21. 1922, డిసెంబరు 31న స్థాపించిన 'స్వరాజ్ పార్టీ'కి అధ్యక్షులు, కార్యదర్శిగా ఎవరు వ్యవహరించారు?
   1) చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ
   2) మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్
   3) చిత్తరంజన్ దాస్, సి.రాజగోపాలాచారి
   4) మోతీలాల్ నెహ్రూ, సి.రాజగోపాలాచారి


మోతీలాల్ నెహ్రూ



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-4; 2-1; 3-2; 4-4; 5-4; 6-2; 7-1; 8-3; 9-1; 10-3; 11-1; 12-3; 13-4; 14-3; 15-1; 16-4; 17-4; 18-2; 19-1; 20-2; 21-1.

విద్యార్జనపై భూతాప ప్రభావం

తెలుగు రాష్ట్రాల్లోనూ కొనసాగిన అధ్యయనం

దిల్లీ: వాతావరణ మార్పులతో పెరుగుతున్న ఉష్ణోగ్రత- బాలల్లో అభ్యసన శక్తిని దెబ్బతీస్తుందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు తేల్చారు. గతంలో భారత్ సహా 61 దేశాల్లోని 1.45 కోట్ల మంది విద్యార్థులపై జరిగిన ఏడు అధ్యయనాలను సంబంధించిన సమాచారాన్ని వారు విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ అధ్యయనాల్లో ఒకటి బ్రిటన్ జరిపిన యంగ్ లైవ్స్ సర్వే. ఇథియోపియా, పెరూ, వియత్నాంలతోపాటు భారత్‌లోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలోని 12,000 మంది విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించారు. ప్రతి ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్, అంతకు మించి ఉన్నప్పుడు భారత్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కనిష్ఠమైన ప్రశ్నలకు, కొన్ని లెక్కలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోయారు. వారి పుస్తక పఠనం కూడా దెబ్బతింది. ఉష్ణోగ్రత 15-17 డిగ్రీలుంటే ఇలాంటి సమస్యలు రాలేదు. ముసుపటి సంవత్సరాల్లో ఉష్ణోగ్రతలను, విద్యార్థులపై ప్రభావాన్ని అధ్యయనకర్తలు విశ్లేషించారు. వరుసగా 10 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే పఠన స్కోర్లు 0.02 శాతం, గణిత స్కోర్లు 0.03 శాతం తగ్గాయి. గ్రామీణ విద్యార్థులపై వార్షిక విద్యా నివేదిక (అసర్) సమాచారం ఆధారంగా ఈ సంగతి నిర్ధారించారు.

హజ్‌యాత్ర దరఖాస్తు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: హజ్‌యాత్ర-2026 ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఆగస్టు 7 వరకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పొడిగించినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. హజ్ యాత్రికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు. విజయవాడలో ఉన్న ఎంబార్కేషన్ పాయింట్‌ను రాష్ట్రం నుంచి వెళ్లే యాత్రికులు మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలన్నారు.

'డిప్యూటీ కలెక్టర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోండి'

ఈనాడు, అమరావతి: భూ వినియోగ మార్పిడికి సంబంధించి నకిలీ చలానాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించిన వ్యవహారంలో సీఆర్డీఏలో డిప్యూటీ కలెక్టర్ స్వర్ణమేరీ, మచిలీపట్నంలో పనిచేసే సీనియర్ ఉద్యోగి కృష్ణచైతన్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. చల్లపల్లి మండలం తహసీల్దార్‌గా స్వర్ణమేరీ, మచిలీపట్నంలోని ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా కృష్ణచైతన్య ఉన్నప్పుడు ఈ నకిలీ చలానాల వ్యవహారం చోటుచేసుకుంది. దీనిపై విజిలెన్స్ నివేదికను అనుసరించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ముఖ్యమంత్రికి పర్యాటక సమీక్ష నివేదికల అందజేత


చంద్రబాబుకు నివేదిక అంశాలు వివరిస్తున్న లంకా దినకర్

ఈనాడు, అమరావతి: రాజస్థాన్ స్టడీ టూర్, గండికోట పర్యాటక సమీక్ష నివేదికలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అందజేశారు. సచివాలయంలో సీఎంను గురువారం కలిసిన ఆయన.. నివేదికలో పేర్కొన్న అంశాలను వివరించారు.

సజ్జల శ్రీధర్‌రెడ్డి మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో ఏ6 సజ్జల శ్రీధర్‌రెడ్డి మూడోసారి ఏసీబీ కోర్టులో గురువారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే రెండుసార్లు కోర్టు తిరస్కరించింది. దీనిపై ప్రాసిక్యూషన్‌కు నోటీసుల నిమిత్తం ఆగస్టు 4వ తేదీకి వాయిదా పడింది.

● ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, ఓఎస్డీ సత్యప్రసాద్‌లు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. దీనిని న్యాయాధికారి శుక్రవారానికి వాయిదా వేశారు. ఈ కేసులో నిందితుల రిమాండ్ శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న 12 మందిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరులోని కారాగారాల్లో ఉన్న నిందితులను న్యాయాధికారి ఎదుట హాజరుపరచనున్నారు.

ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈగా శేషకుమార్

ఈనాడు, అమరావతి: ఆర్అండ్‌బీలోని క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్(సీఈ)గా కె.శేషకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన కమిషనర్ ఆఫ్ టెండర్స్ సభ్యుడిగా, చీఫ్ టెక్నికల్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చూస్తారని పేర్కొంది.

నల్లమలలో పర్యాటకాభివృద్ధి

తెలంగాణ మంత్రి జూపల్లి


లాంచీ నడుపుతున్న మంత్రి జూపల్లి. చిత్రంలో ఎమ్మెల్యే సత్యనారాయణ

అమ్రాబాద్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: నల్లమలలోని అక్కమహాదేవి గుహలు తదితర పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలంగాణ ఆబ్కారీ, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లిన ఆయన గురువారం హైదరాబాద్‌కు వస్తూ మధ్యలో బ్రహ్మగిరి(దోమలపెంట) సమీపంలో ఆగారు. కృష్ణానదిలోకి వెళ్లి లాంచీ నడుపుతూ ఎస్ఎల్‌బీసీ ఇన్‌లెట్ ముఖ ద్వారం వరకు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీశైలం నుంచి కొల్లాపూర్ వరకు లాంచీల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కృష్ణానది పరిధిలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు, నాయకులు పాల్గొన్నారు.

త్వరలో జిల్లాకో పరీక్షల బోర్డు ఏర్పాటు

- సమ్మేటివ్, ఫార్మేటివ్ ప్రశ్నపత్రాల రూపకల్పన అక్కడే
- మూల్యాంకనంలో తప్పులు చేస్తే సర్వీసు పాయింట్లలో కోత
- 1969 తర్వాత ప్రభుత్వ పరీక్షల విభాగంలో కీలక మార్పులు

ఈనాడు, అమరావతి: జిల్లాకో పరీక్షల బోర్డును ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న డీసీఈబీల స్థానంలో వీటిని ఏర్పాటు చేస్తారు. జిల్లా విద్యాధికారిని ఛైర్మన్‌గా.. సహాయ కమిషనర్, సార్వత్రిక విద్యా పీఠం సమన్వయ అధికారులను కార్యదర్శులుగా నియమిస్తారు. ప్రధానోపాధ్యాయులను అకడమిక్ కార్యదర్శులుగా నియమిస్తారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలను ఈ బోర్డుల ద్వారానే రూపొందిస్తారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు మినహా మిగిలినవాటిని జిల్లా స్థాయిలోనే రూపొందించనున్నారు. ప్రశ్నపత్రాల ప్రమాణాలను రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) నిర్ణయిస్తుంది. గురువారం నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ పరీక్షల విభాగంపై 1969 తర్వాత మొదటిసారిగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

● రాష్ట్ర పాఠశాల ప్రామాణిక అథారిటీని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుత మార్పుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేస్తారు.

● పదో తరగతి పరీక్షల విభాగాన్ని స్వయం ప్రతిపత్తి విభాగంగా మార్చనున్నారు.

● వృత్తి విద్య కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలను ఇక నుంచి బోర్డు నిర్వహించనుంది.

● పాఠశాల స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కోర్సులను నిర్వహిస్తారు. వీటిని మదింపు చేసి, పదో తరగతి బోర్డు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుంది.

తప్పులు చేస్తే మార్కులు కట్..

● పదో తరగతి పబ్లిక్ పరీక్ష మూల్యాంకనంలో చేసే తప్పుల ఆధారంగా సర్వీసు పాయింట్లలో కోత, జరిమానాలపై సమావేశంలో చర్చించారు.

● మూల్యాంకనంలో తప్పు వల్ల 10-20 మార్కులు తేడా వస్తే 0.5 పాయింట్లు, 20-30 మార్కులు తేడా వస్తే ఒక పాయింటు, 30 పైన మార్కులు తేడా వస్తే రెండు పాయింట్లు కట్ చేస్తారు. ఈ పాయింట్లలో కోత పడితే బదిలీల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది.

● మరీ ఎక్కువగా తప్పిదాలు చోటుచేసుకుంటే జరిమానా విధిస్తారు. ఇంక్రిమెంట్లలోనూ కోత పెడతారు.

● మూల్యాంకనం ఓఎమ్మార్ షీట్‌లోనూ మార్పులు చేయనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయి. ఇవి కాకుండా ఛాయిస్ ఉంటుంది. మూల్యాంకన సమయంలోనే ట్యాబ్‌ల్లో మార్కులు వేసేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో కూడికలో తప్పులు వచ్చే అవకాశం ఉండదు. ఏ ప్రశ్నకు మార్కులు వేయకపోయినా సాఫ్ట్‌వేర్‌తో గుర్తిస్తారు.

ఇంజినీర్ సిద్ధయ్యపై తగ్గని ప్రేమ?

- 'ఆడుదాం ఆంధ్ర'లో అవినీతి ఆరోపణలున్న వ్యక్తిని కొనసాగించే యత్నం
- రాయలసీమలోని ఓ భాజపా ఎమ్మెల్యే నుంచి సిఫార్సు లేఖ

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం. సిద్ధయ్యపై ఇప్పటికీ ప్రేమ తగ్గడం లేదు. తాజాగా ఆయన డిప్యుటేషన్ కాలాన్ని మరో ఏడాది పొడిగించాలని రాయలసీమకు చెందిన ఓ భాజపా ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వడం చర్చనీయాంశమైంది. దీన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా శాప్ ఎండీ కార్యాలయానికి యువజన, క్రీడలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెమో ఇవ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. రోడ్లు, భవనాల శాఖకు చెందిన సిద్ధయ్య శాప్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. డిప్యుటేషన్ గడువు 2024 ఆగస్టు 8తోనే ముగిసినా. . అప్పటి నుంచి 11 నెలల పాటు ఎలాంటి పరిపాలనా ఉత్తర్వులు ఇవ్వకుండానే ఆయన్ను కొనసాగించారు. తీరిగ్గా జులై 9న దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చారు. ఆ గడువు కూడా మరో నాలుగు రోజుల్లో (ఆగస్టు 4తో) ముగియనుంది. దీంతో మళ్లీ శాప్‌లోనే కొనసాగేందుకు సిద్ధయ్య పావులు కదుపుతున్నారు. తన డిప్యుటేషన్‌ను మరో ఏడాది పొడిగించాలని కోరుతూ యువజన, క్రీడలశాఖ ముఖ్యకార్యదర్శికి దరఖాస్తు చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో శాప్ ఇంజినీరింగ్ విభాగంలో అన్నీ తానై సిద్ధయ్య చక్రం తిప్పారు. 'ఆడుదాం ఆంధ్ర'లో క్రీడాపరికరాల కొనుగోలు టెండర్లలో చోటుచేసుకొన్న అవకతవకల్లో ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. శాప్ క్రీడామైదానాల అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులందాయి.

దేశ గౌరవాన్ని తగ్గించే విమర్శలు తగవు

జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: అంతర్జాతీయంగా దేశ గౌరవాన్ని తగ్గించేలా కొందరు ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే అలాంటి విమర్శలు తగవని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ఆర్థిక వ్యూహాల్లో భాగంగా దేశ వాణిజ్య భాగస్వాములను ఎన్డీయే ప్రభుత్వం క్రమంగా మారుస్తూ వస్తోంది. భారత్‌ను స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. దేశ ఆర్థికవృద్ధి, సార్వభౌమత్వాన్ని రక్షించేందుకు ఎన్డీయే ప్రభుత్వానికి మా పార్టీ పూర్తి మద్దతిస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 10వ స్థానం నుంచి 4వ స్థానానికి భారత్ చేరింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, తయారీరంగం, ఐటీ, ఫార్మా ఉత్పత్తులు, వ్యవసాయ రంగాల్లో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కేంద్ర ప్రభుత్వం స్థిరంగా వ్యవహరిస్తోంది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలోనూ దేశ ఆర్థిక ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టిగా కట్టుబడి ఉంది. ఈ సమయంలో ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలి" అని పవన్ పేర్కొన్నారు.

మద్యం కుంభకోణం కేసులో త్వరలో అనుబంధ అభియోగపత్రం

- ముడుపుల సొమ్ము రూ.11 కోట్ల వివరాలు పొందుపరిచే అవకాశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే ప్రాథమిక అభియోగపత్రం దాఖలు చేసిన సిట్. . ఈ నెల రెండో వారంలో అనుబంధ అభియోగపత్రం దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందులో తాజాగా పట్టుబడిన మద్యం ముడుపుల సొమ్ము రూ.11 కోట్ల వివరాలతో పాటు కుట్రకు సంబంధించిన మరికొన్ని అంశాలు పొందుపరిచే అవకాశముంది. ఈ కేసులో ఇప్పటివరకు 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చిన సిట్.. తాజా దర్యాప్తులో గుర్తించిన వివరాల ఆధారంగా మరో నలుగురైదుగుర్ని నిందితులుగా చేర్చే అవకాశముంది. రాజ్ కెసిరెడ్డి నిర్వహించిన ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్‌లో అప్పట్లో కీలకంగా పనిచేసి, దుబాయ్‌కు పారిపోయిన నిందితులపై ఇప్పటికే నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినందున.. వారిని భారత్‌కు రప్పించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. ఈ కేసులో నిందితుడైన షేక్ సజీల్ బెహరూన్ (ఏ-48)ను సిట్ అధికారులు రెండు రోజులుగా విచారిస్తున్నారు.

రాహుల్‌గాంధీకి దేశాభివృద్ధి అంటే ఇష్టంలేదు

భాజపా నేత లంకా దినకర్ ధ్వజం

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అంచనాల ప్రకారం 6.5 శాతం నుంచి 7 శాతం వృద్ధి రేటుతో దృఢంగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను మరణావస్థలో ఉందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొనడం తగదని భాజపా నేత, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "రాహుల్ గాంధీ ఆలోచన విధానం సరికాదు. దేశం అభివృద్ధి చెందడం ఆయనకు ఇష్టం లేనట్లుంది. కాంగ్రెస్ పార్టీ అవినీతి పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థ 14వ స్థానానికి చేరుకోడానికి 70 ఏళ్లకు పైనే పట్టింది" అని దుయ్యబట్టారు.

బల్క్ డ్రగ్ పార్కుపై ఈఐఏ నివేదిక ఆందోళనకరం

శాస్త్రవేత్తలు, మానవ హక్కుల వేదిక

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ప్రతిపాదిత బల్క్ డ్రగ్ పార్కు కోసం రూపొందించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఈఐఏ) ఆందోళనకరంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు, మానవ హక్కుల వేదిక సభ్యులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఈఐఏ నివేదికలో మోసపూరిత, సందేహాస్పద సమాచారం గుర్తించినట్లు మానవ హక్కుల నివేదిక గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'ఉమ్మడి పొగ గొట్టాల ద్వారా ప్రాసెస్ స్టాక్ వెలువడుతుందని వాయు ఉద్గారాలకు సంబంధించిన సమాచారం ఈఐఏ నివేదికలో చూపింది. 17 స్టాకులన్నీ ఒకే ఎత్తు, వ్యాసం, ఫ్లూ గ్యాస్ ప్రసరణ వేగం, నిష్క్రమణ ఉష్ణోగ్రతలతో జాబితా రూపొందించింది. ప్రపంచ పారిశ్రామిక పార్కుల్లో ఇది దాదాపుగా అసాధ్యం. వాస్తవ కొలతలు, ఇంజినీరింగ్ డిజైన్ల ఆధారంగా లేదని స్పష్టమవుతోంది. కాలుష్య సమాచారమే లోపభూయిష్టంగా ఉన్నప్పుడు ప్రజల శ్వాసకోశ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు, పర్యావరణానికి కలిగే నష్టాలపై సరిగ్గా అంచనా వేసి నిర్వహించడం అసాధ్యం. సవరించిన నివేదిక వచ్చే వరకూ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయాలని కోరాలి' అని మానవ హక్కుల వేదిక సభ్యులు సూచించింది.

నైపుణ్యం గల యువతకు జర్మనీలో భారీగా ఉపాధి అవకాశాలు

- ఆసక్తి గలవారు జర్మన్ భాషపై పట్టు సాధించాలి
- లోయర్ సాక్సనీలోని నైపుణ్య' విభాగాధిపతి బాలసుబ్రహ్మణియన్ రమణి

ఈనాడు, అమరావతి: నైపుణ్యం కలిగిన యువతకు జర్మనీలో భారీగా ఉపాధి అవకాశాలున్నాయని అక్కడి లోయర్ సాక్సనీ రాష్ట్రం ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖలో నైపుణ్య ఉద్యోగుల నియామక విభాగాధిపతిగా పనిచేస్తున్న బాలసుబ్రహ్మణియన్ రమణి తెలిపారు. లోయర్ సాక్సనీ రాష్ట్రం, ఏపీ ప్రభుత్వం మధ్య నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు జర్మన్ భాష శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఇతర రంగాల్లో ద్వైపాక్షిక సహకారం అవకాశాలపై ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో గురువారం ఆయన ఇక్కడ సమావేశమయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. "జర్మనీలో ప్రస్తుతం 7 లక్షలకు పైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. 2035 నాటికి మరో 70 లక్షల నిపుణుల అవసరం ఉంటుందని అంచనా. రవాణా, నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, ఇంజినీరింగ్, ఐటీ వంటి కీలక రంగాల్లో నైపుణ్య నిపుణుల కొరత ఉండనుంది. ఈ సమస్య పరిష్కారానికి భారతదేశాన్ని వ్యూహాత్మక భాగస్వామిగా జర్మనీ గుర్తించింది. అందువల్ల ఏపీ యువత నైపుణ్యంతో పాటు జర్మన్ భాషపై పట్టు సాధించాలి" అని సూచించారు. జర్మన్ భాషపై శిక్షణ, ధ్రువీకరణ, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలల భాగస్వామ్యం, పరిశ్రమ-అకాడమీ తదితర అంశాలపై మంత్రి లోకేశ్‌తోనూ చర్చించామని ఆయన వెల్లడించారు. సమావేశంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో గణేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారు సీత శర్మ తదితరులు పాల్గొన్నారు.

పలువురు జీపీ, ఏజీపీల తొలగింపు

జీవోలు జారీ చేసిన న్యాయశాఖ

ఈనాడు, అమరావతి: దిగువ కోర్టులలో మూడేళ్ల పాటు సర్వీసులో కొనసాగేందుకు వైకాపా హయాంలో నియమితులైన పలువురు ప్రభుత్వ న్యాయవాదులు(జీపీ), సహాయ ప్రభుత్వ న్యాయవాదులను(ఏజీపీ) బాధ్యతల నుంచి తొలగిస్తూ (డిస్ ఎంగేజ్‌మెంట్) న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత లా ఆఫీసర్లకు నెల రోజుల గౌరవ వేతనం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లను విజ్ఞప్తి చేశారు. ఆ ఖాళీల భర్తీకి న్యాయవాదుల పేర్లను సూచించాలని కోరారు.

తొలగించింది వీరినే..

● గుంటూరు పీడీజే కోర్టు జీపీ మారెళ్ల వెంకట సుబ్బారెడ్డి

● గుంటూరు ప్రిన్సిపల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ మాజేటి సౌభాగ్యలక్ష్మి

● విజయవాడ అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు జీపీ చిన్నం రామకృష్ణ

● విజయవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సహాయ జీపీ సీహెచ్ చైతన్య

● కృష్ణా జిల్లా మచిలీపట్నం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ సీహెచ్‌వీ ఫణికేశవరావు

● కృష్ణా జిల్లా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు

● చిత్తూరు సివిల్ కోర్టు, ఎస్టేట్ అబాలిషన్ చట్టం కింద కేసులు చూసే ప్రత్యేక ఏజీపీ గోవిందు సాంబశివుడు

● చిత్తూరు జిల్లా పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ గంట్ల కృష్ణమూర్తి

● ఆదోనిలోని రెండో అదనపు జిల్లా కోర్టులో ప్రత్యేక కౌన్సెల్ పద్మదేశాయ్

ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో 2015 డిసెంబరు 31కి ముందు మృతి చెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులు 2020 జనవరి ఒకటి నుంచి ప్రభుత్వంలో విలీనం కాగా, అంతకుముందు మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాల కోసం 2022లో ఆదేశాలిచ్చారు. 2016-19 మధ్య మరణించిన ఉద్యోగుల వారసులకే ఉద్యోగాలు కల్పించారు. తాజాగా 2016కి ముందు మరణించిన ఆర్టీసీ ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టనున్నారు. వీరి దరఖాస్తులు జిల్లాల్లో కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని జిల్లా ఆర్టీసీ అధికారులు తీసుకొని, వారి పరిధిలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, అసిస్టెంట్ మెకానిక్‌లుగా నియమించాలని తాజా ఆదేశాల్లో పేర్కొన్నారు.

పరిశ్రమల భద్రతకు వర్సిటీల సేవలు

- ఆంధ్ర, జేఎన్‌టీయూ, ఎస్వీయూ వర్సిటీలతో త్వరలో ఫ్యాక్టరీస్ విభాగం ఒప్పందం


ఈనాడు, అమరావతి: ఫ్యాక్టరీస్ విభాగంలో ప్రత్యేకంగా నిపుణుల వ్యవస్థ లేనందున ఇకపై విశ్వవిద్యాలయాల సేవలు వాడుకోవాలనుకుంటోంది. కర్మాగారాల్లో అంతర్గత ఆడిట్, సాంకేతిక సేవలు, ప్రమాదాలపై విచారణ నివేదికలు ఇచ్చేందుకు వర్సిటీ విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలని ఫ్యాక్టరీస్ విభాగం నిర్ణయించింది. అందుకు ఆంధ్ర, జేఎన్‌టీయూ-కాకినాడ, శ్రీవేంకటేశ్వర వర్సిటీలతో ఈనెల మొదటి వారంలో ఒప్పందాలు చేసుకోనుంది. ఈ అవసరాల కోసం వర్సిటీల్లోని విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తారు. పరిశ్రమల నిర్వహణ, సాంకేతికత వినియోగం, ప్రమాదకర రసాయనాలు వాడటంలో సరైన భద్రత పాటిస్తున్నారా?... అనేవి తనిఖీ చేసేందుకు ఫ్యాక్టరీస్ విభాగంలో ప్రత్యేక వ్యవస్థ లేదు. ప్రమాదం జరిగితే పరిశ్రమలు థర్డ్ పార్టీ ఆడిట్ చేయిస్తున్నాయి. ఆ నివేదికను పరిశీలించే వ్యవస్థ కూడా లేదు. దీంతో విశ్వవిద్యాలయాల సేవలు ఉపయోగకరంగా ఉంటాయని కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు నిర్ణయించి.. వర్సిటీలతో సంప్రదింపులు జరిపారు.

అంబులెన్సులు ఏర్పాటు..

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్య సేవలు అందించేందుకు కార్మిక శాఖ అంబులెన్సులను ఏర్పాటు చేస్తోంది. వీటిని ఈఎస్ఐ ఆసుపత్రులకు అనుసంధానిస్తోంది. ఈఎస్ఐ ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలు వచ్చినా వీటి సేవలు వినియోగించుకోవచ్చు. రాజమహేంద్రవరంలో గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ ఓ అంబులెన్సును ప్రారంభించారు. విశాఖపట్నంలో ఈనెల 10న అంబులెన్సు సేవలను ప్రారంభించనున్నారు.

కృష్ణా జలాలు వృథాగా పోవద్దు

- చెరువులను, జలాశయాలను నింపండి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



ఈనాడు-అమరావతి: 'కృష్ణా జలాలను సముద్రంలోకి వృథాగా పోనివ్వద్దు. వీలైనంత మేర జలాశయాలన్నీ నింపండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాలను కూడా నింపాలన్నారు. సచివాలయంలో గురువారం జలవనరుల శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కృష్ణా వరదను సముద్రంలోకి వదిలేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్ల పరిస్థితులు, పూర్తి స్థాయిలో నింపేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాయలసీమ జలాశయాల్లో ఇంకా 132 టీఎంసీలు నింపేందుకు అస్కారం ఉందని అధికారులు వివరించారు. ఉమ్మడి జలాశయాలతో కలిపి ప్రస్తుతం 882 టీఎంసీల నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. భారీ రిజర్వాయర్లలో 772 టీఎంసీలు, మధ్య తరహా జలాశయాల్లో 43 టీఎంసీలు, చెరువులు, చిన్న నీటి వనరుల్లో 67 టీఎంసీల నిల్వలు ఉన్నట్లు సీఎంకు వివరించారు. నదుల్లో ఎన్ని రోజులు ప్రవాహాలు కొనసాగే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పోతిరెడ్డిపాడు, ప్రకాశం బ్యారేజీ ద్వారా ఎన్ని నీళ్లు తరలించగలమని ప్రశ్నించారు. ప్రతిరోజూ 4 టీఎంసీలు తరలించగలిగితే ఎన్ని రోజుల్లో.. ఎన్ని రిజర్వాయర్లను నింపవచ్చని ఆరా తీశారు. పోతిరెడ్డిపాడు ప్రవాహం 30 వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. అవసరమైతే ముచ్చుమర్రి నుంచి కూడా నీటిని ఎత్తిపోయాలని సూచించారు. చిత్తూరు, కుప్పం వరకు తరలించాలని చంద్రబాబు సూచించారు. రాయలసీమలో చిన్న నీటి వనరులు ఎన్ని ఉన్నాయి? గ్రావిటీతో ఎన్నింటిని నింపే అస్కారం ఉందని మొబైల్ ఎత్తిపోతల ద్వారా ఎన్ని చెరువులు నింపవచ్చో పరిశీలించాలన్నారు. రాయలసీమలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. చెర్లోపల్లి, పత్తికొండ, మారాల రిజర్వాయర్ల దిగువన ఉన్న చెరువులన్నీ నింపాలని చెప్పారు. సాగునీటి సంఘాలను ఈ విషయంలో సమర్థంగా వినియోగించుకోవాలని, వాటికి ఆయకట్టును మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో 50 మందికి మించితే రెండో సెక్షన్

- ఫౌండేషనల్ పాఠశాలల్లో 20 మంది వరకు ఒక ఎస్జీటీ కేటాయింపు
- సవరణ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు మించితే రెండో సెక్షన్ ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన జీఓలో 54 తర్వాత రెండో సెక్షన్ అని ఉండగా.. దీన్ని 50కి సవరించింది. ఆ తర్వాత ప్రతి 40 మంది విద్యార్థులకు అదనపు సెక్షన్ మంజూరు చేస్తారు. ఇటీవల ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, సర్దుబాటు, పదోన్నతులు నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలకు జీఓ ఇవ్వకుండా ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో 25 వేల మంది టీచర్లకు జీతాల సమస్య ఏర్పడింది. దీంతో సెక్షన్లు, టీచర్ల కేటాయింపుపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

● ఫౌండేషనల్ పాఠశాలల్లో 20 మంది వరకు ఒక ఎస్జీటీ, 21 నుంచి 60 వరకు ఇద్దరు ఎస్జీటీలను ఇస్తారు.

● ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో 121-150 మధ్య విద్యార్థులు ఉంటే మిగులు ఎస్జీటీల ఉన్న సమయంలో అదనంగా మరో ఎస్జీటీని కేటాయిస్తారు.

● పాఠశాల విద్యలో ఖాళీగా ఉన్న 1,221 పోస్టులను రద్దు చేసి, అవసరాల మేరకు కొత్తగా 1,901 పోస్టులను సృష్టించారు. పదోన్నతులు, హేతుబద్ధీకరణ తర్వాత 1,995 పోస్టులు మిగులు తేలాయి. ఇందులో ప్రధానోపాధ్యాయులు 30, ఎస్జీటీలు 1,965 ఉన్నాయి. వీటిని ఏ జిల్లాలోనైనా కొరత ఏర్పడినా.. కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులకు అవసరమైనా వినియోగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసు కొట్టివేత

- ఆ సెక్షన్లు వారికెలా వర్తిస్తాయో అర్థం కాలేదు
- ఎఫ్ఐఆర్, ఛార్జిషీటును కొట్టేసిన సుప్రీంకోర్టు



ఈనాడు, దిల్లీ: సినీనటులు మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణులకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం గతంలో ధర్నా చేసినందుకు వారిపై రాష్ట్ర ప్రభుత్వం నమోదుచేసిన కేసును కొట్టేస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు చెప్పింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు ఈ ఏడాది జనవరి 2న ఇచ్చిన తీర్పును కొట్టేసింది. తమ కాలేజీకి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం మోహన్‌బాబు, విష్ణులు 2019 మార్చి 22న సిబ్బంది, విద్యార్థులతో కలిసి శ్రీవిద్యానికేతన్ నుంచి తిరుపతి- మదనపల్లె రోడ్డుపై ర్యాలీ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించారని, అప్పట్లో అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని పోలీసులు కేసు నమోదుచేశారు. తాము ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా శాంతియుతంగా ధర్నా చేసినా పోలీసులు తప్పుడు అభియోగాలు నమోదు చేశారని, ఎన్నికల కోడ్ తమకు వర్తించకపోయినా దానికింద కేసు పెట్టినందున కొట్టేయాలని గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఇందులోని నిజానిజాలు ట్రయల్‌కోర్టులో విచారణ ద్వారానే తేలాల్సి ఉందన్న కారణంతో హైకోర్టు వీరి క్వాష్ పిటిషన్‌ను కొట్టేసింది. దాన్ని సవాలు చేస్తూ ఇద్దరూ ఈ ఏడాది మార్చి 3న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 22న ఇరుపక్షాల వాదనలు విని తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది. చంద్రగిరి పోలీసుస్టేషన్‌లో 2019 మార్చి 23న నమోదుచేసిన ఎఫ్ఐఆర్, దాని ఆధారంగా దాఖలుచేసిన ఛార్జిషీట్‌ను కొట్టేస్తున్నట్లు పేర్కొంది. ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లను కలిపి చదివిన తర్వాత అందులో పేర్కొన్న సెక్షన్లు వీరికి ఎలా వర్తిస్తాయో అర్థం కావట్లేదని వ్యాఖ్యానించింది. వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు గానీ, ప్రజలకు హాని తలపెట్టినట్లు గానీ చూపలేకపోయినట్లు పేర్కొంది.

కరేడు పర్యటనకు అనుమతిపై నిర్ణయం తీసుకోండి

రామచంద్రయాదవ్ వ్యాజ్యంలో పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ పరిశ్రమ కోసం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు అనుమతించాలంటూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఇచ్చిన వినతిపై ఆగస్టు 2లోగా నిర్ణయం తీసుకోవాలని డీజీపీ, నెల్లూరు ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. కరేడు వెళుతున్న తనను పోలీసులు అడ్డుకుంటున్నారని రామచంద్రయాదవ్ హైకోర్టులో అత్యవసర పిటిషన్ వేశారు. ఆగస్టు 3న పర్యటనకు అనుమతి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని అందులో కోరారు.

148.74 హెక్టార్లలో ఇనుప ఖనిజ లీజు బదిలీ

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని 148.74 హెక్టార్లలో పసిఫిక్ మైనింగ్ ప్రొడక్ట్స్ పేరిట ఉన్న ఇనుప ఖనిజ లీజును పయనీర్ టోర్‌స్టీల్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. తుమ్మలూరు గ్రామ పరిధిలోని ఈ లీజు తొలుత 2006లో ఎస్.శివారెడ్డి పేరిట 20 ఏళ్ల కాలానికి మంజూరైంది. తర్వాత దీనిని 2012లో పసిఫిక్ మైనింగ్ ప్రొడక్ట్స్ పేరిట బదలాయించారు. ఈ సంస్థ తమ లీజును డోమినీర్ పిల్లెట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట బదలాయించాలని 2022, మార్చి 14న దరఖాస్తు చేసుకుంది. ఆ తర్వాత 2023, సెప్టెంబరు 7న లీజు బదలాయింపు దరఖాస్తును పసిఫిక్ మైనింగ్ సంస్థ ఉపసంహరించుకుంది. అనంతరం ఈ లీజును పయనీర్ టోర్‌స్టీల్ మిల్స్ లిమిటెడ్ పేరిట బదలాయించాలని పసిఫిక్ మైనింగ్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఇనుప ఖనిజ లీజు (నాన్ కేపిటివ్)ను పయనీర్ టోర్‌స్టీల్ మిల్స్ లిమిటెడ్ పేరిట బదలాయిస్తూ గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీచేశారు.